సుందర చైతన్యం



ఆది దేవుడు

ఆచార్య దేవుడు

ఆచార్యుడు

సుందర చైతన్యం



సర్వ సంపూజ్య

జ్ఞానబ్రహ్మ, ఆర్షవిద్యా వాచస్పతి, సత్సంగ ప్రచారమణి

పూజ్య గురుదేవులు

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారి

77వ జన్మదినోత్సవము

విశేష సంచిక




గురువు - కల్పతరువు
గిరిధారి
సత్సంగాలు
యజ్ఞాలు
సి.డి.లు
శిక్షణ
గ్రంథాలు
కృష్ణాలయాలు
ఆశ్రమాలు
ప్రబోధాలు
ధ్యాన తరగతులు
ప్రచారాలు
సప్తాహాలు
మోక్షధామం
గ్రామ చైతన్యం
మహిళా చైతన్యం
యువ చైతన్యం
వేదిక చైతన్య కల్పతరువు
లేదిక జ్ఞానానికి కరువు

శుభం భూయాత్

మనసు అందరికీ ఉంది. మంచి ఎందరిలో ఉంది?

అందరికీ తెలుసు ఆట. ఎందరికి తెలుసు బాట?

కళ్ళుండి చూడలేని వాళ్ళు

చెవులుండి వినలేని వాళ్ళు

అన్నీ ఉండి ఏమీ లేని వాళ్ళు – ఎక్కువ శాతం వీళ్ళే ఈ ప్రపంచంలో.

బ్రతుకుకు అర్థం తెలియనంత కాలం బ్రతుకులో అందం అగుపించదు.

మనం నేడు బ్రతకలేక పోతున్నా మనేది నిజమైతే, బ్రతుకుకు బంగారు బాటను ఒకనాడు నిర్మించిన వారు మన పూర్వీకులే అనేది సత్యం. వారే ఋషులు.

ఆశలు లేనివారు. అధర్మం తెలియని వారు.

సత్యధర్మాలను అంబారీ నెక్కించి ఊరేగించినవారు.

వారి మాటే మన బాట కావాలి.

వారి బాటలోనే మన బ్రతుకు సాగాలి.

మహాజనో యేన గత స్స పన్థాః

మహాత్ములు నడచిన మార్గమే మార్గము.

బాటసారిగా కదిలాను.

బాట సాక్షిగా మిగిలాను.

అంతటితో ఆగలేదు.

బాటను సుగమం చేసే ప్రయత్నంలో తలమునక లయ్యాను.

నమ్మి నడిచే వారికి నమస్కారం.

నమ్మని వాళ్ళకు లేదు తిరస్కారం.

గచ్ఛ త్పిపీలికా పంక్తిః సముద్ర మధిగచ్ఛతి ।

అగచ్ఛన్ వైనతేయోపి పదమేకం న గచ్ఛతి ॥

చరిస్తూ ఉండాలే గాని చీమలబారైనా సముద్రాన్ని చేరుతుంది.

చలనం లేకపోతే గరుత్మంతు డైనా అడుగు ముందుకు పోడు.

అసలు విషయమిది.

శుభం భూయాత్!

అనంతుని ఆలయంలో

అర్చకుడు

మీ

ॐ స్వామి సుందర చైతన్యానంద

JAI BHARAT

Past glory, though not seen in the present years, is not lost for ever. No other country in the world has suffered so many foreign invasions and domestic upheavels as India yet, she has successfully safeguarded her unity and integrity throughout the centuries.

I extol the past of our country with a view to laying a strong foundation for a glorious future. We inherit a great cultural tradition. Ours is the sacred Vedic tradition. We are the children of the Rishis. Their blood runs in our veins. We have their grit and nerve.

We also have their love and compassion. Now we have to direct all our energies and resources towards reviving and strengthening our cultural and spiritual heritage. Only then can we bring back to India her past glory.

ॐ Swami Sundara Chaitanya

COUNTRY AND CONSTITUTION

If the people who are elected are capable, and men of integrity and character, they will be able to make the best even of a defective constitution. If they are lacking in these qualities, no constitution can help the country. After all, a constitution like a machine, is a lifeless thing. It acquires life because of the men who made it, control it, and operate it.

Dr.Rajendra Prasad

The first President of free India

రాజ్యము - రాజ్యాంగము

రాజ్యాంగము లోప భూయిష్టంగా ఉండినా, ఎన్నుకోబడ్డవారు సమర్థులై శీలవంతు లైనపుడు దానిని ఉన్నతంగా వినియోగించుకో గలుగుతారు. ఈ లక్షణాలు వారిలో లేనపుడు ఏ రాజ్యాంగమైనా దేశాన్ని ఉద్ధరించలేదు. ఏముంది? రాజ్యాంగ మనేది ఒక యంత్రము లాగా నిర్జీవమైంది. దానిని నిర్మించిన వారి వల్ల, నియమించే వారి వల్ల, నిర్వహించే వారి వల్ల అది సజీవ మవుతుంది.

స్వతంత్ర భారత దేశ ప్రథమ రాష్ట్రపతి

డా॥ రాజేంద్ర ప్రసాద్

Pages from Sages Wishes & Blessings

Swami Sundara Chaitanyananda is an apostle of purity, unity and divinity. He is one of our spiritual luminaries. He is awakening people to self-knowledge and peace. He has done excellent service to Sanatana Dharma.

Swamiji's is a fervent devotee of Lord Krishna. I shall be one of you to make the ashram a universal centre of Krishna consciousness. Shudha and Sundara shall be one in Krishna consciousness.

Swami Shuddhananda Bharati

పరమహంసల పుటలు - మహాత్ముల అభినందనలు, ఆశీస్సులు

స్వామి సుందర చైతన్యానందులు ఏకత్వానికి, దివ్యత్వానికి, పవిత్రతకు ప్రతిరూపము. నేడు మనకున్న మహాత్ములలో, ప్రమాణ పురుషులలో వీరు ఒకరు. ఆత్మజ్ఞానమును పంచుతూ, నిత్యశాంతి వైపుకు మానవాళిని మరలిస్తున్న మహనీయులు వీరు. సనాతన ధర్మమునకు వీరు చేస్తున్న సేవ అమోఘము.

స్వామీజీ శ్రీకృష్ణ భగవానుని పరమ భక్తులు. కృష్ణ చైతన్యమునకు విశ్వకేంద్రంగా ఈ ఆశ్రమమును తీర్చి దిద్దుటలో నేనూ మీలో ఒకడినై ఉంటాను. 'శుద్ధ' - 'సుందర' కృష్ణ తత్త్వములో సదా ఏకమై ఉండెదరు.

స్వామి శుద్ధానంద భారతి

I am extremely glad to know the wonderful work that Swami Sundara Chaitanyananda is accomplishing in Andhra Pradesh.

The work done by Swami Sundara Chaitanyananda thrills me to no end. This is exactly what is to be done if they must organise a successful and silent campaign for our cultural revival through Vedanta study.

My prayers for his long and dynamic activity.

Swami Chinmayananda

సుందర చైతన్యానంద స్వామి ఆంధ్రదేశంలో విస్తృతంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను గూర్చి తెలుసుకొని అమితానందమును పొందుతూ ఉన్నాను.

మహోన్నత దృక్పథంతో వారు చేపట్టే పవిత్ర కార్యాలు నన్ను పులకాంకితుడను చేస్తూ ఉన్నాయి. వేదాంత ప్రబోధముల ద్వారా ఆర్షసంస్కృతిని పునరుద్ధరించేందుకు ఈ విధమైన నిశ్శబ్ద ఆధ్యాత్మిక ఉద్యమాలే ఏకైక మార్గము.

శక్తివంతమైన వారి యజ్ఞకార్యములు ఎడతెగక నిత్యము కొనసాగాలని ప్రార్థిస్తూ ఉన్నాను.

స్వామి చిన్మయానంద

Swami Sundara Chaitanyananda who has written several books in Telugu and English on various aspects of our Sanatana Dharma and who is engaged in singing with his musical voice and expounding with his speaking gifts, the glories of God, the one indwelling Divine and of the spiritual life, before large audiences all over Andhra Pradesh, has brought out this detailed Telugu translation and exposition of 'The Vishnu Sahasranamamu', which is a hymn very dear to the Hindu devotees all over the world, many of whom recite it from memory every day.

I am very glad to introduce this book to the Telugu speaking world which will remain indebted to Swami Sundara Chaitanyananda for this service, while he, on his part, has done it only as a worship of Lord Vishnu through humble service to His children in the men, women and children of the world. I hope the book will help to increase their love of God and love and service of man, irrespective of caste, creed, race or sex.

Swami Sundara Chaitanyananda has got scholarship, spiritual life, musical gift and tremendous energy. Highly educated both in modern education as well as in Sanskrit, he has utilised all his energy to spread Sanatana Dharma in our state.

Swami Ranganadhananda
Ramakrishna Mutt

మన సనాతన ధర్మానికి సంబంధించిన వివిధ విషయాలపై ఆంధ్రము లోను, ఆంగ్లము లోను అనేక గ్రంథాలు రచించి, తన మధుర సుస్వరంతో, గాననిరతుడై, ఆంధ్రప్రదేశ మంతటా బ్రహ్మాండమైన సభలలో తన వాగ్వైఖరీ శబ్ద ఝరులతో భగవద్విభూతులను, సర్వ హృదయాంతర్వాసి యైన ఏకైక దివ్యత్వాన్ని, ఆధ్యాత్మిక జీవితమును గూర్చి వివరించు వారును అగు సుందర చైతన్యానంద స్వామి, ప్రపంచము లోని హిందూ భక్త జనులకు ప్రియమైనదియు, వారిలో అనేకులచే ప్రతి దినము పారాయణ చేయబడునదియు నగు "విష్ణు సహస్రనామము" అను స్తోత్రరాజమునకు ఆంధ్రానువాదం, సాకల్య వివరణం ప్రచురించారు.

నేను ఈ గ్రంథాన్ని తెలుగు ప్రజానీకానికి పరిచయం చేయడానికి చాలా సంతోషిస్తున్నాను. ఈ సేవకు తెలుగు ప్రజానీకం స్వామి సుందర చైతన్యానందకు ఋణపడి యుంటుంది. ప్రపంచ మందలి మానవులలో, స్త్రీలలో, పాపలలో ఉండే పరమేశ్వరుని అనుంగు బిడ్డలకు సేవ చేయడమే మహావిష్ణు అర్చనగా భావించి అతడు ఈ సేవ చేశాడు.

జాతి, మత, కుల, లింగ వివక్షత లేకుండా మానవప్రేమను, మానవసేవను, భగవద్భక్తిని పెంపొందించుకొనుటకు ఈ గ్రంథము సాయపడునని ఆశించుచున్నాను.

స్వామి సుందర చైతన్యానంద పాండిత్యము, ఆధ్యాత్మిక జీవనము, గాన వైదుష్యముతో పాటు అనంతమైన శక్తి సామర్థ్యములు గల మహోన్నత వ్యక్తి. ఆధునిక విద్యతో పాటు దేవభాష యైన సంస్కృతములో ప్రావీణ్యమును పొందినారు. రాష్ట్ర వ్యాప్తంగా సనాతన ధర్మమును ప్రచారము చేయుటలో స్వామీజీ తమ యావచ్ఛక్తిని ధారపోయు చున్నారు.

స్వామి రంగనాథానంద

రామకృష్ణ మఠము.

May Sundara Chaitanya Swami live long! And long may he live in good health, still active in this wonderful Dharma prachara karya, Jana jagriti karya and bringing the precious gems of wisdom from various sources of Vedanta, puranas, Ramayana, Bhagavata and giving it to everyone in his own inimitable, unique style which is a combination of so many divine gifts and talents.

God has given him the facility and facile ability to put his words in black and white.

Saraswati Kataksham is upon him.

Swami Chidananda

సుందర చైతన్యస్వామి కలకాలము జీవించు గాక! పూర్ణ ఆయురారోగ్యాలతో ఈ ధర్మ ప్రచార ఉద్యమములో, జన జాగరణ కార్యములో వర్ధిల్లు గాక! వేదాలలో, రామాయణ భాగవతాది పురాణ ఇతిహాసములలో నిక్షిప్తమై ఉన్న జ్ఞానమణులను వెలికి తీసి వితరణ చేయుటలో వారికి వారే సాటి. వారి జీవన విధానము, వారి ప్రచారోద్యమము అంతులేని కళలతో, విశేష జ్ఞానవైభవంతో విరాజిల్లుతూ ఉన్నాయి.

గహనమైన విషయాలను సరళమైన శైలిలో అక్షర రూపంలో లిఖించి అలరించే నేర్పు పరమాత్మ వారి కిచ్చిన అపురూపమైన వరము. సరస్వతీ కటాక్షం వారిపై పూర్ణంగా ఉంది.

స్వామి చిదానంద

శ్రీ స్వామి సుందర చైతన్యానందజీతో మాకు **1965** వ సంవత్సరము నుండి, అనగా వారు వేంకటగిరిలో విద్యార్థిగా యున్నప్పటి నుండి పరిచయ మున్నది. విద్యార్థిగా యున్నప్పుడే వారు మా దివ్యజీవన సంఘు కార్యక్రమాలలో తరచుగా పాల్గొనుచుండెడి వారు. వారు మేము అనేక సార్లు భజనలు - సంకీర్తనలు కలిసి చేసితిమి.

శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారు అనేక చోట్ల గీతా యజ్ఞములను నిర్వహించినారు. మంచి పేరును గడించినారు. ఆశ్రమమును స్థాపించి వారి ప్రచార కార్యక్రమములను విరివిగా సాగించుచున్నారు. వారి సంకీర్తనా మాధుర్యమును చవిగొన్నవారు, వారి ప్రవచనములను విని ఆకర్షింపబడిన వారు అనేకమంది భక్తులు మమ్ములను కలిసి చెప్పునప్పుడు ఎంతో ఆనందించు చుందుము.

కరుణాసాగరుడైన శ్రీకృష్ణ పరమాత్మ శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారు విరివిగా ఆధ్యాత్మిక ప్రచార, ప్రసారము లొనర్చుటకు వలయు ఆయురారోగ్యములను, బలమును ప్రసాదించి రక్షించు గాక!

స్వామి దేవానంద

"Blessed is the family, blessed are the parents, blessed is the land that gives birth to saintly people."

This is the great utterance of our shastras. Mother India continuously gives birth to great masters and saints. We are very happy to see some of them living in our times. One of them is our beloved Swami Sundara Chaitanyanandaji Maharaj.

Young and dedicated, versatile and well-read in our holy scriptures of Sanatana Dharma Swami Sundara Chaitanyanandaji is attracting millions of devotees through out Andhra Pradesh turning them towards God.

Endowed with a rich sonorous voice Sri Sundara Swamy sings soulfully the devotional songs that fill the heart with devotion.

May Lord Panduranga and Devi Rukmini shower their supreme blessings on him to inspire our people towards national integration and spiritual harmony.

Sant Keshava Das

'సత్పురుషులకు జన్మ నిచ్చిన వంశము ధన్యము, తల్లిదండ్రులు ధన్యులు, దేశము ధన్యము' – ఇది శాస్త్ర వచనము. భారతమాత నిరంతరం సద్గురువులకు, సంత పురుషులకు జన్మ నిస్తూనే ఉంది. వారిలో కొందరు మన సమకాలీనులుగా జీవించడం మన భాగ్యం. అటువంటి ఉత్తమ కోవకు చెందిన మహనీయులే మన ప్రియతమ స్వామి సుందర చైతన్యానందజీ మహరాజ్.

చిరుతప్రాయము లోనే అంకిత భావము, సనాతన ధర్మశాస్త్రము నందు అకుంఠిత దీక్ష, బహుముఖ ప్రావీణ్యములతో ఆంధ్రదేశ మంతటా లక్షలాది మందిని ఆకర్షించి దైవోన్ముఖులను గావిస్తూ ఉన్నారు.

మృదు మధుర స్వరముతో, హృదయ లోతుల నుండి పెల్లుబుకు గాన మాధుర్యముతో శ్రోతల హృదయాలను భక్తి పారవశ్యంలో ముంచెత్తు తున్నారు.

దేశ సమైక్యత మరియు ఆధ్యాత్మికత వైపుకు మానవాళిని నడుప గల శక్తిని శ్రీ పాండురంగడు, రుక్మిణీదేవి వారికి అనుగ్రహింతురు గాక!

సంత్ కేశవదాస్



Messages sent by Saints and Dignitaries in reciprocation to the invitation for Gita Gnana Yagna held in Swamiji's native place Venkatagiri town, Nellore District in the year 1974.

1974 వ సంవత్సరం స్వామీజీ స్వస్థలమైన నెల్లూరు జిల్లా లోని వెంకటగిరి పట్టణంలో నిర్వహింపబడిన గీతా జ్ఞానయజ్ఞానికి మహాత్ములు, మాననీయులు పంపిన సందేశములు.

Prosper Fervent Soul,

I am happy to know that Venkatagiri holds your Gita Yagnam. Gita is a book for all ages, book for 'inner look'. It brings out the secret of living in divine consciousness. It is a gospel of dynamic living in the ever living soul that does not die even by titanian bombs. The second chapter speaks of the death-proof soul and tells how to fix the mind in it and live free from fear, care and anxiety. Even if the human body ripes and rots and dies, the immortal soul is reborn in a new body and the chain of life continues. Death is but a change of robes. I remember four births of mine and this is the final incarnation for all my sankalpas are finished.

Gita has given me Tattwamasitwam.

Let all enjoy it Aum.

Yoga Samaj,
Adayar, Madras - 20

YOGI SHUDDHANANDA BHARATI
5-8-1974

చైతన్యాత్మా! వర్ధిల్లుము!

వెంకటగిరిలో మీ గీతాయజ్ఞము నిర్వహింప బడుతున్నందుకు సంతోషము. ఆగమమైన గీత పవిత్రమైన గ్రంథము. అది కేవలం ఒక గ్రంథం మాత్రమే కాదు. గీత వేద ప్రమాణము. శ్రుతి ప్రకాశము. భగవద్గీత అన్ని కాలాలకు సంబంధించినది. అది స్వరూపానుభూతికి సహకరించు సాధనము. ఆత్మ ఉనికిలో, సదా చైతన్య స్ఫూర్తితో మనుగడను సాగించు రహస్య మార్గమును గీత బోధిస్తుంది. ఎటువంటి అస్త్ర శస్త్రములచే వినాశము నొందని నిత్యాత్మలో అద్భుతమైన జీవనమునకు దారి చూపుతుంది.

గీత రెండవ అధ్యాయము అమృత స్వరూపమైన ఆత్మను గూర్చి ప్రవచిస్తుంది. ఆత్మ ఎరుకలో స్థిరపడి, భయము, శోకము, ఆందోళనల నుండి విడిపడి, ప్రశాంత జీవనమును సాగించు విధమును వివరిస్తుంది. మృత్యువు కేవలం దుస్తుల మార్పిడి వంటిది. నేను నా గత జన్మలను నాలుగింటిని ఎరుగుదును. ఇది నా ఆఖరి జన్మ. నా సంకల్పము లన్నీ అంతరించినవి.

తత్త్వమసిత్వమును గీత నాకు అనుగ్రహించినది.

సర్వులునూ ఆ స్థితిలో రమింతురు గాక! ఓం.

యోగి శుద్ధానంద భారతి
5-8-1974

యోగ సమాజ్, అడయార్, మాద్రాస్ - 20

Adorable Atman,

Om Namo Narayanaya

Pranams.

I have received your kind letter of the 4th August 1974, enclosing programme of the esteemed Gita Gyana Yagna.

It is really edifying to observe that the message of the Bhagavadgita is stirring up the genius of learned souls like your good self and the light of divinity shall radiate solace and peace to the hearts of listeners. It is high time now that the gospel of the Gita which has usually been wrongly regarded as a call of the eternal isolated from the temporal, should become a down-to-earth guide in the daily functions of the human individual, whatever be one's vocation. When the Absolute speaks to the relative, it will naturally not leave anything unsaid or any aspect of life untouched.

May God's Grace be upon you all.

With respects and regards
Yours, in the Lord,
SWAMI KRISHNANANDA
10-8-1974

The Divine Life Society,
Sivananda Ashram
Rishikesh, Himalayas

పూజ్య ఆత్మ స్వరూపా,

ఓం నమో నారాయణాయ,

ప్రణామములు.

ఆగస్టు 4 వ తేదిన మీరు వ్రాసిన హృదయ పూర్వకమైన ఉత్తరము మరియు మీరు నిర్వహించనున్న గీతా జ్ఞానయజ్ఞ కార్యక్రమము అందినవి. భగవద్గీతా సందేశం మీ వంటి తత్త్వవేత్తల మేధస్సులను కదిలిస్తోందనే వాస్తవం ఎంతో ఉత్తేజకరంగా ఉంది. మీ ప్రబోధముల ద్వారా ప్రసరించు చైతన్య వెలుగు శ్రోతల హృదయాలకు శాంతిని, ఊరటను ప్రసాదించగలదు.

ప్రపంచం వేరని, పరమాత్మ వేరని; ప్రపంచానికి విలక్షణంగా ఉన్న పరమాత్మ ప్రపంచానికి ఇస్తున్న పిలుపే గీతాసార మనే అపోహలో జనులు ఇంతవరకు ఉన్నారు. ఇక ఇప్పుడు, ప్రపంచంలో ఏ వృత్తి వారికైనా, ఏ ప్రవృత్తి వారికైనా, గీత జీవనరీతిని నవరించి, మేలైన మనుగడను చూపే మార్గగామి కావాలి. పరమార్థం వ్యవహారం కన్నా వేరు కాదు. పరమార్థం లోనే వ్యవహారం ఒదిగి ఉంది. అనంతుడైన భగవంతుడు ప్రపంచానికి సందేశ మిచ్చునప్పుడు వ్యవహారిక మైన ఏ విషయాన్నీ ప్రస్తావించకుండా, ఏ సన్నివేశాన్నైనా స్పృశించకుండా వదిలి పెట్టడు.

పరమాత్మ కృప సర్వులపై వర్షించు గాక!

ఆదరాభిమానములతో

దివ్య జీవన సంఘము,
శివానంద ఆశ్రమం,
ఋషీకేశ్

ఈశ్వర చైతన్యంలో, మీ
స్వామి కృష్ణానంద
10-8-1974

Blessed

Harih Om. Salutations,

I am happy to learn that you are conducting a Gita Gnana Yagna at Venkata giri on the 14th of August.

The Gita, even though very popular, is the most profound book and it requires a lot of guidance and individual reflection to arrive at the right meaning of the verses. May Mother Gita bless you with her message in order that you may convey the same to the people attending your yagnas. I wish your noble undertaking a great success.

Sandeepany Sadhanalaya

Bombay

Yours, in the Lord,

DAYANANDA

9-8-74

ధన్యాత్మా!

హరిః ఓం. నమస్కారములు.

ఆగస్టు 14 వ తేది వెంకటగిరిలో మీరు గీతాజ్ఞాన యజ్ఞమును నిర్వహిస్తున్నా రని తెలుసుకొనుటకు సంతోషము.

గీత అతి ప్రాచుర్యము నొందిన గహనమైన గ్రంథము. శ్లోకాల లోని భావ లోతులకు దిగి గీతను యథాతథంగా అర్థం చేసుకోవడానికి బాహ్యంలో సమర్థుడైన మార్గదర్శి, వ్యక్తి అంతర్యంలో విచారము అత్యంత ఆవశ్యకమై ఉన్నాయి. యథార్థ జ్ఞానమును పొంది దానిని శ్రోతలకు అందించే సామర్థ్యాన్ని గీతామాత మీకు అనుగ్రహించు గాక!

మీ పవిత్ర కార్యము విజయవంతం కావాలని పూర్ణ హృదయంతో ఆశిస్తున్నాను.

ఈశ్వర చైతన్యంలో
మీ
దయానంద
9-8-74

సాందీపని సాధనాలయ,
బొంబాయి

Lord of the Universe, Papa,
Beloved Sundara rajan,

May you always be inspired by our Beloved Pujya Papa's illuminating words :

"Right knowledge, destroying ignorance, dissolves the ego-sense. True knowledge consists in your consciousness of oneness with the immortal Atman, seated in your heart and pervading all life and form in the universe."

Your loving letter of the 4th instant enclosing the printed invitation for the 'Geeta Gyana Yagna' which you are going to conduct from the 14th to 29th instant, has been received.

May Beloved Pujya Papa bless the function with all the devotees there.

Anandashram,
Kanhangad
Kerala

KRISHNA BAI
9-8-74

జగత్పిత పపా!
ప్రియతమ సుందర రాజన్,

పూజ్య పపా జ్ఞానమయ పలుకులు మీకు సదా స్ఫూర్తి దాయక మగుగాక. . . .

"సత్య జ్ఞానము అజ్ఞానమును నిర్మూలించి అహంకారమును విలీన మొనర్చును. విశ్వ కారణము, సర్వవ్యాపి అయిన చైతన్యాత్మయే నేను అన్న ఎరుకయే సత్యజ్ఞానము."

మీ ప్రేమపూరిత మైన ఉత్తరముతో పాటు ఈ నెల 14 నుండి 29 వ తేది వరకు మీరు నిర్వహించనున్న గీతా జ్ఞానయజ్ఞ ఆహ్వానము అందినది. ఈ పవిత్ర యజ్ఞకార్యము, అందు పాల్గొను సమస్త భక్తజనులపై పూజ్య పపా పూర్ణ ఆశీస్సులు వర్షించుగాక!

ఆనందాశ్రమం, కన్హన్‌గడ్
కేరళ

కృష్ణాబాయి
9-8-74

Dear Shri Sundara rajan,

Thank you very much for your letter of 4th August 1974. I am happy that the Geeta Gyana Yagna is being conducted for a fortnight from 14th to 29th August and the Second Chapter of Bhagavadgita is being discussed at Venkatagiri. Gita is an embodiment of ethical principles not only intended for the devotees engaged in search of the Self but also for the day to day use of every aspirant to the best advantage. I wish the discourses all success.

With kind regards,
Yours sincerely,
B.D. JATTI
9-8-1974

Governor
Raj Bhavan, Orissa

ప్రియమైన శ్రీ సుందర రాజన్ గారికి,

మీరు వ్రాసిన ఉత్తరానికి ధన్యవాదాలు. ఆగస్టు **14** నుండి **29** వ తేది వరకు పక్షం రోజుల పాటు వెంకటగిరిలో మీరు గీతా జ్ఞానయజ్ఞమును నిర్వహిస్తున్నారని, రెండవ అధ్యాయంపై ప్రసంగించబోతా రని తెలుసుకొనుటకు సంతోషము. గీత మానవతా విలువల పూర్ణ స్వరూపం. అది కేవలం ఆత్మాన్వేషణను కొనసాగించే ముముక్షువుల కొరకే కాక, నిత్య జీవితంలో సాఫల్యాన్ని పొందాలని ఆశించే వారందరికి ఎంతో ఉపయుక్త మైన గ్రంథము.

మీ ప్రసంగాలు ఫలవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

గౌరవాభిమానములతో
మీ
బి.డి. జట్టి
9-8-1974

గవర్నర్, రాజ్‌భవన్
ఒరిస్సా

Dear Sri Sundararajan.

Thank you for your letter of 6th August. I am sorry I could not write to you earlier. I am sure that your Geeta Yagna would have started on the 14th of August 1974 and would be going on successfully.

Sankhya according to the Geeta is knowledge that the Soul is different from the body and is permanent, while the body is transient. So long as desire persists for the fulfilment of desire, births and rebirths occur. But when each man has done his duty in a spirit of detachment and dedication to God he has no longer to suffer or enjoy the benefits from the results of such action. He has no more births.

I hope and trust that every one who participates in the Geeta Yagna will become a better person and fit himself into the society and contribute to its welfare by his service and sacrifice. I pray to Lord Venkateswara to crown the function with success, to grant long life and prosperity to both the teacher and the taught.

With kind regards,
Yours sincerely,
M. ANANTASAYANAM AYYANGAR
27-8-1974

Sri M. Anantasayanam Ayyangar,
Formerly : Speaker, Lok sabha
and Governor of Bihar.

ఎమ్. అనంతశయనం అయ్యంగార్

ప్రియమైన శ్రీ సుందర రాజన్ గారు,

ఆగస్టు **6** వ తేదిన మీరు వ్రాసిన ఉత్తరము అందినది. ధన్యవాదములు. మీకు వెంటనే జవాబు వ్రాయలేక పోయినందుకు విచారిస్తున్నాను. మీ గీతాయజ్ఞము **14** వ తేదిన ప్రారంభమై అద్భుతంగా జరుగుతుందని భావిస్తున్నాను.

గీతానుసారము - 'ఆత్మ దేహానికి అతీతమైనది, నిత్యమైనది కాగా దేహము మృగ్యమైనది' - అన్న జ్ఞానమే సాంఖ్యము. కామం ఉన్నంత వరకు కోరికలు తీర్చుకునే నిమిత్తం జన్మలు వస్తాయి. మనిషి తన విధిని నిస్సంగంగా ఈశ్వరార్పణ బుద్ధితో నిర్వహించి నపుడు కర్మఫలాలు సుఖాన్ని గాని, దుఃఖాన్ని గాని కల్పించలేవు. ఇక అతడికి పునః జన్మలు ఉండవు.

మీ గీతాయజ్ఞంలో పాల్గొన్న ప్రతి వ్యక్తి ఉన్నత స్థితికి ఎదుగుతాడని, సమాజంతో సమరస మవుతాడని, సేవా దృక్పథంతో, త్యాగ నిరతితో సమాజ కళ్యాణానికి తోడ్పడతా డని విశ్వసిస్తున్నాను.

మీ కార్యక్రమం విజయవంతం కావాలని, ప్రబోధకులైన మీరు, ప్రబోధితులైన శ్రోతలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విలసిల్లాలని, ఆ విధంగా శ్రీ వేంకటేశ్వరుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడని ఆశిస్తున్నాను.

గౌరవాభిమానములతో
మీ
ఎమ్. అనంతశయనం అయ్యంగార్
27-8-1974

శ్రీ ఎమ్.అనంతశయనం అయ్యంగార్
లోకసభ మాజీ స్పీకర్, ఢిల్లీ
బీహారు మాజీ గవర్నర్,
సరోజినిదేవి లేబౌట్, తిరుపతి.

దివ్యాశీస్సులు

(1985 వ సంవత్సరము ఏప్రిల్ 24 వ తేది మాజీ రాష్ట్రపతి డా॥ శంకరదయాళ్ శర్మ, స్వామీజీ దీక్షా గురువు కవియోగి, మహర్షి శ్రీశ్రీశ్రీ శుద్ధానంద భారతీ స్వాముల వారి ఆధ్వర్యమున ధవళేశ్వరం ఆశ్రమం లోని మురళీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మరియు కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహింప బడ్డాయి. ఆ సందర్భమున పరమ గురువులైన శ్రీ శుద్ధానంద భారతీ స్వాముల వారు పూజ్య స్వామీజీని గూర్చి పలికిన అమృత వచనాలు).

దివ్యాత్మ స్వరూపులారా!

సుందర స్వామి సారథ్యంలో మీరు ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఈ రోజు ఆలయంలో శ్రీకృష్ణ భగవానుడు కొలువు తీరాడు. దానికి మేము సాక్షులం.

ఈ ఆలయంలో శ్రీకృష్ణుని నిలిపినట్లే, మీ అందరి హృదయాలను కృష్ణ చైతన్యంతో నింపే శక్తి సామర్థ్యాలు సుందరస్వామికి ఉన్నాయి.

సుందర స్వామిని గూర్చి నేడు నా కన్నా మీకే బాగా తెలుసు. కాని, మీకెవ్వరికీ తెలియక ముందు సుందరస్వామి బాలస్వామిగా నాకు తెలుసు.

బాల్యంలో భక్తి వైరాగ్యాలతో వినమ్రుడై ఉండే ఈ స్వామికి నేను మంత్రదీక్ష నిచ్చాను. ఇతనికి ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉందని ఆనాడే నేను ఊహించాను. సనాతనధర్మ దీపికా భృత్ *(Torch bearer of Sanatana Dharma)* గా శోభిస్తాడని నాకు అనిపించింది. నా ఊహ నేడు నిజమైంది.

నేను సుమారు ఆరు వందల పుస్తకాలు రచించాను. కవితలు అల్లినాను. దేశవిదేశాల్లో వేలాది ప్రసంగాలు చేశాను. ఎందరో మహాత్ముల జీవిత చరిత్రల్ని వ్రాశాను. ప్రస్తుతం నేను శతవృద్ధుణ్ణి. నాకు వంద సంవత్సరాలు నిండాయి. నేను త్వరలో సుందర స్వామి చరిత్రను కూడా ఆంగ్లంలో రచిస్తాను . . . .

ఓం

సనాతన ధర్మ దీపికాధారి

అనుభవ వేదాంత ప్రవక్త

పూజ్య గురుదేవులు

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారు

కడప పట్టణంలో

108వ జ్ఞానయజ్ఞ సమాపనోత్సవ సందర్భమున

పెజావర్ మఠాధీశులు

పూజ్యశ్రీ విశ్వేశతీర్థ స్వాముల వారి కరకమలముల నుండి

'జ్ఞానబ్రహ్మ' బిరుదమును

పూజ్యశ్రీ కామకోటి మఠాధీశులు

శ్రీశ్రీశ్రీ శంకరాచార్యుల వారి సన్నిధి నుండి

'సత్సంగ ప్రచారమణి' బిరుదమును

స్వీకరించిన శుభవేళ గోచరించిన

మధుర స్మృతులు


సుందర చైతన్యాశ్రమం
హైదరాబాద్ - 500 043

ఓం నమో భగవతే వాసుదేవాయ

శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామి వారికి

కడప పట్టణములో జరిగిన 108వ గీతా జ్ఞానయజ్ఞ సమాపనోత్సవములో

13-1-1994 తేదీన

జగద్గురు ఉడుపి పీఠాధీశ్వర

శ్రీశ్రీశ్రీ విశ్వేశతీర్థ స్వామి చరణుల

కరకమలముల నుండి యివ్వబడుచున్న

'జ్ఞానబ్రహ్మ'

అను బిరుదాలంకారము

విశ్వప్రపంచ దేశాలు కన్ను విప్పని తొలినాళ్ళ లోనే - జ్ఞాన విజ్ఞాన పూర్ణ నాగరికతా భిక్షను పంచి పెట్టింది మన భారతదేశం. ఆ వైదిక సంస్కృతీ సంప్రదాయ మందాకిని అవిచ్ఛిన్నంగా అనాదిగా ప్రవహిస్తూనే ఉంది. ఒకనాడు, నాగార్జునగిరి, ధాన్యకటకం, శ్రీశైలం మొదలైన ప్రాంతాలు ప్రధాన కేంద్రాలుగా జైన - బౌద్ధ మతాలు వైదిక ధర్మ విధ్వంసకాలుగా పెచ్చరిల్లిన నాడు, రాజకీయ, సాంఘిక సంక్షోభం చెలరేగిననాడు, న్యాయసూత్ర భాష్యకర్త యైన వాత్స్యాయనుడు, న్యాయవార్తికకారుడైన ఉద్యోతకరుడు ఆనాటి స్థితిని ప్రతిఘటించారు. ఎట్టకేలకు సాక్షాత్తూ శంకరుడే కైలాసం నుండి దిగివచ్చి ఆదిశంకరులుగా అవతరించవలసి వచ్చింది. ఆదిశంకరులు పరమత ఖండనం గావించి వైదిక ధర్మాన్ని పునః ప్రతిష్ఠించి అద్వైత మతాన్నీ, భక్తి తత్త్వాన్నీ బహుళంగా ప్రచారం లోకి తెచ్చారు. శంకరులు స్థాపించిన శంకర పీఠాలు అద్వైత మత ధర్మాన్ని అకుంఠితంగా ప్రచారం చేస్తూనే వున్నాయి.

హింస, స్వార్థం, అసూయ పెచ్చరిల్లుతున్న యీనాడు, ద్వైతాన్ని, అద్వైత మతాన్నీ - అమేయ కృష్ణభక్తి తత్త్వాన్నీ రంగరించి హింసను రాజహంసగా, స్వార్థాన్ని - సకల హితార్థంగా, విషాన్ని అమృతంగా మార్చాలని శ్రీసుందర చైతన్యానందులు బద్ధకంకణు లయ్యారు. యావదాంధ్ర దేశంలో ఇప్పుడు ప్రవహిస్తున్నది శ్రీ సుందర చైతన్య బోధానంద గంగా ప్రవాహం. ఇప్పుడు వీస్తున్నది శ్రీ సుందర చైతన్యుల ఆధ్యాత్మ విద్యా ఝంఝా మారుతం. ఇప్పుడు వినిపిస్తున్నది సుందర చైతన్య గాథానంద నందాలాపన. ఈ ప్రవాహంలో మునగనివాడు లేడు. ఈ ఝంఝావాతానికి ఎదురొడ్డి నిలువగల ప్రత్యర్థిమతం లేదు. ఈ జ్ఞాన గానామృతంలో ఓలలాడని ఆంధ్రుడు లేడు అంటే అతిశయోక్తి కాదు. గ్రామీణ పౌరుని మొదలు పండిత ప్రకాండుని వరకు ఆబాలగోపాలమును - ఆ బాలగోపాల భక్తితో మీరు అలరిస్తున్నారు. మాటలతో, పాటలతో, వ్యాఖ్యానాలతో, వైదుష్యాలతో భక్తజన సందోహాలను సముద్రీకరిస్తున్నారు. పదులు కాదు. వందలు కాదు. వేలు కాదు. లక్షలాది భక్తజనుల గుండె గుండెలో జ్ఞానయజ్ఞ జ్యోతిని వెలిగిస్తున్నారు.

జ్ఞానం బ్రహ్మము. యజ్ఞం బ్రహ్మము. జ్యోతి బ్రహ్మము. 'బృహి - వృద్ధౌ' అన్న ధాతువు నుండి పుట్టింది బ్రహ్మపదం. 'బృంహతి ఇతి బ్రహ్మ'. వర్ధతే - వృద్ధిని పొందునది. లక్షలాది భక్తుల యొక్క హృదయ హృదయములో జ్ఞానబ్రహ్మను ప్రతిష్ఠించుచున్న - శ్రీ స్వాములైన మిమ్ము అభేదాధ్యవసాయముగా 'జ్ఞానబ్రహ్మ' అన్న బిరుదముతో సముత్కంఠముగా, సాభిప్రాయముగా, సగౌరవముగా, సాభిలాషముగా, సపాక్షికముగా మిమ్ము సమ్మానించు చున్నామని ప్రకటించుటకు హర్ష సముత్కర్షిత హృదయారవిందుల మగుచున్నాము.

అష్టోత్తరశతే యజ్ఞే శ్రీమత్కడప పట్టణే।
'జ్ఞానబ్రహ్మే'తి దివ్యేన బిరుదేన సమర్ప్యతే ॥

తేది: 13-1-1994

కడప

ఇట్లు

జగద్గురు ఉడుపి పెజావర్ మఠాధీశ్వర

శ్రీశ్రీశ్రీ విశ్వేశతీర్థస్వామి చరణుల

అధ్యక్షతన - గీతాజ్ఞాన యజ్ఞ సమతి, కడప

ॐ नमो भगवते वासुदेवाय
श्री श्री श्री सुन्दर चैतन्यानन्द स्वामिना कृते
कडपपट्टणे अष्टोत्तर शततम गीताज्ञानयज्ञ समापनोत्सवे १३-१-९४ दिनाङ्के
जगद्गुरु उडुपि पेजावर मठाधीश्र्वर
श्री श्री श्री विश्र्वेशतीर्थ स्वामिचरण
करकमलयोः दीयमान

"ज्ञानब्रह्म"

इति बिरुदालङ्कारः

विश्र्वप्रपञ्चदेशेभ्यः अनुन्मीलितनयनेभ्यः सर्वप्रारम्भ एव ज्ञानविज्ञानपूर्ण नागरकताभिक्षां वितरति स्मास्माकं भारतो देशः। सैवं वैदिर सम्प्रदाय संस्कृति मन्दाकिनी अनादि अविच्छिन्न प्रवहत्येव। यदा नागार्जुनगिरिः, धान्यकटकं, श्रीशैलं इत्यादीन् प्रधानतया केन्द्रीकृत्य जैन-बौद्धमते वैदिकधर्मध्वंसके सञ्जोते, यदा साङ्घिक राजकीय स्थितिः संक्षुब्धा अभूत् तदा न्यायसूत्रभाष्यकर्ता वात्स्त्यायनः, न्यायवार्तिककारः उद्द्योतकरः तां स्थितिं अवारुरुधतुः। पर्यन्ततः काले साक्षात् शङ्कर एव कैलासादवतीर्य आदिशङ्करत्वेन अवतरितुमवसरस्सञ्जातः। शङ्करभगवत्पादा श्र्च परमतान् विखण्डय, वैदिकधर्मं पुनः प्रतिष्ठाप्य, अद्वैतमतं भक्तितत्त्वं च बहुधाऽप्रचारयत्। शङ्करेण संस्थापितानि पीठानि अद्वैतमत धर्मान् तथा प्रचारयन्ति।

हिंसा स्वार्था सूया परिवृते ऽस्मिन् दिने द्वैतं, अद्वैतम् अमेय कृष्ण भक्ति तत्त्वंच पिष्टवा हिंसां राजहसवत्, स्वार्थं सकलहितार्थवत्, विषममृतवत् परिवर्तीयितुं सकलान्ध्रदेशे

बद्धकङ्कणाः श्रीसुन्दर चैतन्यानन्दाः। सकलान्ध्रदेशे अद्य प्रवहति सुन्दरचैतन्य बोधानन्द गङ्गाप्रवाहः। अद्य वीजति सुन्दरचैतन्याध्यात्मविद्या झंझामारुतः। अद्य श्रूयते सुन्दरचैतन्यगाथानन्दनन्दालापनम्। नास्त्यनिमग्नः अस्मिन् प्रवाहे। नास्ति प्रतिरोधि प्रत्यर्थिमतमस्य झंझावातस्य। अस्मिन् ज्ञानगानामृते अस्नात आन्ध्रः नास्तीत्यत्र नास्त्यतिशयोक्तिः। हे सुन्दरचैतन्यानन्दाः! ग्रामीण मारभ्य पण्डितप्रकाण्ड पर्यन्तं आबालगोपालं तद्बालगोपालभक्त्या अनुमोदयन्ति भवन्तः। वचनैः, गीतैः, व्याख्यानैः, वैदुष्यैश्च भक्तजनसन्दोहान् समुद्रीकुर्वन्ति। न दशकानि, न शतकानि, न सहस्राणि; किन्तु लक्षलक्षादिकानां जनानां हृदये हृदये ज्ञानज्योतिं प्रज्वालयन्ति। ज्ञानं ब्रह्म, यज्ञो ब्रह्म, ज्योतिर्ब्रह्म। "बृहि-वृद्धौ" इति धातोः बृहति वर्धते इति ब्रह्म। लक्षलक्षादिकानां जनानां हृदये हृदये ज्ञानब्रह्मप्रतिष्ठापनं कुर्वन्तीति स्वामिनो भवतः अभेदाध्यवसायं "ज्ञानब्रह्म" इति बिरुदेन समुत्कण्ठं, साभिप्रायं, सगौरवं, साभिलाषं, ससाक्षिकं सम्मानयामः इति हर्षसमुत्कर्षितहृदयारविन्दा भवामः।

अष्टोत्तरशते यज्ञे श्रीमत्कडप पट्टणे ।
ज्ञानब्रह्मेति दिव्येन बिरुदेन समर्च्यते ।।

इत्थम्
जगद्गुरु उडुपि पेजावरमठाधीश्र्वर
श्री श्री श्री विश्र्वेशतीर्थ स्वामि चरणानां
आध्यक्ष्ये गीताज्ञानयज्ञसङ्घः
कडपा.

१३-१-९४
कडपा.

శ్రీశ్రీశ్రీ జగద్గురు కామకోటి పీఠాధీశ్వర

శ్రీ శంకరాచార్య స్వాముల వారి

దివ్య ఆశీర్వాదము

సనాతన వైదిక ధర్మమునకు మూలము వేదములు, పురాణములు, శ్రీమద్భగవద్గీతా శాస్త్రము మొదలగు గ్రంథములు. అవి జనులకు సకలలోక కళ్యాణకర మును, ఐహికాముష్మిక సర్వవిధ శ్రేయస్సులకు, సుఖశాన్త్యాదు లకు కారణమునైన, గురు సజ్జన భగవద్భక్తి శ్రద్ధాదులతో గూడిన సద్వర్తనమును బోధించుచున్నవి. వాని ననుసరించి జనులు సర్వదేశముల యందును ఇప్పటి వరకు సామాన్య లౌకిక జనులు గాని అట్లే దరిద్రులు గాని, మహా సంపన్నులు గాని, మహా పండితులు గాని అందరూ భగవద్భక్తి సంపన్నులుగా సద్వర్తనము కలవారుగా ప్రవర్తించు చున్నారు. కాలవశమున నీకాలమునందు, భక్తి ప్రపత్తుల యందును, సద్వర్తనము పట్లను జనులకు శ్రద్ధ తరిగి పోవుచున్నది. ఈ సంగతి గుర్తించి శ్రీ సుందర చైతన్య మహారాజు గారు పలు తావులలో సంచరించుచు సత్సంగముల ననేక విధములుగ నడపుచు శాస్త్ర సమ్మతమైన, సకలలోక కళ్యాణకరమైన ఆ సనాతన ధర్మమును ఉద్ధరించుటకై బహువిధములుగ, మనోజ్ఞ మగు రీతిని ప్రవచనములను గావించు చున్నారను విషయమును విని శ్రీ జగద్గురువులు ఎంతయొ సంతసించుచు వారికి **'సత్సంగ ప్రచార మణి'** యను బిరుదము ననుగ్రహించు చున్నారు. మరియు వీరు ఇతోధికముగ ప్రచారముల గావించి జనులను సద్వర్తన సంపన్నులనుగ చేయుటకు యత్నించవలయునని, తదనుకూల ఆరోగ్యాది సంపదలు వీరికి లభించ వలయునని ఆశీర్వదించు చున్నారు.

ఆర్షవిద్యా వాచస్పతి

బిరుద ప్రదానము

జ్ఞానబ్రహ్మ శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామి

వారికి విశాఖ మహానగరంలో అత్యంత వైభవోపేతముగా, నిర్వహింపబడిన 121వ జ్ఞానయజ్ఞ సమాపనోత్సవములో విశాఖ లోని సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సేవా సంస్థలు నలుబది అయిదు కలిసి **'అభ్యుదయ చైతన్య సమాఖ్య'**గా రూపొంది యావత్ప్రజామోద ముతో తే 30-5-1995 న పద్మభూషణ శ్రీ ఎస్.ఆనందరామ్, ఐ.పి.ఎస్. గారి హస్త పద్మములతో అలంకరిస్తున్న

'ఆర్షవిద్యా వాచస్పతి'

మహాబిరుద భూషణము.

భారతదేశం ధార్మిక చైతన్యముతో, ఆధ్యాత్మిక జ్ఞాన వైభవముతో, విలక్షణమైన సంస్కృతీ సభ్యతలతో, విశిష్టమైన నాగరికతతో ప్రపంచ దేశాలకే శిరోభూషణ మైంది. జగద్గురు స్థానాన్ని సముపార్జించిన భారత జాతి, మానవుని మహోన్నత స్థితికై మార్గాలను అన్వేషించి సత్యం, ధర్మం, అహింస, శాంతి, సహనం, సౌభ్రాతృత్వం మున్నగు సూత్రాలను విశ్వమానవ కళ్యాణానికై ప్రబోధించింది. ఐహిక భోగభాగ్యాలను పరిమితం చేసుకొని శాశ్వత బ్రహ్మానంద ప్రాప్తికై వేద, శాస్త్ర, పురాణ, ఇతిహాస రహస్యాలను అవగతం చేసుకోమని భారతీయ సంస్కృతి ఉద్బోధించింది. వాల్మీకి, వ్యాస, వసిష్ఠాది తపోధనులు సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని ప్రబోధించారు. శ్రీ శంకర, రామానుజ, మధ్వాచార్యులు పరమార్థాన్ని పంచిపెట్టారు. విదేశీయుల పాలనలో ఆత్మధర్మాన్ని విస్మరించిన భారతజాతిని శ్రీరామతీర్థ, స్వామి వివేకానందలు చైతన్య చకచ్ఛకితం గావించారు. స్వామి సుందర చైతన్యానంద, వారి వారసులు.

సనాతన ధర్మ ప్రాశస్త్యాన్ని గురించి, ఆర్షవిజ్ఞాన వైభవ ప్రాభవాలను గురించి, ఆధ్యాత్మిక చింతనా వైశిష్ట్యాన్ని గురించి, రామాయణ, భారత, భాగవతాది గ్రంథ రహస్యాలను గురించి, ఉపనిష త్సార సుధాంబుధి గురించి, గీతాలహరిని గురించి, అపారశేముషీ వైదుష్యంతో, ఘనగంభీర వచోవైభవంతో, అనితరసాధ్య ప్రజ్ఞా పాటవంతో, తన మహోపన్యాస కళావిలాసంతో గంధర్వగాన మధురిమతో, విశిష్ట రచనా విన్యాసంతో దేశాన్ని పునీతం చేస్తున్న స్వామి, చైతన్యస్వామి, సుందర చైతన్య స్వామి దైవమిచ్చిన అపురూప వరం. ఇహపరాలను అనుగ్రహించే మహాప్రసాదం.

వానను తడువని వారును, సూర్యకిరణ ప్రసారము సోకని వారును ఉండవచ్చును గాని, శ్రీ స్వామి పేరును వినని వారును, వారి ప్రసంగామృతముతో ఓలలాడని వారును, ఎవరూ కానరారు. లక్షలాది ప్రజానీకాన్ని మంత్రముగ్ధులను గావించే శ్రీ స్వామి శంఖారావం ముగ్ధ మనోహర గాన మాధుర్య మహిమ, లలితలలిత పద విన్యాస భరిత రచనా వైదుష్యం జగద్విదితం. రసికజన హృదయానంద సంధాయకం.

శ్రీ సుందర చైతన్యానంద స్వామి ఆర్షధర్మ ప్రబోధక మహా జ్ఞానయజ్ఞాలను దేశంలో విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పారవశ్యంతో ప్రజానీకం జ్ఞానగంగలో పవిత్ర స్నానమాచరిస్తున్నారు. శ్రీ స్వామిని సద్గురువుగా ఆరాధిస్తున్నారు. శ్రీ స్వామి కీర్తిగానంతో పులకిస్తున్నారు. పరవశిస్తున్నారు.

విశాఖపట్టణంలో శ్రీ స్వామి నిర్వహించిన 121వ జ్ఞానయజ్ఞం అపూర్వం; అనిదం పూర్వం. ఆర్షధర్మ వ్యాప్తికై శ్రీ స్వామి గావిస్తున్న నిర్విరామ, నిరంతర కృషిని స్తుతిస్తూ, ప్రస్తుతిస్తూ

'ఆర్షవిద్యా వాచస్పతి'

మహాబిరుదంతో మిమ్ములను సగౌరవంగా సత్కరించుట మా భాగ్య విశేషముగా సంభావించు చున్నాము.

శ్రీ స్వామి వాగ్వైభవానికి శ్రీరస్తు.

శ్రీ స్వామి అమృత గానలహరికి శుభమస్తు.

శ్రీ స్వామి రచనా వైదుష్యానికి కళ్యాణమస్తు.

30.5.1995

విశాఖపట్టణము

ॐ नमो भगवते वासुदेवाय

"ज्ञानब्रह्म"

श्री श्री श्री सुन्दर चैतन्यानन्द स्वामि महोदयाय
विशाख नगरे एकविंशत्यधिक शततम ज्ञान महायज्ञ
समापनोत्सव सन्दर्भे अभ्युदय चैतन्य समाख्य स्थित
सर्व सारस्वत सांस्कृतिक सांघिक आध्यात्मिक संस्थानां पक्षे
३०-५-१९९५ दिनाङ्के
"पद्मभूषण" श्री एस्. आनन्दराम महोदय करकमलयोः
अलंक्रियमान

"आर्ष विद्या वाचस्पति"रिति

महाबिरुद भूषणम्

धर्मभूमिः, वेदभूमिः, ज्ञानभूमिः, कर्मभूमिः, तपोभूमिश्चेत्यारव्यां वहत्यस्माकं भरतभूमिः। धार्मिक चैतन्येन, आध्यात्मिक वैभवेन, संस्कृती सभ्यता वैलक्षण्येन, नागरिकता वैशिष्ट्येन च प्रपञ्चदेशानां शिरोभूषण मभूदस्माकं भारतदेशः।

जगद्गुरु पीठिकाधिष्ठिता भारत जातिः मानवाना मभ्युदय मार्गानन्विष्य सत्यधर्म शान्त्यहिंसा सहन सौभ्रतृत्वादीनि सूत्राणि प्रबोधयामास। विश्वमानवकल्याण साधनान्येतानि सर्वाणि सूत्राणि नात्र सन्देहः। मानवः परिमितभोगाभिलाषस्सन् शाश्वत ब्रह्मानन्दाय वेदशास्त्र पुराणेतिहास रहस्यज्ञो भूयादिति उब्दोधयति भारतीय संस्कृतिः। तपोधनैः व्यासवाल्मीकि वसिष्ठादिभिरपि बहुधा प्रपञ्चितं सनातन धर्म वैशिष्टचम्। एतदेव प्रपञ्चितं श्री शङ्कर रामानुज मध्वाचार्यादिभिरपि।

विदेशी पालने विस्मृत संस्कृतीकं भारतजातिं श्रीरामतीर्थ विवेकानन्दादि महोदयाः प्रबोधयन्। तेषामनुयायी श्री सुन्दर चैतन्यानन्द महोदयः।

सनातन धर्म प्राशस्त्य मधिकृत्य, आर्षविज्ञान वैभव प्राभवावुररीकृत्य, आध्यात्मिक चिन्तना वैशिष्टच-मूरीकृत्य रामायण महाभारत भागवतादि ग्रन्थ रहस्यानुद्दिश्य उपनिषत्साराम्बुधिं प्रति गीतादि ग्रन्थराजान् सर्वान् निजघन गम्भीर वचो वैभवेन, अपार शेमुषीवैदुष्येन , महोपन्यास कला विलासेन, गन्धर्वगान माधुर्येण उपन्यसन् यावद्देशं पुनाति स्वामी चैतन्यानन्द महाराजः।

स्वामी चैतन्यानन्दस्तु प्राकृतजनो न, देवदत्त वरप्रसादः, इहपरसाधक महाप्रसादश्च।

स्वामिनः मुग्धमानोहर गानमाधुर्य, ललितपद विन्यास रचना वैदुष्यञ्च जगव्दिदितं, रसिकजन हृदयानन्द सन्धायकञ्च। अशेषजन मोह सन्धायिनी तेषामुक्तिः। स्वमिनः भारतीय सनातन धर्म शङ्खारावेण निनदितमिदं जगदित्यत्र नास्त्यतिशयोक्तिः।

श्री स्वमी सुन्दर चैतन्यानन्द महोदयः आर्षधर्म प्रबोधक महाज्ञानयज्ञान् असंख्याकान् निर्वहन्ति अस्मद्देशे। जनास्सर्वे पवित्रस्नानमाचरन्त्यस्यां ज्ञानगङ्गायाम्। तं स्वमिनं सद्गुरुं मन्यन्ते आराधयन्ति च।

विशाख नगरे स्वामिनानुष्ठितं एकविंशत्यधिक-शततम ज्ञानमहायज्ञमिदं अपूर्वं, अनिदंपूर्वं च। आर्षधर्म प्रचार निमग्नस्य स्वामिनः निरन्तरकृषिं, निस्वार्थसेवां च अभिनन्दयन्, स्तुवन्

"आर्षविद्या वाचस्पति" रिति महाबिरुदेन स्वामिनं सत्कृत्य आत्मनो धन्यं मन्यामहे।

श्री स्वामिनः वाग्वैभवाय श्रीरस्तु
श्री स्वामिनः रचनावैदुष्याय कल्याणमस्तु
श्री स्वामिनः अमृतगानलहर्यै शुभमस्तु

30-5-95 एवं
विशाखपट्टणम् अभ्युदय चैतन्य समाख्या

సంత్ సన్నిధి

పెజావర్ మఠం - ఉడిపిలో శ్రీ స్వామీజి

బెంగుళూరులో తమ 156 వ యజ్ఞాన్ని పూర్తి చేసుకొని పెజావర్ మఠాధీశులు శ్రీశ్రీశ్రీ విశ్వేశ తీర్థుల వారి ఆహ్వానం మేరకు శ్రీ స్వామీజీ ఉడిపి వేంచేశారు. రెండు సంవత్సరాలుగా పర్యాయ సేవలో ఉన్న విశ్వేశ తీర్థ స్వామీజీ వారిని పూజ్య గురుదేవులు కలసి భాషించారు. శ్రీకృష్ణ భగవానుడు అధిష్ఠానంగా ఉన్న ఉడిపి లోని ఎనిమిది మఠాల లోని పీఠాధిపతులకు ఒకొక్కరికి రెండు సంవత్సరాలు భగవానునికి అర్చనాదులు నిర్వహించే అవకాశం కలుగుతుంది. 16 సంవత్సరాల కొకసారి లభించే ఈ పర్యాయ సేవ, తమ తొమ్మిదవ ఏటనే సన్యాస దీక్షను పొందిన పవిత్రమూర్తి శ్రీ విశ్వేశ తీర్థుల వారికి ఇది నాలుగవసారి ప్రాప్తించడంతో 2 సం॥గా స్వామిజీ ఉడిపి నుండి ఎక్కడికీ వెళ్ళే అవకాశం లేకపోయింది. అందువల్ల పూజ్య గురుదేవులను వారు ఉడిపికే ప్రేమతో ఆహ్వానించుకున్నారు.

సాయంత్రం 5 గంటలకు మఠ మర్యాదలతో పెజావరు - అధోక్షజ మఠం నుండి శ్రీకృష్ణాలయం వరకు ముందు ఏనుగులు నడుస్తుండగా, బ్రహ్మచారులు వేద మంత్రములను వల్లిస్తుండగా, మంగళ వాద్యములు మ్రోగుచుండగా, వెంట పండితులు, భక్తులు నడుస్తుండగా పూజ్య గురుదేవులను ఊరేగించారు. కృష్ణాలయం వద్ద శ్రీ విశ్వేశ తీర్థ స్వాముల వారు పూజ్య గురుదేవులకు పూలమాల వేసి సాదరముగా ఆహ్వానించి లోనికి తీసుకొని వెళ్ళి భగవద్దర్శనం చేయించారు. కనకదాసు మహాత్ముడు దర్శించిన 'కనక ఖిండి'ని కూడా చూపించారు. తరువాత పూజ్యశ్రీ విశ్వేశ తీర్థుల వారి గదిలో ఇరువురు స్వాములు కొంత కాలం ఏకాంతంగా భాషించుకున్నారు.

అనంతరం, ప్రధానమంత్రి శ్రీ వాజ్‌పాయ్ నూతనంగా ఆవిష్కరించిన ఆడిటోరియంలో సభ ప్రారంభమైంది.

శ్రీ విశ్వేశ తీర్థుల వారు ప్రసంగిస్తూ "శ్రీ మధ్వాచార్యుల వారు భక్తి ఉద్యమాన్ని ఆంధ్రప్రదేశము నుండే ప్రారంభించారనియు, భక్తి గంగను అక్కడ నుండే ఉడిపికి తీసుకొని వచ్చారనియు, ఆంధ్రదేశానికి ఉడిపికి ఎనలేని ప్రేమ బంధము కలదనియు సెలవిచ్చారు.

పూజ్యశ్రీ విశ్వేశ తీర్థుల వారి ప్రసంగము

'శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానందుల వారు భక్తిప్రబోధమును ప్రారంభించి, ఆంధ్ర రాష్ట్రపు వాడవాడల జ్ఞాన గంగను ప్రవహింప చేసినారు. వారి సభలకు లక్షలాది జనం వచ్చి కూర్చొని భక్తి శ్రద్ధలతో ఆలకించటం నేను ప్రత్యక్షంగా చూసినాను. భగీరథుడు ఆకాశ గంగను భూలోకానికి తీసుకొని వచ్చినట్లు స్వామి సుందర చైతన్యా నందుల వారు జ్ఞాన గంగను తాము వెళ్ళిన చోటెల్లా ప్రవహింప చేశారు. ఈయన అపర భగీరథులు. భక్తి అనే జ్ఞాన చైతన్యమును వారు సమస్త భక్తుల హృదయాలలో నింపడం మనందరి

భాగ్యంగా భావిస్తూ ఉన్నాను.
స్వామి సుందర చైతన్యానందుల వారు కృష్ణ భక్తులు. ఆయన ఈనాడు ఉడిపిలో ఉన్నారు. ఉడిపి కృష్ణుని తమతో పాటు తీసుకెళ్తారేమో అనే సందేహం నాకుంది (అని చమత్కరించారు). కృష్ణ భక్తుల మైన మా ఇద్దరి కలయిక గంగా యమునల సంగమము వంటిది. సంసార జీవన యాత్రలో విసిగి వేసారిన మానవ హృదయాలపై భక్తి అనెడి అమృతాన్ని చిందింప చేసి వారిని కడతేర్చిన మహానుభావులు శ్రీ సుందర చైతన్యానందుల వారు.
కడపలో జరిగిన ఒక మహాసభలో స్వామిజీకి 'జ్ఞాన బ్రహ్మ' ప్రశస్తిని మేమే ఇచ్చినాము. శ్రీ సుందర చైతన్యానందుల వారు నన్ను జ్ఞాన ఫలాలను సమాజానికి వితరణ చేసిన ధర్మ వృక్షంగా, జ్ఞాన వృక్షంగా అభివర్ణించారు. నిజమే. కాని, మేఘాలు వర్షిస్తేనే తరువులు ఫల పుష్పాలను అందిస్తాయి. సుందర చైతన్యానందుల వంటి మహాత్ములు జ్ఞాన మేఘాలై భక్తి వర్షాన్ని కురిపిస్తూ ఉంటే, జ్ఞాన వృక్షాలు ఫలాలను ఇస్తూ ఉంటాయి'.

ఈ మాటలు శ్రీ విశ్వేశ తీర్థుల వారు పలికినపుడు కరతాళ ధ్వనులతో సభ మారుమ్రోగింది.

పూజ్యశ్రీ స్వామీజీ వారి స్పందన

'నా పేరు సుందర చైతన్యానంద. మీకు తెలుసు. నన్ను అపర భగీరథుడని స్వామిజీ సెలవిచ్చారు. ఇది కేవలం పోలిక మాత్రమే. పోలిక అయినప్పుడు భగీరథునితో కాకుండా గంగ తోనే ఎందుకు పోల్చకూడదు? నేనే గంగనైతే కదిలిన చోటికే చేరినట్లు, పరుగు లిడుతూ వచ్చి ఈ మహాత్ముని చరణ కమలాలను కడగక పోతానా?'

అని గురుదేవులు భావగర్భితముగ పలికినపుడు చప్పట్లతో ఆడిటోరియం ప్రతిధ్వనించింది.

కార్యక్రమ వైభవం చూడదగిందే గాని చెప్పనలవి కానిది. పూజ్య స్వామిజీ లిరువురు ఒకరి నొకరు ప్రశ్నించుకొంటూ, పరస్పర సమాధానా లిచ్చుకొంటూ, శ్రోతలను పరవశింప చేస్తూ, కరతాళ ధ్వనుల మధ్య ప్రసంగిస్తూ ఉంటే, ఆ పుణ్యస్థలిలో జ్ఞానగంగ శివుని శిరస్సు నుండి భువికి దిగివచ్చినట్లే ఉండింది. ఉపన్యాసానంతరం పూజ్యశ్రీ విశ్వేశ తీర్థ స్వాముల వారు పూజ్య గురుదేవులను శాలువా కప్పి సన్మానించారు. శ్రీ కృష్ణభగవానుని మూర్తిని జ్ఞాపికగా అందించారు.

మనసులో మాట

పూజ్యశ్రీ సర్వేశ్వరానంద
అఖిలాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షులు

సదయాత్మా! యశోధనా!

హార్దిక ప్రేమ పూర్వక నారాయణ స్మరణలు.

పూజ్య స్వామీజీ!

దయామయుని దయాపరత అపారము. అనంత శ్రీవిభూతి కందమై అలరారు ఈ సుందర చైతన్యాశ్రమ ప్రాంగణము నా ప్రాణమనములకు తృప్తిని కలిగించినది.

సౌహార్ద ప్రేమాస్పదా! స్వామీజీ!

కలికాలములో అందరూ ఒకరై జీవించగలరేమో గాని సన్యాసులు ఇద్దరు ఒక్క భావంతో ఒకచోట మనలేరు. కాని, అద్వైతానుభూతి నందిన వ్యక్తులు సర్వాత్మ భావ సంపన్నులు అయినవారు ఏ కొద్ది మందియో విశ్వశ్రేయోకాంక్షచే నాదని, మీదని తలచక దేహాత్మదృష్టి వదలి ఆప్యాయ తానురాగములు అలరించు కుంటూ అంతరంగిక బాంధవ్యమున నిలిచి ఉంటారు.

ఆధునిక యుగాన నేడు ప్రపంచ పరివర్తనము నందు భారతావని యొక్క మహోజ్జ్వల తాత్త్విక సిద్ధాంతములు ఆచరణాత్మ కంగా అనుభూతిపరంగా ప్రజలకు చక్కగా ప్రవచనము ద్వారా అందచేయు వ్యక్తులు చాలా అరుదు.

వివేకానంద, రామతీర్థ, రమణమహర్షి, అరవింద మొదలగు మహాపురుషుల తాత్త్విక జీవన విధానమును మీరు అందు కున్నారు. నవీన నాగరిక వ్యక్తులకు రసభరితంగా గానము ద్వారా జ్ఞానమును, జ్ఞానము ద్వారా సంయమనశీలతను, చతురవచనముల ద్వారా రసజ్ఞమైన యోగానుభవమును మీ యొక్క గడచిన జ్ఞానయజ్ఞముల ద్వారా అశేష జనమునకు మీరు అందించారు. దానిని ఆదరించి ప్రజానీకము మీకు నీరాజనము లందచేశారు.

మహనీయమైన ఆర్షసంస్కృతికి వారసులుగా వాల్మీకి వ్యాస భారద్వాజులు ఎవరా అని తలపోయు సమయంలో ధృవతారల్లాగా ధర్మరక్షణకు, దుష్టభావ దూరీకరణకు ధార్మిక ప్రబోధముల నొనర్చు వైతాళికులను మరలా మీలాటి యువ సన్యాసుల ద్వారా చూడగల్గు తున్నాము. అతిశయించిన మీ వాగ్విభవమును, మీ సుందర చైతన్య ఆశ్రమ కళా సంస్కృతిని అభిమానించి, ఆదరపూర్వక స్వాగత సుమములు కృష్ణభగవాన్ సన్నిధిలో సమర్పించువారు ఉన్నారు. ఏది ఏమైనా యుగసంధిలో ఆధ్యాత్మిక నౌక నడి సంద్రములో మునగకుండా చక్కనైన దిక్సూచిగా మీ కలము, గళము సాధకులకు ఉపయుక్తంగా ఉన్నాయి. శంకరుని తాత్త్విక గ్రంథరాజములను చక్కని భాషా వైదుష్యమున వెలువరింపజేసి పురాణ ప్రస్థానమును కూడా ప్రజలకు అందచేసిన మీ అనితర సాహస చర్యకు పరవశించుచు ఆ శ్రీకృష్ణదేవుని ప్రార్థించువాడ.

స్వామి వారు వ్యాసావతారమ్

శ్రీశ్రీశ్రీ త్రిదండి సంపత్కుమార
రామానుజ జీయరు స్వామి
శ్రీమత్ అష్టాక్షరీ పీఠం

పూజ్యశ్రీ గురుదేవులతో శ్రీ త్రిదండి సంపత్కుమార రామానుజ జీయరు స్వామి, శ్రీమత్ అష్టాక్షరీ పీఠం

శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారు సాక్షాత్తు వేదవ్యాసులు. వీరి ప్రవచనములు వినినా, వీరి వైభవమును కనినా మాకు వేదవ్యాసుడే జ్ఞాపకము వస్తారు. భగవానుడు శాస్త్రం ద్వారా లోకంలో ప్రజలకు జ్ఞానాన్ని కల్పించి, తన ఉనికిని వైభవాన్ని చాటుకున్నాడు. ఎన్నో శాస్త్రాలు ఆయన వైభవాన్ని అనంతంగా తెలియ చేసినాయి.

దుర్లభము, దుర్గ్రాహ్యము, గహనము అయిన శాస్త్రాల ద్వారా పరమాత్మను తెలిసి కొనుట సులభసాధ్యము కాదు. కనుకనే పరమాత్మ వ్యాసవాల్మీకాది ఎందరో మహాత్ముల ద్వారా తన తత్త్వాన్ని వ్యాప్తి చేసుకున్నాడు.

అలాగే, శాస్త్ర జ్ఞానము కలిగి పామరులకు సైతం సుకరంగా పరమాత్మను గూర్చి తెలియ చెప్పడం కోసం వ్యాస భగవానుడు మరల మన సుందర చైతన్యానంద స్వామిగ ఈ లోకానికి విచ్చేసారు. అందుకే స్వామి అపర వ్యాసులు. వీరి రచనలు, ప్రవచనములు, కీర్తనలు లోకాన్ని ఆకట్టుకున్నాయి. సమాజాన్ని జాగృతం చేసి, చైతన్యపరచి, శ్రీకృష్ణ భగవానుని దివ్యచరణ సన్నిధిలో నిత్య కైంకర్యరతిని భక్తులకు కల్పించటమే వీరి నిరంతర తపన. కనుకనే వీరు సుందర చైతన్యులు.

జ్ఞానం ద్వారా సమాజానికి చైతన్యం రావాలి. అప్పుడే మూఢ నమ్మకాలు, అర్థం లేని ఆచారాలు పోయి ప్రజలు వివేకంతో ప్రవర్తించ గలుగుతారు. స్వధర్మ స్వరూపం స్పష్టంగా తెలుస్తుంది. పరధర్మము లందు ఆకర్షణలు తగ్గుతాయి. సదాచారం ఏర్పడుతుంది. తద్వారా సనాతన ధర్మ వైభవము తెలుస్తుంది. ఇదే మన సుందర చైతన్య స్వాముల వారి తపన, పరితపన, నిరంతర నిర్విరామ పరిశ్రమ. సదా శ్రీకృష్ణగత చిత్తులై, సత్ప్రవర్తన పరులైన వీరే లోకానికి ఆదర్శము. వీరిని తెలియని భక్తులు లేరు. వీరిని ఆదరించని వ్యక్తులు లేరు. వీరు లోకానికి సన్మార్గ దర్శకులు. వీరి అవతారము పూర్ణమైనది.

స్వామి వారి బోధనలు సమాజానికి రక్షణ కల్పించు గాక! వీరికి సంపూర్ణ ఆరోగ్యాన్ని, ఆయువును పరమాత్మ అనుగ్రహించాలని జగదాధారుడైన శ్రీకృష్ణ పరమాత్మను మేము శరణాగతి చేయుచున్నాము.

10/1/2016

కారంచేడు - శ్రీ హరేరామ జపయజ్ఞాశ్రమాధిపతులు పూజ్యులు, శ్రీశ్రీశ్రీ ప్రణవానంద స్వాముల వారి ప్రసంగము



ఓం నమో భగవతే వాసుదేవాయ. జగత్పిత, జగత్పతి యైన శ్రీకృష్ణ పరమాత్మ దివ్య పాదారవిందాలకు ప్రణమిల్లుతూ, పరమ పూజ్య శ్రీ సుందర చైతన్యానందుల వారి దివ్యారుణ చరణ కమలాలకు శిరసు వంచి నమస్కరిస్తూ,

దివ్యాత్మ స్వరూపులారా! నా జీవితంలో ఇది ఒక అపురూపమైన భాగ్యంగా, అనేక జన్మల పుణ్య విశేషంగా నేను భావిస్తున్నాను. ఈ వేదికపై, స్వామీజీ సన్నిధిలో కూర్చొనే యోగ్యత అటుంచి, నిలబడే యోగ్యత కూడా నాకు లేదు. పూజ్య స్వామీజీ కేవలం నిర్హేతుక జాయమాన కటాక్షము మినహా మరే యోగ్యత గాని, అర్హత గాని లేదు.

పూజ్య గురుదేవుల ప్రవచనాలను నేను అనేక చోట్ల శ్రవణం చేశాను. ముఖ్యంగా ఇలాంటి పుట్టు పండుగ సందర్భంగా, గతంలో విశాఖపట్టణం - బుల్లయ్య కళాశాల ఆవరణలో పద్దెనిమిది రోజులు భాగవతంపై గురుదేవులు ప్రసంగించినపుడు, ఒకనాడు, హిందీలో ఒక దోహా పాడుతూ, ఒక నిరుపేద తనయ ఒక కోటీశ్వరుని పరిణయ మాడితే, మరుక్షణంలో ఆమె దారిద్ర్యం అదృశ్యమై, సర్వ సంపన్నురాలుగా ఎలా మారుతుందో, భక్తుడు భగవంతునితో సంబంధాన్ని ఏర్పరచుకోగానే అలా పరిణామం చెందుతాడని, దోహాను మధురంగా పాడి వినిపిస్తూ ఉంటే, అది విని తట్టుకోలేక నేను చిన్న పిల్లాడిలా ఏడ్చాను.

లోకంలో ఎందరో ఉపన్యాసకు లున్నారు. కాని, ఎవరి హృదయాన్ని భగవంతుని అనుగ్రహ కిరణం తాకి ఉంటుందో, వారి ఉపన్యాసమే మన హృదయాలను ఆకర్షిస్తుంది. మన గురుదేవుల హృదయాన్ని నేను అలాగే గ్రహించాను. సికింద్రాబాద్ - పి.జి. కళాశాల మైదానములో స్వామీజీ నూరవ జ్ఞాన యజ్ఞాన్ని నిర్వహించారు. ఆ పద్దెనిమిది రోజులు నేను యజ్ఞంలో పాల్గొన్నాను. ఆ మైదానానికి నాలుగు ద్వారాలు ఉండేవి. జనం వెళ్ళడానికే సరిపోక, గోడను పగులగొట్టి మరో నాలుగు ద్వారాలు పెట్టారు. అయినా, బయటికి వెళ్ళడానికి గంటలు పట్టేది. ఎంత జనమో! అదంతా భగవ ద్విభూతి. మన మందరం భగవంతుని స్మరిస్తాము. కాని, భగవంతుని శరణు పొందడ మెలాగో గురుదేవులకే సాధ్యపడింది. మనకు స్మరణం ఉంది. కాని, శరణం ఎలాగో మనకు తెలియదు. నా గురుదేవులు, మన గురుదేవులు పూజ్యశ్రీ సుందర చైతన్యానందుల వారు భగవంతుని కొరకు జీవితాన్ని సంపూర్ణంగా సమర్పించిన మహనీయులు. వారు మన గురుదేవులుగా లభించటం మన భాగ్యం. భగవ ద్విభూతిని మనం ప్రత్యక్షంగా, సమకాలీన జీవితంలో దర్శిస్తున్నాం. ఏముందని ఈ ఆకర్షణ? ఏమో! శ్రీకృష్ణ పరమాత్మ రాయబారానికి కురుసభకు వస్తూ ఉంటే, దుర్యోధనుడు ముందు గానే సభికులను ఆజ్ఞాపించాడు. శ్రీకృష్ణుడు వస్తాడు. ఏదో చెప్పుకుంటాడు. పోతాడు. మీరెవ్వరూ లేవకండి అన్నాడు. దుర్యోధనుని ఆజ్ఞలకు తలవంచిన సభికు లందరూ కారులో సీటు బెల్టులు తగిలించు కున్నట్లు కదలకుండా ఉండి పోయారు. శ్రీకృష్ణుడు వచ్చాడు. అంతే. ముందుగా దుర్యోధనుడే లేచి నిలబడ్డాడు. అప్పటికే అందరూ లేచి నిలుచో న్నున్నారు. అదే ఆకర్షణ. అదే మన గురుదేవుల ఆకర్షణ. ఒకరి కాళ్ళను మరొకరు త్రొక్కుకుంటూ, ఎక్కడ స్వామి వారు వేదిక దిగినా భక్తులు పరుగులు తీస్తూ ఉంటారంటే, ఏమని చెప్పగలం? మీ రెంతో పుణ్యాత్ములు. స్వామీజీని ఆశ్రయించి మీ జీవితాలను ధన్యం చేసుకున్నారు. ఆశ్రమం నాకూ తగులుకొని ఉన్నందున. నేను అంత అదృష్టానికి నోచుకోలేక పోతున్నా. మీరందరూ అదృష్టవంతులు'.

స్వామి సుందర చైతన్యానంద బోధనా విధి

స్వామి కమలానంద భారతి
కృష్ణా జిల్లా



శ్రీ సుందర చైతన్యానంద స్వామి వారు తమ 19వ ఏట ప్రారంభించిన ఉద్యమాన్ని అంచెలంచెలుగా విస్తరింపజేస్తూ 1990 నాటికి ఆంధ్రదేశ మంతట ఒక హిందు ఝుంఝూమారుతాన్ని, ఒక హిందు ఆధ్యాత్మిక, పౌరాణిక ప్రభంజనాన్ని సృష్టించారు. కేవలం మన ఆంధ్రదేశం లోనే కాదు, తమిళనాడు, కర్ణాటక, యావద్భారత దేశం లోను, ఇతర దేశాలలో కూడా గీతా జ్ఞాన యజ్ఞాలను అనేకం నిర్వహించారు.

శ్రీ సుందర చైతన్యానంద స్వామి వారు మన శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల పట్ల ఒక సాధికారిక మైన అవగాహన, సాధికారికమైన స్థానము, స్థాయి కలిగినటువంటి మహాపురుషులు. వారు భాగవతం చెప్పినా, భారతం చెప్పినా, రామాయణం చెప్పినా, ఉపనిషత్తులు చెప్పినా, గీత చెప్పినా - ప్రతి విషయాన్ని విడదీసి, అర్థసహితంగా వివరించి చెప్పగలిగే మేధావులు. వారు పాటలు వ్రాస్తారు - పాడతారు. పురాణాలు విప్పి చెబుతూ నవ్విస్తారు - ఏడిపిస్తారు. వారు బోధించే రామాయణం, భాగవతం వింటూ ఉంటే మనం అందులో లీనమై పోయేటటువంటి పరిస్థితిని కల్పిస్తారు.

1984 ప్రాంతాలలో నెల్లూరు టౌన్ హాలులో 'మాండూక్యోపనిషత్తు'పై వారు ఉపన్యసించినప్పుడు అక్కడ మేము విన్నాము. కాని, అక్కడ నుండి ఒక ఆరు సంవత్సరాలు ముందుకు వస్తే 1990 సంవత్సరం నాటికి నెల్లూరు వి.ఆర్.కళాశాల మైదానం క్రిక్కిరిసి పోయేటంతటి జనం రావడం మొదలు పెట్టారు. అప్పటికి ఈనాటి సామాజిక మాధ్యమాలు లేవు. యూట్యూబు, ఫేస్‌బుక్కు, ఇన్‌స్టాగ్రాము, వాట్సాపులు లేవు. అసలు సెల్ ఫోనులే లేవు. టి.వి. ఛానళ్ళు కూడా లేవు. కాని శ్రీ స్వామీజీ వారి ప్రవచనం యొక్క తీరు, చెప్పే విధానము జన సామాన్యం లోకి వెళ్ళి, గుడిసెలలో ఉండే వారిని కూడా మైదానాలకు రప్పించింది. అది ఒక పెను మార్పు. ఆ రోజుల్లో మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు చేసే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఏదో ఉన్నతంగా, ఆకాశంలో, అందరు అర్థం చేసుకోలేని స్థాయిలో ఉంటాయి అని అనుకునేవారు. కాని, అత్యంత గొప్ప విషయాలను వారి ప్రవచనాల ద్వారా చాలా సులభంగా, ప్రతి ఒక్కరికి అర్థమయ్యేటట్లు చెప్పడమనే విధానం కేవలం శ్రీసుందర చైతన్యానంద స్వామి వారి సొంతం. అది అంతే! వారి భాష కూడా సామాన్యులు మాట్లాడుకునే విధంగా ఉండేది. అది నెల్లూరు యాస. అది సమాజానికి నేరుగా వెళ్ళి అతుక్కు పోయేది.

శ్రీ స్వామి వారు చైతన్య రామాయణం, చైతన్య భాగవతం, చైతన్య మహాభారతం, చైతన్య భగవద్గీత, ఉపనిషత్తులు - ఇలా అన్ని రకాలైన పుస్తకాలు వ్రాశారు. సి.డి.లు తయారు చేశారు. జనులకు హిందుత్వం పట్ల చక్కటి అవగాహనను కలిగించి, హిందు ధర్మాన్ని పరిరక్షించే ప్రయత్నంలో వారు అవిశ్రాంతంగా, అహర్నిశం శ్రమించారు.

ఆదిలాబాద్ జిల్లాలో, మారు మూల గ్రామాల్లో, ఈ రోజుకి కూడా సుందర సత్సంగాలు జరుగుతూ ఉంటాయి. నెల్లూరు జిల్లాలో, కరీంనగర్ జిల్లాలో, ప్రధానంగా ఆదిలాబాద్ జిల్లాలో సుందర సత్సంగాలు జరుగుతూ ఉంటాయి. ఒక చిన్న ఆశ్రమం లాంటిది నిర్మాణం చేసుకొని అక్కడే ఆ భక్తులందరు చేరి స్వామి వారి క్యాసెట్లు, సి.డి.లు పెట్టుకొని వింటూ, ఆ పాటలు, భజనలు పాడుకుంటూ ఉంటారు. ఇలాంటి పవిత్ర జీవనాన్ని కొనసాగించే ఒక వర్గాన్ని సమాజంలో శ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారు తయారు చేశారు.

అపర భగీరథుడు

పూజ్యశ్రీ
విశ్వేశ తీర్థులు

శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానందుల వారు భక్తి ప్రబోధమును ప్రారంభించి, ఆంధ్ర రాష్ట్రపు వాడవాడల జ్ఞానగంగను ప్రవహింప చేసినారు. వారి సభలకు లక్షలాది జనం వచ్చి కూర్చొని భక్తి శ్రద్ధలతో ఆలకించటం నేను ప్రత్యక్షంగా చూసినాను. భగీరథుడు ఆకాశగంగను భూలోకానికి తీసుకొని వచ్చి నట్లు స్వామి సుందర చైతన్యా నందుల వారు జ్ఞాన గంగను వెళ్ళిన చోటెల్లా ప్రవహింప చేశారు. ఈయన అపర భగీరథులు. భక్తి అనే జ్ఞాన చైతన్యమును వారు సమస్త భక్తుల హృదయాలలో నింపడం మనందరి భాగ్యంగా భావిస్తూ ఉన్నాను.

కృష్ణ భక్తుల మైన మా ఇద్దరి కలయిక గంగా యమునల సంగమము వంటిది. సంసార జీవన యాత్రలో విసిగి వేసారిన మానవ హృదయాలపై భక్తి అనెడి అమృతాన్ని చిందింప చేసి వారిని కడతేర్చిన మహానుభావులు శ్రీ సుందర చైతన్యానందుల వారు.

కడపలో జరిగిన ఒక మహాసభలో స్వామీజీకి 'జ్ఞానబ్రహ్మ' ప్రశస్తిని మేమే ఇచ్చినాము. శ్రీ సుందర చైతన్యానందుల వారు నన్ను జ్ఞాన ఫలాలను సమాజానికి వితరణ చేసిన ధర్మ వృక్షంగా, జ్ఞాన వృక్షంగా అభివర్ణించారు. నిజమే. కాని, మేఘాలు వర్షిస్తేనే తరువులు ఫల పుష్పాలను అందిస్తాయి. సుందర చైతన్యానందుల వంటి మహాత్ములు జ్ఞాన మేఘాలై భక్తి వర్షాన్ని కురిపిస్తూ ఉంటే, జ్ఞాన వృక్షాలు ఫలాలను ఇస్తూ ఉన్నాయి.

సందేశ కుసుమాంజలి

శ్లో॥ వసుదేవసుతం దేవం కంసచాణూర మర్దనమ్ ।
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

శ్రీ స్వామి ఓంకారానందగిరి
గౌరవాధ్యక్షులు,
అఖిలాంధ్ర సాధు పరిషత్

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామి వారి
షష్టిపూర్తి మహోత్సవ సందర్భమున
సందేశ కుసుమాంజలులు

ఆర్షవిద్యావాచస్పతి, జ్ఞానబ్రహ్మ శ్రీ సుందర చైతన్యానందస్వామి వారికి ఓంకారానంద స్వామి హృత్పూర్వక ఓం నమో నారాయణాయ.

మీ షష్టిపూర్తి మహోత్సవాలను సంస్కృతి టి.వి.లో తిలకించే ప్రతివారికి ఆనందంతో పాటు జన్మ కూడా ధన్యమవుతూ ఉంది. ఇలాంటి మహోత్సవము **'న భూతో న భవిష్యతి'** అన్న రీతిన నిర్వహించిన మీ భక్తజనకోటికి అనేక ధన్యవాదములు.

స్వామీ! మీ తపోశక్తి, మీ కార్యదక్షత, మీ కృషి అనంతమైనది. చైతన్య రామాయణం, చైతన్య భారతం, చైతన్య భాగవతం, చంద్రభాగా తరంగాలు, ఉపనిషత్తులు, శంకరాచార్య స్వామి ప్రబోధములు భక్తులకు అందించటంలో మీరు విశేషంగా కృషి చేశారు. అనంతమైన శక్తిని ఆ అనంతుడు మీకు ప్రసాదించాడు. మీరు ప్రస్తుతం పండిత పామర జనరంజకంగా వ్రాస్తున్న **చైతన్య భగవద్గీత** రచనలో ఆ వాసుదేవుడు మీకు సదా తోడుగా, నీడగా, జంటగా ఉంటూ మిమ్ము అనుగ్రహిస్తూ ఉంటాడు. అలనాడు ద్వాపరయుగంలో బలరామ సమేతుడై శ్రీకృష్ణ పరమాత్మ మధురలో ప్రవేశించినపుడు అక్కడ గోచరించిన ఆనాటి గోపులు, భక్తజనులే మళ్ళీ మీ షష్టిపూర్తి మహోత్సవ సందర్భమున మీ ఆశ్రమంలో కనిపించారు.

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవములో స్వామి వారి **పల్లకీసేవ** వలె మీ షష్టిపూర్తిలో **పల్లకీసేవ** జరిగినపుడు, బ్రహ్మాది దేవతలు ఇలకు అరుదెంచి, మా సుందర చైతన్యుని పల్లకీ సేవలో భక్తజనుల వలె పాల్గొని ఆనందించారు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని తులాభారములో తూయలేక సత్యభామ అవస్థల పాలైతే, మీ శిష్యులు, మీ భక్తులు మిమ్ములను, మీ జ్ఞాన తపోశక్తిని తులాభారములో సాహసించి తూచినందుకు మీ భక్తకోటికి అభివందనాలు.

సుమారు 50, 60 సంవత్సరముల నుండి అనేక ఆధ్యాత్మిక సభలలో నేను పాల్గొనడం జరిగింది. కాని, అతి సుందరమైన, విశిష్ట మైన, విజ్ఞానమయ మైన, భక్తజన సేవాపరమైన మీ షష్టిపూర్తి మహోత్సవమును తిలకించిన తరువాత నేను అమితానంద భరితు ణ్ణయ్యాను.

అజ్ఞానంలో అలమటించే మానవాళిని మీ **గిరిధారి** పత్రిక ద్వారా ఆధ్యాత్మిక మార్గానికి పయనింపజేసి, వారిని సుజ్ఞానులుగా మార్చేందుకు తోడ్పడుతున్న మీకు భగవతాధి వందనములు. కొందరికి గళం ఉంటే కలం నడవదు. మరి కొందరికి కలం నడిస్తే గళం పలకదు. కలము, గళము, సాహిత్యము, సంగీతము, జ్ఞానము, విజ్ఞానము, సుజ్ఞానము, పాండిత్యము ఆ భగవంతుడు మీకు ప్రసాదించిన సంపదలు.

వెంకటగిరిలో 1964 వ సంవత్సరములో మా గురుదేవులు బ్రహ్మీభూత శ్రీరామకృష్ణానంద స్వామి వారు గీతోపన్యాసాలు చేసినపుడు మిమ్ములను కలిసినటువంటి స్మృతి చెదరకుండా ఉంది. * ఆ తరువాత 1984 లో తెనాలి - సాధుపరిషత్ భవనంలో కలుసుకోవడం జరిగింది. ఆ తరువాత హైదరాబాద్ ఆశ్రమంలోను, ధవళేశ్వరం ఆశ్రమం లోను మిమ్ములను కలిసినపుడు మీతో మాకు ఏర్పడిన అవినాభావ ఆధ్యాత్మిక సంబంధం ఎంతో ఆనందదాయకంగా ఉండింది. ఈ సంబంధం శాశ్వతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, మీరు శతజయంతి ఉత్సవాలు కూడా జరుపుకోవాలని, శ్రీకృష్ణ పరమాత్మ మీకు అఖండమైన శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ, మిమ్ములను హృదయ పూర్వకంగా అభినందిస్తూ, మీకు కుసుమాంజలులు భక్తితో సమర్పిస్తున్నాను.

శ్రీ ఓంకారానందగిరి స్వామి

* అప్పట్లో పూజ్య స్వామీజీ ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతూ ఉండేవారు.
పెద్దలు, సాధువులు నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ముందుగా సంకీర్తనం చేస్తూ ఉండేవారు.

ధర్మ ప్రచార ప్రముఖ్ సభ

2003 సం॥ డిసెంబర్ 4, 5 తేదీలలో హైదరాబాద్ లోని తులిప్ మనోహర్ స్టార్ హోటల్ లో పూజ్య శ్రీ స్వామి దయానంద సరస్వతి సారథ్యంలో ధర్మప్రచార ప్రముఖ్ సభ నిర్వహింపబడింది.

పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారు పాల్గొని స్వాగతోపన్యాసం చేసిన ఈ సమ్మేళనంలో పూజ్య స్వామి దయానందజీ, పూజ్య స్వామి సుందర చైతన్యానందజీతో పాటు విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు శ్రీ అశోక్ సింఘాల్‌జీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ప్రముఖులు శ్రీ కె.ఎస్.సుదర్శనంజీ, బెంగుళూరు వేదవిజ్ఞాన మహావిద్యా పీఠ్‌కి చెందిన శ్రీ రవిశంకర్‌జీ, గుజరాత్ జునాగడ్ సంత్‌రామ్ మందిర్ పక్షాన శ్రీ స్వామి ముదిత వదనానందజీ, శ్రీ స్వామినారాయణ సంప్రదాయానికి సంబంధించిన మాధవ ప్రియదాస్ స్వామి, వనవాసి కళ్యాణాశ్రమం పక్షాన గుణ్వంత్ సింఘ్ కోఠారీజీతో పాటు ఆశారాం బాపు ట్రస్టు, మాతా అమృతానందమయి మిషన్, రామకృష్ణ మిషన్, చిన్మయ మిషన్, తిరుమల తిరుపతి దేవస్థానం, బెంగుళూరు కొలాడ మహాసంస్థానములకు చెందిన ప్రతినిధులు కూడా ఈ సభలో పాల్గొన్నారు.

వీరే కాకుండా Aim for Seva జాతీయ కో ఆర్డినేటర్ శ్రీ శ్రీకాంత్ జక్కర్, కార్యదర్శి శ్రీ ఎమ్.పి.నారాయణన్ కూడా హాజరయ్యారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, దానశీలి, ఇస్పాట్ గ్రూప్ అధ్యక్షులు శ్రీ మోహన్‌లాల్ మిట్టల్ హాజరు కావడమే గాక, ఈ ధర్మ ప్రచార ప్రముఖ్ సభను స్పాన్సర్ చేశారు.

హిందూ ధర్మాన్ని, హిందూ సమాజాన్ని పరిరక్షించే దిశగా రెండు రోజుల పాటు సాగిన ఈ సమ్మేళనంలో అనేకమైన కీలకాంశాలను, మహాత్ములు చర్చించి తీర్మానించారు.

పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారు ఆంగ్లంలో ప్రసంగించిన స్వాగతోపన్యాసాన్ని టేపు నుండి సంగ్రహించి 'గిరిధారి' పాఠకుల కొరకు ఆనాడే ఆంధ్రీకరించి అందిచడం జరిగింది.

'భారత దేశంలో గోచరించే ఈ శుభ పరిణామాన్ని దర్శించి, యావత్ప్రపంచం పరివర్తన దిశగా పయనిస్తుందని భావిస్తున్నాను' అని రెండు దశాబ్దాల క్రితమే ఈ ఉపన్యాసంలో గురుదేవులు పలికారు. మహాత్ముల వాక్కులు ఊరకే పోతాయా! అవి నిజమని నిరూపిస్తున్న ఈ శుభ తరుణంలో శ్రీ స్వామి వారి అమృత సందేశాన్ని సర్వులకు అందించాలనే ఉద్దేశ్యంతో మరల ప్రచురిస్తున్నాము.

* * * * * * * *

స్వామీజీ అమృత సందేశం

పూజ్య స్వామి దయానందజీ, మహాత్ములారా!
మాననీయులారా!

భారతదేశం పుణ్యభూమి. తపోభూమి. జ్ఞానభూమి. మహాత్ములు చరించిన పుణ్యభూమి. మహర్షుల హృదయాలలో కదిలిన పవిత్రజ్ఞానంతో పునీతమైన దేశం మనది. ఋషులు విడిచిన పవిత్రమైన గాలితో నిర్మలమైన జ్ఞానభూమి మనది. వేలాది సంవత్సరాలుగా ఈ పవిత్ర భారతదేశంలో మానవాళిపై ఆధ్యాత్మిక జ్ఞాన ప్రభావ ముంది.

అనాదిగా ప్రకృతి పురుషులు ఇక్కడ పరస్పరం ప్రేమతో, అవగాహనతో, సానుభూతితో జీవించారు. పక్షిని రక్షించేందుకు తన శరీరాన్ని కోసిపెట్టిన శిబి చక్రవర్తి అనే ఉశీనర మహారాజు చరించింది ఇక్కడే. ఒక దుష్టుడు స్త్రీని అపహరిస్తే, అతణ్ణి ప్రతిఘటించి ప్రాణా లర్పించిన జటాయువు అనే పక్షి విహరించింది ఇక్కడే. ఈ పుణ్య భారతావనిలోనే.

ఋషులకు, మహర్షులకు, సంత్‌లకు, సాధువులకు, యోగులకు, త్యాగులకు నిలయమైన పుణ్యభూమి ఈ భారతావని.

ఇక్కడ ధర్మానికే పట్టాభిషేకం. త్యాగానికే సింహాసనం. సత్యానికే సన్మానం. మన జాతికి స్వార్థం తెలియదు. ద్రోహం అర్థం కాదు. మోసము, దగా, వంచన లాంటివి మన పూర్వీకుల పంచన నిలబడేందుకు సాహసించేవి కావు.

గడచిన చరిత్రనంతా ఒక్కసారి త్రిప్పి చూస్తే, మన దేశం మరొక దేశం మీద దండయాత్ర చేసిన సంఘటన మచ్చుకు ఒక్కటైనా కనిపించదు. ఇతరుల భాగ్యాన్ని ఆశించిన సందర్భం ఒక్కటి కూడా అగుపించదు.

స్వార్థం తెలియని మనపై స్వార్థపరులు దండెత్తారు. మన సంపదను అపహరించారు. మన సంస్కృతిలో చిచ్చు పెట్టారు. మనిషిని మనిషిని వేరు చేశారు. మమతల్ని కాల రాచారు. శాంతి నిలయంగా శోభించిన పవిత్ర దేశాన్ని అశాంతి నిలయంగా మార్చేశారు.

కొన్ని శతాబ్దాలుగా సాగిన పాశ్చాత్య కర్కశ పాలనలో జాతీయత కుంటుపడింది. విలువలు అడుగంటి పోయాయి.

ఈ రోజు మహాభారత గాథను మళ్ళీ విషాదంతో వీక్షిస్తున్నాం. మహాభారతంలో పాండవుల లాగా ధర్మం అరణ్యవాసం చేస్తోంది. నిజం చెప్పాలంటే, అజ్ఞాతవాసంలోకి వెళ్ళింది. స్వార్థం దుర్యోధనుని వలె పట్టాభిషేకం చేయించుకుంది. దాని ఫలితంగా ఈనాడు భారత దేశం క్రూరుల, దుండగుల, హింసావాదుల చేతిలో ద్రౌపదిలాగా నలిగిపోతూ ఉంది.

ఆవేశాలకు హద్దులుంటాయి. ఉన్మాదానికి సరిహద్దు లుండవు. శత్రువులపై పగ సాధించటం, విరోధుల్ని హతమార్చటం వంటి విషయాలను గూర్చి విన్నాం. అమాయకుల్ని, నిర్దోషుల్ని, పసికందుల్ని నిర్దాక్షిణ్యంగా వధించడాన్ని ఏమనాలి? దీనిని సభ్యసమాజం జీర్ణించుకోలేక పోతోంది.

భక్తితో ఆలయాలకు వెళ్ళే భక్తులు భయంతో వెళ్తున్నారు. కొందరు వెళ్ళలేక మానుకుంటున్నారు. పవిత్రతకు నిలయాలైన ఆలయాలు రక్తంతో మలిన పడుతున్నాయి.

ఇటీవల కాలంలో, అంటే రెండు దశాబ్దాలుగా ప్రజల్లో ధార్మిక చింతన బాగా పెరిగింది. ఆధ్యాత్మిక స్పృహ జనావళిలో ఏర్పడింది. నలభై మంది విద్యార్థులను తరగతి గదిలో కూర్చోబెట్టి ప్రశాంతంగా బోధించలేని స్థితిలో విద్యా విధానం మూలుగుతూ ఉంటే, మైదానాలను తరగతి గదులుగా మార్చి, వేల సంఖ్యలో జనాన్ని నిశ్శబ్దంగా కూర్చో బెట్టి ప్రవచనాలను శ్రవణం చేయించారు గురువులు, సాధువులు, ధర్మప్రచార ప్రముఖులు. అలాంటివారు నేడు మన మధ్య ఈ సభలోనే ఉన్నారు.

కాని, పరిస్థితి నేడు మారుతూ ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో సభలు, సదస్సులు

నిర్వహించడం కూడా కష్టమే అవుతుంది. ధర్మప్రవచనాలు కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోతాయి.

స్వతంత్ర భారతదేశంలో సంస్కృతీ పరిరక్షణ విషయంలో ఇప్పటికే పెద్ద అగాధం ఏర్పడి ఉంది. ఎలాగైనా దానిని భర్తీ చెయ్యాలి.

1947 ఆగష్టు **15**వ తేది మన దేశానికి స్వాతంత్ర్యం లభించింది. శతాబ్దాల బానిసత్వానికి తెరపడింది. విదేశీ పాలనలో ఛిన్నాభిన్నమైన ఇంటిని సరిజేసుకో వలసిన బాధ్యత స్వదేశీయులపై బడింది. సంస్కృతిని పునర్జీవింప చేసే గురుతర బాధ్యత పాలకులపై పడింది.

దురదృష్టం. అర్ధ శతాబ్దము నిండిన స్వతంత్ర భారతదేశంలో సంస్కృతీ వైభవాన్ని పునః నిర్మించుకొనే ఆలోచన నాయకుల్లో కలగక పోవడమే గాక, సంస్కృతీ సంప్ర దాయాలు శాశ్వతంగా మరుగున పడిపోయే రీతిలో చెలరేగిన కార్యక్రమాలకు పదవీ దాహంతో మన నాయకులు ఊపిరి పోయడం కూడా మన కళ్ళ ముందే జరిగింది. జరుగుతూ ఉంది.

ఫలిత మేమిటి?

దేశం ఛిన్నాభిన్నమై నిలిచి ఉంది. మోసం అడుగడుగునా మకాం పెట్టింది. సత్యము శిలువ వేయబడింది. మంచితనం మాయమైంది. విద్యావిధానం వెర్రితలలు వేస్తోంది. అబద్ధాలు పరిపాలిస్తున్నాయి. అరాచకాలు, లంచాలు యంత్రాంగంగా నిలిచాయి. ప్రభుత్వాలలో గందరగోళం ఏర్పడింది.

దేశద్రోహులు విదేశీ మతోన్మాదులతో చేతులు కలిపి విధ్వంసం సృష్టిస్తూ ఉంటే, రాజకీయ నాయకులు అరాచకంగా, అప్రజాస్వామ్య పద్ధతులలో దేశాన్ని పాలిస్తున్నారు. అందరూ కలిసి మాతృభూమిలో శాంతిని, సౌభాగ్యాన్ని నాశనం చేస్తున్నారు.

ఈ స్థితిని మార్చేందుకు, ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు, అధర్మపు మండుటెండల్లో కాలిపోయిన భూమిని తడిపి చల్లబరచేందుకు, సమాజ గగనంలో ధర్మమేఘాలు దర్శనమిచ్చాయి. అదే ఈ ధర్మప్రముఖ పరిషత్.

మహాత్ములారా! మాననీయులారా! స్నేహితులారా!

దేశంలో అధర్మం, హింస అగ్రస్థానంలో ఉన్నాయి. ఏ సంస్థ అయినా ఒంటరిగా చేసే ప్రయత్నంలో వీటిని తరిమికొట్టలేదు. దీనికి ఒక శక్తి కావాలి. ధార్మికసంస్థ లన్నీ సంఘీ భావంతో చేతులు కలిపి, ఐక్య కార్యాచరణలో కాలిడినప్పుడే అట్టి శక్తి ఉత్పాదన జరుగుతుంది. ఈ



విషయాన్ని మనస్సులో ఉంచుకొని, సహకార దృక్పథంతో, సుహృద్భావంతో పని చేయగలిగితే మనం తలపెట్టిన కార్యాన్ని సాధించగలం. హిందూ సమాజాన్ని చక్కగా పరిరక్షించగలం.

హిందూ సమాజ పునరుద్ధరణకు అందరిని అక్కున చేర్చుకోగల విశాల హృదయు లైన పూజ్య స్వామి దయానందజీ మన మధ్య ఉన్నారు. ఆ మహాత్ముని సహచర్యంలో, మార్గదర్శకంలో ఏ సేవలైనా అందించగలం. దేశంలో శాంతి ధర్మాలను నెలకొల్పగలం.

సుందర చైతన్యాశ్రమం స్థానిక ఆశ్రమం. అందుకే నేమో, పూజ్య స్వామి దయానందజీ స్వాగతోపన్యాసం చేసే అవకాశాన్ని నాకిచ్చారని భావిస్తున్నాను. పూజ్య స్వామిజీకి నా భక్తిపూర్వక నమస్కృతులను సమర్పించుకుంటూ, మీ అందరికీ మనఃపూర్వకంగా ఆహ్వానం పలుకుతున్నాను.

ఈ ధర్మప్రచార ప్రముఖ్ సభ భారతజాతిని పూర్వ వైభవంతో, సంస్కృతీ సంప్రదాయాల మార్గంలో నడిచేందుకు మార్గాన్ని నిర్దేశిస్తుందని, భారతీయ సమాజాన్ని లోక కళ్యాణం దిశగా, శాంతి మనుగడను సాగించే మార్గంలో నడుపుతుందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

అంతేకాదు. భారతదేశంలో గోచరించే ఈ శుభ పరిణామాన్ని దర్శించి, యావత్ప్రపంచం పరివర్తన దిశగా పయనిస్తుందని భావిస్తున్నాను.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు!

శ్రీ స్వామి రంగనాథానందజీ

శ్రీ స్వామి శుద్ధానంద భారతి


శ్రీ స్వామి విశ్వేశతీర్థులు


పూజ్యశ్రీ స్వామి చిదానందజీ

శ్రీ స్వామి బాలగంగాధరనాథ్‌జీ

శ్రీ స్వామి దయానందజీ


శ్రీ త్రిదండి సంపత్కుమార రామానుజ జీయరు స్వామి

సంత్ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న పూజ్య స్వామీజీ

రామకృష్ణులు

స్వామి సుందర చైతన్యానంద

భువిని వెలిగించే దివిదీపాలు రెండు. వారే సూర్యచంద్రులు. భువికి భుక్తి నిచ్చే శక్తిదీపాలు రెండు. అవే ఎండవానలు. భువికి ముక్తి నిచ్చే వేదదీపాలు రెండు. అవే ప్రవృత్తి నివృత్తులు.

కళ్ళు రెండయినా చూపు ఒక్కటే
చెవులు రెండయినా వినికిడి ఒక్కటే
పెదవులు రెండయినా నవ్వు ఒక్కటే
కాళ్ళు రెండయినా నడక ఒక్కటే
మార్గాలు రెండయినా గమ్య మొక్కటే.

ద్వివిధో హి వేదోక్తో ధర్మః ప్రవృత్తి లక్షణో నివృత్తి లక్షణశ్చ, జగతః స్థితి కారణమ్,
ప్రాణినాం సాక్షాత్ అభ్యుదయ నిశ్శ్రేయస హేతుః

'వేదాలలో రెండు ధర్మాలు చెప్పబడ్డాయి. ఒకటి ప్రవృత్తి. రెండవది నివృత్తి. ఈ రెండూ జగత్తు యొక్క మనుగడకు హేతువులు. ప్రాణుల అభ్యుదయానికి, నిశ్శ్రేయసకు కారణాలు' అని శ్రీ శంకర భగవత్పాదులు గీతాభాష్యాన్ని ప్రారంభిస్తూ పలికారు.

ప్రవృత్తి కర్మమార్గము. అది సమాజానికి అభ్యుదయాన్ని ప్రసాదిస్తుంది. నివృత్తి జ్ఞానమార్గము. అది వ్యక్తిలో పరిపూర్ణతను నింపుతుంది. ప్రవృత్తి ధర్మయుతము. ధర్మము నెలా ఆచరించాలో తెలిపేందుకు రాముడు. నివృత్తి మోక్షరూపము. స్వరూపంలో ఎలా ఆనందించాలో చూపేందుకు కృష్ణుడు.

రాముడు హస్త దేవత. కృష్ణుడు పాద దేవత.

చేసే పనులన్నీ పూజలు అయ్యేలా ధర్మాచరణము చేయిస్తాడు రాముడు. వేసే ప్రతి అడుగు ముక్తి ధామం వైపు సాగేలా నడకను నేర్పిస్తాడు కృష్ణుడు.

ఈ రెండూ జత కలిస్తేనే జీవితం.

అందుకే కాళ్ళు చేతులు అంటూ సంయుక్తంగా పలుకుతారు.

ఇవి బండి చక్రాల వంటివి. దేనిని విస్మరించినా విపత్తే.

అలాగే ప్రవృత్తి నివృత్తులు కూడా. **జగతః స్థితి కారణమ్.** ఈ ప్రపంచ మనుగడకు ముఖ్య కారణాలు.

ఈ రెండూ పరస్పర విరుద్ధంగా గోచరిస్తాయి. కాళ్ళు చేతులు వేరైనా ఎలా సంయుక్తంగా తెలుస్తున్నాయో, అలాగే ప్రవృత్తి నివృత్తులు కూడా సంయుక్త ధర్మాలే. వాటిని ప్రతిపాదించే రామ-కృష్ణులు కూడా సంయుక్త రూపాలే.

వర్కారీ సంప్రదాయంలో **రామకృష్ణ హరి** అనేది తారకమంత్రము. తుకారామునకు స్వప్నదర్శన మిచ్చి పాండురంగ భగవానుడు ఉపదేశించినది ఈ మంత్రమునే. 'రాముడు-కృష్ణుడు సంయుక్త రూపంగా తెలుస్తున్న శ్రీహరియే' అని ఈ మంత్రము ధ్రువపరుస్తూ ఉంది. అదే హరే రామ - హరే కృష్ణ.

రామ రామో రామకృష్ణః
కృష్ణ రామ ఇతి క్రమాత్

అని యోగదీపిక. ఇది సంయుక్త మూర్త్యోపాసన. సంయుక్త రూపోపాసన. సంయుక్త రూపార్చన.

దివికి, భువికి నిచ్చెనలను వేసిన ఈ రామ-కృష్ణ అవతార వైశిష్ట్యమును రామా యణ, భాగవత, భారత గ్రంథములే గాక అనేక పురాణాలు దివ్యంగా వర్ణించాయి. భిన్న మార్గాలలో పయనిస్తున్నట్లు గోచరించే ఈ రెండు అవతారములలో అభిన్నతను చూడగలిగే వారికే లభిస్తుంది బ్రతుకులో పరిపూర్ణత. ఇంతకీ, వారిరువురి మధ్య భిన్నత్వం ఎలా ఉంటుందో, వైరుధ్యం ఎలా కనిపిస్తుందో వారి ద్వారానే విందాం.

రామః :- నన్ను రామః అంటారు. నేను సూర్యవంశానికి చెందిన వాణ్ణి. ఆది శేషుడు లక్ష్మణుడు అనే పేరుతో నాకు తమ్ముడుగా జన్మించాడు. నేను మా సోదరులలో పెద్దవాణ్ణి. నా జననం అయోధ్యానగరంలో చాలా వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు నేను జన్మించాను.

కృష్ణః :- నన్ను కృష్ణః అంటారు. నేను చంద్రవంశానికి చెందిన వాణ్ణి. ఆదిశేషుడు బలరాముడు అనే పేరుతో నాకు అన్నగా జన్మించాడు. నేను మా సోదరులలో చిన్నవాణ్ణి. నా జననం మధురలో కారాగృహంలో భయాందోళనల మధ్య జరిగింది. రాత్రి 12 గంటలకు నేను జన్మించాను.

రామః :- నా బాల్యము చాలా ఆనందంగా వేడుకగా గడిచింది. పదహారేళ్ళు వచ్చేసరికి ఒక విషబాణాన్ని ప్రయోగించి తాటక అనే రాక్షసిని వధించాను.

కృష్ణః :- నా బాల్యము గండాలతో, భయాలతో సాగింది. ఆరురోజుల వయసులో నేను పూతన అనే రాక్షసి ఇచ్చిన పాలు త్రాగుతూ ఆ రాక్షసి ప్రాణాలు కూడా పీల్చేశాను.

రామః :- నేను ఏకపత్నీవ్రతుణ్ణి. నా భార్యను రావణుడు అనే రాక్షసుడు అపహరించాడు. అతణ్ణి వధించి సీతను రావణ చెర నుండి విడిపించాను.

కృష్ణః :- నేను బహుభార్యా సమేతుణ్ణి. నేను నా భార్య రుక్మిణిని అపహరించి తెచ్చుకున్నాను. అడ్డొచ్చిన శిశుపాలుడు లాంటి వారిని నామమాత్రం కూడా లేకుండా చేసి వారి శత్రుత్వం నుండి విడిపడ్డాను.

రామః :- నన్ను వాంఛించి వచ్చిన శూర్పణఖకు ముక్కు చెవులను దూరం చేసి వికృత స్వరూపంగా మార్చేశాను. సదా ధనుర్బాణాల తోనే శోభించే వాణ్ణి. అందుకే నన్ను కోదండరాముడు అంటారు.

కృష్ణః :- నన్ను అభిలషించి దగ్గరైన కుబ్జ యొక్క వికారమును పోగొట్టి అందమైన సుందరిగా తీర్చిదిద్దాను. నేను ఆయుధాలు ధరించను. పిల్లనగ్రోవితో ప్రకాశిస్తూ ఉంటాను. అందుకే నన్ను వేణుగోపాలుడు అంటారు.

రామః :- ధర్మమే నాకు ప్రాణం. మానవులకు ధర్మాచరణను ఆచరించి చూపాను. అందుకే నన్ను **రామో విగ్రహవాన్ ధర్మః** అని శ్లాఘించారు. నేను మార్గదర్శకుణ్ణి.

కృష్ణః :- ప్రేమయే నాకు ఊపిరి. జ్ఞానమే నా ప్రాణం. జ్ఞానంతో శోభించే దెలాగో మానవులకు బోధించాను. నన్ను

కృష్ణస్తు భగవాన్ స్వయం అని కీర్తించారు. నేను లక్ష్యసిద్ధిని.

రామః :- నా భార్యను రావణుడు అపహరించిన వార్త నా గుండెను కుదిపేసింది. సీత లేనిదే నా బ్రతుకు ఎందుకని విలపించాను. సీత నన్ను చేరిన తరువాతే నా హృదయం శాంతించింది.

కృష్ణః :- నేను దూరమైతే ఆ వియోగము గోపికల హృదయాలను నలిపేసేది. కృష్ణుడు లేనిదే మా బ్రతుకు ఎందుకని వారు ఏడ్చేవారు. నేను మళ్ళీ వారికి కనిపిస్తే శాంతించేవారు.

రామః :- నేను ఒక్క అబద్ధం చెప్పలేదు. దొంగతనం నాకు తెలియదు. హాస్య భాషణం నేను ఎరుగను. నన్ను మర్యాద పురుషోత్తముడు అనేవారు. నన్ను సమీపించా లంటేనే అందరికీ భయం.

కృష్ణః :- నాకు అబద్ధాలు మంచినీళ్ళు త్రాగినట్లే. దొంగతనం నా గుణం కాదు; వృత్తి. నా దంతా హాస్య భాషణమే. పొట్ట చెక్క లయ్యేలా నవ్వే వారు నా సహచరులు. నన్ను ప్రేమమూర్తి అంటారు. నన్ను సమీపిస్తే, తిరిగి ఎవరూ విడిచి వెళ్ళరు.

రామః :- నా గుండెలో అంతా కరుణే. ఎవరికి ఏ బాధ వచ్చినా వాళ్ళ కన్నా ముందుగా నేను ఏడ్చేవాణ్ణి. నాది జాలిగుండె.

కృష్ణః :- నా గుండెలో అంతా జ్ఞానమే. నా జీవితంలో ఉప్పెన లాగా బాధ లొచ్చిపడినా నేను చలించే వాణ్ణి కాదు. నాది జ్ఞానహృదయం.

రామః :- సూర్యుని కుమారుడైన సుగ్రీవుడు నా స్నేహితుడు. అతని కొరకు ఇంద్రుని కుమారుడైన వాలిని నేను వధించాను. వాస్తవానికి వారిద్దరు సోదరులే.

కృష్ణః :- ఇంద్రుని కుమారుడైన అర్జునుడు నా సఖుడు. అతని కొరకు సూర్యుని కుమారుడైన కర్ణుని వధకు నేను కారణ మయ్యాను. నిజానికి వీరిద్దరు కూడా అన్నదమ్ములే.

రామః :- నేను ఏకపత్నీవ్రతుణ్ణి. కాని, ఏం ప్రయోజనం? జీవిత మంతా బాధలే. దుఃఖాలే. ఏడుపులే.

కృష్ణః :- నేను బహుభార్యా సమేతుణ్ణి. అయితే నేమి? జీవితమంతా ఆటలే. పాటలే. మాటలే. ప్రేమ బాటలే.

రామః :- నా భార్య ఉత్తమురాలు. ఆదర్శమహిళ. అందుకని గౌరవంతో ఆమె పేరును నా పేరుకు జోడించి 'సీతారాం' అని కీర్తిస్తారు భక్తులు.

కృష్ణః :- నా భార్యలు కూడా ఉత్తములే. ఆదర్శ మహిళలే. కాని, నా పేరుకు ముందు వాళ్ళ పేర్లుండవు. 'రాధ' అని మరొకరి భార్య ఉంది. ఆమె పేరును నా పేరుకు తగిలించి 'రాధేశ్యాం' అంటూ తల లూపేస్తూ, తబలాలు వాయించేస్తూ, తన్మయత్వంతో గంతులేస్తూ సంకీర్తనలు చేస్తారు భక్తులు.

రామః :- నేను యుద్ధంలో భయంకరంగా పోరాడేవాణ్ణి. రామబాణానికి ఎదురు లేదని చెప్పుకొనే వారు. దిక్పాలకులు కూడా జడిసి పోయేవారు.

కృష్ణః :- నేను యుద్ధంలో చూసేవాణ్ణే గాని, చేసేవాణ్ణి కాను. మురళియే నా ఆయుధం. దాని ద్వారా జీవన రాగాన్ని ఆలపిస్తాను. అది విని దిక్కులే కాదు; దివి కూడా ద్రవించి పోతుంది.

రామః :- కాంచన మృగాన్ని తీసుకొని రావాలని వెళ్ళి కాంతను పోగొట్టుకున్నాను. కాంతను తృప్తి పరచాలనుకున్నానే గాని రెండూ లేకుండా పోతాయనుకో లేదు.

కృష్ణః :- నేను కూడా శ్యమంతకమణిని తీసుకురావాలని అన్వేషిస్తూ వెళ్ళి మణిని తెచ్చుకున్నాను. దానితో పాటు "జాంబవతి" అనే భార్యామణిని కూడా వెంట తెచ్చు కున్నాను.

రామః :- నన్ను దేవుడని చాలామంది విశ్వసించారు. నేను అంగీకరించ లేదు. **ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్.** నేను మానవ మాత్రుణ్ణి. దశరథ కుమారుణ్ణి అని చెప్పేవాణ్ణి.

కృష్ణః :- నన్ను దేవుడుగా అంగీకరించుటకు చాలా మంది సందేహించారు. నేను అవన్నీ లెక్క చేయలేదు. **లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః.** లోకము నందును, వేదము నందును ప్రకాశించు పురుషోత్తముడను నేనే అని ఢంకా బజాయించి మరీ చెప్పాను. నేనే పరమాత్మను అని శంఖారావం చేసేవాణ్ణి.

రామః :- అయోధ్యను సురక్షితంగా ఉంచి నేను నా పరంధామం చేరాను. ఆ తరువాత చాలాకాలం నా అయోధ్య శోభాయమానంగా రాణించింది.

కృష్ణః :- నేను నిష్క్రమించక ముందే ద్వారక నీళ్ళలో కలిసి పోయింది. ఆ తరువాతే నేను నా పరంధామం చేరాను. ద్వారక ఎక్కడుందో, ఎలా ఉందో ఇప్పటికీ అంతు పట్టడంలేదు. పరిశోధకులు ఈ రోజుకీ వాళ్ళ పాట్లు వాళ్ళు పడుతూనే ఉన్నారు.

సరే! ఇంతటితో ఆపి, మన బాటకు మనం వస్తాం. చూశారా! ఇది రామకృష్ణుల సంభాషణము. ఎంత వైరుధ్యంతో గోచరిస్తున్నారు? పైకి వైరుధ్యముగా తెలిసినా అంతరంగమున అంతా వైభవమే. వీరిలో ఎవరిని కలిసినా ప్రయాణం వైకుంఠానికే. మార్గాన్ని రాముడు సుగమం చేస్తే, గమ్యమై శ్రీకృష్ణుడు భాసిస్తాడు. ఒకే నాణెమునకు బొమ్మ బొరుసు లాగా బ్రతుకు చెలామణి కావాలంటే అభ్యుదయ నిశ్శ్రేయసలు బొమ్మ బొరుసు లాగా విడిపోకుండా ఉండాలి. కనుకనే రామకృష్ణులు కూడా విడిపోకుండా సంయుక్తమై మన చేత సంయుక్త నామార్చన చేయించు కొంటున్నారు. ఈ అర్చనలో సిద్ధించే ప్రసాదమే రామ-కృష్ణ స్వరూపము.

తెలుగమ్మా! ఇది నీ వెలుగమ్మా! (పాట)

శ్రీ స్వామి సుందర చైతన్యానంద



పల్లవి :

అన్నపూర్ణ తెలుగుతల్లి ఆమె మనసు పాలవెల్లి
కవితలకు కల్పవల్లి మమతలకు మన తల్లి ॥ అన్నపూర్ణ ॥

చరణములు :

1. ఆంధ్రమాత వదనమ్మున అలరించిన నవ్వులం
తేనె కన్న తియ్యనైన తెలుగుభాష బిడ్డలం ॥ అన్నపూర్ణ ॥

2. కాకతీయ వైభవం విజయనగర ప్రాభవం
పల్నాటిది గౌరవం ఈ నాడిక మనతరం ॥ అన్నపూర్ణ ॥

3. గుండెను రాముని గుడిగా మార్చెను భద్రాదిలో రామన్న
వ్యాసుని మించిన వాణిని పలికెను పరమభక్తుడు పోతన్న
రాల్కరగించే రాగరసములో ముంచి తేల్చెను త్యాగన్న
కవిబ్రహ్మగా కవుల గుండెలలో నిలిచిపోయెను తిక్కన్న
ఎన్నన్నా తనివి తీరదు
ఏమన్నా నీ సరి తూగదు
మల్లమ్మ, రుద్రమ్మ, మొల్లమ్మలను
ఒడిలో పెంచిన తెలుగమ్మా - మా
యెద యెదలో నీ వెలుగేనమ్మా ॥ అన్నపూర్ణ ॥

4. పలికిన వారికి పరమ నేర్పుతో పల్లకి పట్టిన మన జనని
ఎనిమి దేనుగుల నధిరోహించి ఊరేగిన పరమ పావని
బుస్సని లేచిన భాషలన్నిటికి లెస్సని పలికిన రాయులమ్మ
నీవనే కల్పతరువున మేము కాచిన కాయలమ్మా!
ఆగాలి - ఆనేల - ఆపైరు - ఆపేరు
గౌతమీ కృష్ణా తరంగాల పన్నీరు
విశ్వశాంతికి దూత మన తెలుగుతల్లి
నిత్యాన్నదాత మన కన్నతల్లి ॥ అన్నపూర్ణ ॥

మనసైన మాట

స్వామి సుందర చైతన్యానంద

ఎంత మందితో నాకు పరిచయాలు ఉన్నాయి; ఎవరెవరు నాకు తెలుసు అనే ఆలోచనల కన్నా, నాతో నాకు ఎంత వరకు పరిచయం? అనే ప్రశ్న వేసుకోగలిగితే, ఆ క్షణమే జీవితం ఒక అందమైన మలుపు తిరుగుతుంది. సదవగాహనకు మనస్సు సిద్ధ పడుతుంది. ఆ నిముషం నుండి బ్రతుకు సరళంగా, సజావుగా సాగుతుంది.

నేను ఒక్కణ్ణే. కాని, నాలో నేను తొంగి చూసినపుడు తెలుస్తుంది నేను ఒక్కడిగా లేనని. నాలో నేను ఇద్దరుగా ఉన్నానని. రెండుగా ఉన్నానని.

(1) నాలో వాంఛలు ఉన్నాయి; వ్యథలు ఉన్నాయి; బాధలు ఉన్నాయి; అపజయాలు ఉన్నాయి. గాయాలు ఉన్నాయి. చెప్పుకోలేని గాథ లున్నాయి. ఇలా నేను ఒకణ్ణి.
ఇలా ఉండాలని ఎవరైనా ఎందుకు అనుకుంటారు? కాని అలా ఉన్నారు. మరోలా ఉండలేకపోతున్నారు అంటే, ఈ విధమైన జీవనము వెనుక బలమైన కారణా లున్నాయి. ధర్మా లున్నాయి. నియతి ఉంది.

నేను ఇలా ఉండటానికి ఏది కారణమో, నా జీవితం ఇలా ఉండటానికి ఏ నియతి కారణమో, అదే నా పరిసరాల్లో ఉంది. ప్రపంచంలో ఉంది. వ్యక్తులలో ఉంది. వారి ప్రవర్తనల లోనూ ఉంది.

ఆ సమయంలో అలా ప్రవర్తించకుండా ఉంటే బావుండేది. అక్కడ అలా చేసి ఉంటే బావుండేది అనే మాటలు పలికేది మనమే.

చేయకూడని దానిని ఎవరు చేయమన్నారు? చేయవలసిన దానిని ఆపమని చెప్పిం దెవరు? మానుకున్నది మనమే. పూనుకున్నదీ మనమే.

అంతా తెలిసే చేశాం. అప్పుడు మరోలా చేయటం, మరో విధంగా ఉండటం సాధ్య మయ్యేది కాదు అని ఇప్పుడు కూడా తెలుసుకోలేక పోతున్నాం.
చేయవలసింది ఎంతైనా ఉండవచ్చు. చేయగలిగిందే మనం చేయగలం. ఉండవలసినవే మన వద్ద ఉంటాయి. లేనివి రావచ్చు. మన కొరకు లేనివి రమ్మన్నా రావు.

పోయేందుకు వచ్చినవి ఉండమన్నా ఉండవు.
ఉండటానికి వచ్చినవి పొమ్మన్నా పోవు.
మనకు ఇష్టం లేనివి ఎన్నో మనం చేస్తున్నాము. ఇతరులు చేసే వాటిని ప్రశ్నించే హక్కు మనకు ఎక్కడుంది?
నా జీవితంలో అయినా,
పరుల జీవితంలో అయినా,
ప్రపంచంలో అయినా జరుగవలసినవియే జరుగుతున్నాయి. జరుగకూడనివి అయితే ఎందుకు జరుగుతాయి?
గతంలో ఇలాగే జరిగాయి.
వర్తమానంలో కూడా ఇదే రాగం.

భవిష్యత్తులో కూడా ఇదే పాట. ఇదే బాట.

ఇదే జీవితంలో ఘర్షణ. జీవిలో సంఘర్షణ.
మనిషిలో అంతా ఇంతేనా? బ్రతుకంతా బాధలేనా?
నాలో ఇంకేమైనా ఉందా? ఉంది. అదే ఆ రెండో నేను.

(2) నాలో తృప్తి ఉంది. విశ్రాంతి ఉంది. హాయి ఉంది.
సాధించినవి ఉన్నాయి. ప్రేమ ఉంది. దయ ఉంది.
సానుభూతి ఉంది. ఇలా నేను మరొకణ్ణి.

ఏదీ అవసరం లేనివాణ్ణి; ఎవరూ అవసరం లేనివాణ్ణి.
దేనినీ కాదనలేని వాణ్ణి; ఎవరినీ కాదనలేని వాణ్ణి.
సుఖాన్ని కోరనివాణ్ణి; సుఖమై ఉండేవాణ్ణి.
ఉండాలి అనుకోని వాణ్ణి; ఎప్పుడూ ఉండేవాణ్ణి.
అందగాణ్ణి కాను; అందంగా ఉంటాను.
మాటలు లేవు; మాట్లాడుతాను.
పాటలు రావు; పాడుతాను.

పోవాలి అనుకోను; ఉండాలి అని భావించను.
పోయినా ఉండేవాణ్ణే; పోకుండా ఉండేవాణ్ణే.
రమ్మని పిలవని వాణ్ణి; పొమ్మని చెప్పని వాణ్ణి.
అదిగా ఇదిగా ఉండనివాణ్ణి

ఏదోగా ఉండని వాణ్ణి
నేనుగా ఉండేవాణ్ణి.

చలికి చెలికాణ్ణి. వానకు నేస్తాన్ని. ఎండకు మిత్రుణ్ణి.
కాలంతో కలసి తిరుగుతాను. గాలితో చేతులు కలిపి
షికారు కెళ్తాను. వెన్నెలను వాటేసుకొని ఊరేగుతాను.
ఇదే జీవితంలో సరళత్వం. జీవికి సమత్వం.
మనిషి తనలో తాను ఇలా లేడా? ఈ జీవన కళ తనకు
లేదా? తనది కాదా? అవును. తనదే. నీదే. నాదే.
ఇదే ఆ రెండో నేను.
నీవు ఒక్కడివే.
ఎలా ఉంటావు రెండుగా?
రెండు ఉన్నా, ఉన్న దొక్కటే. నీవుగా ఉన్న దొక్కటే.
అదేదో మనం తేల్చుకోవాలి.
నీవు, మొదటి నీవే అయితే, ఇక జీవితంలో కాంతి
మిగలదు.
నీవు, రెండవ నీవే అయితే, ఇక జీవితంలో అశాంతి
నిలవదు.
ఇది తేలాలి. అప్పుడే, బ్రతుకు తేలిక పడుతుంది.
తేలిపోతుంది.
లేదా అమాంతం, ఆసాంతం మునిగిపోతుంది.

శనిని వలచి మునిగిపోవడమా?
మునిని తలచి తేలిపోవడమా? తరించిపోవడమా?
ఇదే నిర్ణయం కావాలి. ఇదే బుద్ధిలో స్పష్టత. బ్రతుకులో
పరిష్టత.

అందమైనవి
అమోఘమైనవి
అద్భుతమైనవి - ఎన్నో ఉన్నాయి ఈ ప్రపంచంలో.

వినీలాకాశము
పచ్చని పొలము
సాగర జలము - అందంగా ఉంటాయి.

వాల్మీకి కవిత్వం
నారదుని సంగీతం
విశ్వకర్మ నిర్మాణం - అమోఘంగా ఉంటాయి.

రవీంద్రుని గేయాలు
రవివర్మ చిత్రాలు
తిక్కన పద్యాలు
పోతన పలుకులు - అద్భుతంగా ఉంటాయి.



అన్నీ ఆకర్షణలే. అన్నీ అందాలే. ఆనందాలే. అద్భుతాలే.
అన్నిటికన్నా,
అందమైనది, ఆకర్షణీయమైనది, అద్భుతమైనది ఏదయినా ఒక్కటి చెప్పండి అని మీరెవరన్నా నన్ను అడిగితే,
'స్పష్టత' అని సమాధానం చెబుతాను.

స్పష్టత అంటే ఏ సంశయం లేకుండా ఉన్నది ఉన్నట్లు స్వచ్ఛంగా తెలియటం. అందుకే నేమో, "జ్ఞానానికి సమమైన పవిత్ర వస్తువు లేదు" అన్నది భగవద్గీత.

ఈ విషయంలో
మన శాస్త్రాలు విలక్షణంగా శోభిస్తాయి.
మన మహర్షులు వైభవంతో ప్రకాశిస్తారు.

బుద్ధిలో స్పష్టంగా వెలిగే జ్ఞానము హృదయంలో వెన్నెలను కాయిస్తుంది.
మనస్సులో మల్లెలను పూయిస్తుంది.

మనం ఏదో చేయాలని ప్రపంచానికి రాలేదు.
ఏదో కావాలని ప్రారబ్ధంతో కలసి వచ్చాము.

మనం ఏమీ కాలేకపోయామని, ఏదీ చేయలేకపోయామని కాలం చూస్తూ కూర్చోదు. పరుగు లెత్తే కాలాన్ని మనం కూర్చోబెట్టలేము. మనం శాంతిలో పవ్వళించే దెలాగో అర్థం చేసుకోవాలి. పరమార్థాన్ని పొంది తరించాలి.

సింహపురిలో విరబూసిన జ్ఞాన మందారాలు

*(**15-6-94** నుండి **24-6-94** వరకు నెల్లూరు వి.ఆర్. హైస్కూలు మైదానములో నిర్వహింపబడిన పూజ్య స్వామీజీ **118** వ జ్ఞానయజ్ఞము సందర్భముగా కార్య నిర్వాహకులు భక్తులకు వితరణ చేసిన యజ్ఞప్రసాదము)*



కవిబ్రహ్మ తిక్కన

కం॥ భారత సంహితఁ దెన్గున
సారమతుల్ పొగడ నుడివి జగతికి మేలున్
గూరిచిన, యజ్వతిక్కన
పొరుండీ సింహపురికి బ్రహ్మయు కవితన్ ॥

కవయిత్రి మొల్ల

కం॥ మొల్లల జాజుల తావులు
వల్లవ మృదుశోభలొప్పఁ బల్కెను కావ్యం
బుల్లములు పల్లవింపగ
మొల్ల యనఘ సింహపురికి ముద్దుల పడుచై ॥



జ్ఞానబ్రహ్మ సుందర చైతన్య

కం॥ సుందరుడౌ చైతన్యా
నందుండాంధ్రమ్మునందు నాణ్యత మీరన్
పొందించి భాగవత సుధ
నందించెను సింహపురికి యశముం గూర్చెన్ ॥

శివ కుటుంబం

స్వామి సుందర చైతన్యానంద

చిక్కులు లేని కుటుంబం.
చింతలు లేని కుటుంబం.
స్పర్థలు తెలియని కుటుంబం.
వ్యర్థం గాని కుటుంబం.

మన కుటుంబాలు కూడా శివ కుటుంబాలు కావాలి. అవగాహన ఉంటే, సంసారాలు కైవల్యా లవుతాయి. కైలాసా లవుతాయి.

పరిస్థితులు దుఃఖానికి కారణం కావు, ప్రవర్తనే కారణం. ఈ సత్యం తెలిస్తే, సంసారం కోఱలు తీసిన పాములా మన ముందే ఆడుతూ ఆనందాన్ని పంచుతుంది. అదే శివ కుటుంబం. ఎలా ఉందో చూద్దాం పదండి.

శివ కుటుంబం లో
ఒక ఇల్లాలు. ఇద్దరు కుమారులు.
ఆయన వాహనం నంది.
భార్య వాహనం సింహం........ ఈ రెండు జంతువులకు బద్ధ శత్రుత్వమనే విషయం వేరే చెప్ప నవసరం లేదు.
ఒక కుమారుడి వాహనం మూషికం
మరొక కుమారుడి వాహనం మయూరం.
తండ్రి మెడలో ఆభరణం సర్పం......... సరిపోయే, వీటిలో ఒకటి మరొకటితో సరిపడి ఉండవు.

మానవ దేహము ఈ లోకంలో పట్టున పదిపదు లైనా ఉండదు. ఈ మధ్య కాలంలో సంసారము ఉండే దెంతసేపు? ఊడే దెంతసేపు?

ఉన్నంత కాలం తోడుగా ఉండదు
పోయేనాడు నీడలా వెంబడించదు.

కాలప్రవాహంలో కూడే దెప్పుడో తెలియదు. వీడే దెప్పుడో అర్థం కాదు.
ఈలోగా - సంసారం ...... సంసారం
మహాసాగరం - దుస్తరం - అంటూ అరుస్తూ అలసి పోతుంటాము.

సంసారాలు బంధహేతువులు కావు. సంసార భావనే బంధహేతువు. ఈ సత్యం అవగతమైతే, సంసారంలో కూడా సారమే ఉంటుంది. సారరూపుడైన పరమాత్మే ఉంటాడు. పరమాత్మ ఉండే చోటు మంగళకరంగా ఉంటుంది. శివప్రదమై, శుభప్రదమై ఉంటుంది. ఈ సత్య నిరూపణకే భగవంతుడికి కూడా కుటుంబం తయారైంది.
అదే 'శివ కుటుంబం'.



కుటుంబ మంతా ఒకే చోటికి ప్రయాణమైనా, అందరూ ఒకే కాలంలో చేరలేరు. ఎవరి గమనం వారిదే. ఎవరి గమ్యం వారిదే. వారి వాహనాలు అలాంటివి. ఇదే శివ కుటుంబం.

కానీ, ఈ కుటుంబ సభ్యు లందరూ ఎంత హాయిగా ఉన్నారో చూశారా!

రూపాలు వేరుగా ఉన్నా,
స్వరూపం ఒకేలా ఉంది.

అనేకము లున్నాయే గాని అనేకత్వం లేదు.
భిన్నత్వముందే గాని భేదం లేదు.

ఇదే శుభానికి సంకేతం.
శివ కుటుంబ సందేశం.

ఒక కుటుంబంలో ఎందరో ఉంటారు.
అందరి ప్రారబ్ధాలు ఒకేలా ఉండవు.
ఎవరెవరి పరిమితాలు వారికి ఉంటాయి.
ప్రవర్తనా సరళిలో వ్యత్యాసాలు ఉంటాయి.

ఆలోచనలు వేరుగా ఉంటాయి.
అభిరుచులు వేరుగా ఉంటాయి.
అవసరాలు వేరుగా ఉంటాయి.
ఆశలు వేరువేరుగా ఉంటాయి.

ఎవరు, ఎందుకు, ఎలా ఉన్నారో - అర్థం కాకపోయినా, అంత కన్నా మరో విధంగా ఉండటం వారి చేత కూడా కావటం లేదు - అనే సత్యాన్ని సహృదయతతో అర్థం చేసుకున్న నాడు,
ద్వేషాలు, సంతాపాలు దూరమై
ప్రేమలు, సానుభూతులు చిగురిస్తాయి.

వైకల్యాలు అదృశ్యమై
కైవల్యాలు దర్శన మిస్తాయి.

పుట్టింట అన్నీ ఉన్నాయి. అత్తగారింట్లో అక్షయపాత్రే ఆస్తి. దానినే అక్షయ సంపదగా భావించింది హైమావతి. అత్తగారింట్లో ఏమీ లేకపోవచ్చు. ఆత్మీయతను, ప్రేమను పంచే భర్త ఉన్నాడు అనే భావనే పార్వతీదేవి ఆనందానికి మూలం.

ఏదో కావాలని శివుడు తపించ లేదు.
మరేదో రావాలని పరితపించ లేదు.
అంతర్ముఖుడై ఉన్నదానితో తృప్తి చెందాడు.

ఏదో లేదని
మరేదో రాలేదని సంసారులు అలమటిస్తుంటారు.
ఏదో ఉందని

మరేదో పోలేదని సదా కుటుంబాలలో ఆందోళన చెందుతూ ఉంటారు.

ఉండేందుకు వచ్చింది పొమ్మన్నా పోదని
పోయేందుకు వచ్చింది ఉండమన్నా ఉండదని
ఉన్న సత్యాన్ని గ్రహించిన ఉమాపతి

ఓ బొజ్జ గణపయ్యను
ఆ బుజ్జి ఎలుకమ్మను,
ఆరు ముఖాల కుమారుని
తుర్రుమనే తోకమ్మను
మరొకరికి తల వంచని మృగరాజును
దించిన తల ఎత్తని వృషభరాజును
ఓ ప్రక్కన
కళ్ళెర్ర జేసే కాళీని జోడు చేసుకున్నా
మరో ప్రక్క
మెడలో బుసలుకొట్టే కాళమును తోడుగా పెట్టుకున్నా,

శివుడు సదా ధ్యానమయుడే
శాంతి మయుడే
సార రూపుడే
సంసార రూపుడే.

ప్రపన్న పారిజాతం

స్వామి సుందర చైతన్యానంద

ఓ నవ నళిన దళ లోచనా!
ఓహ్! సుర వందిత కంజ విలోచనా!
అసుర భంజనా! నందనందనా!

ఎన్ని పువ్వులు? వాటిలో ఎన్ని పొంగులు?
ఎన్ని రంగులు? వాటిలో ఎన్ని హంగులు?
ఎన్ని మనసులు? వాటిలో ఎన్ని సొగసులు?
ఎన్ని పాటలు? వాటిలో ఎన్ని పలుకులు?
ఎన్ని రాగాలు? వాటిలో ఎన్ని అనురాగాలు?
ఎన్ని మొగ్గలు? వాటిలో ఎన్ని సిగ్గులు?
ఎన్ని రూపాలు? వాటికి ఎన్ని శాపాలు?
ఎన్ని కళ్ళు? వాటిలో ఎన్ని కన్నీళ్ళు?

హే సకలార్థ సంవేదీ! విపుల యశోనిధీ!
ఓ దేవా! హే వాసుదేవా!

అన్నీ నీవు కావా? అన్నిటిలో నీవు లేవా?
భక్తుల మొర వినలేవా? ఆర్తిని విని రాలేవా?

ధరణిని మరచినావా దేవా!
దయను విడిచినావా వాసుదేవా!

హల కులిశాది రేఖలతో శుభకరంగా శోభిల్లు పవిత్ర పాదముద్రలతో పుడమిని పావన మొనర్చిన పరమ పురుషా! భక్తజన పోషా! చైతన్య దరహాసా!

సురవరుల కిరీటాలు సుశోభితంగా విలసిల్లాయట.
అది నీ చరణ కమల పరాగ వైభవం కాదా?

సర్వ తీర్థములను పావన మొనర్చినది
నీ పాద పంకజ పవిత్ర తీర్థము కాదా?

సుర నర ముని గణములు అవ్యయానంద మోక్షదాయక మని భావించినది నీ పద ధ్యానము కాదా?
విధి శివ సనకాది వందిత చరణారవిందా! అఖిల జన నయనానందా! ఆనంద కందళిత హృదయారవిందా! ముకుందా!

ఇంద్రాది సురులు భావింప నలవి గాని ఈ విచిత్ర లోకం నీవు మేలెంచి క్రీడించే అద్భుత చదరంగం. విధాతను వినియోగించుకొని నీవు నర్తించే క్రీడారంగం. నీ అఖండానంద సుధాబ్ధి నుండి ఎగసి పడే లీలా విలాస తరంగం.

అరవింద వాసినీ వసుంధరా సుందరీ సమేతా! సకల సుగుణ సహితా! దోషరహితా!
హే అనంత తేజో విరాజా! అహర్పిత తేజా!

సులలిత కృష్ణ కథా సుధాబ్ధిలో గ్రుంకులిడి
సుమనోహర కృష్ణ లీలామృత రసాన్ని పానం చేసి

పులకరించి
పరవశించి

మాటలు వినిపించి,
పాటలు ఒలికించి
రచనలు సాగించి,
ప్రవచనాలు
కొనసాగించి -
ఊరూరు తిరిగాను. నోరార పలికాను.

అయినా,
తీరలేదు - దేవా!
తనివి తీరలేదు - వాసుదేవా!

త్రిజగన్మాంగల్యమై, దారుణ సంసార సాగరోత్తారణంబై శోభించు శ్రీకృష్ణ కథా సుధారసాన్ని పుడమికి త్రాగించే ప్రయత్నంలో,

వేణుగానంగా
మంజుల నాదంగా - వినిపించాలని, విని తరించాలని

మనసులో తలచి
మనసారా వలచి
మనసుతో పిలిచే - ఈ శ్రీకృష్ణ కథా గానము అనే
హరినామాంకిత మైన గీతము

నీకు వినపడాలని
నీ చూపు మాపై పడాలని - నీ కీర్తిని గళమెత్తి
పాడుతున్నా.

బ్రతికినంత కాలం
నీ అడుగుల కడ పడి
పాడుతూనే ఉంటా!
ఉన్నంత కాలం
అలాగే ఉంటా!

నా జీవితంలో ఒక సంఘటన

స్వామి సుందర చైతన్యానంద

ప్రతి మనిషి జీవితంలో ఎన్నో సన్నివేశాలు చోటు చేసుకుంటాయి. కాలం గడిచే కొద్దీ ఎన్నో మరుగున పడిపోతూ ఉంటాయి. కొన్ని అలా మరుగున పడకుండా, పైపైనే తేలుతూ ఉంటాయి. అలాంటివి మరువలేని మధురానుభూతులు కావచ్చు. మరపురాని దుఃఖానుభవాలు కావచ్చు. మితిమీరిన విషాదాలు, అతిశయించిన ఆనందాలు మాత్రమే తరచుగా బుద్ధితెరపై కదుల్తూ ఉంటాయి. సాధారణ సంఘటనలు స్మృతికి వచ్చినా మనస్సును పెద్దగా చలింప చేయలేని సన్నివేశాలు, కాలక్రమేణ స్మృతి పుటలలో మడత పడి కనిపించకుండా పోతాయి. ఒక్కొక్కసారి, జ్ఞాపకం చేసుకోవా లని ప్రయత్నించినా, ఆనవాలు కూడా దొరకని రీతిలో మరుగున పడిపోతాయి.

సమయం లేకుండా సన్నివేశం జరగదు. ఏ సన్నివేశమైనా ఒక సమయంలో జరిగేదే. సమయాలలో జరిగిన సన్నివేశాలను కాగితాలలో మడత పెట్టడానికి కూడా సమయానుకూలం కావాలి. కాలం కలిసి రానిదే కలం కూడా కదల దేమో! కాగితం కూడా దొరక దేమో! అదే కాల వైభవము. కాకపోతే, 'అర్జునా! కాలం నేనే' (కాలోఽస్మి) అని గీతలో భగవానుడు ఎందుకు చెబుతాడు?

ప్రస్తుతం అదే నా అనుభవంలో సాగుతూ ఉంది. క్షణాలే చాలా విలువైనవిగా మారిపోయాయి. నిముషాలు అమూల్యంగా ఉన్నాయి. ఖరీదు కట్టలేని విధంగా గంటలు నిలిచి ఉన్నాయి. కాల విలువ తెలియనివాణ్ణి కాను. ఎందుకనో తెలియదు గాని జీవితంలో కాలాన్ని పెద్దగా వినియోగించుకోలేక పోయాను. కాకపోతే, వినియోగించుకొనిన కాలం లోనే పెద్ద పెద్ద కార్యాలను చేసుకో గలిగాను. చేతనైనంత వరకు, భగవత్కృప తోడుగా ఉన్నంత కాలం బ్రతుకును చక్కదిద్దు కున్నాను.

నా జీవితంలో ప్రారబ్ధం బలీయంగా హింసించిన సంఘటనలు ఉన్నాయి. భగవంతుని అనుగ్రహ పవనాలు చల్లగా వీచిన సన్నివేశాలూ ఉన్నాయి. ఏవి ఎందుకు జరుగుతున్నవో నా బుద్ధికి అందక పోయినా, కొన్నిటిని నేను ఊహించ గలిగాను. కొన్నిటిని స్పష్టంగా అర్థం చేసుకోగలిగాను. కొన్ని అస్పష్టంగా అర్థమైతే, కొన్ని అయోమయంగా ఉండిపోయాయి. నా బాల్యంలో జరిగిన సంఘటన ఇది.

అది 1963.

నేను ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నాను. తిరుమల బ్రహ్మోత్సవాలు చూచి, తిరిగి మా ఊరికి ప్రయాణ మయ్యాను. తిరుపతిలో రైలు ఎక్కాను. శ్రీకాళహస్తి వచ్చింది. బండి ఆగింది. మళ్ళీ కదిలింది.

బ్రహ్మోత్సవాలలో చూచిన వేడుకంతా మనస్సులో ఊరేగుతోంది. భక్తి వైరాగ్యాలతో హృదయం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. బండిలో చాలా మంది ప్రయాణికులు ఉన్నారు. అంతా కలకలం.

నేను మెల్లగా లేచి బండి తలుపు దగ్గరకు వచ్చి నిలబడ్డాను. ఎందుకనో, ఆ రోజుల్లో నాకు ఆ అలవాటు బాగా ఉండేది. ఎక్కువ సేపు తలుపు దగ్గరే నిలబడి ప్రకృతిని చూస్తూ ప్రయాణం చేసేవాణ్ణి. కుటుంబ సభ్యులతో కలసి ప్రయాణం చేసేటప్పుడు కూడా అదే అలవాటు.

ఇనుప కడ్డీని గట్టిగ పట్టుకొని ద్వారం వద్దే నిలబడ్డాను. ఎదురుగా, దూరంగా ఎత్తైన పర్వత పంక్తులు కనిపిస్తూ ఉన్నాయి. బండి ముందుకు పోతూ ఉంటే, బంధువుల్ని సాగ నంపి తిరిగి వెళ్ళే చుట్టాల లాగా పర్వతాలు, చెట్లు వెనక్కి పోతూ ఉన్నాయి.

బండి వేగం పుంజుకుంది. అంతకన్నా వడిగా నాలో భావ వేగం, భక్తి భావావేశం ఊపందు కున్నాయి. ఏవో ఏవో ఆలోచనలు, భవిష్యత్తును గూర్చిన ఊహలు, రైలుబండి కన్నా వేగంగా పరుగు లెత్తుతున్నాయి.

ఎల్లకారు, అక్కుర్తి అనే రెండు చిన్న స్టేషన్లు వచ్చాయి. పోయాయి. ఇక రాబోయే స్టేషన్ వెంకటగిరి. అక్కడ నేను దిగాలి.

వాతావరణం చల్లగా ఉంది. ఉదయం పదకొండు గంటలు కావస్తోంది. ఆకాశం మేఘావృతమై ఉంది. గాలి హాయిగా వీస్తోంది.

కాస్త అలసటగా అనిపించిందో ఏమో తెలియదు. చేతిగుడ్డ పరచుకొని ఆ ద్వారం వద్దే కూర్చున్నాను. కొంత సేపటికి నిద్ర పట్టేసింది. తలుపుపై తల ఆన్చి నిద్ర పోయాను. నా కాళ్ళు అలా క్రిందికి జార విడిచాను.

ఇక్కడే. . . ఇక్కడే. . . ఇక్కడే.

ఎలా వ్రాయాలో నాకే తెలియడం లేదు.

నేను కళ్ళు తెరవడం - అప్రయత్నంగా రెండు కాళ్ళు పైకి లేపడం - కాళ్ళ క్రిందే ప్లాట్‌ఫారమ్ వెనక్కి పోతూ ఉండటం . . . అంతా క్షణాల్లో జరిగి పోయింది. నేను కళ్ళు తెరిచి, కాళ్ళు పైకి లాక్కున్నానా? లేక, కాళ్ళు పైకి లేపిన తరువాత కళ్ళు తెరిచానా? ఇప్పటికీ అర్థం కాదు. ఇక అప్పుడేమి అర్థమై ఉంటుంది? కాకపోతే, నేను కాళ్ళు పైకి లేపిన మరుక్షణం లోనే ప్లాట్‌ఫారం వెనక్కి పోతూ ఉంది. అంతా క్షణాల్లోనే.

బండి ఆగింది. నా శరీరం వణకుతోంది. మెల్లగా లేచి నిలబడ్డాను. బ్యాగు అందుకొని బండి దిగాను. ప్లాట్‌ఫారం మీద నిలబడ్డాను. కాళ్ళు వణకుతున్నాయి. నడవలేక పోతున్నాను. వాతావరణం చల్లగా ఉన్నా, నాకు చెమటలు పోస్తున్నాయి. బండి వెళ్ళే వరకు అలాగే నిలబడి ఉండిపోయాను. బండి పోతూ ఉంటే, ఎందుకనో, నా చూపు బండిలో ప్రయాణం చేసే వాళ్ళ మీద లేదు. బండి క్రింద పరుగులు తీస్తున్న చక్రాల మీదే ఉండి పోయింది.

ఆ క్షణంలో . . . . ఆ క్షణంలో నేను కాళ్ళు పైకి లేపకుండా ఉంటే, ఏమై ఉండేదో! ఎక్కడ ఉండేవాణ్ణో! ఆలోచన చెయ్యాలనే ఉంటుంది. కాని, ఆ సన్నివేశం జ్ఞాపకం రాగానే ఎవరో పట్టి ఆపినట్లు నా మనస్సులో ఆలోచనలు ఆగిపోతాయి. కళ్ళను తోసుకొంటూ ముందు కొచ్చి అశ్రువులు క్రిందికి జారుతాయి. ఏదో కృతజ్ఞతా పూర్వక భక్తిభావంతో హృదయం చలించి పోతుంది. మాటల కందని ప్రేమకు విలువ కట్టలేక మనస్సు మూగ బోతుంది. తీర్చలేని ఋణ భారాన్ని తలచుకొని బుద్ధి బరువెక్కుతుంది. తమేవ శరణం మమ దేవదేవ అని మాటలు ముందు కొస్తూ ఉంటే, అప్రయత్నంగా తల క్రిందికి వంగుతూ ఉంటుంది.

శరీరం ఆరోగ్యంగా ఉండాలని, దృఢంగా ఉండాలని అందరమూ వ్యాయామాలు చేస్తూ ఉంటాం. చేయాలి కూడా. అది చాలా మంచి అలవాటు. కాని, ఆరోగ్యాలు, ఆయుష్షులు ప్రయత్నాలకే పరిమితమై లేవు అనేది ఎంతో ఆలోచించిన తరువాత గాని అర్థం కాదు. ఏ విషయంలో నైనా కృషి లోపం ఉండ కూడదు. కాని, ఎవరి జీవితంలో నైనా సుఖం అంటూ ఉంటే, భద్రత అంటూ మిగిలితే, శాంతి అంటూ విరాజిల్లితే, వీటి వెనుక మన కృషి కన్నా భగవంతుని కృపే అసమానంగా అలరారుతూ ఉంటుంది అనే సత్యం గ్రహించడానికి వయస్సు సరిపోదు. బుద్ధి జ్ఞానము సరిపోదు. అనుభవము చాలదు. మనిషికి ఆధ్యాత్మిక జీవితం కావాలి. పరమేశ్వరుని కృపను స్వయంగా అనుభవించిన అనుభూతులు కొన్నైనా ఉండాలి.

నా జీవితంలో ఎన్నో గండాలు - మరెన్నో సుడిగుండాలు. వాటిని ఏదో ధైర్యంతో ఎదుర్కొన్నా నని, సాహసంతో ఈదుకొచ్చా నని నే నెప్పుడూ భావించ లేదు. భావించను కూడా. వాస్తవానికి నేను పెద్ద ధైర్యశాలిని కాను. చిన్న చిన్న గాలుల్ని తట్టుకోగల నేమో గాని, పెద్ద గాలివానను తట్టుకొని నిలిచే టంతటి సాహసవంతుణ్ణి కాను. కాని, నా జీవితంలో ఘోర తుఫాను లొచ్చాయి. ముంచేసే సునామీలూ వచ్చాయి. వాటిని తట్టుకొని నిలిచాను. ధైర్యం ఉండి కాదు. శక్తి ఉండి కాదు. తెలివితేటలు ఉండి కాదు.

నేను వేదికలపై బోధలు వినిపిస్తూ ఉంటే, నా ముందు, నా చుట్టూ వేల సంఖ్యలో జనం మూగుతారు.

కానీ,

నేను దుర్భరమైన బాధల్లో చిక్కుకు న్నప్పుడు, నా వెంట భగవంతు డొక్కడే ఉంటాడు. వాసుదేవు డొక్కడే ఉంటాడు. ఇది సత్యం. నా జీవితంలో నేను అనుభవించిన సత్యం. ప్రస్తుతం నా చేతిలో కలం ఉంది అనేది ఎంత సత్యమో, నా ఈ అనుభవం అంత సత్యం.

భగవంతుడు ఎవరి సొత్తూ కాడు. భక్తుడు కాగలిగితే, అతని కంటూ సొత్తు ఉంటే, అది సత్తే. భగవంతుడే. అదే 'స్వామి' శబ్దార్థము.

అందరూ స్వామి వైపే చూడాలి.
స్వామి అందరివాడూ కావాలి. అస్తు.

కేశవ నామాలతో మేలుకొలుపు

స్వామి సుందర చైతన్యానంద



1. **కేశవ!** యని నిన్ను నోరార భక్తులు
 కీర్తించు చున్నారు మేలుకో!
 దేవకీనందన దానవ భంజన
 వందన మిదె స్వామీ మేలుకో! . కృష్ణా, ఏలుకో!

2. **నారాయణ!** నరులు కరములు జోడించి
 వరము లంటున్నారు మేలుకో!
 వైకుంఠ మాధవ! గోకుల యాదవ!
 నారద సన్నుత మేలుకో! ..... కృష్ణా, ఏలుకో!

3. **మాధవ!** యని నిన్ను మహితాత్ము లందరు
 స్తుతియించు చున్నారు మేలుకో!
 మాయలు మసి చేసి మహిమను దర్శింప
 గరుడ గమన వేగ మేలుకో! .....కృష్ణా, ఏలుకో!

4. **గోవింద!** యని నిన్ను ఆనందముగ మేము
 అర్చించు చున్నాము మేలుకో!
 గోపాల బాలక! గోపీ జనప్రియ!
 గోవర్ధనోద్ధార! మేలుకో! .....కృష్ణా, ఏలుకో!



5. **విష్ణుదేవుడ!** నీవు వైకుంఠమును వీడి
 మా ఇంట కొలువుండ మేలుకో!
 సిరులు లేవు మాకు సురులు కాము మేము
 వరములు కోరము మేలుకో! ... కృష్ణా, ఏలుకో!

6. **మధుసూదన!** అంటూ మంచి తెలిసిన మనసు
 మారాము చేస్తోంది మేలుకో!
 చిరునవ్వు లొలుకుచు వెన్నెలలు చిందించే
 మా జీవన జాబిల్లి మేలుకో! ....కృష్ణా, ఏలుకో!

7.**త్రివిక్రమ!** ఇది ఏమి పరాక్రమము?
ఆక్రోశ మెందుకు? మేలుకో!
సక్రమ మార్గాన మమ్ముల నడుపుటకు
చక్రధారి! వేగ మేలుకో! . . . . కృష్ణా, ఏలుకో!

8. **వామన!** మన తన వదలిన మా పైన
కరుణను వర్షింప మేలుకో!
మునిజన వందిత వసుదేవ నందన
మురళి మనోహర మేలుకో! . . . కృష్ణా, ఏలుకో!

9. **శ్రీధర!** సుకుమార! ఇకనైన మేలుకోరా!
అపవాదు లెందుకు మేలుకో!
ఇలలో శ్రీపతు లెల్ల కల లోనే ఉంటారు
జగ మెరిగిన నా స్వామీ మేలుకో! . . .కృష్ణా, ఏలుకో!

10. **హృషీకేశ!** నిన్ను వర్ణించుటకు మాకు
భాష లేదు తండ్రీ! మేలుకో!
ఋషి బిడ్డలము మేము దోషము లెరుగము
పోషించుటకు మమ్మ మేలుకో! . . . .కృష్ణా, ఏలుకో!

11. **పద్మనాభ!** పది కాలాల భక్తిని
పట్టించుటకు మాకు మేలుకో!
వట్టి చేతుల తోనే మూరేసే వారము
గట్టి జ్ఞానము నివ్వ మేలుకో!. . . . . కృష్ణా, ఏలుకో!

12. **దామోదర!** దేవ దానవుల నడుమ
మగువై కులికిన స్వామీ మేలుకో!
మంచి చెడుల మధ్య మునుగుచు నున్నాము
మమ్ముద్ధరించుటకు మేలుకో! . . . కృష్ణా, ఏలుకో!

13. సంకర్షణ! మాకు సంఘర్షణే గాని
సంతృప్తి తెలియదు మేలుకో!
సంతస మొసగేటి చల్లని నా స్వామి
పంత మేల? దేవా! మేలుకో! . . . కృష్ణా, ఏలుకో! .

14. వాసుదేవ! మాలో వసియింపగ రావా!
వాస్తవమును తెలుప మేలుకో!
వలపులరాయుడ! వసుమతి వల్లభ!
వాగ్దేవి సన్నుత మేలుకో! . . . . కృష్ణా, ఏలుకో! . . .

15. ప్రద్యుమ్న! యని నీ పావన చరితము
పఠియించు చున్నాము మేలుకో!
దధి చిలికే వేళాయె దొరతనము నీదాయె
దొంతరలు దించుటకు మేలుకో! . .కృష్ణా, ఏలుకో!

16. అనిరుద్ధ! మా వద్ద భక్తి ఒక్కటె గాని
సిరిసంపదలు లేవు మేలుకో!
వరించితిమి నిన్ను తరియింప జేయవా
సిరి గల దేవుడ మేలుకో! . . . . .కృష్ణా, ఏలుకో!. .

17. పురుషోత్తమ! నీవు వేషములు మానేసి
తోషము లొలికింప మేలుకో!
అన్నెము పున్నెము నెరుగని వారము
ఉన్నాము నీ కొరకు మేలుకో! . . .కృష్ణా, ఏలుకో!

18. అధోక్షజ! నిన్ను వీక్షించలేని మా
అక్షిని సరిజేయ మేలుకో!
పద్మనిభేక్షణ మాది నిరీక్షణ
క్షణమైన మరువము మేలుకో! . . .కృష్ణా, ఏలుకో!

19. **నారసింహా!** నీ ప్రేమ అపారము
మేము నీ వారము మేలుకో!
ఓంకార దేవుడ! ఘీంకార రూపుని
గట్టెక్కించితి వయ్య, మేలుకో! . . . కృష్ణా, ఏలుకో!

20. **అచ్యుత!** ఆనంద! దివ్య పరమానంద!
అర్కుడొస్తున్నాడు మేలుకో!
మిత్రవంశ తిలక! సుగ్రీవ ప్రియ మిత్ర
రవి చంద్రవర నేత్ర, మేలుకో! . . . కృష్ణా, ఏలుకో! . .

21. **జనార్ధన!** నీవే జీవనము మాకంటూ
జనులు మూగున్నారు మేలుకో!
జన కళ్యాణము చేయ జాగేల నా స్వామీ
జగ న్నివాసుడ మేలుకో! . . . . . కృష్ణా, ఏలుకో! . .

22. **ఉపేంద్ర!** నీ కొరకు నిరుపేద లందరు
నింగి చూస్తున్నారు మేలుకో!
సిరి లేని వారిని పురిపెట్టు చున్నారు
కరి వరద! సరి జేయ మేలుకో! . . కృష్ణా, ఏలుకో!

23. **హరి!** యను వారినే సిరి కనికరించును
మరి మరి పిలిచెద మేలుకో!
చేరి భజించెద జారిన బ్రతుకును
దరి జేర్చుటకు నీవు మేలుకో! . . . కృష్ణా, ఏలుకో!

24. **శ్రీకృష్ణ!** అనగానే తృష్ణను హరియించు
సుతపుని తనయుడ మేలుకో!
విష్ణుదేవుడ వయ్యా! వాసుదేవ స్వామి
వర్ణించలే మయ్యా! మేలుకో! . . . కృష్ణా, ఏలుకో!.

25. మందహాసము చిందే నందకిశోరుడ!
చైతన్యాశ్రమ వాసి మేలుకో!
పండిన ప్రేమతో నిండిన గుండెలలో
గుడి కట్టుకున్నారు మేలుకో!
మునులై సేవిస్తున్నారు ఏలుకో! . . . . .

26. కల్ల కపటములు లేని చైతన్యుని కలములో
బలము నీవైతివి మేలుకో!
గళకలము లేకమై మాటలు ఒలికింప
మహి పులకరించింది మేలుకో . . .కృష్ణా, ఏలుకో!



27. కేశవ నామాల మేలుకొలుపులు పాడ
ఆశలు తొలగును మేలుకో!
పాశములు త్రెంచేటి కేశవుని కృప కలుగు
సిద్ధించు కైవల్యం మేలుకో! . . . . కృష్ణా, ఏలుకో! .

శంఖారావం

నిద్రించినది చాలు. మేలుకో.

మగతను వీడు. మమతయే కీడు.

అహంకార వత్తి ఆరిపోనీ. ఆత్మజ్యోతి వెలగనీ.

శాంతి నీలోనే ఉంది. సుఖము నీదై ఉంది.

విలువైన బ్రతుకును వృథా చేసుకోకు.

నవ్వుతూ జీవించు. జీవిస్తూ ఆనందించు.

భేద భావాలు కదలనీయకు. ప్రేమను వదలి పెట్టకు.

ప్రపంచములో చీకటి ఉందని వగచకు.

నీ చుట్టూ కాంతి వలయ ముంది. నీ బ్రతుకు శాంతి నిలయ మవుతుంది.

పరమాత్మను విశ్వసించు వారికి కొరత లేదు. వెలితి రాదు.

ఇది నా అనుభవము. మీరూ పొందండి.

స్వామి సుందర చైతన్యానంద

GO FORWARD

Why should there be misery and sorrow in the world when Vedanta is alive and available?

We are not to be blamed for being what we are; but for not trying to be better.

The world is, after all, a vanishing play of vanity. Take complete surrender in Him. Let Him do what He pleases with you.

Live in God, as God.

Mind ingathered settles in peace. Reside in the heart. Be 'That' (tat). Off with other concerns.

Be within. The within shall take care of without. The best part of my life has enjoyed this nectar-fruit. You too can. Try.

All my love and strength to you.

Swami Sundara Chaitanyananda

బాధల భారతం

స్వామి సుందర చైతన్యానంద

తీపి తిని తెచ్చుకున్న అనారోగ్యాన్ని చేదు మ్రింగి పోగొట్టుకోవాలి. తీపి తిన్నంత మాత్రాన బ్రతుకులో తియ్యదనం రాదు. చేదు అయినంతమాత్రాన ఆరోగ్యాన్ని ప్రసాదించకపోదు.

బాధలు అనుభవించడానికి దోషాలు ఉండనవసరం లేదు. బాధలు లేనంత మాత్రాన దోషులు నిర్దోషులు కాలేరు. స్వార్థపరులున్న చోట పండ్లచెట్లకు రాళ్ళ దెబ్బలు తప్పవు. దుష్టులున్నచోట సాధువులకు బాధలు తప్పవు.

నాటి భారతంలో పాండవుల దోషాలేమిటి? నేటి భారతంలో సత్పురుషుల లోపాలేమిటి? ఏమీ లేవు. అయినా బాధలు వారికీ తప్పలేదు; వీరికీ తప్పలేదు. ఇది బాధల భారతం.

సుఖం సుఖే నేహ న జాతు లభ్యం
దుఃఖేన సాధ్వీ లభతే సుఖాని



"సుఖమనేది సుఖాల నుండి రాదు. బాధలనుండే సుఖాలు లభిస్తాయి" అని మహాభారతం - అరణ్య పర్వంలో ద్రౌపది సత్యభామతో చెబుతుంది.

సర్వాన్ని మరపించేది సుఖం. సమస్తాన్ని ఎరుక పరచేది దుఃఖం. అంతరేక్షణ పెరిగేది, అవగాహన అంకురించేది ఆపదలలోనే.

భక్తులైన వారికి అంతరేక్షణ, అవగాహన ఇంకా పెరగాలి అని భగవంతుడు భావిస్తే వారికి బాధల్ని సరఫరా చేయడంకన్నా మరొకటి చేయలేదు.

బాధలొచ్చాయని సాధకులు భీతి చెందనవసరం లేదు. వాటి వెనుక భాసించే అచ్యుతుని అదృశ్య హస్తాన్ని వీక్షించే అలవాటును కలిగియుండాలి.

ఇది బాధల ప్రపంచం. స్వార్థసర్పాలు చరిస్తున్న ప్రదేశం. ఇక్కడ బాధలు తప్పవు. సమస్యలు తప్పవు. కాని ఆ సమస్యలు పరమాత్మను చూపే జ్యోతులైనపుడు సమస్యలు నీకు స్నేహితులే. బాధలన్నీ బంధువులే.

ప్రపంచంలో వాటిని ఉండనీ.
పరమాత్మలో నీవు ఉండిపో.

ప్రేమ పిలుపు



కాలమాత కడుపు తీపిగా కదిలొస్తున్న సహస్రాబ్దీ! ఓ సహస్రాబ్దీ!
తీపిని తినిపిస్తూ రా! తీపి మాటల్ని వినిపిస్తూ రా!
నీవు కాలపడుచువు.
క్రొత్త దానివి కావు.
ఉతుకు వాతబడి మాసిన బట్ట అందాలు చిందించునట్లు,
క్రొత్త బట్టల్లో సహస్రాబ్దిగా మెరిసిపోయే ఓ పాత కాలమా!
మా పిచ్చి ప్రాణమా!
చల్లని నీటిలో వేడిని, వెలుగును పుట్టించిన వాసుదేవుని ఉనికిని చాటి చెప్పేందుకు చలికాలంలో వేడి వేడిగా, వడివడిగా సవ్వడి లేకుండా కదిలొస్తున్న ఓ సహస్రాబ్దీ!
మా ఒడిలో సేదదీర్చుకో పసిడివై! ప్రేమ కడలివై!
నీవు వచ్చేది ఒకే దినం.
అది నింపాలి మాలో క్రొత్తదనం.
ఏడుస్తూ పుట్టటం మానవజాతికి నైజం.
మా ఏడ్పును బాపేలా ఉదయించాలి నీ తేజం.
తిమిరహరుని వలె ఉద్భవించాలి నీ వైభవం.

ఓ సహస్రాబ్దీ!
నీవు వస్తున్నావు. మరి, మాకేం తెస్తున్నావు?
ఉన్నవే తెస్తావా? లేనివి తెచ్చి ఇస్తావా?
బాటను పోగొట్టుకొన్న బాటసారులం.
దారిలో దగా పడిన అయోమయ సంసారులం.
ఈ దారి - ఏ దరికో!
మా దారి - దేని కొరకో!
'కలడో - లేడో' అని ఓనాడు కదిలిన మేము
'నీవే తప్ప నితః పరం బెరుగ' అని నేడు నిలకడగా ఉన్నాం.
ఓ సహస్రాబ్దీ! రా!
రమణీయంగా మా మధ్యకు రా!

పోగొట్టుకొన్న మా చిరునామాలను చిరునగవుతో మా చేతికివ్వు!
నీ విచ్చే ఒక్క దివ్య సంకల్పంతో సప్త స్వరాలు పలికే నా మనోవీణతో నీకు పూర్ణకుంభ ఆహ్వానం పలుకుతాను. నీ తీపి మాటల్ని ఆనందంతో వింటాను.
బ్రతికినపుడు సబ్బు లెన్ని రాసుకున్నా, అత్తరెంత పూసుకున్నా చచ్చిన నాడు మంచి వాసన ఇసుమంతైనా రాదు ఎంత రుద్దుకున్నా!
'బూడిదలో పన్నీరు దేహ సౌందర్యము
అందమైన ఆత్మ చెడని ఆనందము'
అనే పల్లవితో కదిలొచ్చే నీ చరణాలను
నిద్రలో కన్పించినావని మేల్కొని వెదికితే
మెలకువ మాయ అని బుద్ధి చెప్పినావు.
మేలు తెలిపి మమ్ము మేలుకొలిపిన నిన్ను
మేలు తెలిసి పలికెద మమ్మేలుకొమ్మని.
చిరుమాటల సిరిమువ్వలను తొడిగి,
ప్రపంచ రంగస్థలిపై
బ్రతుకు నాటకాన్ని
నవరస భరితంగా,
సమరస చరితంగా,
సుఖదుఃఖాలను ఏకబిగితో అద్భుతంగా అభినయిస్తూ,
ఆనందంగా అనుభవిస్తూ,
సమయాలను మరిపిస్తూ, సందేశాలను వినిపిస్తూ
సంబరాలతో అంబరాన్ని తడుపుతూ, సంతసముతో అవనిని కదుపుతూ
మాకు జోడైన నీ స్నేహానికి ఈడుగా,
మాకు నీడైన నీ ప్రేమకు తోడుగా,
బ్రతుకంతా అండగా
బలమంత దండిగా
పుట్టే నిన్ను, ఓ సహస్రాబ్దీ!
పెంచేందుకు
మే నుండక పోయినా, మన సుండక పోయినా, మే ముంటామని
ప్రేమ పిలుపు నందిస్తూ, శాంతి పలుకు వినిపిస్తూ
ప్రేమతో మా వైపుకు కదిలొస్తున్న ఓ రెండువేలూ!
నీవు చిందించే శాంతి సుగంధాలే మాకు పదివేలు!
ఇక నీ సందడిలో
వివేకాన్ని ఎంచుకుంటాం.
జ్ఞానాన్ని పెంచుకుంటాం.
శాంతిని దించుకుంటాం.
ప్రేమను పంచుకుంటాం.
నీవు అరుదెంచే ఈ పండుగ రోజు
మా మనసులు దండిగ నిండిన రోజు.
మా బ్రతుకులు శాంతితో పండిన రోజు.
నవ్వే పువ్వులు ఎన్నున్నా,
మా నవ్వులతో పనిలే దన్నా,
పని గట్టుకొని మునులై నవ్వేందుకు
పువ్వులై కదిలొస్తున్నాం,
నవ్వులై నీకు ఎదురొస్తున్నాం.
యెద నిండిన ప్రేమతో ఎదురొస్తున్నాం.
కమనీయంగా కదిలొచ్చే నీతో కరచాలనం చేస్తూ
ఆహ్వానం పలుకుతున్నాం.
ఆరని కర్పూరపు వెలుగులా
మారని ఆకాశపు విలువలా
విశ్వమంతా కళ్యాణ శోభతో కళకళ లాడాలని, ప్రతి వ్యక్తీ పవిత్రతకు ప్రతిరూపం కావాలని,

నిండైన మనస్సుతో, కొండంత ఆశతో
కమలాక్షుని చూపుల్లో
కరిగిపోతున్న

ఓం స్వామి సుందర చైతన్యానంద

సర్వజిత్ సందేశ లహరి

(షష్టిపూర్తి సంబరాలలో సుందరంగా అల్లుకున్న భావ సుమహారం)

జీవితమే ఒక సజీవ గ్రంథంగా విలసిల్లాలని
మాటలే పాటలై
ఆర్ష సంస్కృతీ సౌధానికి
బరువైన, బలమైన
ఇటుకలుగా మారాలని

వేదనలను రూపు మాపేందుకు
వేదికలే వేడుకలను సంతరించుకోవా లని



దురదృష్టాలను దూరం చేసే ప్రయత్నంలో
కాగితాలపై అక్షర సేనలు కదం త్రొక్కాలని

పూప వయస్సు లోనే కలలు గని
మధ్య వయస్సులో ప్రచండంగా చెలరేగి,

ఏదో ఏదో చేసి
యెద యెదలో సౌందర్యాన్ని ఆవిష్కరించి

ఆవేదనల మధ్య ఆలోచనలను పెంచుకుంటూ
ఆశయాల ఆక్సిజన్‌తో ఊపిరి పోసుకుంటూ

శ్రమనే ఆహారంగా
పరిశ్రమనే పానీయంగా గ్రహిస్తూ

చెడే వాటిని చూచి మనస్సు చెడి పోకుండా
బాగును భావిలో చూచేందుకు బుద్ధిని బాగు
చేసుకుంటూ
అనంత సహనంతో
నిరంతర మననంతో
చెత్తను ఊడ్చుకుంటూ
చిత్తును పేర్చుకుంటూ
గతిని మార్చుకుంటూ
గమనాన్ని ఈడ్చుకుంటూ
విచిత్రంగా కదులుతూ
వినూత్నంగా కలలు కంటూ
అలరిస్తూ ఆడిస్తూ
పలికిస్తూ పాడిస్తూ
నడకను మరచి
పరుగును వలచి
మూత పడిన ద్వారాలను తెరుచుకుంటూ
దుమ్ము నిండిన దారులను దులుపుకుంటూ
అడుగడుగున మడుగు లెదురవు తున్నా





వైకల్యానికి విడాకు లిచ్చి
వైకుంఠాన్ని మనసారా వరించి
జీవన ఋణాన్ని తీర్చుకోమని
బ్రతుకును కడతేర్చుకోమని
రంగ రంగ వైభవంగా
రంగవల్లుల నడుమ
ఆనాడే నడచి వచ్చింది
భవ్యమైన వైకుంఠ ఏకాదశి.

మళ్ళీ వచ్చింది సర్వజిత్
వచ్చిన పని పూర్తి అయిందా?
అని ప్రేమతో పలకరించేందుకు.
ఏమని చెప్పేది?
చెప్పేందుకు ఏముంది?

సర్వజిత్‌లో కేక వేసింది
సర్వజిత్ కావాలని కాదు
సర్వవిత్ గా మారాలని
సర్వమూ తానే నని తెలియాలని
ఆ మాటనే తలచి తలచి
ఆ బాట లోనే నడచి నడచి



పండరీపురం - చంద్రభాగా నదిలో
స్నానం చేస్తున్న పూజ్య స్వామీజీ

పూప వయస్సు లోనే
కాలం తెలియకుండా
కాళ్ళు మడచి కూర్చున్నాను
అని మెల్లగా చెప్పనా?
అసూయా మండుటెండల్ని సైతం
లెక్క చేయకుండా అనవరతం
గోవిందుని వైభవ మంతా
గీత లోనే దర్శనీయ మంటూ
జీవిత మంతా ఎక్కుతూ దిగుతూ
వేదికలే వాసయోగ్య మనుకొంటూ
రెండు నూర్లు గుంటూరులో పలికా నని
గుర్తు చేస్తూ చల్లగా చెవిలో ఊదనా?

సూర్యుణ్ణి విడిచి
చంద్రుణ్ణి మరచి
దీప జ్వాలకే అంకితమై
వేలాది పుటలు
నేలంతా పరచా నని
వ్రాసి మరీ చూపనా?

నాద వైభవం లేకున్నా
సునాదం వినిపించా నని
వాద పటిమ లేకున్నా

బరి తెగించి వాదించానని
మాటకు ప్రాణం పోస్తూ
ప్రాణంతో పలికా నని
పాటకు జీవం పోస్తూ
జీవిస్తూ పాడానని
మార్దవంగా వినిపించనా?
మంజులంగా కనిపించనా?
నిజమేలే!
ఏదేదో చేశావు. ఎంతెంతో చేశావు.
అంతా బాగానే ఉంది
ఇంతకీ గీత ఏమైంది?
అని సర్వజిత్ ప్రశ్నిస్తే
ఏం చెప్పను సమాధానం?
ఎలా చేయను సంధానం?
అమ్మా! సర్వజిత్!
కని పడేసి పోయావు
కనినందుకు ఫలమేదో
వినాలని మళ్ళీ వచ్చావు
కనిన నీవు కనుమరుగైనా
మా మధ్య నీవు లేకపోయినా





ఈ మధ్యలో ఏం జరిగిందో
కళ్ళకు కట్టినట్లు చెప్పుకున్నా!

ఇక గీత అంటావా!
అదంతా నా రాత మీదే ఉంది.
గీత పుట్టిన నాడు నన్ను పుట్టించింది
నీవు మళ్ళీ వచ్చే సరికి గీతను పుట్టించ మని
తెలుగుజాతికి చైతన్యగీతను పట్టించ మని
అని నాకు తెలుసు.
అలాగే ఉంది నా మనసు
అందుకే నీ కోసం ఎదురు చూశా!
యెదనంతా యాదవుని నింపుకొని
మది నంతా మాధవునికి అర్పించుకొని
గీతమ్మ ఋణం తీర్చుకొనుటకు
శంకరునికి కింకరుణ్ణై
వంకరలు లేకుండా
శంకలు కదలకుండా
రమణీయ రచనను సాగించుటకు
ఉగాదినే పునాదిగా ఎంచుకున్నా!
పారం ఎక్కడో తెలియకున్నా
కళ్ళ ముందే కాలం కదలి పోయింది
ఏది ఏమైనా

ఎవరు ఎదురైనా
జన్మ నిచ్చిన జననీ! సర్వ జననీ!
పుట్టించిన నీవు పట్టించిన పాలు
ఎంతగా నన్ను పెంచాయో
నా నుండి ఏమేమి పంచాయో
నీవు ఉన్నప్పుడే చూపాలని
దృఢ నిశ్చయంతో ఉన్నా!
కలలు కంటున్నా
మేలుకొని చూస్తున్నా!
అమ్మవై వచ్చావు
నువ్వు వెలగాలి సర్వజిత్తుగా
నేను నిలవాలి సర్వవిత్తుగా!
అవరోధాలు లేకుండా చూడు
రెట్టించిన స్ఫూర్తితో వ్రాస్తా!
రండి - రండి
మా ఊరికి రండని
ఊదర బెట్టే భక్తుల్ని
ఒకింత కట్టడి చేశావా!
ఆ తరువాత
రెండింతలుగా రెచ్చిపోయి వ్రాస్తా!
బాధలు పడుతూ
బోధ లిక వ్రాయలేను
బాధలను దూరం చెయ్యి
బాధించే వారిని దగ్గర చేర్చకు
అలా నువ్వు దగ్గ రున్నావా
క్షణం గీతకు దూరం కాకుండా వ్రాస్తా

చైతన్య భగవద్గీత.

అటు ఇటు చూడ పనిలేదు
ప్రయత్న లోపం లేదు
ఎటొచ్చి సమయమే కనికరించాలి
అంతా మస్తకం లోనే ఉంది
పుస్తకం లోకి ఎక్కే పనే మిగిలి ఉంది
అంతా సవ్యంగా సాగితే
ఆరు మాసాలు సరిపోతుంది
అపసవ్యాలు ఎదురైతే
మరి కొన్ని మాసాలు పడుతుంది
లేదా, సంవత్సరాలే పడుతుంది.
అవరోధాలు ఆగితే
అందల మెక్కినట్లే
ప్రతిబంధకాలు పారిపోతే
ప్రతులు ఊరూరా ఊరేగినట్లే.

అస్తు!

సర్వే జనాః సుఖినో భవన్తు!

ఓం స్వామి సుందర చైతన్యానంద



చైతన్య భావ సుమాలు

స్వామి సుందర చైతన్యానంద

1. ఎదురు చూచేవాడు నరుడు.
యెదను చూచేవాడు నారాయణుడు.

కళ్ళు కాయలు కాయటం ముఖ్యం కాదు
పుణ్యం పండటమే ప్రధానం.

వంక లెన్నున్నా
జంకు లేకుండా
భక్తి తీర్థంలో గ్రుంకు లిడువారికి
ముక్తి ముందు నిలుస్తుంది.
ముకుందుడు ముందుండి నడిపిస్తాడు.

2. కూలబడేది మన కృషి
కూర్చోబెట్టేది అతని కృప.

ఏడుపు మనది.
వేడుక అతనిది.

ఆగ్రహాలు, నిగ్రహాలు మనవి
అనుగ్రహాలన్నీ అతనివి.

మనసు మనది
మహిమ అతనిది.

భక్తి బరువుల్ని లెక్కచేయదు.
బాధల్ని పట్టించుకోదు.

పూర్ణభక్తిలో వెలితి ఉండదు.
పూర్ణజ్ఞానంలో వెలుగు చెదరదు.

3. అదుపు తప్పితే కుదుపు తప్పదు.
పొదుపు కుదిరితే చెడుపు ఉండదు.

మితమే ఎన్నడైనా హితం.
అతిలేని కార్యమే సముచితం.

చిన్నవి పెద్దవి చేసుకొని చిన్నబోయేకన్నా
పెద్దవి కూడా చిన్నవేననే పెద్దమనస్సుతో
వచ్చేవాటిని వలచక
రానివాటికి వగచక
వెన్నెలలాగ చల్లగా శోభించటమే సాధన.

4. అన్నీ సరిపడగనే సాధన ప్రారంభిస్తాము అనుకోవటం సరియైన అవగాహన కాదు. ముందు ప్రారంభిస్తే మున్ముందు అన్నీ సరిపడతాయి. గుఱ్ఱం కదిల్తే చాలు, బండి తనంతటదే కదుల్తుంది. చేస్తేనే ఏదైనా చూసేది. రుచి చూడాలన్నా వంట చేస్తేనే. ఆచరణ లేని ఆలోచనలు జడత్వాన్ని పెంచుతాయి.

5. ఏదో చేయాలి అంటుంది ఎద
చేసేందుకు ఏదయినా ఉంటే గదా!

అంతా ఇచ్చేయాలి అంటుంది మనసు
ఇచ్చేందుకు ఏది మిగిలుందో ఎవరికి తెలుసు.

పిలవకపోయినా వస్తుంది కోపం
అదేదో పిలిచినట్లు వస్తుంది పాపం.

చేసిన పనులే.
చూసిన రుచులే.
నేడు కొత్త. రేపు పాత.
మరునాడు ఉండదు పత్తా.
చెత్తే కదా ఇప్పటికి చూసిందంతా
పరమాత్మే అంతటికి నిజమైన సత్తా.

6. సుఖానుభూతిలో 'ఇక్కడ' అనేది ఉంటుందే గాని 'అక్కడ' అనేది ఉండదు. 'ఇప్పుడు' అనేది ఉంటుందే గాని 'అప్పుడు' అనేది ఉండదు.

పదవి వస్తే 'ఇప్పుడు పదవిలో ఉన్నాను' అంటాము.

ధనం వస్తే 'ఇప్పుడు ధనవంతుణ్ణి' అంటాము.

ఆరోగ్యంగా ఉంటే, 'ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను' అంటాము.

పోటీలో గెలిస్తే, 'ఇప్పుడు గెలిచాను. ఆనందంగా ఉంది' అంటాము.

సుఖం ఎప్పుడు కలిగినా, అది 'ఇప్పుడు'గానే తెలుస్తూ ఉంది. అలాంటప్పుడు సుఖపడేందుకు 'ఇప్పుడు' ఎప్పుడు వస్తుందా? అని నిరీక్షించడంకన్నా, 'ఇప్పుడు' ఇక్కడే, ఇప్పుడే ఉంది కనుక వెంటనే సుఖపడితే అడ్డు నిలిచేవారెవరు?



7. లేని దానిని ఈ ప్రపంచంలో శ్రమించి పొందవచ్చు. పొందిన దానిని ఎంతో కాలం నిలుపుకోలేము. కష్టపడి పొందిన దానిని తేలికగా పోగొట్టుకున్నప్పుడు గుండె ఎవరికైనా బరువెక్కుతుంది. గుండె భారంతో బ్రతుకును ఈడ్చు కుంటూపోవటం అందరికీ సాధ్యపడే పని కాదు. పొందేవి ఏవయినా పోయేందుకే వస్తున్నాయని అవి రాకముందే గ్రహించగలిగితే, ఆ తరువాత అవి రాకపోయినా లేదా వచ్చి పోయినా బ్రతుకులో పెద్ద తేడా ఉండదు.

8. మన అభిప్రాయాలకు, మన భావాలకు ప్రాధాన్యత నిస్తూ ఆలోచించినంత కాలము మనకు ఇతరుల దోషాలే గోచరిస్తాయి. ఇతరులు ఆలోచించే కోణం నుండి మన ఆలోచనలను సాగించ గలిగితే వెంటనే మనకు మన దోషాలు కనిపిస్తాయి. ఇతరుల దోషాలు మనకు గోచరించినా వాటిని నివారించే శక్తి మనకు లేదు. కాని, మన దోషాలను పోగొట్టుకొనే అవకాశం మాత్రం మన చేతిలోనే ఉంది.

9. మనం శ్వాసలు వదుల్తూ ఉంటాము. తిరిగి పీల్చుకుంటామనే నమ్మకంతోనే శ్వాసలను విడుస్తూ ఉంటాము. శ్వాసను తిరిగి పీల్చుకోలేమనే సందేహం ఉంటే అసలు శ్వాసనే విడువమేమో!

శ్వాసలను విడువటమే గాక తిరిగి పీల్చుకుంటాము అనేది మన అనుభవంలోనే ఉన్నా, తిరిగి పీల్చుకోలేక పోవచ్చు అనే సందేహానికి అవకాశం లేకపోలేదు. ఈ సత్యం తెలిస్తే, శ్వాసల మీద కాకుండా శ్వాసలను కదిలించే వానిపై విశ్వాసము పెరుగుతుంది. క్రమేపీ ఆ విశ్వాసమే భక్తియై శోభిస్తుంది.

10. ఏదో ఒకటి, లేదా కొన్ని జీవితంలో సాధించగనే, విశ్వ విజేత అయినట్లు మనిషి ఊగిపోతూ ఉంటాడు. మనం జీవితంలో ఆశించి, శ్రమించి, సాధించలేకపోయినవి ఎన్నో కాసేపు విచారించుకుంటే, మన వైఫల్యాలకు మించినవి మరొకరికి ఉండవేమో అనిపిస్తుంది. ఏదో పొందటం, మరేదో పొందలేక పోవటం విజయం కాదు. ఏది పొందినా, పొందలేకపోయినా అశాంతిని పొందని మనస్సును కలిగియున్న వారే విశ్వ విజేతలు. అమూల్య మైన సంపదకు యజమానులు.

11. నిన్నటి స్వప్నం ఇప్పుడు లేదు; అది గతం. రేపటి స్వప్నం ఇప్పుడు లేనేలేదు; అది భవిష్యత్తు. ఇప్పుడు కల లేదు. ఇది వర్తమానం. కలలు లేని కళ, జీవన కళ వర్తమానమే అనేదే జీవికి దేవుడు పంపే వర్తమానం.

గతించింది తిరిగి రాదు. వచ్చేది ఏదో వస్తే గాని తెలియదు. ఉన్నదే ఉన్నది. ఉనికై ఉన్నది. ఊరేగుతూ ఉన్నది. ఉత్సవ మూర్తిగా శోభిస్తూ ఉన్నది.

12. చీమ చిన్నదే అయినా దాని నోట్లో చక్కెర ఉంటుంది. ఏనుగు పెద్దది అయినా దాని తలమీద అంతా దుమ్మే. తలకు ఎక్కించుకో వలసింది ఏదీ లేకపోయినా తలగడల రూపంలో చెత్త నింపిన పుస్తకాలను కొందరు రచయితలు సమాజ భుజానికి ఎత్తుతూ ఉంటే, కొండ అద్ద మందు కొంచెమై ఉండదా అన్నట్లు విశిష్టమైన పెద్ద విషయాన్ని తక్కువ మాటల్లో పొదిగి అందించగలిగే నేర్పు నూటికో, కోటికో ఏ ఒక్కరికో ఉంటుంది. వారే గురువులు. ఆచార్యులు.

తండ్రి మనసు తల్లికి రాదు. తల్లి హృదయం తండ్రికి ఉండదు. కానీ ఈ రెండూ ఆచార్యునికి ఉంటాయి. **ఆచార్య దేవో భవ!** గురువు నీకు దేవుడు అగుగాక! అని ఆశీర్వదించింది వేదమాత. అట్టి ఆచార్యులు ధర్మాన్ని, ప్రేమని కలబోసి జ్ఞానాన్ని అందిస్తారు.

13. సూర్యుడు ఈ ప్రపంచానికి గొప్ప వరం లాంటి వాడు. గురు భాస్కరుడు శిష్యులైన వారికి పరమాత్మ అనుగ్రహించిన వరం. గురువును చాలామంది పట్టు కుంటారు. కాని, చాలా తక్కువ మంది మనసులో పెట్టు కుంటారు. మరీ తక్కువమంది హృదయంలో నిలబెట్టు కుంటారు. నిలుపు కుంటారు. హృదయాన్ని గురునిలయంగా మార్చుకుంటారు.

14. నిన్ను మారమని నేను చెప్పలేదు. నేను చెప్పేదేదో విరామం లేకుండా చెబుతూ ఉన్నాను. నీవు మారటం, మారకపోవటం కేవలం నీ మీద ఆధార పడి ఉంది. నీవు హాయిగా, తృప్తిగా ఉంటే, ఎందుకు మారాలి? ఒకవేళ నీవు అసంతృప్తిగా ఉండి, అయినా మారకపోతే ఎలా సుఖపడాలని భావిస్తున్నావు? ఆలోచించుకో. నేను ఆలోచింపచేశాను. అంతే.

స్వామీజీ సేవా స్వర్ణోత్సవం (1966 - 2016) సందర్భంగా
భారత ప్రభుత్వ తపాలా శాఖ వారు విడుదల చేసిన
ప్రత్యేక పోస్టలు స్టాంపు, మరియు
ప్రత్యేక పోస్టలు కవరు



వేదిక పై విడుదల చేస్తున్న
ఆత్మీయ అతిథులు

పూజ్య స్వామీజీ ఆశీర్వదిస్తున్న ప్రముఖ భారతీయ క్రికెటర్
శ్రీ ఎమ్.ఎస్.కె.ప్రసాద్ సోదరులు

స్వామీజీ ఆశీస్సులను అందుకుంటున్న మాండలిన్ శ్రీనివాస్

హైకోర్టు న్యాయమూర్తి
శ్రీ ఐ.వెంకట నారాయణ

పాద పూజ
సుదర్శన రెడ్డి దంపతులు

తత్త్వగాన సుధ

స్వామి సుందర చైతన్యానంద



(1)

ఏమి జన్మము? ఏమి జీవనము?
నిలువెల్ల బ్రతుకు
కాలిపోవుట దేని కోసము?
ఎవరి కెవరో ఎరుక లేదు
ఏది ఎపుడో తెలిసిరాదు
మనసు చెడితే బాగుపడదు
వయసు పోతే తిరిగి రాదు
ఏమి జన్మము? ఏమి జీవనము?
నిలువెల్ల బ్రతుకు
కాలిపోవుట దేని కోసము?

(2)

మట్టికుండ మలిన దేహము
పుట్టి చచ్చి
చచ్చి పుట్టి ఏమి లాభము?
ఉండ దెపుడూ మట్టికుండ
కాలగతిలో పగలకుండా
దేహముండదు కాలకుండా
దేహి ఉండును చెదరకుండా
మట్టికుండ మలిన దేహము
పుట్టి చచ్చి
చచ్చి పుట్టి ఏమి లాభము?

(3)

తోడు ఎవరు? ఎవరికి తోడు?
నిజము తెలిసిన
తోడు ఎవడూ కోరుకోడు
తారలెన్నో ఆకసమున
తోడు నిలిచి అంబరానికి
తెల్లవారితే జాడలుండవు
గోడులే ఈ తోడులన్నీ
తోడు ఎవరు? ఎవరికి తోడు?
నిజము తెలిసిన
తోడు ఎవడూ కోరుకోడు

(4)

ఎవరు బాధలు లేనివారు
కన్నీటి జగతిలో
బాధ లెవరూ దాటలేరు
    బాధలను తొలగించు శక్తి
    ఎవరి కున్నది ధరణి లోన?
        దైవ మందు మనసు పడితే
        బాధలన్నీ కరిగిపోవు
ఎవరు బాధలు లేనివారు
కన్నీటి జగతిలో
బాధ లెవరూ దాటలేరు



(6)

తనువు నీవని మోసపోవద్దు
అది ఎంత కులికినా
వల్లకాటిలో కాలి బూది యగు
    గాలి పీల్చిన దేహ ముండును
    గాలి పోయిన కుప్పకూలును
        చితిలో చర్మము చితికి పోవును
        కనుల ముందే మాయ మగును
తనువు నీవని మోసపోవద్దు
అది ఎంత కులికినా
వల్లకాటిలో కాలి బూది యగు



(5)

నిలువ దెంతో కాలము ప్రాణం
దేహ ఒడిలో
కారిపోవును క్షణములో జీవం
    కారిపోవు మేఘ జలము
    కురిసి కురిసి క్షణము క్షణము
        రాలిపోవు మాయ దేహము
        ఎప్పుడైనా ఎక్కడైనా
నిలువ దెంతో కాలము ప్రాణం
దేహ ఒడిలో
కారిపోవును క్షణములో జీవం



(7)

పెంచుకొనిన సిరులు సంపదలు
పంచ చేరి
ముంచి తీరును మోహమును పెంచి
తృప్తి నివ్వని సిరులు ఎందుకు?
లేని సిరులకు దిగులు చెందకు
ఉన్నదానితో తృప్తి చెందితే
కలుగు సుఖము తొలగు శోకము
పెంచుకొనిన సిరులు సంపదలు
పంచ చేరి
ముంచి తీరును మోహమును పెంచి

(8)

తెలియకుంటే బ్రతుకు శాపము
తెలివి ఉంటే
క్షణము క్షణము దివ్య జీవనము
బ్రహ్మ నీవని బోధ చేయుచు
వెలుగు చున్నవి వేదవాక్కులు
మనసు పెట్టి మర్మ మెరిగితే
మాయ తొలగును - మహిమ తెలియును
తెలియకుంటే బ్రతుకు శాపము
తెలివి ఉంటే
క్షణము క్షణము దివ్య జీవనము

(9)

ఉన్న దెవరు? లేని వారెవరు?
ఎంచి చూచిన
లేనివారే ఉందు రిలలోన
ఎంత ఉన్నా తనివి తీరదు
ఏది ఉన్నా తనువు నిలవదు
లేని వారికి లేని దేమిటి?
ఉన్న వారికి ఉన్న దేమిటి?
ఉన్న దెవరు? లేని వారెవరు?
ఎంచి చూచిన
లేనివారే ఉందు రిలలోన



(10)

ఆశ పాశము ఘోర శాపము
ఎంత ఉన్నా
తుది ఎరుగదు తీర దెన్నడు
చాలు అనుకొని మేలు తెలిసి
పరుల హితమును మదిని తలచి
ధర్మ నీడన నడచు వారికి
ప్రాప్తి పరము జన్మ వరము
ఆశ పాశము ఘోర శాపము
ఎంత ఉన్నా
తుది ఎరుగదు తీర దెన్నడు



(11)

భేద భావము బాధరూపము
విశ్వమంతా
విశ్వనాథుని దివ్య మందిరము
అలను చూడకు కడలి చూడు
అంతరించును అంతరములు
నామరూపము కాదు సత్యము
అంతరంగము ఆత్మమయము
భేద భావము బాధరూపము
విశ్వమంతా
విశ్వనాథుని దివ్య మందిరము

(12)

ఏవి మమతలు? ఏవి మధురములు?
సరిపడని కొలతలు
ఎంత వెదకిన ఎండమావులు
ఎదురు చూచిన ఎదలు పగులును
ఎదురు తిరిగిన దిగులు మిగులును
వగల వెనుక పగలు దాగును
వెలుగు లారి చీకటగును
ఏవి మమతలు? ఏవి మధురములు?
సరిపడని కొలతలు
ఎంత వెదకిన ఎండమావులు

(13)

మనసు చపలము బ్రతుకు చంచలము
ఉన్న సమయము
ఆకసమున మెరపు చందము
నిన్న ఉన్నది నేడు లేదు
నేడు ఉన్నది రేపు రాదు
నాశమగును రూపులన్నీ
నిలిచి వెలుగు స్వరూప మొకటే
మనసు చపలము బ్రతుకు చంచలము
ఉన్న సమయము
ఆకసమున మెరపు చందము

(14)

సాధు స్నేహము జన్మ సార్థకము
వినియోగ పడితే
భక్తి సులభము ముక్తి సాధకము
హితము చేయును సాధు సన్నిధి
సర్వ జనులకు దివ్య పెన్నిధి
క్షయము లేనిది క్షేమ మైనది
మోక్షప్రాప్తికి మార్గ మైనది
సాధు స్నేహము జన్మ సార్థకము
వినియోగ పడితే
భక్తి సులభము ముక్తి సాధకము

(15)

జీవు డెవరు? దేవుడు ఎవరు?
వారి నైజము
తెలిసి నపుడే తొలగు బంధము
ఊగులాడే వాడె జీవుడు
ఊరకుంటే దేవు డతడు
తనను మరచిన జీవు డగును
తనను ఎరిగిన దేవు డగును
జీవు డెవరు? దేవుడు ఎవరు?
వారి నైజము
తెలిసి నపుడే తొలగు బంధము

(16)

ఎవరు మిత్రులు? ఎవరు ఆప్తులు?
సదా మనతో
కలసి మెలసి మెలుగు వారెవరు?
ఎన్నడూ విడిపోని వాడు
సదా మనతో ఉండువాడు
ఈశుడే కాపాడువాడు
నిత్యు డతడే మిత్రు డతడే
ఎవరు మిత్రులు? ఎవరు ఆప్తులు?
సదా మనతో
కలసి మెలసి మెలుగు వారెవరు?

(18)

భక్తియే బ్రతుకు చుక్కాని
జీవి యాత్రలో
గురుదేవుడే మార్గగామి
బాగు చేయును భక్తి ఒకటే
బ్రతుకు భవ్యము జీవి ధన్యము
భక్తి లేని జీవి బ్రతుకు
నీరు లేని బావి రీతి
భక్తియే బ్రతుకు చుక్కాని
జీవి యాత్రలో
గురుదేవుడే మార్గగామి

(17)

మరచిపోనీ మనసు నేదైనా
మరువ రానిది
ధర్మ మొకటే ధరణి లోన
ధర్మముగ జీవించు వానిని
అనుసరించును దైవ మెపుడు
దైవ మెవరిని కనికరించునో
వాడే దైవము విశ్వమునకు
మరచిపోనీ మనసు నేదైనా
మరువ రానిది
ధర్మ మొకటే ధరణి లోన

(19)

ఏది నీది? ఎక్కడిది నీకు?
ఏ విభవమైనా
సత్యదేవుని నిత్య వైభవము
దర్పముండదు సత్య మెరిగిన
వినయ మొప్పును నిజము తెలిసిన
ఏ తేజము ఎవరి దైనా
దైవ మహిమే అందులోన
ఏది నీది? ఎక్కడిది నీకు?
ఏ విభవమైనా
సత్యదేవుని నిత్య వైభవము



(20)

ఉన్న వెపుడూ బాధించవు
మనిషి మదిలో
ఉన్నవే వేధించును
ఏది ఉన్నా లేదు నష్టము
మదిలో ఉంటే లేదు లాభము
రాగద్వేషము లంతరించిన
ఏది ఉన్నా సుఖము చెడదు
ఉన్న వెపుడూ బాధించవు
మనిషి మదిలో
ఉన్నవే వేధించును

(21)

గీత తెలిసిన బ్రతుకు అమృతము
తెలియకుంటే
అంత మగును వింత జీవితము
గీత తుడుచును నొసటి రాత
గీత దింపును బ్రతుకు మోత
గీత నెపుడూ విడిచి పెట్టకు
ముక్తి నొసగును కృష్ణగీత
గీత తెలిసిన బ్రతుకు అమృతము
తెలియకుంటే
అంత మగును వింత జీవితము



(22)

కర్మ లెపుడూ బంధించవు
వాస్తవానికి
కర్మఫలములు బాధించవు
కామ్య మెరుగని కర్మజాతము
కోర లుడిగిన పాము పగిది
అలల వోలె కలల వోలె
కరిగి పోవును కనుల ముందే
కర్మ లెపుడూ బంధించవు
వాస్తవానికి
కర్మఫలములు బాధించవు

(23)

ఏది ఉన్నా నాది అనుకోకు
నీది కాని
దాని నెవ్వరు దోచుకోలేరు
నాది నాదని పలవరిస్తే
ఏది నీదిగ మిగలబోదు
ఏది ఉన్నా మమత వీడితే
నీది కానిది ఏది ఉండదు
ఏది ఉన్నా నాది అనుకోకు
నీది కాని
దాని నెవ్వరు దోచుకోలేరు

(24)

దోష వస్తువు జగతిలో లేదు
దోషముంటే
చూచువాని తీరులో ఉంది
ఏది దోషము? ఏది లోపము?
విశ్వమంతా బ్రహ్మమయము
పొరలు కరిగి తెరలు తొలగితే
దర్శనీయము దైవమహిమ
దోష వస్తువు జగతిలో లేదు
దోషముంటే
చూచువాని తీరులో ఉంది

(25)

ఏది భయము? ఎవరికి భయము?
వెలుగు పడితే
భయహేతువు భ్రాంతియే యగును
ఉన్న త్రాడు తెలియ నందున
లేని పాము బుసలు కొట్టును
భ్రాంతి తొలగిన భయము ఉండదు
సత్య మెరిగిన అభయ మగును
ఏది భయము? ఎవరికి భయము?
వెలుగు పడితే
భయహేతువు భ్రాంతియే యగును

(26)

ఏది పరులు చేయకుండిన
అది నీకు సుఖమో
చేయకెన్నడు నీవు పరుల కది
మంచి చేసి మంచి చూచి
మంచి తోనే మైత్రి చేసి
మంచి పెరిగి మనసు కరిగి
మంచి మనిషిగ మహిమ నెరిగి
ఏది పరులు చేయకుండిన
అది నీకు సుఖమో
చేయకెన్నడు నీవు పరుల కది

(27)

కోరుచుందురు అందరు సుఖము
వాస్తవానికి
తెలియ దెవరికి సుఖము చిరునామా
విషయ మందున సుఖము లేదు
కాల మందున కలసిరాదు
బయట లేదు లోన రాదు
నీ స్వరూపమె పరమ సుఖము
కోరుచుందురు అందరు సుఖము
వాస్తవానికి
తెలియ దెవరికి సుఖము చిరునామా

(28)

ఏది ఎంతగ అనుభవించినను
తనివి తీరదు
తృప్తి ఉండదు మనసు చాలనదు
కలలు గన్నవి అంద వెపుడు
అందినా అవి ఉండ వెపుడు
జ్ఞాపకాలు విడిచి పెట్టవు
వ్యాపకాలు మరపు రావు
ఏది ఎంతగ అనుభవించినను
తనివి తీరదు
తృప్తి ఉండదు మనసు చాలనదు

(29)

మనుగడంతా మాయ కార్యము
మర్మ మెరిగిన
బట్టబయలు మాయ మర్మములు
లేని దానిని తెచ్చి చూపును
ఉన్న దానిని మరుగు పరచును
మనిషి బ్రతుకును మార నివ్వదు
మోక్షతీరము చేర నివ్వదు
మనుగడంతా మాయ కార్యము
మర్మ మెరిగిన
బట్టబయలు మాయ మర్మములు

(30)

గుండెలో బడబాగ్ని లుండినా
సముద్ర జలము
చలువ నెపుడు వీడ లేదు
పిడుగులు తల మీద పడినా
విష నాగులు పడగ లెత్తినా
ప్రళయమే ముంచు కొచ్చిన
కలత చెందడు ఆత్మవిదుడు
గుండెలో బడబాగ్ని లుండినా
సముద్ర జలము
చలువ నెపుడు వీడలేదు

(31)

నామ స్మరణము ఎంతో హాయి
విస్మరణ జరిగితే
జీవి బ్రతుకు చీకటిరేయి
నామమే నడిపించు నావ
నామి చెంతకు సూటి త్రోవ
నమ్మి నామము నాశ్రయిస్తే
సొమ్ము చేయును వమ్ము చేయదు
నామ స్మరణము ఎంతో హాయి
విస్మరణ జరిగితే
జీవి బ్రతుకు చీకటిరేయి

(32)

పోయినోళ్ళ కొరకు ఏడవకు
తెలుసుకుంటే
శోక నిలిచే వారు ఎవ్వరు?
పోయినోళ్ళు తిరిగిరారు
ఉన్నవాళ్ళు పోకపోరు
ఆత్మ పోదు దేహ ముండదు
తత్త్వ మెరిగిన శోక ముండదు
పోయినోళ్ళ కొరకు ఏడవకు
తెలుసుకుంటే
శోక నిలిచే వారు ఎవ్వరు?

(33)

తల్లి రాదు బిడ్డ ఏడ్చినా
బొమ్మలిచ్చి
మభ్య పెట్టి ఏడ్పు నాపును
ఏది ఇచ్చిన తృప్తి చెందక
తల్లి కొరకే తల్లడిల్లిన
తల్లి వచ్చి ముద్దు లిడును
మార్గ మదియే దైవమైనా
తల్లి రాదు బిడ్డ ఏడ్చినా
బొమ్మలిచ్చి
మభ్య పెట్టి ఏడ్పు నాపును

(34)

బ్రతుకు లోన భయములే అన్నీ
ఎవరి నైనా
భయము వీడదు బ్రతికి నన్నాళ్ళు
ఎన్ని ఉన్నా భయము ఉండును
ఎవరు లేరని భయము ఉండును
వ్యాధి భయము మరణ భయము
భయము భయము బ్రతుకు భయము
బ్రతుకు లోన భయములే అన్నీ
ఎవరి నైనా
భయము వీడదు బ్రతికి నన్నాళ్ళు



(35)

నావలే జీవు లందరు
కాల కడలిలో
ఏ రేవు ఏ నావదో
పయన మైనవి నావలన్నీ
సుడులు ఏవో తెలిసి రాదు
నామమే చూపు తీరము
నడుపు వాడు నరుని సఖుడు
నావలే జీవు లందరు
కాల కడలిలో
ఏ రేవు ఏ నావదో

(36)

ఎవరి దేహము ఏమి తింటుందో
తెలియకున్నా
తినక పోతే దేహ ముండదు
ఎవరు ఏది ఎంత తినినా
పెరుగు దేహము తరుగు ప్రాణము
కడకు కాటికి చేరి నపుడు
భస్మమే ఏ కాయమైనా
ఎవరి దేహము ఏమి తింటుందో
తెలియకున్నా
తినక పోతే దేహ ముండదు

(37)

ఏది నష్టము? ఏది లాభము?
సత్య మెరిగితే
నష్ట మెరుగని లాభమే లేదు
ముందు కానిది వెనుక లేనిది
నడుమ ఉన్నది లాభమౌనా?
కాలమేదీ కనికరించదు
కారిపోవును ఉన్నవన్నీ
ఏది నష్టము? ఏది లాభము?
సత్య మెరిగితే
నష్ట మెరుగని లాభమే లేదు

(38)

ద్వంద్వములతో అంద ముండదు
ఎప్పుడైనా
ఆనందము ఏకమై వెలుగు
కష్టసుఖములు వెలుగునీడలు
ఏది ఎపుడో ఎంత వరకో
కష్ట మొచ్చిన కలత చెందకు
సుఖము లొచ్చిన సంతసించకు
ద్వంద్వములతో అంద ముండదు
ఎప్పుడైనా
ఆనందము ఏకమై వెలుగు

(39)

అహం భావము మేలుకోగానే
ఆ క్షణము లోనే
పవ్వళించును అంతరాత్మ
మిథ్య అయిన అహం భావము
కప్పివేయును అంతరాత్మను
అహం భావము అంతరించిన
ఆత్మ తేజము దివ్య మగును
అహం భావము మేలుకోగానే
ఆ క్షణము లోనే
పవ్వళించును అంతరాత్మ

(40)

నమ్మవచ్చును దేని నైనా
ఆ నమ్మకము
నమ్మ దగినది ఔనా? కాదా?
సత్యమైతే నమ్ము టెందుకు
హేతు వేమిటి సత్య మనుటకు?
నిత్యమైనది ఆత్మ ఒకటే
జ్ఞానమే ప్రమాణ మగును
నమ్మవచ్చును దేని నైనా
ఆ నమ్మకము
నమ్మ దగినది ఔనా? కాదా?


భువనేశ్వరం ఆశ్రమంలో సంకీర్తన చేస్తూ (1986)



(41)

ఉన్న దానిని ఇచ్చు వారెవరు?
ఒకవేళ ఇస్తే
ఉన్నది అను జ్ఞానమును తప్ప
సత్యజ్ఞానము గురువు ఎరుగును
శిష్యుడైతే జ్ఞాన మబ్బును
గురుని కృపతో జన్మ సఫలము
తీర్చలేనిది గురువు ఋణము
ఉన్న దానిని ఇచ్చు వారెవరు?
ఒకవేళ ఇస్తే
ఉన్నది అను జ్ఞానమును తప్ప

(42)

'నేను - నేనని' అందు రందరు
ఆ 'నేను' ఏమిటో
తెలిసి పలికే వారు ఎందరు?
'నేను' ఎవరని అడిగి చూడు
మాయ మగును నేను అనునది
నేను పోయిన తాను మిగులును
తానే సత్యము తానే సర్వము
'నేను - నేనని' అందు రందరు
ఆ 'నేను' ఏమిటో
తెలిసి పలికే వారు ఎందరు?

(43)

మనిషి సృష్టించేది ఏముంది?
ఈ వింత జగతిలో
మనిషియే సృష్టింప బడినాడు
సృష్టి ఒక మాయ కార్యము
మనిషి బ్రతుకు స్వప్న తుల్యము
మేలుకొనిన స్వప్న ముండదు
మేలు తెలిసిన మాయ నిలవదు
మనిషి సృష్టించేది ఏముంది?
ఈ వింత జగతిలో
మనిషియే సృష్టింప బడినాడు

(44)

మాయ తత్త్వము తెలుసుకో జీవా!
సద్గురుని కృపతో
పారిపోవును క్షణములో మాయ
లేకనే కనిపించు పాము
లేకపోవును త్రాడు తెలిసిన
లేకనే నడిపించు మాయ
మాయ మగును మహిమ తెలిసిన
మాయ తత్త్వము తెలుసుకో జీవా!
సద్గురుని కృపతో
పారిపోవును క్షణములో మాయ

❋ ❋ ❋

చైతన్య భజన మండలి - వెంకటగిరి

మొదటి లైనులో కూర్చున్న **3** వ వ్యక్తి శ్రీ స్వామీజీ,
4 వ వ్యక్తి - శ్రీ రేబాల లక్ష్మీ నరసారెడ్డి,
5 వ వ్యక్తి - శ్రీ పెరుంబూదూరు వెంకట నరసయ్య - శ్రీ స్వామీజీ జ్యేష్ఠ భ్రాత
2వ లైనులో **5** వ వ్యక్తి - శ్రీ ఎస్.సూరిబాబు, ఎమ్.ఎ., ఎమ్.ఎ., ఎమ్.ఎ., ఎమ్.ఎ.,ఎమ్.ఇ.డి.- పూజ్య స్వామీజీ తమ్ముడు.





భక్తి టి.వి. అధినేతలు
శ్రీమతి రమాదేవి, శ్రీ నరేంద్ర చౌదరి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు

శ్రీ నిరంజన్, ఛైర్మెన్, బ్యాక్‌వర్డ్ కమ్యూనిటి



త్రిపుర గవర్నర్ శ్రీ ఎన్.ఇంద్రసేనా రెడ్డి

KRISHNA CHANDRA

Swami Sundara Chaitanyananda

To bring light into the dark world of ignorance
To usher in joy among the dull and dreary lives
To drive away the darkness of fear and care
To relieve our burdens and release our bondage
The Lord was born!
An embodiment of knowledge and bliss
And the crowning grace of humanity
By His radiance is everything radiant here
And by His light do the sun and stars shine bright.
Let us all, therefore, unite our hearts in prayer
To invite the Lord into our lives and invoke His grace
When at last He answers our prayers
And really comes into our lives,
What shall we offer at His lotus feet?
Nothing more, nothing less
But our own self!

A FLOWER TO THEE, MY LORD

Swami Sundara Chaitanyananda

O Lord of blisssful energy!

You have made your lotus-feet ever rest in my heart.
How can I voice the marvel of your Divine Presence?
Your love for me has been indescribable.
Let my heart melt and my eyes rain in your love.

O Granter of boons and bliss!

I beg of you for no new boons
But to let me see my acts
In the light of your Grace.

O Benevolent Bestower of liberation!

Even from my playful boyhood,
I have been living a life of surrender at your feet
Without the least stain of selfishness.
You know me all through
Yet, why do you not answer my prayers?



O Lord of the universe!

Light the lamp of wisdom in my mind so that
I may see you in the innermost recesses of my heart.
Let me have no other shelter in this world
Except your holy feet.

O Author of the world-play!

Be pleased to wear my garland of songs
Make me an instrument of your Divine Voice
Let my mind be offered to you as a flower
I worship thee; I praise thee; I adore thee!

May this flower be yours.

AT THE LOTUS FEET OF RAMACHANDRA

An echo from the heart-cave

Swami Sundara Chaitanyananda

Dharma and Satya constitute thy name,
Dharmavatara Ram of great fame!
Incarnated thyself on this vast earth
To ease her burden and bestow her mirth.

Effulgent Self in the cave of my heart!
Thou hast installed me in this divine cart,
Prostrations unto thee, O Kousalya's treasure!
Salutations unto thee, O Sita's pleasure!

Thou art the brilliant presence that lives and loves
By thy supreme grace the whole creation moves
Thou hast smoothly released me from life's cage
And enabled me to go on this sacred pilgrimage.

Let me now behold thee, O light of sight!
Let me bathe in thee, O Divine light!
Let me serve thee, O Eternal might!
Let me abide in thee, O Beatific Delight!

Where the ruler is the radiant Ram,
There findeth no place the virulent Kam,
Thy single minded devotee I am,
Let me breathe my last singing Ram, Sita Ram!

HOMAGE TO PANDURANGA VITHAL

An echo from the heart-cave

Swami Sundara Chaitanyananda

My tongue is stupefied before thy splendour,
My thoughts are silenced before thee, All-wonder,
My heart melts in thy divine vision
As I look up at thy beaming face O Vithal!

Thy mysterious magic touch transformed me,
Thy enticing sweet looks freed me,
Thy glory manifests in the sacred Chandrabhaga
Which in toto eradicates men's bhoga and raga.

Thy grace kindled in me Divine Oneness
And filled me with ecstatic bliss and pure inner peace,
O Universal Witness! O self-effulgent Sun!
Thou art peerless O Gracious One!

Hail, hail unto thee O Living Presence!
Hail, hail O Bheema's Resonance!
All hail unto thee O Eternal Vithal!
Hail, hail the light Divine that shines in this mortal being.

MURMUR IN MOTHER'S LAP

An echo from the heart-cave

Swami Sundara Chaitanyananda

Thou art the Mother of all, O Sreedevi!
Who removes mundane afflictions heavy.
Thou art the loving Consort of Hari,
Who eradicates in men their worry.

Thou art the daughter of Ocean-God,
Thou art the reliever of the distressed,
Thou art the an ocean of mercy
To those who solely take refuge in thee!

How can I worship Thee, O kind Mother?
As no flower of virtue hath bloomed in me!
How can I wash Thy lotus feet?
For no single tear of love can drop from my eyes!



As a buzzing bee flies from flower to flower
Do I run among fleeting objects for pleasure
Let Thy service be my sole aim
And world peace be my true goal.

Thou art the sound 'OM' that hideth in the silence,
Thou art the Absolute that abideth in the Consciousness,
Thou appearest as many to the baffled mind,
Thou art the only One to the conscious being.

THE DIVINE FUSION

{Excerpts from Pujya Swamiji's message to Lasya Priya Academy of Indian Dances and Centre for Higher Learning and Research - Hyderabad on the occasion of a three-day festival of Yakshaganas held on 22nd, 23rd and 24th of December 2002 at Ravindra Bharati, Hyderabad}

Art is celestial and divine and on that account it is eternal; and *lasya* or dance is an expression of Siva, the divinity in man. As earth in space revolves around the sun and receives light from it, so does art revolve around Siva, the Absolute Truth, and thus drawing inspiration from Him strive to express His beauty to mankind. It is through art and spirituality that divinity reveals itself in all its splendour and glory. Spirituality and art are hence, bound together by an invisible and inextricable link, that is Siva.

Siva is all that exists
Siva is Sakti, Satya and Sundara
Siva makes Sakti fruitful and
Sakti makes Siva beautiful.
Siva and Sakti have not merged into one
But are one in name and form as
Arthanariswara.
Nataraja! Nartana Sundara!
Lasya Priya! O Lord of Natya!
Our salutations unto thee!
All glory unto thee!

ॐ Swami Sundara Chaitanya

PRAYERS IN THE LANGUAGE OF FLOWERS

Swami Sundara Chaitanyananda

We drag our lives on in countless births
Joined together with links of pain and pleasure
Albeit, there are fleeting gleams of gladness
But like woodland brooks that cross a sunlit spot.

The world is all in a turmoil
It boils like a pot of lentils
And men of the world are torn asunder
By eternal strifes and discords.

The youth of today are reeling headlong
In luxury and sensuality
With outbreaks of anger, anxiety,
Bitterness and unreasoning rage.

Now,
May we all walk hand in hand
In the golden light of spirituality
Admiring the brilliance of the rising sun
Kindling flames of love and purity.

May the dark years of pain and agony
Be swept away like crumbling ashes
May our fears and doubts give way
Like rivulets flowing from snow-covered peaks.

May love spring in every heart
Like silver fountain in a golden lake
May desires be swept away from the mind
Like wind-blown leaves from a desolate island.

Love alone has access
To the inmost recesses of the heart
For love is among the sublimest and
Most ennobling sensations of the soul.

Let the mind be silent
Like the deep blue sea
Let the intellect shine bright
Like the immortal sun in the sky.

May our sighs and pleas for peace
Soar to the sky like a flight of white-winged clouds
May our ego leap down crestfallen
Like the torrent from the icy mountains.

May our prayers reach the Almighty
Like towers rising at sunset
May the stars in the sky speak to us
The divine messages of eternity.

Gnana, like the veiled future shines before us
As a vision of promise
Agnana, like the terrible past lay afar
Like a dream left behind in the night.

Are not flowers the stars of the earth?
And are not stars the flowers of heaven?
Here, a singing rose
There, a whispering lily
These have been my writings
That worshipped the Lord.

I string them now into a garland
And adorn His lotus feet
Blessed are we who embrace His feet
For the garland is now around our neck!

WHISPERS OF THE WIND

Swami Sundara Chaitanyananda

Ever trying and ever failing
Giving and gaining, winning and losing
Man dies and fades into oblivion.
But his honourable thoughts and deeds
Having something to do and something to live for,
Burn bright like stars; illumining the paths of men
Forever after his death on earth.



An oak sways with the wings of boughs
A rose dances with the wings of petals
A bird flies over hills and dales
With the feathery wings of joy and hope.

Dawn and dusk are the wings of the day
Life and death are the wings of eternity.
Voices of the past and the distant lands
are the wings of the wind,
Which by murmuring sounds that soothe and bless
help us to soar to heights divine.
Thoughts and words of a poet, tender and soft
are the wings of the soul,
Which by their depth of wisdom, wit and vision
bring us glory, honour and worth.

Let us be silent my brothers!
That we may hear the whispers of the wind
Wrapped in the sweetest and simplest sounds.
The wind carries with it the greatest truth -
'Let him, who would move the world,
First move himself'.
Wind blows unseen but never unaccepted
Idle breeze plays upon our heart-strings
Sweet melodies with sweet pleasure.
It pours into us peace-breathing music
That washes away from the soul
The dust of everyday life.

At night, when darkness veils the world,
Whistling through the rustling leaves
And dancing with the sparkling waves
That glitter like diamonds under the starlit sky,
The wind breaks the silence of the midnight hour
Murmuring to us the serene beauty of nature.

When the dusk of evening gathers on life
And the shadows of twilight grow broader and deeper,
When past disappointments sit heavy on our heart
And clouds of melancholy cast shadows all around
On the wings of lonely musings and solitary prayers
We mount to the sky of infinity.

Deeds are seeds of fate sown here on earth
That bring forth their harvest far away in eternity.
But to have the harvest then
We have to sow the seed now.

Give us pure lives and honest hearts
That we may ask ourselves:
What will I be? What will I do?
And as the seed by planting is multiplied,
So do our joys multiply by good deeds, a thousand fold.

No form, no colour, no length, no breadth
O Saviour of mankind! O Lover of humanity!
Essence of life and the all-pervading presence!
We call upon you pouring out our love,
Not to come and go away but to live and abide with us.

You are in us, as the very breath of life
And yet, high above and far beyond us.
Awaken our souls, lift them high,
Wing them with desires, noble and lofty.



Biting north winds, soothing south winds,
High east winds, light west winds,
Dreary summer winds, weary autumn winds,
Cold winter winds, soft monsoon winds.
Blow in gusts, blow in gales
Clear away the fog of vanity,
Blow away the clouds of disparity.

We are wandering in the wilderness
Like nature's unacknowledged guests
Refresh us as night refreshes the day
Revive us as the day revives the world.

PEARLS OF WISDOM

Swami Sundara Chaitanyananda

1. Love is like a flower. Its beauty and fragrance make life a garden of delight.

2. Whether to be driven out like a noisy crow or called in like a nightingale is left to us. After all, the world too has its choices.

3. Life is brief. Whoever deems it precious will not squander time; for time is what life is made of.

4. An eye to which blue seems yellow is a jaundiced eye. Of what use are eyes that are beautiful but blind to truth?

5. There are some people who in the beginning win our hearts and later wring our hearts.

6. Literacy is not the end of education. The end of education is to make man high, lofty and noble.

7. In meditation thought is not cut and thrown out of us like scrap. It just melts in us and vanishes without even our being conscious of it.

8. Teachers who can truly inspire mankind also roar, not like lions but like the clouds that melt and shower to quench the thirst of ardent seekers and drench them in the rain of their supreme love.

9. A seeker of pleasures can never have peace but a seeker of God has both pleasure and peace.

10. Education means knowledge, learning, understanding and enlightenment.

ఆసక్తికరమైన లేఖ

{అమెరికా లోని డెట్రాయిట్‌లో 9-10-1998 నుండి 15-10-1998 వరకు పూజ్య స్వామిజీ నిర్వహించిన 137 వ జ్ఞానయజ్ఞంలో (ఉదయం: సాధన పంచకము, సాయంత్రం: శ్రీమద్రామాయణము - సుందరకాండ) సమాపనోత్సవంలో పూజ్య స్వామిజీ స్వహస్తాలతో వ్రాసిన లేఖను ముద్రించి, భక్తులకు యజ్ఞప్రసాదంగా పంచడం జరిగింది. ఆ ప్రతిని యథాతథంగా అందిస్తున్నాము}

ॐ

ॐ नमो भगवते वासुदेवाय

The Spirit of Service

My dear Children of Immortal Bliss!

Om.... Om.... Om.

We are the children of the ancient Rishis whose daily prayer said SARVE JANAAH SUKHINO BHAVANTU — may happiness be unto all.

We are the children of those great sages who sat down amidst mountains and rivers, under the cool shades of trees and in that atmosphere of peace and tranquility made their young children probe into the reality of the world around them.

Circumstances and surroundings keep changing. Things will not always be in our favour. Our friends, relatives and the whole world for that matter will be taken away from us oneday. We do not know when our last breath will be and when our heart will cease to beat. This is the fact about life which we can neither alter nor escape but accept as inevitable.

Today, we have forgotten the art of living. We do not know what real happiness is, where to find it and how. We have fallen into an abyss of ignorance where we see the truth as false and Vice Versa.

Now, each one has to think and see for himself if this is where he stands. But the sad fact is that we never really think of ourselves. We always think about what people think of us. Actually, therefore, it is not the people that hurt us. All this comes under the private interests of a person. To learn that one should not be lost in one's personal interests one needs to have some knowledge about the truth.

Each individual in this world is united with his fellow-beings in one way or the other. Our personal interests may apparently seem to be of utmost importance to us. But if the fulfilment of our interests brings unhappiness to others then such a fulfilment can never bring us real happiness.

We often see this happen in sports. We see a tennis champion hugging his or her friends and fans jubilantly. He is all smiles then. But when it comes to shaking hands with the loser we see his or her face shrink. Though his victory brought him joy the fact that his victory is the cause of the loser's sorrow makes the victor of the game sad. Such facts are known only to depth Psychology.

You cannot be happy unless everyone else in this world is happy. We will come to know of this fact only when we learn the truth about ourselves and our relationship with this world and not until then.

Today, those who do not know the essentials of religion speak loudly about it. Those who do not even know the meaning of peace cry out for world-peace.

Man is travelling faster than sound and is exploring the space. But has he ever troubled to explore himself? He is conquering space. He has not learnt to conquer himself.

Today we are all groaning with broken hearts shattered brains and boiling emotions of hatred, jealousy and malice. We have all become slaves to ego and selfishness.

Now, this must all come to an end. Our young men and women must lower the final curtain. This is my message to you all. We must realize that each

of us, must live for the sake of all others. Only then can we build a healthy society and grow towards a prosperous and peaceful life.

Fragrance in flowers is natural and so is sweetness in honey and coolness in water. They are all Nature's bounty born out of her love for humanity. To give and serve man is Nature's only wish and hence she remains the eternal companion of man. But why speak of eternity? What about the common bath soap, the little thing that lasts only for a few days? Does it not lavish every bit of itself on man? Cleaning our bodies and giving us fragrance does it not dissolve into nothingness, yet, as long as it lives how useful and delightful it makes itself to us!

Caring not for your waning self,
Washing dirt and lending scent
you grow smaller day by day.
Noble Soap! you truly live before you die,
For you have known the Spirit of Service.

Dear friends! A lamp is a lamp so long as it gives light. Never fearing its extinction it burns away in the very joy of giving light. It is this sense of Sacrifice and self-denial that lends brilliance even to our lives. He who fears his end can never live for others.

We keep rubbing the soap making it smaller and smaller till it is all used up. Does the poor thing ever try to save or preserve itself? No, nor does it get soiled by people's dirt with no fear of melting away it scatters fragrance to the last bit. Care and self-interest mar the beauty of our services.

you must not just serve but be cheerful and pleasant while doing so. A heart that overflows with love and service will always be cheerful.

Be like the lovable little bath soap that retains its charm for life — ever giving and never losing.

Be thankful that God has made you serviceable to Him and profitable to others.

Find happiness in your path the path of service.

Radiate joy and lasting delight to one and all around you.

I pray to Almighty Lord to shower His blessings on all of us.

With Prem & Om

Yours in the Lord

Swami Sundara Chaitanyananda

137th Gyana yagna
12-10-98
Detroit
Michigan



THE GOLDEN THRESHOLD

A warm welcome to a New Millennium - 2000

Eternity is not something which is beyond time and space but the basis which creates and makes both known. Time and space, though beginningless, seem to be having a beginning here and there. Today, the world is looking forward to one such landmark in the history of mankind - a New Millennium - with the hope of a new dawn, a new light and an evolved life.

The Beginning of a New Era

WELCOME to you, O Delightful Morning Star!
Come to us glowing with the spirit of wisdom
Rich as the dawn of the first day of creation.
Rise, to erase the midnight melancholy of
yesteryears,
To open the visions of an endless life
And conduct us through the trance of death
Into realms of Effulgent Light and
everlasting delight.

O Luminary of Eternity! Welcome!
You are the resort of love, joy, peace
and plenty.
Brightening and cheering your way
We wait impatiently for the break of day.
Come, guide us before the sunset of life
To the last and final awakening.
Give us hopes of eternal joy
In a better world of true living.

O Messenger of the Infinite! Welcome!
We wait to watch the golden sunbeams
Pierce through the purple vaulted night.
We sit still to hear your silent footsteps
Upon the mountain tops of meditation.
The past that once pierced us like thorns
Now slowly drifts away like a dream.

Come! Make the discords of the present the harmonies of the future.
Take us back to the pristine simplicity of our ancient culture.

O Golden Dawn of the New Millennium!
You have the key that opens to us
The treasures of God's mercies and blessings.
Make us most lovable in the eyes of our Lord
By helping us help our fellow beings.
Remind us that duties are our own and
events are God's.
Render us most acceptable to Him
Not like the flower that fades,
But like the fragrance that lasts.

Dear Friends!

We are here, the fortunate few, living and breathing to witness the morning star at the dawn of the first day of the new century.

Let us get into the habit of looking for the silver lining of the cloud, rather than at the leaden grey in the middle, and this will help us overcome our weaknesses and obstacles. It is for the sake of man, not of God, that worship and prayer are needed, and so we pray unitedly for a happy beginning of a new era standing at the Golden Threshold of the NEW MILLENNIUM.

Yours, in the Lord,

ॐ Swami Sundara Chaitanya

MY LIFE AND MISSION

Swami Sundara Chaitanyananda



I strongly believe that the ablest men in all walks of life are men of faith. Faith produces firm convictions and firm convictions precede great actions. Every great enterprise therefore, begins with and takes its first step forward in faith. Faith and action are as necessary to our spiritual life as soul and body are to our life as men. Life was not given for indolent contemplation; actions and actions alone determine its worth.

I look back across the gulf of years and memories of the past come to me like scents from a twilight garden. I remember how in my childhood I kept asking myself and every reasonable person I met queries about birth, death, life and rebirth; about the world and its truth and untruth. My quest went on for years both within and without but I could draw no conclusions from it. Even my search for a Guru who could enlighten me remained futile. Neither my household nor the teachers in school could help me find answers to these queries. In my despondency the only ray of hope was my pious and devout mother who showed me the path of devotion and said it would certainly one day lead me to God-head one day. I wept at the feet of the Lord day and night and when at last His grace showered upon me, my ignorance vanished and my misery ceased.

My self-unfoldment had burst forth into full bloom in all its fragrance. The realization of God as the Universal Self led to the experience of universal sympathy, universal love and universal bliss. I gave up my plans of retiring from the busy world and leading the life of a recluse. Instead, I made up my mind to serve the society selflessly and thus serve Him who is the one effulgent Truth behind all the world panorama. I could see that the men of the world around me, though wise and learned were completely in the dark regarding knowledge of their own cultural heritage. I, therefore, tried to give them a right interpretation of our ancient and sacred culture for which purpose I employed all the mental faculties and

intellectual capabilities which the Almighty bestowed on me. I tried in my own way to explain both to the educated and the uneducated masses, the contents of the immortal books of the Upanishads and the Gita. I travelled widely conducting 'Gnana Yagnas' for inspiring, thrilling, reviving and awakening people through spiritual discourses and sankeertans. My erudition, oratory, literary and musical skills - all helped me tremendously in fulfilling my mission. The task of bringing about a cultural renaissance embarked on in my nineteenth year was successfully carried out for nearly two decades. I was immensely happy with my work.

The year 1984, however, proved to be an epoch-making year in the history of my missionary work. Countless devotees who came into my fold and were awakened and transformed by me began to feel the need for an ashram - a divine hermitage, which they thought would give them solace from the pangs and pains of life and form a strong and constant base for their spiritual sadhana. But my views were different. I personally felt that I was not the kind of a person to be limited and confined to an institution. I was afraid my abundant and varied skills would stagnate and not be fully utlized if my free movement in society was restricted. I am for the masses, I thought. I have to run like a stream to quench the spiritual thirst of the millions. I am like a river that flows through vast expanses of parched land wetting and revivifying it before mingling with the sea. But as God would have it, the ardent wish of the devotees to set up an ashram was fulfilled. So, on the eleventh of November 1985, much against my wishes, the Sundara Chaitanya Ashram was started in Dowlaiswaram on the banks of the holy Godavari. It was a simple ashram with a humble beginning. The ashram literally was born in debts and financial resources to run the ashram were practically nil. But having made a beginning I was determined to make it a success. Most of the devotees were common people leading modest and quiet lives. They were not people of wealth, position or influence. Yet, they were generous, large-hearted, honest and devoted. With the love and co-operation of these true devotees I could withstand the trials and face the hardships I was put to by the unscrupulous, heartless and hypocritical people of the society.

I continued my work of spreading the glory of Sanatana Dharma by conducting Gnana Yagnas and setting up Satsangs even in the remote corners of the state. I wrote a number of interesting books on philosophy and released cassettes of bhajans and spiritual discourses. A monthly magazine 'Giridhari' was started in the

year 1995. All these kept the lamp of bhakti and gnana burning constantly in the hearts of the devotees wherever and in whichever walks of life they may be. Today, after a span of ten years, I recollect with pride how, though thwarted at every step by insuperable obstacles and difficulties, challenged by inveterate forces of opposition and criticism; and though threatened by flames of discord and controversies from all quarters of society, our ashram has emerged successfully through all those dangers and difficulties and kept the glorious flag of Sanatana Dharma flying high. It was Lord Shyama Sundara, the presiding deity of the ashram who constantly guarded and guided me along this ardous path. He has blessed me with a consistency of purpose and all the spiritual vigour that was needed to strengthen myself and fight against anything that barricaded the road to truth. I knew that this would be an endless and eternal struggle.

Jealousy, hatred and malice are ugly and stubborn strains in human minds which poison and disfigure the society. Not only athiests and sceptics but even religious leaders are sometimes the cause and victims to these emotions. Between different religions and even within the same religion we see groups and factions torn apart by quarrels and fights, misunderstandings and mutual animosities.

Cultural revival is never a destructive revolution but a steady and constructive evolution. My ambition had always been to build a peaceful army of revivalists and to inspire them through love and tenderness to walk steadily towards a peaceful communal growth. Love and forgiveness have always been my strongest weapons against hatred and revenge. I, therefore, try to mould my disciples and followers in my own image by making them morally strong, ethically good and spiritually evolved. I am confident that one day the members of Sundara Chaitanya Ashram and Sundara Satsangs who are themselves perfect disciples and conscientious citizens will bring about a change in society by transforming and spiritualising their fellow-beings. This is the greatest miracle that any Saint or a Religious Leader can aspire to do.

I instruct my disciples, therefore, to avoid becoming mere pedantic scholars and intellectual enquirers but to live their philosophy before they can preach it to others. I lovingly advise them to be regular and sincere in their sadhana, to be peaceful and serene themselves, and to be noble and loving to their fellow-men in society.

I belong to the lineage of great sages like Sankara, Ramana, Vivekananda and Ramateertha who met challenges and threats with an invincible courage and marched on with

determination and fearlessness towards their goal. An inborn and irresistible impulse to spread the greatness of Hindu religon against all odds was a great driving force in their lives. So it is with me.

The call of Vedanta to man is God-relization through right knowledge. Right knowledge dawns not through mere study of scriptures and by hearing to discourses but by right living. In and through life alone we can discover the truth. Therefore, I suppose it was the divine dispensation that visited me at every stage of my life in the form of troubles, trials, hardships and difficulties with a view to making me a role model for my disciples. Spiritual growth being a subjective unfoldment, none can help another directly. Each must take charge of himself and learn while he lives.

Today is the 10th annual celebration of the temple of Bhagavan Murali Krishna in Sundara Chaitanya Ashram which incidentally happens to be the inaugural day of the Kailasanatha Temple also in our ashram. This coincidence, I am sure, will wipe off all trace of difference, if still lurking in our hearts, between Siva and Vishnu and enable us to discern oneness everywhere, not only among deities but also among men.

I am extremely glad to bring out a souvenir to mark this auspicious occasion and herein, I would like to thank one and all who had wished and worked and continue to do so for the progress and well-being of the ashram. There are those who are clogged by insincerity and full of self-glory on the one hand. My heart-felt sympathy for them. There are others who are honest, unassuming, submissive and serviceable on the other. My blessings for their peace and joy and spiritual progress. I, for my part, re-dedicate myself to the service of mankind with added vigour and enthusiasm. I will carry out the task of re-interpreting the timeless and immortal values of life as propounded by the scriptures and training the citizens of Bharat to live the Sanatana Dharma. May God bless us all in our endeavours.



పూజ్య స్వామీజీ గాత్ర కచ్చేరీ

వాద్య సహకారం :
వీణ : శ్రీమతి శాంతామూర్తి, మృదంగం : శ్రీ దుర్గా కుమార్

పూజ్య స్వామీజీతో కళాతపస్వి శ్రీ కె.విశ్వనాథ్ గారు

శ్రీకాళహస్తి మహిళా మండలి సభ్యులతో శ్రీ స్వామీజీ (1974)

శ్రీ సుందర చైతన్యానంద స్వామి అష్టోత్తర శతనామావళి

ప్రతిధ్వనించేది శబ్దం. ప్రతిఫలించేది బింబం. నామం శబ్దానికి సంబంధిం చిందైతే బింబం రూపానికి సంబంధించింది. పరమాత్మ ప్రతిబింబమైన ఈ ప్రపంచం నామరూపాల సమ్మేళనం.

పరమాత్మ వినిపించువాడే కాని కనిపించువాడు కాదు. ఆయన శబ్దవాచ్యుడు, ఓంకార స్వరూపుడు. అందుకే కంటికి కనిపించని పరమాత్మ పిలిస్తే పలుకుతాడు. ప్రపంచమంతా పరమాత్మదే అయినా, పరమాత్మే అయినా, దైవం కొలువు దీరి ఉండేది తనను తలచే మదిలోనే, తనను పిలిచే ఎదలోనే. ఈ ప్రపంచంలో శిష్యుడికి గురువే ప్రత్యక్ష దైవం. ఈశ్వరో గురురాత్మేతి మూర్తిబేధ విభాగినే, అన్న శాస్త్ర వాక్యార్థాన్ని

నీవే దైవము, నేనే నీవని
పలుకును గురు కవులు,
మాకు కామ ధేనువులు'

అంటూ అచ్చమైన తేటతెలుగులో అందంగా వీనుల విందుగా గానం చేశారు 'చైతన్య గానం'లో మన పూజ్య గురుదేవులు.

గురువే ఆత్మ. గురువే పరమాత్మ. నది ఎపుడు సముద్రం నుండి వేరు పడని విధంగా జీవు డెపుడు పరమాత్మ నుండి విడిపడలేడు. జీవాత్మ పరమాత్మల మధ్య అభేదాన్ని దర్శింపచేసే గురుదేవుడు వారిరువురి మధ్య వారధి వంటివాడు. సంసార సాగరాన్ని దాటించడంలో నావ వంటివాడు. అజ్ఞాన చీకటిని పటాపంచలు చేయగల దీపం వంటి వాడు. భవరోగానికి మందు వంటివాడు. గురు భగవానుడు కొలువై యున్న హృదయంలో బాధలకు, భయాలకు తావు లేదు.

పూజ్య గురుదేవులకు 77 సంవత్సరాలు పూర్తయిన ఈ శుభ సందర్భంలో 'శ్రీ సుందర చైతన్యానంద స్వామి అష్టోత్తర శతనామావళి'ని మీ కందిస్తున్నందుకు మేము ఎంతగానో ఆనందిస్తున్నాము. 54 సంఖ్యను రెండుతో గుణిస్తే 108 అవుతాయి.

సంస్కృతంలో అక్షరాలు 54. ఆరోహణ అవరోహణ క్రమంలో 108 అవుతాయి. పరమాత్మ అక్షర స్వరూపుడు. పరమాత్మ స్వరూపమైన గురుదేవుడు అక్షర స్వరూపుడే. కనుక ఈ 108 నామాలతో మనం పిలిచేది, కొలిచేది గురురూపంలో ఉన్న పరమాత్మనే. రెండింతల ప్రేమాసక్తితో, ద్విగుణీకృతమైన శ్రద్ధాభక్తితో శిష్యులు నిత్యము పఠించేందుకు గాను, సాధననే నిత్యార్చనగా కొనసాగించేందుకు గాను పూజ్య గురుదేవుల అష్టోత్తర శతనామావళిని అర్థం చెబుతూ అందిస్తున్నాము. అష్టోత్తర శతనామాలతో గురువును పిలిచినా, పిలిచే గుండె ఒక్కటే. పలికే హృదయ మొక్కటే. బిడ్డ ఏడుపుకు స్పందించి తల్లి పాలిచ్చినట్లు శిష్యుని ప్రేమ పిలుపుకు ప్రతిస్పందించి గురుదేవుడు ఆత్మజ్ఞానాన్ని అందించి ఆశీర్వదిస్తాడు. గురుబిడ్డలను తరింపచేస్తాడు.

జై జై గురుదేవ!

1. ఓం సద్గురవే నమః
సద్రూపుడైన గురుదేవునకు నమస్కారము

2. ఓం సచ్చిదానంద రూపాయ నమః
సచ్చిదానంద స్వరూపునకు నమస్కారము

3. ఓం సత్సంగ ప్రచారకాయ నమః
భగవంతుని సాంగత్యమును కల్పించు వారికి నమస్కారము

4. ఓం సర్వసంగ పరిత్యాగినే నమః
సకల బంధములను సన్న్యసించిన వారికి నమస్కారము

5. ఓం సకల విద్యా నిలయాయ నమః
సమస్త విద్యలకు నెలవైన వారికి నమస్కారము

6. ఓం సదా ద్వాదశాక్షరీ మంత్ర ప్రచారకాయ నమః
ఎల్లప్పుడు 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనెడి దివ్య మంత్రమును ప్రచారము చేయువారికి నమస్కారము

7.ఓం సర్వదాత్మరతాయ నమః
నిరంతరం ఆత్మయందు రమించు వారికి నమస్కారము

8.ఓం సర్వగతాయ నమః
అంతట నిండియున్న వారికి నమస్కారము

9.ఓం సాధురూపాయ నమః
మంగళకర రూపునకు నమస్కారము

10.ఓం స్థితప్రజ్ఞాయ నమః
ప్రజ్ఞాన ఘన స్వరూపము నందు స్థిరు లైన వారికి నమస్కారము

11.ఓం సుమధుర గాయకాయ నమః
తేనె లొలుకు గాన వైదుష్యము గల వారికి నమస్కారము

12. ఓం షడ్గుణైశ్వర్య సంపన్నాయ నమః
ఆరు కళ్యాణ గుణములను సంపదగా గలిగిన వారికి నమస్కారము

13.ఓం జ్ఞాన గమ్యాయ నమః
జ్ఞానము చేత పొందదగిన వారికి నమస్కారము

14ఓం జ్ఞాన రూపాయ నమః
జ్ఞానమే తమ స్వరూపమైన వారికి నమస్కారము

15. ఓం జ్ఞాన బోధకాయ నమః
జ్ఞానమును బోధించు ఆచార్యునకు నమస్కారము

16. ఓం జ్ఞాన నిష్ఠాయ నమః
జ్ఞానమునందే నిలిచియున్న వారికి నమస్కారము

17.ఓం జ్ఞాన బ్రహ్మణే నమః
జ్ఞానబ్రహ్మకు నమస్కారము

18.ఓం ధ్యాన రూపాయ నమః
ధ్యాన స్వరూపునకు నమస్కారము

19. ఓం ధ్యాన బోధకాయ నమః
ధ్యాన విధిని బోధించు యోగి వర్యులకు నమస్కారము

20. ఓం జ్ఞాన భాస్కరాయ నమః
అజ్ఞాన చీకట్లను తొలగించు జ్ఞాన సూర్యునికి నమస్కారము

21.ఓం గాన ప్రియాయ నమః
భగవద్గుణములను కీర్తించుట యందు ప్రీతి గల వారికి నమస్కారము

22. ఓం గాన కళాకోవిదాయ నమః
గానకళ యందు నిపుణులైన వారికి నమస్కారము

23. ఓం నాట్యాచార్యాయ నమః
స్వరూపమును సదా గుర్తుంచుకొని సంసారమున మన పాత్ర పోషించు టెట్లో తెలుపు గురుదేవులకు నమస్కారము

24.ఓం కవయే నమః
క్రాంతిని దర్శించువారికి నమస్కారము

25.ఓం నిగమాగమ పారగాయ నమః
వేద వేదాంగముల యందు పారంగతులైన వారికి నమస్కారము

26.ఓం నిత్యతృప్తాయ నమః
సదా సంతుష్టులై ఉండువారికి నమస్కారము

27.ఓం నిరహంకారాయ నమః
అహంకారము నంతమొందించిన వారికి నమస్కారము

28. ఓం నిరామయాయ నమః
భవరోగ దూరునకు నమస్కారము

29.ఓం నిరంజనాయ నమః
నిరంజన స్వరూపునకు నమస్కారము

30. ఓం నిర్మలాయ నమః
విమల చరితునకు నమస్కారము

31. ఓం నిర్గుణాయ నమః
సత్త్వరజస్తమో గుణముల కతీతులైన వారికి నమస్కారము

32. ఓం నిత్యాయ నమః
ఎల్లప్పుడు ఉండువారికి నమస్కారము

33. ఓం నిరుపమాన ప్రబోధకాయ నమః
సాటిలేని ప్రబోధకునకు నమస్కారము

34. ఓం నిరాకారాయ నమః
రూపమునకు అతీతులైన వారికి నమస్కారము

35. ఓం నిరంతర శ్రీకృష్ణ పాదపంకజ భ్రమరాయ నమః
నిరంతరం శ్రీకృష్ణుని పాదపద్మముల యందలి ఆనంద మకరందమును గ్రోలు చుండు తుమ్మెదకు వందనము

36. ఓం మనోవాగతీతాయ నమః
మనస్సునకు, వాక్కునకు అందని వారికి నమస్కారము

37. ఓం మాతృముక్తి ప్రదాయకాయ నమః
మాతృదేవికి ముక్తినిచ్చిన వారికి నమస్కారము

38. ఓం భావాతీతాయ నమః
ఆలోచనకు అందని వారికి నమస్కారము

39. ఓం గుణాతీతాయ నమః
త్రిగుణముల కందని నిర్మలునకు నమస్కారము

40. ఓం పరిపూర్ణాయ నమః
పరిపూర్ణ స్వరూపునకు నమస్కారము

41. ఓం పరిశుద్ధాయ నమః
నిష్కళంకునకు నమస్కారము

42. ఓం పరితోష ప్రదాయినే నమః
ఆనందము ననుగ్రహించు వారికి నమస్కారము



43. ఓం పరాత్పరాయ నమః
శ్రేష్ఠులకు శ్రేష్ఠు లైన వారికి నమస్కారము

44. ఓం పవిత్రాత్మనే నమః
జ్ఞానపూతులైన వారికి నమస్కారము

45. ఓం ప్రణవ స్వరూపాయ నమః
ఓంకార రూపునకు నమస్కారము

46. ఓం తీర్థ స్వరూపాయ నమః
తరింప జేయు వారికి నమస్కారము

47.ఓం త్రిమూర్త్యాత్మక శక్తి స్వరూపాయ నమః
బ్రహ్మ విష్ణు మహేశ్వరుల శక్తినే తన స్వరూపముగా గల వారికి నమస్కారము

48. ఓం ప్రకాశైక స్వరూపాయ నమః
తేజోవంతునకు నమస్కారము

49. ఓం మంగళ స్వరూపాయ నమః
శుభకరునకు నమస్కారము

50. ఓం మంత్ర స్వరూపాయ నమః
అనేక మంత్రములచే స్తుతించబడు దివ్యరూపము తామే యైనవారికి నమస్కారము



51. ఓం ఆనంద స్వరూపాయ నమః
ఆనందమే తమ స్వరూపముగ గల వారికి నమస్కారము

52. ఓం ఆత్మ స్వరూపాయ నమః
సకల జీవులలో 'నేను'గా తెలియు స్వరూపము తానే యైనవారికి నమస్కారము

53. ఓం అక్షయ రూపాయ నమః
నశింపు లేనివారికి నమస్కారము

54. ఓం చిన్మయ రూపాయ నమః
జ్ఞానమయునకు నమస్కారము

55. ఓం శాంత రూపాయ నమః
ప్రశాంత స్వరూపునకు నమస్కారము

56. ఓం తత్త్వమసీత్యాది వాక్య లక్ష్యార్థ రూపాయ నమః
'తత్త్వమసి' (నీవే అది) మొదలగు శ్రుతివాక్యముల నిజ అర్థమే తన స్వరూపముగ గలవారికి నమస్కారము

57. ఓం బ్రహ్మానందమయాయ నమః
బ్రహ్మానందముతో నిండియుండు వారికి నమస్కారము

58. ఓం దయామయ దేహాయ నమః
కరుణ ననుగ్రహించు ఆలయము వంటి శరీరము గల వారికి నమస్కారము

59.ఓం ప్రేమ నిలయాయ నమః
ప్రేమకు నిలయమైన వారికి నమస్కారము

60. ఓం జితేంద్రియాయ నమః
సకలేంద్రియములను జయించిన వారికి నమస్కారము

61. ఓం అభినవ శంకరాచార్యాయ నమః
నేటి సమాజమున ఆదిశంకరుల వలె ధర్మోద్ధరణ గావించుచున్న వారికి నమస్కారము

62. ఓం అద్వైత వివేకాయ నమః
అద్వైత జ్ఞానము ననుభూతిగ గల వారికి నమస్కారము

63. ఓం అద్వితీయాయ నమః
రెండవది లేని ఏక స్వరూపము తానే యైన వారికి నమస్కారము

64. ఓం అవికారాయ నమః
మార్పు లేనివారికి నమస్కారము

65. ఓం అశేష జనాకర్షకాయ నమః
సకల జనులను తమ ప్రేమ, జ్ఞానము లతో ఆకర్షించు వారికి నమస్కారము

66. ఓం అచిన్త్యాయ నమః
యోచించలేని స్వరూపము తానే యైన వారికి నమస్కారము

67. ఓం అనర్గళ భాషణశీలాయ నమః
గంగా ప్రవాహము వలె బోధ ననుగ్ర హించు వారికి నమస్కారము

68. ఓం ఆత్మస్థితాయ నమః
ఆత్మయందే స్థిరుడై ఉండువారికి నమస్కారము

69. ఓం ఆదిమధ్యాంత రహితాయ నమః
మొదలు, నడుమ, తుది అనునవి లేని వారికి నమస్కారము

70. ఓం ఆనంద ప్రదాత్రే నమః
దివ్యానందము ననుగ్రహించు వారికి నమస్కారము

71. ఓం ఆర్షధర్మ దీపికాధారిణే నమః
సత్యసందేశాల వెలుగులు విరజిమ్మే సనాతన ధర్మదీపికను ధరించినవారికి నమస్కారము

72. ఓం జన్మకర్మ నివారిణే నమః
జనన మరణ సంసార చక్రమును నిరోధించు వారికి నమస్కారము

73. ఓం బ్రహ్మచారిణే నమః
నిరంతరం బ్రహ్మమునందే రమించు వారికి నమస్కారము

74. ఓం బుద్ధి సాక్షిణే నమః
బుద్ధికి వెనుక ఉండి నిర్లిప్తులై వీక్షించు వారికి నమస్కారము

75. ఓం సుమకోమల భావ సంపన్నాయ నమః
పువ్వుల వంటి సున్నిత భావములను సంపదగ గలవారికి నమస్కారము

76. ఓం లలిత కళాకోవిదే నమః
జీవన కళను తెలిపే లలితకళల యందు నిష్ణాతులైన వారికి నమస్కారము

77. ఓం గజారోహణ కృతే నమః
గజారోహణ పురస్కారము పొందిన వారికి నమస్కారము

78. ఓం భవసాగర సేతు కృతే నమః
సంసార సాగరమును దాటుటకు వంతెన గట్టిన వారికి నమస్కారము

79. ఓం దోష దూరీకృతే నమః
గుణదోషములను క్షాళన మొనరించు వారికి నమస్కారము

80. ఓం కాంస్య ఘంటారవ భాషిణే నమః
కంచువలె మ్రోగు కంఠము గల వారికి నమస్కారము

81. ఓం దుస్సంగ ద్వేషిణే నమః
దుర్జన, దుష్టభావ సాంగత్యమును సహించని వారికి నమస్కారము

82. ఓం సత్సంగ ప్రియాయ నమః
సత్సాంగత్యము నిష్టపడు వారికి నమస్కారము

83. ఓం భక్త హితాయ నమః
భక్తులకు శ్రేయము నొనగూర్చు వారికి నమస్కారము

84. ఓం భక్త సులభాయ నమః
భక్తులకు అత్యంత సన్నిహితులైన వారికి నమస్కారము

85. ఓం శిష్య వత్సలాయ నమః
తండ్రివలె శిష్యులను కాచి, కాపాడు వారికి నమస్కారము

86. ఓం శిష్య సన్మార్గ శాసకాయ నమః
నిజధామమును చేరు మార్గమును శిష్యులకు చూపు వారికి నమస్కారము

87. ఓం శిష్యాణాం కల్పవృక్షాయ నమః
శిష్యులకు హితమైన దంతయు ఇచ్చు కల్పతరువైన వారికి నమస్కారము

88. ఓం అజ్ఞాన తిమిర నాశకాయ నమః
అజ్ఞాన చీకట్లను చీల్చువారికి నమస్కారము

89. ఓం ద్వంద్వ నాశకాయ నమః
సాపేక్షికములైన ద్వంద్వములను నాశము చేయువారికి నమస్కారము

90. ఓం తాపత్రయ వినాశకాయ నమః
అధిభూత, అధిదైవ, అధ్యాత్మ తాప ములను హరించు వారికి నమస్కారము

91. ఓం కామ వినాశకాయ నమః
కామమును దగ్ధమొనర్చు వారికి వందనము

92. ఓం శిష్య హృదిస్థ సంశయ విచ్ఛేదకాయ నమః
శిష్యుల హృదయముల యందలి సందేహములను నశింపజేయువారికి నమస్కారము

93. ఓం భేదభావ దృష్టిదోష నివారకాయ నమః
సత్యము అందని దశలో తెలిసే భేద భావ చత్వారమును తొలగించువారికి నమస్కారము

94. ఓం భయశోక హరాయ నమః
భేదభావ జన్యములైన భయమును, శోకమును తొలగించువారికి నమస్కారము

95. ఓం భవసాగర తారకాయ నమః
సంసార సముద్రమును దాటించు వారికి నమస్కారము

96. ఓం కరుణామృత సాగరాయ నమః
కారుణ్యమనే అమృతముతో నిండిన సాగరము వంటి వారికి నమస్కారము

97. ఓం యశఃకామ రహితాయ నమః
కీర్తి కాంక్ష నెరుగని వారికి వందనము

98. ఓం మనోభీష్ట ఫలప్రదాయ నమః
మన ఆంతర్యములోని వెలితిని తామే గ్రహించి
తొలగించు వారికి నమస్కారము

99. ఓం విశిష్ట నూపుర సత్కృతాయ నమః
గండపెండేరముచే సత్కరింపబడిన వారికి
నమస్కారము

100. ఓం ప్రవచన సమ్మోహిత శ్రోతృజనాయ నమః
తమ ప్రబోధముచే ఆలకించు వారిని ఆనంద
సాగరమున ఓలలాడించు వారికి నమస్కారము



101. ఓం భవబంధ విమోచకాయ నమః
సంసార సంకెళ్ళనుండి విడుదల చేయు వారికి
నమస్కారము

102. ఓం శతాధిక జ్ఞానయజ్ఞ నిర్వాహకాయ నమః
వందకు మించిన జ్ఞానయజ్ఞములను నిర్వహించిన
వారికి నమస్కారము

103. ఓం శతాధిక సత్సంగ సంయోజకాయ నమః
వంద కంటె ఎక్కువ సత్సంగ శాఖల నేర్పరచిన వారికి
నమస్కారము

104. ఓం శతాధిక గ్రంథకర్త్రే నమః
నూటికి పైగా గ్రంథములు రచించిన వారికి
నమస్కారము

105. ఓం స్థిరాయ నమః
అచల స్వరూపునకు నమస్కారము

106. ఓం స్వతంత్రాయ నమః
తనకు తానే ఆధార స్వరూపమైన ఉన్న వారికి
నమస్కారము

107. ఓం పరమ గురవే నమః
గురువుల కెల్ల గురువైన వారికి నమస్కారము

108. ఓం సుందర చైతన్యానంద స్వామినే నమః
శ్రీసుందర చైతన్యానంద స్వామి వారికి నమస్కారము

పూజ్య స్వామీజీ కారణజన్ములు

శ్రీ పి.సుబ్బరామయ్య నాయుడు,
బి.ఎ.,బి.ఎల్.,
వేంకటగిరి

(ఋషీకేశం - శ్రీ శివానంద స్వాముల వారికి అత్యంత ప్రియశిష్యులు అయిన శ్రీసుబ్బరామయ్య నాయుడు గారు దివ్య జీవన సంఘము నకు దక్షిణ భారతములో ఉపాధ్యక్షులుగా పని చేయు టయే గాక, దివ్యజీవన సంఘ జాతీయ, ప్రదేశ సదస్సులను స్వయముగా ఆంధ్రదేశంలో అనేకము నిర్వహించారు. శ్రీ చిదానంద స్వామి, శ్రీచిన్మయానంద స్వామి, శ్రీ దేవానంద స్వామి, శ్రీ కృష్ణానంద స్వామీజీలతో కలసి వీరు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. పూజ్య స్వామీజీకి శ్రీ శుద్ధానంద భారతీ స్వాముల వారితో పరిచయ భాగ్యమును కల్పించినది కూడా వీరే. వయస్సులో పూజ్య స్వామీజీ కన్నా నాలుగు పదులు పెద్దవారైన శ్రీ నాయుడు గారు స్వామీజీకి బాల్యములో ఆదర్శ ప్రాయులు).

పూజ్యశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారు ఆధ్యాత్మిక సంస్కారములతో జన్మించిరి. పూర్వ జన్మముననే వారు సిద్ధిని బడసిన మహా పురుషులని నా దృఢ విశ్వాసము. ఏదో కొంత కర్మశేషము చేతనే వారీ జన్మకు వచ్చిరి. వారు కారణజన్ములు. సంసార సాగరమున పడి పరితపించు మానవాళికి ముక్తి మార్గమును జూపుటకే వారీ జన్మకు వచ్చిరి.

శ్రీ స్వామి వారిని బాల్యము నుండి నే నెరుగుదును. వారు చిన్నప్పటి నుండియే ఆధ్యాత్మిక భావములను వ్యక్తపరచు చుండెడి వారు. ఎల్లప్పుడు ఏదో పరధ్యానము లోనే వుండెడి వారు. సాధారణముగ మౌనముగ, ఒంటరిగనే కాలము గడిపెడి వారు. వారు సాయంత్ర సమయాలలో షికారుగ బయటకు వెళ్ళునపుడు గూడా వారి వద్ద ఏదో ఒక ఆధ్యాత్మిక గ్రంథము ఉండెడిది. దివ్యజీవన సంఘ యాజమాన్యమున మేము నిర్వహించు కార్యక్రమములలో వారు తరచుగ పాల్గొను చుండెడి వారు. ఆనందముగ నృత్యము చేయుచు పురవీధులలో దివ్యనామ సంకీర్తన సల్పెడి వారు.

ప్రస్తుతము వారొక వ్యక్తిగ కాక మహా ఆధ్యాత్మిక శక్తిగ ప్రకాశించు చున్నారు. సద్గురు పీఠము నలంకరించి, వేలాది జిజ్ఞాసువు లకు, ఆధ్యాత్మిక సాధకులకు ముక్తి మార్గమును చూపించు చున్నారు. ఇది మహా అద్భుతము. నలుబది నాలుగు సంవత్సరములు నిండక మునుపే శ్రీ స్వామి వారు సుమారు వంద ఆధ్యాత్మిక గ్రంథములను రచించి సాధక లోకమునకు అందించుట, వంద గీతా యజ్ఞములను నిర్వహించుట, వంద సుందర సత్సంగములను ఏర్పరచి వానిని క్రమశిక్షణలో జరుగునట్లు చూచుట సాధారణ విషయమా?

శ్రీ స్వామి వారు అఖండజ్ఞాని; పరమభక్తుడు; ఆదర్శ కర్మయోగి; పూర్ణయోగి. శ్రీకృష్ణపరమాత్మ వీరికి చిరాయువును, ఆరోగ్య శ్రీని, లోక కళ్యాణమునకు, మానవసేవకు వలసిన శక్తి సామర్థ్యములను ప్రసాదించి అనుగ్రహించు గాక!

శ్యామ సుందర చైతన్యం

శ్రీ ఆర్.రాధాకృష్ణయ్య, బి.ఎ.,బి.ఇడి
హెడ్‌మాస్టర్ (రిటైర్డ్)
ఆర్.వి.ఎమ్.హైస్కూలు, వెంకటగిరి

(రచయిత శ్రీ రావినూతల రాధాకృష్ణయ్య గారు సంస్కృతాంధ్రాంగ్లములలో గొప్ప పండితులు. బహుగ్రంథ రచయిత. దివ్యజీవన సంఘము స్థాపకులు, పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ సద్గురు శివానంద స్వాముల వారి శిష్యులు. శ్రీ శివానంద స్వాముల వారి చేత 'సాధన రత్న' అనెడి బిరుదును పొందినవారు. పూజ్య స్వామీజీ ఉన్నత పాఠశాలలో చదివేటప్పుడు శ్రీరాధాకృష్ణయ్య గారు తరగతి ఉపాధ్యాయులే గాక, ప్రత్యేకంగా స్వామీజీకి గణితమును బోధించిన ట్యూషన్ మాస్టారు)

శ్రీ స్వామి సుందర చైతన్యానందులు సుందర చైతన్యాశ్రమ సంస్థాపకులు మరియు నిర్వాహకులు. వివేకానంద, గోరఖ్‌నాథ్, భర్తృహరి, నిత్యానందుల కోవకు చెందిన పావనాత్ములు. కేవలం భగవత్కృప వల్ల ప్రాప్తించే మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయం అనే మూడు అపురూప వరాలను పొంద గలిగిన ధన్యాత్ములు.

శరణాగతి, పవిత్ర ప్రేమ, భగవత్కైంకర్యం అనే అద్భుత సాధనలు చిన్ననాడే అలవడిన శ్రీ స్వామీజీ శ్యామసుందరుని పూర్ణ అనుగ్రహానికి పాత్రు లయ్యారు. భగవంతుని యందు అకుంఠిత భక్తి, సేవా తత్పరత గల శ్రీ స్వామీజీ సదా ఆయన దివ్యప్రేమలో, ఆరాధనలో రమిస్తూ ఉంటారు. పరమ భాగవతోత్తములైన స్వామీజీ భగవద్భక్తిని నిత్యసాధనగా, జీవితావసరంగా బోధిస్తారు.

శ్రీ స్వామీజీ రచించిన శతాధిక గ్రంథాలు అపూర్వములు, అమూల్యములు. అవి అమృత జ్ఞాన భాండాగారములు. పల్లెలలో, పట్టణాలలో, గ్రామాలలో, నగరాలలో ఆశ్రమం ఉచితంగా వితరణ చేసే కర పత్రములు, చిన్ని పుస్తకములు, పొత్తములు ప్రజల హృదయాలలో సనాతన ధర్మ విలువలను వృద్ధి చేస్తూ ఉన్నాయి. మానసిక పరివర్తన, ఆధ్యాత్మిక చింతనము జనులలో చోటు చేసుకుంటూ ఉన్నాయి. ఇది ఒక శుభ పరిణామము. ఈ దిశగా శ్రీ స్వామీజీ, స్వామి వారి ఆధ్వర్యంలో ఆశ్రమవాసులు అహర్నిశం అవిశ్రాంతంగా శ్రమిస్తూ ఉన్నారు, శ్రమిస్తూనే ఉంటారు. సుందర చైతన్యాశ్రమం అలసిపోయిన జీవితాలలో ఆశాదీపం కాగలదు. ఆ దివ్య వెలుగులో ఒక ఉజ్జ్వలమైన భవిష్యత్తును, మంగళకరమైన సమాజాన్ని మనం చూడగలం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. *The child is the father of the man* - 'వ్యక్తి యొక్క ప్రత్యేకతను అతని బాల్యమే చెబుతుంది' అన్న సూక్తి సుందర చైతన్యుని జీవితంలో అక్షర సత్యంగా రాణిస్తూ ఉంది. ఇంతటి మహోన్నత వ్యక్తి కనుకనే ఇతని బాల్యం ఆనాడే ఆధ్యాత్మిక సౌరభంతో గుబాళిస్తూ ఉండేది.

విచారము, అనుభవము, ప్రచారము - ఇదే శ్రీ సుందర చైతన్యుని బాట. చదివిన విషయాన్ని లోతుగా, తదేకంగా విచారణ చేయాలి. ఒకసారి విన్న దానిని పదే పదే మననం చేయాలి. అప్పుడే జ్ఞానం నిదిధ్యాసనలో స్థిరపడుతుంది. నిదిధ్యాసన లోనే సత్యదర్శనం సాధ్య

పడుతుంది. సత్యాన్ని దర్శించిన పవిత్రాత్ములు ఆ జ్ఞానాన్ని ఇతరులకు అందించి ఆనందించే ప్రయత్నం చేయాలి. ఇదే శ్రీ స్వామి వారు నడచి చూపే సనాతన ధర్మ బాట.

భగవద్గీతను నిత్యము అధ్యయనం చేయాలి. విష్ణుసహస్రనామమును నిరంతరం గానం చేయాలి. శ్రీకృష్ణుని సదా స్మరించాలి - ఇదే భగవత్సాక్షాత్కారానికి సూటియైన, సులభమైన మార్గం. శ్రీ శంకరులు చూపిన సాధన మార్గం ఇదే. శ్రీ సుందర చైతన్యులు శంకర మార్గానుయాయులు. వారు సదా, సర్వత్ర గీతా జ్ఞానాన్ని బోధిస్తూ సంచరిస్తూ ఉన్నారు. విష్ణుసహస్రనామ స్తోత్రానికి అమృతమయమైన వ్యాఖ్యను రచించి ఆ గ్రంథమును 'నామరత్నమాలిక' అను పేరుతో ముముక్షు లోకానికి అందించారు. ప్రతి పట్టణం లోను, పల్లెల లోను కరుణామూర్తి శ్రీ శ్యామసుందర మూర్తి ఆలయాలను అందంగా నిర్మించారు. ఇలా ఈ ఆధునిక స్వామి అతి ప్రాచీనమైన మన సంస్కృతీ సంప్రదాయాలను, పురాతన ఋషి వాఙ్మయాన్ని, సనాతన ధర్మ సందేశాన్ని ఆధునిక సమాజానికి అందజేస్తూ ఉన్నారు.

శ్రీ స్వామీజీ ఆధ్యాత్మిక సాహిత్యము అమృత జ్ఞాన సాగరము. లక్షలాది జనులు వారి గ్రంథాల వల్ల ప్రభావిత మవుతూ జీవితానికి కావలసిన స్ఫూర్తిని పొందుతూ ఉన్నారు. 'నామరత్నమాలిక' గ్రంథానికి వ్రాసిన పీఠికలో శ్రీ స్వామీజీ ఇలా అంటారు : 'బాల్యం నుండే విష్ణుసహస్రనామ స్తోత్రంపై నాకు ఎనలేని భక్తి, ఆసక్తి. ఎన్నో సంవత్సరాలు నేను దీనిని నిత్యము పారాయణ చేశాను. దీని భావాన్ని, వైభవాన్ని పదే పదే ఆస్వాదించి, ఆనందించాను. ఆ సహస్ర నామామృత ధారలు మెల్ల మెల్లగా కురిసి సున్నితమైన నా పసి హృదయంలో ఆధ్యాత్మిక అవగాహనను అంకురింప జేశాయి. నా శ్యామసుందరుని భక్తులు చరించిన పవిత్ర బాటలో నేను ఏరుకున్న జ్ఞాన సుమాలను ముముక్షు లోకానికి పంచాలనే స్ఫూర్తి, సత్సంకల్పము నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి. దాని ఫలితమే ఈ గ్రంథము. గ్రంథ రచన ద్వారా నా చిన్నారి ఉనికిని ఆ నీలమేఘశ్యాముని అనంత అస్తిత్వంలో విలీనం చేసి, ఆ ఆనందాబ్ధిలో ఓలలాడాలన్న తపనే గాని గ్రంథం పనిగట్టుకొని వ్రాయాలన్న ఉబలాటం నాకు లేదు. రచన ముగియడంతో పని పూర్తయింది. కానీ, పూజ కొనసాగుతూనే ఉంది'. స్వామీజీ వ్రాసిన ఈ వాక్యాలు ఆయన ఔన్నత్యానికి, ఆశయాలకు, ఆదర్శాలకు అద్దం పడతాయి.

గీతాధ్యయనం ద్వారా, సహస్రనామ పారాయణ ద్వారా, నిరంతర భగవత్స్మరణ ద్వారా ప్రపంచం లోకి పరుగులెత్తే మనసు అంతర్ముఖ మవుతుంది. వారి దివ్య బోధల ద్వారా శ్రీ స్వామీజీ మానవాళికి ఈ మార్గాన్నే నిర్దేశిస్తూ ఉన్నారు. రచనలలో, ప్రవచనాలలో భక్తి వేదాంతాలను ఇలా అందంగా, ఆచరణ యోగ్యంగా మేళవించి బోధిస్తారు శ్రీ స్వామీజీ.

కయ్యాలతో, గిల్లికజ్జాలతో, కులభేదాలతో, మత కలహాలతో రగిలి పోతున్న సమాజంలో వేదాంత అవగాహన మరియు ఆధ్యాత్మిక జీవనమే ప్రేమ పవనాలను వీచగలవు - శాంతి జల్లులను కురిపించ గలవు.

శ్యామసుందరుని ఆనందబాటను, ఆ దివ్యాత్ముని చైతన్య ధామమును లోకానికి సువిదితము, సుగమము గావిస్తున్న స్వామి సుందర చైతన్యానందుల వారికి జయ మంగళ మగు గాక! నిత్య శుభమంగళ మగు గాక!



శ్రీ సుందర చైతన్యానంద స్వామి స్థితి, ప్రబోధ ప్రభావము

శ్రీ పి.వి. నరసింహారావు, ఎం.ఎ.ఎల్.ఎల్.బి.,
రిటైర్డ్ ప్రిన్సిపాల్,
హిందూకాలేజి, గుంటూరు

శ్రీ సుందర చైతన్యానంద స్వామి స్థితి, భక్తిమార్గము ననుసరించి పవిత్ర భక్తాగ్రేసరులైన శ్రీకృష్ణ చైతన్య ప్రభువు, భక్త మీరాల వంటిది. వారికి శ్రీకృష్ణుని యందలి భక్తి గోపికలకున్న ఆరూఢ భక్తి. ఆయన శరీరమందలి ప్రతి అణువు శ్రీకృష్ణనామ స్మరణచే శక్తివంతమై జ్ఞానవంతమై, ప్రభావితమై, ప్రకాశవంతమై యున్నది. గాయకుడుగా, బోధకుడుగా వక్తగా, రచయితగా ప్రపంచము ఆయనను గుర్తించినా, శ్రీకృష్ణ భగవానుని సేవలో ఆ ప్రభుని దివ్య జ్ఞానామృతమైన, గీతామృతాన్ని ప్రజా బాహుళ్యానికి గీతాజ్ఞాన యజ్ఞముల ద్వారా ఉపన్యాస పూర్వకముగా అందించి, భక్తి జ్ఞాన ఉద్యమాలను ప్రారంభించి, విప్లవాత్మకముగా పెంపొందించి, లక్షలాది పామరులను, స్త్రీ, పురుషులను, భగవంతుని ఆశ్రితులుగా, నామస్మరణ యజ్ఞ నిర్వాహకులుగా, తుదకు భగవంతుని యెడల నిరంతర అనురక్తులుగా రూపొందించిన మహనీయ మహిమాన్వితుడు శ్రీ సుందర చైతన్యానంద స్వామి. తన బోధన విన్న ప్రతివ్యక్తిని భక్తి భావ బీజ సహితునిగాను, భగవన్నామ స్మరణ పారంగతుని గాను మార్చి వేయగల దివ్య రసాయనిక శక్తి శ్రీ సుందర చైతన్యానంద స్వామి.

భగవత్‌కథా శ్రవణాన్ని, సత్సంగమును, క్రియా రూపంలో, కార్యక్రమ, ప్రణాళికా బద్ధంగా చేయిస్తున్న సద్గురువు శ్రీ సుందర చైతన్యానంద స్వామి. అట్టి ఈ స్వామిని గాక వేరెవరిని అనుసరించాలి? కలియుగంలో సాధుస్వ రూపంలో భగవానుడు ఉండును. పరమ భక్తులు భగవంతుని విభూతులు. శ్రీకృష్ణ ప్రతీకలు, ప్రతిరూపములు. ఈ సత్యమే పాంచభౌతిక శరీరం ధరించి సాధు స్వరూపంలో మూర్తీభవించిన భక్తిగా, ఉపాధ్యాయుడుగా, బోధగురువుగా, శ్రీహరిని చేరుము అని ఉద్బోధించే తండ్రిగా, బ్రహ్మచర్య, నియమనిష్ఠలను సల్పుతూ, ఆచార్యుడుగా, గీతాచార్యుని ప్రథమశ్రేణి సేవకుడుగా మనందరికి అండగా,

మహత్తరమయిన ప్రేరణనిచ్చు స్వామిగా, సాంఘికసేవ, మాధవ సేవ చేయుచున్న మాన్యుడుగా, ప్రజలందరిని శ్రీకృష్ణ నామ గానలోలులుగా, వైతాళికులుగా తీర్చిదిద్దిన, దీక్షా కంకణబద్ధులు, శ్రీ సుందర చైతన్యానంద స్వామి.

శ్రీకృష్ణ పాదార్చకుడైన శ్రీ సుందర చైతన్యానంద స్వామితో నెయ్యము భవహరము, ఆనందదాయకము విధిగా కాగలదు. ఈ ప్రామాణిక యదార్ధానుసరణముగా శ్రీ సుందర సత్సంగంలో చేరి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, శ్రీ చైతన్యానంద ఉద్యమం ద్వారా భక్తి పథంలోకి చేరవలయును. ఈ నా విన్నపము పాఠకులు, భగవ దాశ్రితులు, భక్తులు ఆలోచించి, ఆచరణలోకి తేవాలి. స్వామి సుందర చైతన్యానంద వ్యక్తిత్వ, ఉద్యమ లక్షణాలను, నేను అవగాహన చేసుకొన్నాను. కాబట్టి, ఈ పై విశ్లేషణ, వారి వ్యక్తిత్వము అను అంశముగా చేసితిని.

ఈయన ప్రబోధము బ్రహ్మవిద్యా విలాసము. సాకార భగవత్ స్వరూపాన్ని మనలో జ్ఞాన మనోనేత్రముల స్థిరీకరించే అద్భుత ప్రక్రియ. వీరి ఉపన్యాసాలు, ఆయన పాండిత్య ప్రకర్షకు చిహ్నములు. స్త్రీ, బాల, వృద్ధులు, జ్ఞానులు, భగవదాశ్రితులు, ఆరాధకులు, నాస్తికులు గూడ శ్రీ సుందర చైతన్యానంద స్వామి భగవత్‌లీలా వైభవ వివరణను గురించి, చింతించటము మొదలుపెడతారు. ఈయన మహనీయ భక్తి ఉద్యమం ద్వారా సాధారణ మానవులకు ఆధ్యాత్మిక చింతన ఏర్పడినది.



లక్షలాది ప్రజలు, స్వామవారి బోధలకు ఆకర్షితులై, భక్తి ప్రాధాన్యాన్ని, జీవిత లక్ష్యాన్ని గ్రహించినవారై, సత్సంగసభ్యులుగా చేరి, ఆధ్యాత్మికతను పెంపొందించే ప్రయత్నంలో నిమగ్నులవుతున్నారు.

గిరిధారి పత్రిక ద్వారా శ్రీకృష్ణ అవతార స్వరూపాన్ని, అద్భుతలీలలను, జీవన్ముక్తుల, మహనీయుల జీవిత విశేషాలను ప్రజాబాహుళ్యానికి సతతము తెలియచేస్తూ, భక్తిభావానికి పుష్టిని, స్థిరత్వాన్ని చేకూరుస్తున్నారు. ఆ పత్రిక చదివిన వారికి, ఈ స్వామికి ఇంతటి పాండిత్యము, జ్ఞానము భగవత్ ప్రసాదితమేనని, ఒక మానవమాత్రుడు పొందగలిగి, ఆర్జించ గల్గినది కాదని విశదమవుతుంది. భక్తునికి, భగవంతునికి ఉండే సామీప్యాన్ని వృద్ధి చేస్తూ ఈ పత్రిక స్వామికి, ఆశ్రితులకు మధ్య ఒక దివ్య వాహినిగా విలసిల్లుతున్నది.

శ్రీ సుందర చైతన్యానంద స్వామి ప్రబోధము, కలియుగ మానవులకు తరించు మార్గము. వారిని అనుసరించుటయే ముక్తికి త్రోవ.

వాగ్దేవి గళ మాధుర్యం

సంగీత కళానిధి
శ్రీ నేదునూరి కృష్ణమూర్తి

నేను స్వామీజీ ప్రవచనాలు విన్నాను. ఆయన యొక్క ఆడియో, వీడియో క్యాసెట్లూ విన్నాను. నేను ఎంతో మంది మహాత్ములను చూశాను గాని ఆ వాగ్దేవి గళ మాధుర్యం శ్రీ స్వామివారిలో తప్ప మరెవరి లోనూ చూడలేదు. ఆయనలా మరెవ్వరూ పాడలేరు.

భక్తిని గురించి మన కందరకు తెలుసు. కాని ఆచరణలో మనం అశక్తులం అవుతున్నాము. స్వామీజీ ప్రవచనములు వింటున్నంత కాలం మనస్సు పవిత్రమైన అనుభూతిని పొందుతూ ఉంటుంది. ఆ తరువాత ఎల్లప్పుడూ బాధించే అరిషడ్వర్గాలు మనల్ని చుట్టు ముట్టేస్తాయి. బహుశా దీనికి కారణం శ్రవణం తరువాత జరగవలసిన మననం చక్కగా చేయటం లేదేమో అనిపిస్తోంది.

స్వామీజీకి కావల్సింది పొగడ్తలు కాదు. ఈ జన్మలో స్వామీజీ మనకు గురువుగా దొరికారు. స్వామీజీ అందించిన జ్ఞానంతో, ఆయన బోధలను అనుక్షణం జ్ఞాపకం ఉంచుకొని తదనుగుణంగా నడుచుకుంటామని మనం చేతులు జోడించి వినమ్రతతో తెలుపుకుంటేనే ఆయనకు సంతృప్తిని ఇస్తుంది. త్యాగయ్య, రామదాసు మొదలగు మహాపురుషులు మన ఆంధ్రదేశంలో జన్మించారు. శ్రీ స్వామీజీ కూడా ఆ కోవ లోని వారే.



జ్ఞానబ్రహ్మ సమాశ్రయామ

డా॥ శ్రీ దోర్బల ప్రభాకర శర్మ
ప్రిన్సిపాల్,
ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం,
కొవ్వూరు.

శ్రీమద్భాగవత ప్రబోధకలిత శ్రీకృష్ణ రాగారుణం
భక్తిజ్ఞాన విరాగ వాస్తవకథావిష్కార వాగ్భూషణం।
శ్రీ చైతన్యమనాది సుందరఘన స్వానంద ధామోజ్జ్వలం
జ్ఞానబ్రహ్మ సమాశ్రయామ శరణం సంసారిణాం తారణమ్ ॥ 1

విన్నంతమాత్రాన, మోక్షాన్ని ప్రసాదించే శ్రీమద్భాగవత తత్త్వాన్ని ఉపదేశించడం ద్వారా, శ్రీకృష్ణుని యందు త్రికరణ తన్మయ రూపమైన రాగభక్తి చేత, చిత్తం రాగరంజితం అయి, భక్తినీ, జ్ఞానాన్నీ, వైరాగ్యాన్నీ, పరమాత్మ విషయక యథార్థ జ్ఞానాన్నీ, అలంకార ప్రాయమైన వాక్కుల చేత ఆవిష్కరిస్తూ, సుందర చైతన్యరూపంగా విరాజిల్లుతున్న జ్ఞానబ్రహ్మని, మనం ఆశ్రయించి, సంసార తరణాన్ని పొందుదాం.

వేదాంతోపవనే సమన్విత శుభా ద్వైత ద్రుమప్రాభవే
చిద్వల్లీ వలితే విహార రసికం సాక్షి స్వరూపస్ఫుటం।
శ్రీ చైతన్యమనాది సుందరఘన స్వానంద ధామోజ్జ్వలం
జ్ఞానబ్రహ్మ సమాశ్రయామ శరణం సంసారిణాం తారణమ్ ॥ 2

అద్వైత జ్ఞానఫలాలు కలిగిన ఉపనిషత్తులనే ఉద్యానవనాల్లో శుభకరమై, ఉన్నతమైన, ఒక మహా అద్వైత వృక్షం శ్రీ స్వామి. సదసద్వివేక రూపజ్ఞానమనే తీగతో చుట్టుకో బడింది ఆ వృక్షం. అటువంటి లతాక్షితిరుహములు గల ఉపనిషదుద్యాన వనాల్లో ఏకైకంగా విస్తరించి సాధకులకు సాక్షీభూతంగా ప్రకాశిస్తున్న జ్ఞానబ్రహ్మ అయిన శ్రీ చైతన్యానంద స్వాముల వారిని, భవమోచనం కోసం మనం ఆశ్రయిద్దాం.

చిత్రాకారిత నిశ్చలాకృతి బహు శ్రోతృ ప్రవాహాంతర
ద్వీపాంభోజ విరాజమాన లలిత బ్రాహ్మీస్వరూపాంచితమ్।
శ్రీ చైతన్యమనాది సుందరఘన స్వానంద ధామోజ్జ్వలం
జ్ఞానబ్రహ్మ సమాశ్రయామ శరణం సంసారిణాం తారణమ్ ॥ 3

శ్రీ స్వామి ప్రవచన ప్రకర్ష, ఒక ప్రవాహం. దాన్ని ఆస్వాదిస్తూ శ్రోతలు చేష్టలుడిగి, చిత్రంలో వ్రాయబడిన బొమ్మలా అన్నట్లు తన్మయంగా ఉంటారు. ఆ ప్రవచన ప్రవాహం, సభ అంతా ప్రవహించగా, భక్తులైన శ్రోతలనే ప్రవాహము మధ్యన అందంగా ఉన్న ద్వీవం లాంటి విశాలపద్మం మధ్యలో ప్రకాశిస్తూ లలితమనోహరమైన, సరస్వతీ స్వరూపంతో ఆశ్రితుల్ని ఉద్ధరించే స్వామిని, మోక్షం కోసం మనం ఆశ్రయిద్దాం.



అభినందన మందారమాల

శతావధాని శ్రీ మాడుగుల నాగఫణి శర్మ

సీ॥ భాష్యాలు చెప్పెనా భాషా విశేషాంశ
బహు పురాణగ్రంథి పరిఢవిల్లు
కథలల్లి చెప్పెనా కమనీయ కల్పనన్
పుక్కిలి కథలకే పుట్టినిల్లు
వేదాన్త మర్మముల్ విప్పి విదల్చెనా
ఉపనిషత్తులు వేలు - ఓహరిల్లు
గళమెత్తి పాడెనా గమక సంగతులతో
స్వర సప్తకము జల్లు - వానజల్లు
శ్రీతో, సకల గుణైక
శ్రీతో, అధ్యాత్మ తత్త్వచేతో మహిత
ఖ్యాత పునీతము - సుందర
చైతన్యానంద రేఖ సర్వదిశాళిన్ 1

పంతొమ్మిది, పసి వయసున
పంతమ్ముగ జ్ఞానయజ్ఞ భాసుర రచనన్
సొంతమ్ముగ తెలిసెను - శ్రీ
కాంతుని దయ ఎంతగలదొ ఘనముగ మీపై 2

జ్ఞానమ్మును - శ్రావ్యమ్మగు
గానమ్మున రంగరించి - కమనీయ కథా
ధ్యానమ్మును జన - హరికిని
కానుకగా జేసినారు గానవిలోలా! 3

ఇంపైన గొంతు, ఆపై
సొంపులు గల మాటతీరు,
సోయగములలే
వంపుల జిలికెడు కవితలు
సంపదలై దొరుకు భక్త (శ్రోత్ర) జనముల కెపుడున్ 4

చెదరని చిఱునవ్వుల విరి
పదిలముగా మొగము నందు పరిమళ మొదవన్
ఎదిగిన కొలదిగ, ఒదిగిన
మృదుమూర్తివి కీర్తిశిఖర హిమ చైతన్యా! 5

ఆడంబర మెఱుగని ఘన!
నేడంబర మంటినావు నిఖిలాగమ వి
ద్యాడంబర చుంబనమున
నీడగ నిను గాచు - నీల నీరద తనుడున్ 6

ఈనాటి యాంధ్రదేశము
గానామృత వృష్టిఁ దడిసి, కడు మోదముతో
ఈ నిన్నుఁ బ్రస్తుతించెను
ధ్యానాయితగాన వేణుధర! చైతన్యా! 7

టీ.వీ. వచ్చెను, సినిమా
రీవుల్ తగ్గెను జనులకు రేవల్ మీరన్
మీవలన 'రెండు' తగ్గెను
జీవికి పరమాత్మ చింత చెచ్చెఱ హెచ్చెన్ 8

వందల కొలదిగ గ్రంథము
లందముగా రచనఁజేసి యందించిన - మీ -
సుందర చైతన్యము-రస
మందిర మని నుడువ వలదె మధుర నిధానా! 9

సద్గురు - పరమపూజ్య

శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారి కీర్తి మూర్తికి

వాక్సుమాంజలి

కళాప్రపూర్ణ
శ్రీ మరుపూరు కోదండ రామిరెడ్డి,
నెల్లూరు

శ్రీ సుందర చైతన్యానంద స్వాములవారు భారతీయ సనాతన ధర్మాన్ని మానవాళికి గరపి, ఆధ్యాత్మిక సామ్రాజ్య స్థాపనకు శంఖారావం పూరించి దివ్య సందేశాన్ని ప్రకటించారు. నిర్విరామంగా హిందూధర్మ ప్రచారం సాగిస్తున్నారు.



స్వామిజీ ఒక వ్యక్తి కాదు. ఒక మహోద్యమం. తపశ్శక్తితో, హిందూ ధర్మ పున ర్వికసనానికి అలుపు ఎరుగని కార్యదీక్షతో, తమ నామంలో ఉన్న చైతన్యా నందాన్ని ఆంధ్రావళికి అనుభవింప జేస్తున్నారు. ఇది వారిలో ఒక విభూతి. శ్రీవారు ఒక శక్తి ఉత్పాదకత యంత్రం వలె ఓ తేజస్సును పుట్టించి ప్రసరింప జేస్తున్నారు. భక్తావళికి ఒక సౌజన్యమూర్తియై, తమ చిరునవ్వు వెన్నెలలో ఆత్మజ్ఞానం ఉపదేశిస్తున్నారు.

ఇది ఆంధ్రుల భాగ్యం. జాగృతమయిన ఆంధ్ర జాతికి సుందర చైతన్యాశ్రమం ఆధ్యాత్మిక కేంద్రమై ఒక మహా వటవృక్షం వలె శాఖోపశాఖలై తెలుగు నేలలో ఊడలు దింపుకుంటూ పరచుకొని పోతున్నది. ఇది సిద్ధి వలన ఏర్పడిన ప్రసిద్ధి.

శ్రీ స్వామి వారిది మోడుల చిగురింపజేసే వక్తృత్వము. వారు బహు భాషా కోవిదులు; మదికెక్కి నాటుకొని పోయేటట్లుగా క్లిష్ట వేదాంత విషయాలను ఒక సెలయేటి గానం వలె గంభీర సుస్వనంతో చెప్ప గలిగిన వక్త వీరు. హిందూ ధర్మనిరతి, భక్తి మార్గము, ఆధ్యాత్మిక చింతనము వీరి ప్రచారం వల్ల పెరిగిపోతున్నవి. ఆ దివ్యవాణిని వినే దానికి ప్రజలు వేనకు వేలుగా సభలలో గుమికూడు తున్నారు.

ఒక ప్రక్క సంచారాలలో దివ్య సందేశ ప్రచారం గావిస్తూనే, స్వామీజీ మహరాజ్ ఆధ్యాత్మిక జ్యోతులయిన గ్రంథాలను తెలుగులో వ్రాసి తెలుగుజాతికి ఆధ్యాత్మిక భిక్ష పెడుతున్నారు. ఈ తీరిక, ఓపిక ఆత్మశక్తి పుట్టించినవే కాని అన్యాలు కావు. స్వామి వారి ఇంగ్లీషు, తెనుగు హస్తాక్షరాలు ఆణిముత్యాల వంటివి. ఈ రెండు భాషలలో కమ్మటి కవిత్వం చెప్పుచున్నారు. ఉపన్యాసాలు గాలికి పోతవి కాబట్టి, వాటికి నిలకడ కల్పించను "గిరిధారి" అను పత్రికను సాధకుల చేతులలో పెడుతున్నారు.

ఇది ప్రజలకు ఒక మహోపకారం. ఇట్టి పనులన్నీ స్వాములవారు ఒంటిచేతి మీదుగా చేస్తున్నారంటే, అది పరమఋషుల ఆశీర్వాదము ఆంధ్రుల పుణ్య పరిపాకం. స్వాములవారి సౌజన్య వీక్షణ ఛాయల ననుభవించిన వారు వారి ప్రసాదమును, ఆదరమును మరువలేరు. రానున్న శతాబ్దం హిందువులకు ధార్మిక శుభోదయం కాగలదు.

అక్షర కుసుమ పరాగం

శ్రీ జి.వెంకటేశ్వర్లు
తెలుగు లెక్చరర్, నల్లగొండ

పుడమి తల్లి పులకరించిన వేళ
ప్రకృతి కాంత పరవశించిన వేళ
దేవుని అంశంగా
జీవుని వంశంగా
భువిని అవతరించిన ఈ కవిభోజుడు రవితేజుడు!

అజ్ఞాన తిమిరంలో కూరుకున్న కూపస్థ మండూకాలకు
దీపస్తంభంలా నిలిచిన ఓ దినకరా!
దీనజనులను బ్రోచే ఓ అభయంకరా!
ఓ మానవాళి వరమా! మా నివాళి గొనుమా!

కొడిగట్టిన దీపంలా రెపరెప లాడుతున్న సనాతన ధర్మజ్యోతికి
మీరే వత్తిగా మారి, కత్తిలా చెలరేగి
భక్తినీ, ఆ భక్తిలోని రక్తినీ, శక్తినీ
చిత్తమునకు మత్తుగా హత్తుకునేలా
మీ వలె వ్యక్తీకరించుట అనితర సాధ్యం! అనన్య సామాన్యం!

మన ఆచారాలను, ఆచార్య లందించిన సమాచారాలను
యోచనతో విచారణ చేసి
జీవన తీరాలుగా
బ్రతుకు దారాలుగా, ఆధారాలుగా
అమృతధారల్లో చిలికించి, పలికించి, ఒలికించి
మా అంచనాలను మించి
మురిపించి, మరిపించిన విరించి విపంచి మీరు!

బ్రతుకు పారిపోయినా
భగవంతుడు జారి పోకూడదని
వెలలేని రీతిలో, వెలితిలేని రీతిలో
ఇలవేల్పుని కొలవాలని, తలవాలని
అలవోకగా సెలవిచ్చిన జ్ఞాన సెలయేరు మీరు!

వేదాంత తత్త్వాన్ని
ఉపనిషత్తుల మహత్వాన్ని
చిత్ర విచిత్రాలుగా
మాటలుగా, పాటలుగా
కాదు - కాదు, పూదోటలుగా ప్రవచించుటలో
మీకు మీరే సాటి
మరెవ్వరూ లేరు మీకు పోటీ.

వెలితిని తొలగించుకొని వెలుగును నింపు కోవాలని
దేహభావనను దైవంలో విలీనం చేసుకోవాలని
భగవంతుడే కొంగు బంగారమని
ముందుగా నిన్ను నీవు తెలుసు కోవాలని
అప్పుడే జీవికి మోక్షమని
దయా వీక్షణంతో, భక్ష్యాల వంటి సాక్ష్యాలతో
పరిపరి విధాల నిరూపించి
ఈ లోకంలో, ప్రజానీకంలో
ఏకంగా, అనేకంగా
అర్థం కానిది వేదాంతమని చెప్పుకొనే పిచ్చిభ్రమను
విభ్రమం చేసి
మీ వాణిని నిత్యసత్యంగా
మీ బాణిని ఆణిముత్యంగా
వినిపించిన కాంతి మీరు! దాంతి మీరు! సిద్ధాంతి మీరు!

ఇలా ఇలా, కలలో, మెలుకువలో
గుండె గుండెను కరిగించి
పిండి చేసిన ఓ కలకండా!
ఇక నుండి మీరే మాకు కొండంత అండ!
అందుకే నండి నా ఈ అక్షరాల దండ!

మా గుండె తలుపులను తెరచుకొని
మీ తలపులనే తలచుకొని
పరమాత్మను చేరేందుకు ప్రయత్నిస్తాము మహాత్మా!
ఆశీర్వదించు ఓ పరమాత్మా!

నమో డైనమో

శ్రీ వాకాటి పాండురంగా రావు
మాజీ డిప్యూటీ ఎడిటర్
'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రిక

కొన్నేళ్ళ క్రింద, ఒక ఆదివారం సాయంకాలం. మామూలుగా ఆదివారం అయితే ఇల్లు కదలని నేను, సికింద్రాబాద్ నుండి బస్సెక్కి టాంక్‌బండ్ దగ్గర దిగాను. దారి పొడుగునా అక్కడక్కడ "స్వామి సుందర చైతన్యానంద ప్రసంగం" అన్న పోస్టర్లు చూచాను.

బస్సు దిగాక ఒక గోడ మీద పోస్టర్‌ని దగ్గరగా చూశాను. ఎ.వి.కాలేజి అని ఉంది. దగ్గరే ఉండాలి అని కనుక్కుని వెళ్ళాను.

ఆ కాలేజి మైదానం తోరణాలతో కళకళలాడుతోంది. లౌడ్ స్పీకర్‌లలో నుంచి **'మన్దమ్ మన్దమ్ మధుర నినదై ర్వేణు మాపూరయన్తమ్'** అన్నట్లుగా భక్తిగీతాలు గాలిలో తేలుతూ చెవులను తాకాయి. కుడి వైపు పుస్తకాల కౌంటరు. దాని నిండా రకరకాల ఆధ్యాత్మిక విషయాల మీద స్వామి వారి పుస్తకాలను వాలంటీర్లు అమ్ముతున్నారు.

'ఇదేదో పెద్ద వ్యవహారమే', అన్పించింది. కొన్ని పుస్తకాలు కొన్నాను. వెళ్ళి జంపకానా మీద ఒక ప్రక్కగా కూర్చున్నాను. అరగంటలో మైదానం నిండిపోయింది. వేదిక మీద ఆర్భాటమైన అలంకరణ. పుస్తకం తిరుగ వేస్తున్నాను.

వేళయింది. వేదిక ప్రక్కగా కారాగింది. చకచక నడచుకుంటూ వేదిక నెక్కాడా స్వామి.

చూచాను.

బలమైన పొడవాటి మొహం. మెరిసే కళ్ళు. తలకో కాషాయాంబరం. నడవడంలో, కూర్చోవడంలో, శ్రోతలను అవలోకించడంలో ఒక రాజసం. ఒక విలక్షణత.

'ఓం' అన్నది వెయ్యివీణలు మంద్రస్థాయిలో మీటినట్లున్న ఆయన గొంతు.

ప్రార్థన, భజన, ప్రసంగం. కాలం తెలియలేదు. మాటలు - హిమవత్ పర్వత సానువుల నుండి ఉరకలు వేస్తూ వచ్చే అలకానంద గలగలలు!

మందలింపులు - హెచ్చరికలు - దారి తప్పుతున్న బిడ్డలను దారికి మళ్ళిస్తున్నంత కాఠిన్యరేఖలు!

విమర్శలు - గురి తప్పని బాణాలు! గీతాలు, మాధుర్య లాలిత్యాపాతాలు - హఠాత్తుగా ముగిసింది. అదే వేగంతో నిష్క్రమణ. ఈయనను మళ్ళీ వినాలి - అంది మనస్సు. మరుసటి రోజు అదే అనుభవం.

ప్రవచనం అయ్యాక ఆయన కారెక్కారు. దాని చుట్టూరా భక్తులు. నేను నా చేతిలో వున్న "దిక్సూచి" పుస్తకం ఎలాగో ఓలాగు కారు కిటికీ లోకి జారవిడిచాను. ఆపాటికే కారు వేగం పుంజుకుంది.

సికింద్రాబాదు పి.జి. కాలేజీ గ్రౌండ్స్‌లో భాగవత ప్రవచనం.

అసలే అది భాగవతం. రాసినవాడు మాటల కలకండల పోతన. ఆర్ద్రతతో, ఆవేశంతో, అర్థ గాంభీర్యంతో, అనిమిషులు తలలూపే మార్దవ మైన

గానంతో ఆ భాగవతాన్ని స్వామి సుందర చైతన్యానంద చెబుతుంటే వినడం చెవులకు, మనసుకు పెద్ద పండగే.

కృష్ణుడు నుండి కబీరు దాకా, స్తోత్ర రత్నావళి నుండి నిర్గుణ మానసపూజ దాకా శ్రీ సుందర చైతన్యులు వ్యాఖ్యానించని సనాతన సాహిత్యాంశం లేదేమో? అనిపించింది.

ఒక వైపు ప్రసంగాలు, ఇంకో వైపు పర్యటనలూ, మరొక వైపు రికార్డింగులు, హైదరాబాదులో టి.వి. ద్వారా తరగతులు, గీత పుస్తకాలు - ఈయన కాలెండరు లోనూ సంవత్సరానికి మూడువందల అరవై రోజులే కదా? రోజుకు **24** గంటలే కదా?

'భక్షిస్తూ కూర్చుంటే
భక్షింపబడుట తప్పదు.
కుక్షిని చల్లగా వుంచు.
అక్షిని మెల్లగా కదిలించు.
అడుగులు ముందుకు వేయి.
పిడుగులు పడినా వెనుకాడకు' అంటారాయన.

ఆ బాటలను తాను జీవిస్తూ అది గమనించలేని మనకు మళ్ళీ వివరించి చెబుతూ, చెప్పింది మరిచిపోతారేమో నని అచ్చు పోసిన అక్షరాలు మన ఎదుట వుంచుతున్నారు.

ఇది పుణ్యభూమి.
మనది సనాతన ధర్మం.
భూగోళం యింకా గోచీ కట్టడం నేర్వక ముందే దైవం మనుషుడై సంచరించిన అపురూపమైన మట్టి యిది.

ఆరని జ్ఞానదీపం యిది.

అయితే నేమి! దీపం క్రిందనే చీకటి వున్నట్లు మనం గుడ్డివార మయ్యాం. పొరపాట్లు చేస్తున్నాం. కరుణ, త్యాగం, సేవ, జ్ఞానం లాంటి వాటిని చిలకల్లా పలుకుతుంటాం తప్ప ఆచరించము. స్వామికి దండం పెడితే చాలు; ఆయన మాటలు వింటే చాలు; ఆచరించక పోయినా ఫర్వాలేదు అనుకునే అజ్ఞానం మనది!

అందుకనే ప్రతి శతాబ్దం లోనూ బధిరాంధక శవాలైన మనకు ప్రాణం పోయటానికి ఎందరో మహానుభావులు పుట్టారు. మన చెవి నిల్లు కట్టుకుని పోరారు. ఆ పుణ్యగంగా తరంగాలలో ఒక్కటి ఈ చైతన్య వాణి.

'నడిచే దారి
కదిలే కాలు
పారే నీరు' అంటారు సుందర చైతన్యానంద స్వామి.

ఆ క్రియా శబ్దాలు గమనించండి.
అన్నీ చైతన్యం నిండినవే. మన వెంటపడి, పాటల బెత్తం పుచ్చుకుని తరుముతున్న ఆధ్యాత్మిక డైనమో ఈయన! **నమో న్నమః**

స్వామీజీ ఆశీస్సులు భక్తులకు శ్రీరామ రక్ష

శ్రీ కె. ఈశ్వర్, మేనేజరు
శ్రీ శుకబ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తి

సర్వము తెలిసిన వారు, సర్వులకు ఆశీస్సుల నందించు వారు, సర్వుల బాధలు తీర్చేవారు, పూజ్యులు, చిన్మయ స్వరూపులైన శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారి పాదపద్మములకు నమస్కరిస్తూ, స్వామి వారిని గూర్చి మనసు లోని నాలుగు మాటలు.

స్వామి చెంత నుండగ
చింత ఎందుకు దండగ

అందరూ కోరేది చైతన్యమునే. అందరిని చైతన్యపరచే వారు పూజ్యులు శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారు. జగద్గురువులు, కారణజన్ములు, కరుణామూర్తులైన స్వాముల వారి ఆశీస్సులను అందుకున్న భక్తులలో నేను కూడా ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

స్వామి వారి జ్ఞాపక శక్తి అమోఘము. దశాబ్దాలు దొర్లించుకుంటూ వచ్చిన సంఘటనలను కూడా స్వామి వారు అవలీలగా చెప్పగలరు.



మద్గురుదేవులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద స్వాముల వారితో అతి సన్నిహితంగా మెలిగిన వారు శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారు. వెంకటగిరి పట్టణంలో ఉండిన సుందర చైతన్యులు ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు ఎదిగినారు. వారివి బాధలను తీర్చే బోధలు. వారిని సేవించిన వారు ధన్యులు. వారి ఆశీస్సులు భక్తులకు శ్రీరామరక్ష.

ఏమి మహిమో, ఎంత ఘనతో ఆ రోజుల లోనే భక్తులు శ్రీ స్వామి వారి బోధలు విని సంతృప్తి చెందేవారు.

ఆ నాటి నుండి నేటి వరకు శ్రీ విద్యాప్రకాశానంద స్వామి వారి గీతా సందేశము, శ్రీ సుందర చైతన్య స్వాముల వారి వేదాంత సందేశము వినుటకు విద్యార్థులు మొదలుకొని పండితుల వరకు, సామాన్యుల మొదలు అసమాన్యుల వరకు వేలాది మంది క్యూ కట్టేవారు. ఉపన్యాసాలు వింటున్నంత సేపు ఇల్లు, ఒళ్ళు మరచిపోయే వారమని భక్తులు చెప్తూ ఉండేవారు.

శ్రీ స్వాముల వారి ఆశీస్సులను కోరుతూ

కె. ఈశ్వర్

సుందర చైతన్య మహోదయ

వేద పండితులు
శ్రీ మేడవరపు విశ్వేశ్వర శాస్త్రి
ఉభయభాషా విద్వత్కవి

సీ. కృష్ణ భక్తిని చాటు, కృష్ణ గీతము పాడి
ఆనందమును గూర్చి ఆదరాత్మ
గీతార్థమును దెల్పి, గీర్వాణభాషలో
సౌందర్యమును దెల్పు సరస హృదయ
ధన్యాత్ములన్ జేసి, ధర్మోపదేశాన
దివ్యులనే జేయు ధీరవర్య
గోదావరీ దరిని గోవిందు నెలకొల్పి
వేదాంతమును దెల్పు విమల హృదయ

తే.గీ.॥ నీదు జన్మంబు ధన్యంబు నిక్కువంబు
నీదు బోధలు కృష్ణుని నిల్పు మదిని
నీకు సము లిల జగతిని నెందు లేరు
సుందర చైతన్య చోద్య మదిర!

కం. ఎందఱొ గీతాచార్యులు
అందఱ ధర మించినావు, అమరాంశుడవై
అందమగు నీ చరితము
పొందుగ గీతార్థ మయ్యె, పుడమిని భళిరే!

కం. సుందర కాండము వోలెను
సుందర మగు నీదు వాక్య సుందర గరిమన్
సుందర చైతన్యాఖ్యా!
అందముగ జూపినావు ఔరా యనగన్!

ప్రణామ శతము

ఏత ద్దేశ ప్రసూతస్య సకాశా దగ్ర జన్మనః
స్వం స్వం నిదేశం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః ॥

సాహిత్య శిరోమణి
శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, M.A.
తిరుపతి

'ఈ భారత భూమిలో జన్మించిన బ్రహ్మజ్ఞుదే భూమండలంలో మానవ జాతి కంతటికీ ధర్మోపదేశం చేయదానికి యోగ్యుడు'.

ఆ గురుపరంపర నేటికీ విచ్ఛిన్నం కాలేదు. అలా ఎన్నటికీ కాబోదు. ఆ పరంపరలో వచ్చిన ఒక గురువర్యులే పూజ్య శ్రీ సుందర చైతన్యానంద స్వామీజీ వారు.

శ్రీ బ్రహ్మచారి సుందర రాజన్ గా వారిని చాలా కాలం నుండి నే నెరుగుదును. భజనల తోనూ, భక్తి ప్రబోధాల తోనూ అశేష జనవాహినిని ఉ(ర్రూత లూగించ గల సామర్థ్యాన్ని పరమాత్ముడు వారికి ప్రసాదించాడు.

తమ పై ప్రసరించిన భగవ దనుగ్రహాన్ని స్వామీజీ వారు సంపూర్ణంగా వినియోగించుకొన్నారు. పూర్తిగా తమదైన ఒక కొంగ్రొత్త బాణీలో సాగిన ధార్మిక మహోద్యమంలో పరిపక్వత సాధించారు. నేడు శ్రీ సుందర చైతన్య స్వామిగా లక్షల కొలది జనులకు ఆరాధ్యమూర్తి అయ్యారు.

శ్రీ స్వామీజీ వారి మాటలూ, పాటలూ, వ్యాసాలూ, వ్యాఖ్యానాలూ, కవితలూ, సర్వతోముఖ వికాసాన్ని సంతరించుకొన్నాయి. అవి జనుల లోని జడత్వాన్ని పోగొట్టి, హృదయాలకు చైతన్యాన్ని సమకూర్చే పదునైన సాధనాలుగా రూపొందాయి.

శ్రీ స్వామి నిర్వహించిన గీతాయజ్ఞాలు ప్రజల అజ్ఞాన అంధత్వాన్ని పటాపంచలు చేశాయి. శరపరంపరగా వెలువదుతున్న గ్రంథాలు ఆధ్యాత్మిక జాగరణకు హేతువు లయ్యాయి.

ఈ రీతిగా శ్రీ స్వామీజీ కొనసాగిస్తున్న మహోద్యమం మూడు పూవులూ ఆరు కాయలుగా దినదినాభివృద్ధి పొందుతున్నది. అవ్యాహతంగా ఇది ఇలా సాగిపోయేటట్లు భగవాను దనుగ్రహించు గాక! హైందవ సమాజాన్ని పట్టి పీడిస్తున్న కులభేదాది రుగ్మతలు రూపు మాసిపోవు గాక!

నందతనయ భక్తాగ్రణీ!
సుందర వదనారవింద! శుభగుణ నిలయా!
సుందర చైతన్య యతీ!
వందనములు స్వామీ! సుజన వంద్య చరిత్రా!

సకల వేద సార సంగ్రహ మన జెల్లు
గీత విశద పరచి కృష్ణుని వలె
నరుల సంశయములు పరిమార్చు సుందరా
నందయోగి విజయ మందు గాక!

సృజనాత్మక రచనలతో
కుజనుల సుజనులను జేయు గురు బోధలతో
భజనలతో నఖిలాంధ్ర
ప్రజలను రంజింప జేయు స్వామికి జే జే!

జాడ్యమును హరించి, చైతన్యమును ఘటించు
ఆత్మతత్త్వ బోధ లంద జేసి,
భక్త జనుల నెల్ల ముక్తుల గావించు
స్వామీ! మీకు నా ప్రణామ శతము!

అభివందన మందార మాల

శ్రీ కొండమూరి వెంకటేశ్వర్లు
నెల్లూరు

1.సీ:శ్రీరంగనాథుని చిద్విలాసంబున
రంగనాయకి పుత్ర రత్న మీవు
అష్టమ గర్భాన ఆవిర్భవించిన
కృష్ణయ్య చందాన తృష్ణ దీర్చ
నెల్లూరు సీమలో నెలకొన్న బుచ్చిలో
భక్త జనుల పంట పండినట్లు
బ్రహ్మమూర్తము నందు బ్రహ్మతేజంబుతో
అవతరించిన స్వామి అంజ లిదిగొ!

ఆ.వె : వేంకటగిరి యందు వేడుతూ పాడుతూ
చిన్నతనము నుండె చిత్రగతుల
వరదరాజ స్వామి వరద హస్తంబుచే
వాంఛితంబు పొంది వరలి తీవు.

2.సీ : పందొమ్మిదేండ్లకే ప్రజ్ఞతో గీతపై
ఉపన్యాస మిచ్చిన ఒజ్జ వీవు,
శంకరాచార్యుల శాస్త్రాలెఁ జూచుచు
ఏకలవ్యుని భంగి విద్య నొంది,
ఆంధ్రదేశము నందు ఆధ్యాత్మ బోధలు
వెదజల్ల వలెనని వేడ్క తోడ
ధవళేశ్వరంబులో ధవళకాంతులుఁ జూప
ఆశ్రమంబు నిడిన ఆర్షఋషివి

ఆ.వె : సాధ నెట్లుఁ జేసి సాధించి నాడవో
కృష్ణ దర్శనంబు కృషితొ పొంది
మురళి కృష్ణదేవు మూర్తినే ధ్యానించు
మిమ్ముఁ జూచు జనులు ముక్తిపరులు.

3.సీ : కడపలో పొందితి కన్నుల పండుగన్
జ్ఞానబ్రహ్మ బిరుదు ఘనముగాను,
రాజమహేంద్రాన రాజువై బడసితి
విజయోత్సవంబును ప్రజలు మెచ్చ,
మెట్పల్లి సీమలో మోదంబు తీరంగ
గండపెండేరంబు తొడగినారు
మదగజారోహణన్ మాన్యులు చేసిరి
విజయవాటిక యందు వినతు లిడుచు,

ఆ.వె : కన్న తల్లి ఒడిలో కనకాభిషేకంబు
జరుపుకొనుట ఘనము, జ్ఞానబ్రహ్మ!
సింహపురము ఎంత చేసెనో భాగ్యంబు
మీకు జన్మ నిచ్చి మిగుల మురిసె

4.సీ : వేదాంత సభలకు వేలలో భక్తులు
పరుగు పరుగున వచ్చి పరవశింత్రు,
వేదాది గ్రంథాలు వేదికపై నుండి
విశదంబుగా దెల్ప వివశులైరి,
ఉపదేశసారంబు విపులంగా దెల్పి
జ్ఞానబోధను చేయు ఘనత మీది,
గళమెత్తి పాడిన గంధర్వులను మించు
కంఠంబు మీ కిచ్చె కంజభవుడు,

ఆ.వె : అష్టపదులు పాడి ఆర్తితో పలుకు, మీ
పలుకు చూడ మాకు కలుగు శాంతి;
సాధు పురుషులెల్ల సామూహికంబుగా
గురువు రూపమందు గోచరించె.

సుందర మణిహారం

డా॥ శ్రీ ధూళిపాళ మహాదేవమణి
ఎమ్.ఎ.(తె), ఎమ్.ఎ.(సం), పి.హెచ్.డి.,
రాజమండ్రి

యేనోద్బోధిత వైష్ణవేన భగవాన్ వ్యాస స్సదా స్మర్యతే
యస్మాద్రామ కథామృతేన సుమహాన్ వాల్మీకి రాక్షిప్యతే
యచ్ఛాస్త్రాంబుధి లంఘనేన మహతా సామీరి రౌపమ్యతే
తం శ్రీ సుందర చేతనాత్మక విభుం వందే కవీనాం కవిమ్ ॥

జన్మించిన ప్రతి మానవుడూ ఋణత్రయంలో ఒకటైన ఋషి ఋణం తప్పక తీర్చుకోవాలి. అందుకోసం ఆర్ష సారస్వతాన్ని ఉపాసించాలి. లేదా ఆ సారస్వతాన్ని ఔపోసన పట్టిన మహామహుల నుండి ఉపదేశ సారాన్ని గ్రహించాలి. అందుకోసం మనకు లభించిన జ్ఞాన చింతామణే శ్రీశ్రీశ్రీ సుందర చైతన్య స్వామి. మనం చేసుకున్న అదృష్టం శ్రీ స్వామివారికి సమ కాలీనులుగా పుట్టడం. పామరులకి సహితం ఆకర్షకంగా ఉండేలా శ్రీ స్వామి ఆధ్యాత్మిక తత్త్వాన్ని మనకి ప్రసంగాల రూపంగా, గ్రంథరాజాల రూపంగా, జ్ఞాన ప్రసాదంగా పంచి పెడుతున్నారు.

మనకు భగవాన్ వ్యాస మహర్షి ఎలా ఉంటారో తెలియదు. అక్కర లేదు కూడా. శ్రీ స్వామి సుందర చైతన్య విష్ణుతత్త్వాన్ని బోధించడంలో సాక్షాత్తు వ్యాసమహర్షే. స్వామి వారి బోధ వ్యాసమహర్షిని స్మరణకి తెస్తుంది. 'వేత్తి విద్యా మవిద్యాంచ' అన్నది భగవల్లక్షణం. ఏది జ్ఞానమో! ఏది అజ్ఞానమో! తెలియడం అన్న మాట. అందుకే మహర్షి వ్యాసుడు భగవానుడైతే మన స్వామీ అంతే.

ఇక ధ్యానంలో రసవల్లోకాన్ని దర్శించే ఋషే కవి. తాను ఎంత పవిత్రంగా, ఎంత రసవంతంగా దర్శిస్తాడో అంత పవిత్రంగానూ, అంత రసమయం గానూ సాహితీ వారసులికి పరమార్థాన్ని అందిస్తాడు. అందులో కవికోకిల ఆదికవి వాల్మీకి ఒకరు. వారి దర్శన లబ్ధమైన రామాయణ సుధని మనం అంతా ఆస్వాదిస్తున్నాం. స్వామి వారి రామాయణ ప్రవచనం వింటే మన కోసం ఆ కవి కోకిల చైతన్య రూపాన్ని ధరించి మళ్ళీ అవతరించారా! అనిపిస్తుంది.

కవి తన ఉదాత్త రమణీయ వర్ణనా నైపుణ్యం చేత, పాఠకుల్ని ఆహ్లాద పరుస్తాడు. అట్టి పరమ రమణీయ మార్గంలో మన స్వామి కవులకే కవిగా ప్రతిష్ఠింప బడ్డారు. ఆ విధంగా భక్తులకు విభుడైన స్వామి సుందర చైతన్యకు నమస్కరిస్తున్నాను.

అంజలి

కళాప్రపూర్ణ
డా॥ శ్రీ జ్ఞానానంద కవి

(పూర్వాశ్రమమున 'బ్రహ్మచారి సుందర రాజన్' గా పూజ్య స్వామీజీ జ్ఞానయజ్ఞములు చేయునపుడు 50 వ జ్ఞానయజ్ఞములో పాల్గొనిన శ్రీ జ్ఞానానంద కవి పూజ్య స్వామీజీని స్తుతిస్తూ రచించిన పద్య రత్నములు).



ఒక మహోన్నత భావ ముయ్యేల లూగ మీ
　　యెదయందు నొకనాటి యదనులోన
ఒక మహోజ్జ్వల రేఖ యొనిగి మీ నేత్రాల
　　ఛాయలో తిరుగాడి సైగచేసి
ఒక మహోద్ధృత శక్తి చక చక మని మిమ్ము
　　నడిపింప ముందుకు నడుగువైచి
ఒక మహోత్తాల సాంఘిక ధర్మ శిఖరి రే
　　ఖామాత్ర మీకు సాక్షాత్కరింప

ఉన్నదంత వీడి ప్రోన్నత ఋషి ధర్మ
పథమునందు నడుగు వైచినట్టి
శుభచరిత్ర! స్వామి సుందర రాజన్ భ
వత్పాదాబ్జములకు ప్రణతు లివియె 1

చిరుప్రాయమ్మున సన్యసించితిరి మాసీమల్ భవన్మాధురీ
వరగీతామృత గంగా నిరరులచే పండింప చైతన్య సుం
దరులై సుందర బ్రహ్మచారులయి సత్యాన్వేషణా మార్గబం
ధురులై దీక్షను గొన్న మౌనుల నుతింతున్ మిమ్ము నశ్రాంతమున్ 2

ధన్యంబైనది నిశ్చయమ్ముగ మహాంధ్రంబెల్ల నీ స్వామి చై
తన్యానందుని సాధుపుంగవుని యాదర్శంపు సన్మార్గ చై
త న్యౌజ్జ్వల్య ప్రబోధకున్ గనుట చేతన్ ధర్మదీక్షైక సౌ
జన్య శ్రీలిట నిండుగా వెలయు మీ సంకల్ప సంసిద్ధిచే 3

నిలిచెనా మీ మహోజ్జ్వల భావనారథ్య
కటివేల్పుదొర గీతికా రథమ్ము
వెలసెనా మీ మనోవీధిలో లోకమ్ము
నలరించు జయదేవు నష్టపదులు
తెలిపెనా మీ మేలు కొలువులో రామయ్య
యలఘు చరిత్రమ్ము తులసీదాసు
నిలిపెనా మీదు మంజుల కంఠసీమలో
అల కబీరుడు తనదైన పలుకు

లేని యెడల మీకు నీనాడు నెటులబ్బు
వారి దివ్యచరిత సారమెల్ల
స్వామీ! మీ చరిత్ర చైతన్య రూపమ్ము
భక్త వితతి కెల్ల ముక్తి పథము 4

అమృత ధునీ ప్రవాహములు నైతుల కించెడు మీ ప్రబోధ రా
జములు మహర్షిచంద్రుల ప్రసన్న మనోజ్ఞ మహత్త్వ సాధనాం
శములును వెంబడించెడివి స్వామీ! మమున్ నిరతమ్ము మీ కటా
క్షము మము సోకినన్ తనియ జాలుట యెంతది? సుందరేశ్వరా! 5



ఈ నాడు మీపాదరేణువుల్ తాకిన
ఈ నేల పున్నె మెంతేని లెస్స
ఈ వేళ మీలోని భావాలు వినినట్టి
జన బృందముల యదృష్టంబుగొప్ప
ఈ రోజు మీధర్మ సార వాక్కుల జుఱ్ఱి
గలుగుట మాదు భాగ్యమ్ము గాదె
ఈ దినమ్మున మీ మహా దేవతాశీస్సు
లందువారల పుణ్యమంత యింత

స్వామి సుందర రాజన్ భవత్పదమ్ము
లంటి నంతనె చెప్పరానట్టి దేదో
అమృతరస మహానంద లోకాంతరాల
కేగుచున్నట్టు లనిపించు నిది నిజమ్ము! 6

అమూల్య రత్న త్రయము

శ్రీ ఆర్.డి.ఎల్.నరసింహ మూర్తి
మచిలీపట్నం

(శ్రీ నరసింహమూర్తి గారు వేదాంత అవగాహనతో, సామాజిక స్ఫూర్తితో అనేక రచనలు చేశారు. గాయత్రీ పీఠాధిపతులు పూర్వాశ్రమంలో వీరి పితృదేవులు).



చైతన్య మహాభారతం గ్రంథాన్ని ఆంధ్రులకు అందించ టానికి స్వామీజీ చేసిన కృషి, దీక్ష అనన్య సామాన్యము, అనితర సాధ్యము.

పంచమ సహస్రంలో నడుస్తున్న కలియుగంలో - ఒంటి కాలు మీద దీనంగా నడుస్తున్న ధర్మదేవత కుంటిది అయ్యే దుస్థితి దాపురిస్తుంటే - గగనతలంలో పరితపించిన వాల్మీకి, వ్యాస భగవానుడు, ఆదిశంకరుడు - మళ్ళీ భూలోకంలో జన్మించి ధర్మోద్ధారం జరపాలని తలంచి - విడివిడి అవతారాలుగా గాకుండా, ముగ్గురూ ఒకే వ్యక్తిలో ఆవిర్భవించారు. అంతే! ఆర్షధర్మ విస్ఫోటం జరిగింది. తియ్యని తేట తెలుగులో పండిత పామరులను వశపరచుకునే అద్భుత రీతిలో మేను గగుర్పాటు చెందే లాగున - **చైతన్య భాగవతం, చైతన్య రామాయణం, చైతన్య మహాభారతం** - ఆదిశంకరుని శతాధిక వేదాంత గ్రంథాలు - ఆయన కలం నుండి జాలువారాయి. పోతన వలె - "వ్రాయించిన వాడు రామభద్రుడు" డనే భావంతో తాను కర్తను అనే స్పృహ లేకుండా అద్భుత సాహిత్య సృష్టి చేసిన ఆ వ్యక్తి మరి మన అందరి ఆరాధ్య గురువు శ్రీ సుందర చైతన్యానంద స్వామి కాదా?

చైతన్య మహాభారతం - తానే వ్యాసుడు - తానే వినాయకుడు అయి రచన సాగించారు శ్రీ స్వామిజీ. వ్యాస భారతంలో వినాయకుడి కోసం 'వ్యాస ఘట్టాలు' ఉంటే - చైతన్య భారతంలో ఆయా సందర్భాలలో పుట్టే శంకలకు, కుశ్శంకలకు సమాధానంగా ఎక్కడ అవసరం ఉంటే అక్కడ 'చైతన్య ఘట్టాలు' నడిపి విశదీకరించిన తీరు చాలా అద్భుతం. ఇంకా లోతుగా పరిశీలిస్తూ ముందుకు పోతే ఎటువంటి ఆణిముత్యాలు దొరుకుతాయో అనిపిస్తుంది. చదువుతుంటే పరిసరాల భావన ఉండటం లేదు. చైతన్య రామాయణం నీలంగా, చైతన్య భాగవతం కెంపుగా భాసిస్తే - చైతన్య మహా భారతం వజ్రంగా భాసిస్తూ సనాతన ధర్మ కిరీటం వెలుగొందుతోంది.

అక్షరాంజలి

సాహిత్య కళాసాగర
డా॥ శ్రీ వక్కలంక లక్ష్మీపతిరావు
ఎమ్.ఎ., పి.హెచ్.డి.

తెల తెల్లని చిరునవ్వుల నల నల్లని ఓ స్వామీ!
ధన్యత మా! సుందర చైతన్యానంద స్వామీ!
ఒక వివేకానందు డొకక్రీ స్తొక్క కృష్ణుడు ఒక్కరూపై
నీవయైనా వని తలంతురు నిన్నెఱింగిన భక్త జనములు
కృష్ణమస్ పర్వమున పుట్టిన విశ్వమోహన కృష్ణరూపా!
జలద గంభీర స్వనా! నిర్దళిత పాపా! శమిత తాపా!
కిల్బిష హత లోకమునకు గీతాచార్యుడవు నీవు!
వాణీ మృదు వీణా నిక్వాణల సద్గళుడ నీవు!
సంస్కృతాంధ్రాంగ్ల సాహిత్య వేదాంతాబ్ధి
నాపోశనము పట్టినట్టి జ్ఞానివి నీవు!
పదియునై దవ యేట పడసినావట తల్లి
కడ నుండి ఆధ్యాత్మిక స్ఫూర్తి అయ్యారె!
విద్యార్థి దశ యందె ఉపనిష చ్ఛాస్త్రములు
కరతలామలకములు కావించుకొన్నావు!
పందొమ్మిదవ యేట ప్రథమ గీతాజ్ఞాన
యజ్ఞ మొనరించి నూరు పూర్తి చేసితివట
సుందర చైతన్యాశ్రమ మందిర నిర్మాణముచే
ధవళేశ్వర పురము పునీతముగ చేసితివి స్వామీ!
అదె సరస్వతి సదన మనెడు పఠనాలయము
అవె అతిథిగృహము లయ్యదియె బృందావనము

తే.గీ. సజ్జనోత్తముఁ డాస్తిక చక్రవర్తి
ఆ గవర్నరు శంకర్ దయాళు శర్మ
కనుచు నుండ శ్రీకృష్ణ విగ్రహము నిలిపి
ఇచ్చోట సమ్మోహన మ్మొనరించినావు!
వివిధ పర్వముల నీ వేదాంత బోధలును
భజనలును సాగు నీ భవ్యాశ్రమము నందు
శంకరాద్వైత భాష్యము సులభమొనరించి
గ్రంథ దానము చేసి జ్ఞాన మందింతువట!
రంగనాథానంద పొంగినాడటనె నీ
విష్ణుసహస్రనామపు భాష్యమును చూచి
బ్రతుకెల్ల పరుల సేవకె అంకితము చేయు
బ్రహ్మచారి ప్రభూ! స్వామీజీ! జోహారు!
ఈ ధవళేశ్వర మ్మెంత ధన్యమొ కదా!
నీయుపన్యాసములు నిరతమును వినుచుండు!

ఈ గౌతమీ తీర మేమి పుణ్యము చేసె
నీ పాదముద్రలను నిలుపు నెదపై సదా!

తే.గీ. తినవలయునన్న గారెలే తినవలయును
వినిన నీ యుపన్యాసమే వినవలయును
శర్కరయు జుంటితేనె ద్రాక్షారసమ్ము
అమృత గంగయు నీ గళమందుఁ గలవు!

అట్టుల జ్ఞానభిక్షగొని ఆంధ్రమహాజన శిష్యకోటి నీ
పుట్టిన రోజు పండుగలు పుట్టెడు వేడుకతోడ చేయగా
అట్టిటు-పండరీపురము అంతరవేదియు వంటి క్షేత్రముల్
ఇట్టి మహస్సు కాంచుటకు ఎంతటి పుణ్యము చేసికొన్నావో!

సుందర మందారాలను అందించిన ఓ స్వామీ!
సుందర లేఖావళితో డెందము దోచిన స్వామీ



చంద్రభాగా తరంగాల స్వాంతములను తేల్చు స్వామీ!
నవ్వుచు బ్రతుకుట నేర్పెడు పువ్వు వంటి నీకు నతులు!
సప్త దశ గ్రంథములు వ్రాసి మది విరియించిన జ్ఞానీ!
శత సహస్ర వర్షములిట చిరంజీవివై యుండుము!

ఎద యెదలో వేణువూది యెదలు గోపికలుగ చేసి
ఎటకో పోయెడు స్వామీ! ఎద ఎదలో నిలుచు స్వామీ!

తెలతెల్లని చిరునవ్వుల నలనల్లని ఓ స్వామీ!
ధన్యత మా! సుందర చైతన్యానంద స్వామీ!

సుగమ సుందర నిగమాంత బోధనానందులు
శ్రీమత్ స్వామి సుందర చైతన్యానందులు

శ్రీ శారదా కుమార్
నెల్లూరు

'మానస సంచరరే బ్రహ్మణి మానస సంచరరే'

ఇది శ్రీ సదాశివేంద్ర సరస్వతీ అవధూత రచించిన కీర్తన.

శ్రీకృష్ణబ్రహ్మ సోయగాలను రసరమ్యంగా గానం చేశారు వారిందులో. మహామహితాత్ములైన అద్వైతసిద్ధులు శ్రీ సదాశివేంద్రులు తమిళనాట కరూరు దగ్గరనున్న నెరూర్‌లో సమాధి పొందినట్లు ఐతిహ్యం. అక్కడి శివాలయం వెనుక వైపున వున్న బిల్వవృక్ష మూలాన్నే సమాధిగా నేటికీ అర్చిస్తున్నారు ప్రజలు.

మన స్వామి సుందర చైతన్యానందులు ఏ దివ్య ముహూర్తాన ఆ మహిత సమాధిని సందర్శించారో, ఏ విధమైన అనుభవాన్నీ, ఆశీస్సునూ అక్కడ పొంద గల్గారో గాని వారి జీవిత గమనంపై చెరగని ముద్రే పడింది. ఒకటి మటుకు మన కందరికీ తెలుసు. నిగమాంత బోధకాలూ, ముక్తి సాధకాలూ అయివున్న శ్రీ సదాశివేంద్రుల కీర్తనలపై మన స్వామికి అపారమైన ప్రేమ. నెల్లూరు వి.ఆర్.కాలేజీ హైస్కూలు ఆవరణలో ఒక అపూర్వమైన కీర్తనా సప్తాహం నిర్వహించారు స్వామీజీ **1989**లో. శ్రీవారి కీర్తనలను పాడుతూ వారు పొందిన తన్మయత్వం ఒక వైపూ, శ్రోతలకు వారందించిన అనిర్వచనీయానుభూతి మరొక వైపూ - ఆ ఏడునాళ్ళూ ఓ తిరునాళ్ళుగా జనం స్వామివారి వేదాంతోపన్యాసాలను ఎగబడి విన్నారు. ఇంతకు ముందు అదే జనం అదే కీర్తనలను వినక గాదు, గానకళా కోవిదులు యిష్టంగా పాడి వినిపించగా విన్నవే అవి. శ్రీ అవధూతవారి కీర్తనల మాధుర్యం వెనుక దాగి వున్న అర్థ గాంభీర్యాన్ని ఆర్ద్రంగా, సుహృత్ సమ్మితంగా, రసజ్ఞ మనోజ్ఞంగా స్వామి వలె విడమరచి చెప్పే ఆ ప్రతిభ అనితరసాధ్యమని నెల్లూరీయులప్పుడు గుర్తించ గల్గారు. శ్రీ సదాశివేంద్రుల వారి ప్రత్యేక ప్రేముడికి నోచుకున్న మన స్వామి ధన్యతములు. 'ఆత్మవిద్యావిలాసం' అను శ్రీ సదాశివేంద్రుల గ్రంథానికి స్వామి ప్రతిభావంతమైన వ్యాఖ్యానాన్ని సంతరించడము అజ్ఞాన తిమిరాంధులకు జాజ్జ్వల్యమాన మైన జ్ఞానదీపిక నందించి తరింప జేసేందుకే.

నెల్లూరులో మళ్ళీ **1994**లో స్వామి భాగవత సప్తాహాన్ని నిర్వహించారు అదే ప్రాంగణంలో. ఎంత గొప్పగా శ్రోతలను ఆకర్షించాయో, వారి హృదయాలను కైవసం చేసుకున్నాయో - స్వామి ప్రసంగాలు వర్ణించలేము. వ్యాసభగవానుని భాగవతాన్నీ, పోతనామాత్యుని తెలుగు భాగవతాన్నీ ప్రాతిపదిక చేసుకొని జ్ఞాన యోగ భక్తి యోగ రహస్యాలను వింగడించిన సందర్భంలో ఉపనిషద్విజ్ఞానాన్ని మేళవించడమే గాక సంత్ పురుషులైన తుకారాం, నామ్‌దేవ్, ఏకనాథ్, నర్సీమెహతా, సూరదాస్, తులసీ, మీరాల మధురతమ గీతాలను తమకంతో, రసరమ్యంగా గానం చేస్తుండేవారు. స్వామి గళం దివ్యమంగళంగా స్వరలయలను పలికించడమే కాదు, యువతకు వెర్రెక్కించే వరుసలలో పాడి సభను రంజింపజేసేవారు. ప్రవచన బ్రహ్మ కూడా ఐన జ్ఞానబ్రహ్మ మన స్వామికి శ్రోతృహృదయ స్పందన కరతలామలకమే. 'ఇదిగో చూడండి' అన్నట్లు, కాళియ ఫణిఫణాలపై నర్తిస్తున్న శ్యామసుందరుని ముగ్ధమనోహర మంగళమూర్తిని దర్శింపజేసి ఆనందాశ్రువులు రాల్చుతున్న శ్రోతలతో వారూ కన్నీరు కార్చేవారు. ఈ బండరాళ్ళ లోనూ సాత్త్విక భావసంపద వుంటుందా అని ఆశ్చర్యచకితులను చేసేవారు. ఇలాగే పూతన, తృణావర్తుడు, శకటాసుర, ధేనుకాసురుల ప్రవేశాన్ని వర్ణిస్తూ శ్రోతలలో కన్నయ్యకు జరుగబోవు ప్రమాదాన్ని గూర్చిన ఉత్కంఠనూ, దుఃఖాన్నీ రేకెత్తించేవారు. వక్తకు ఎన్నెన్ని శక్తులుండేందుకు అవకాశం ఈ లోకంలో వున్నదో

అన్ని శక్తులూ స్వామి అధీనంలో వున్నాయని భక్తులనుకుంటూ వుండేవారు.

లక్షలాది శ్రోతలను తమ అరచేతిలో వుంచుకొని ఆడిస్తున్నారే, వారి హృదయ స్పందనలను తమ యిష్టారాజ్యంగా నియంత్రిస్తున్నారే, ఇది ఎలా సాధ్యమైంది? స్వామి చేసిన ఏ అమోఘ తపస్సు యిలా ఫలించింది? శ్రీ పండరి విఠలుని అకుంఠిత భక్తితో సేవించినందువనా? శ్రీ వ్యాస భగవాముని భక్తి వేదాంత గ్రంథాలను అలవోకగా ఆకళింపు జేసుకున్న ఫలితంగానా? శ్రీమత్ శంకర భగవత్పాదుల ప్రార్థన త్రయామృతాన్ని జుర్రివున్న కారణంగానా? ఊరూ - వాడా తేడా లేక తెనుగు నేలను 'ఓం నమో భగవతే వాసుదేవాయ' మహామంత్రంతో మారో్మగింప జేసిన మహా పుణ్యఫలం యిలా పరిపక్వమైందా?

ఇవన్నీ కారణాలే. కాని, మూల కారణం ఒకటే. వాసుదేవ పరాయణత స్వామి ఊపిరి. బద్ధజీవుల స్థితి పట్ల కాతురత యీ నారాయణ పరాయణునికి అత్యంత సహజమైనది. ఇలా అన్యవిషయ విస్మారణం, ఏకాత్మనిష్ఠ స్వామి కిప్పుడు ఒక సహజాతంగా మారింది. ఇప్పుడు వారు చేయగలిగిందేమీ లేదు. వాడు ఆడించినట్లు ఆడడమే, పలికించినట్లు పల్కడమే. ధారకమూ, పోషకమూ, భోగ్యమూ స్వామికి తమ ఉపాస్య దైవము నల్లనయ్యయే. 'నాన్యత్ పశ్యతి నాన్యత్ శృణోతి' ఇత్యాది శ్రుతివాక్యాలు స్వామిలో సార్థకతను పొందాయిప్పుడు.

తన తోబుట్టువులైన ఆంధ్ర ప్రజావళికి చతుర్విధ పురుషార్థ సిద్ధికై 'మీరు మనసు పెట్టి చదవండ'ని విశ్వజనీనమైన శతాధిక గ్రంథాలను రచించి ప్రచురించారు స్వామి. ఈ గ్రంథాలన్నింటా స్వామి ఉపజ్ఞకు సాటిగా నిల్చేది స్వామి అమోఘ ప్రజ్ఞ. ఒక విశేషం ఏమంటే, స్వామి విరచించిన యిన్ని గ్రంథాల లోనూ ఆది గ్రంథంగా ఎన్నదగినది 'నామరత్న మాలిక' అను అన్వర్థ నామం గల 'విష్ణుసహస్రనామమే'. ఈ గ్రంథం లోని విషయ పరిజ్ఞానమూ విజ్ఞానమూ ఒక ఎత్తు, ఆపై వచ్చిన వాటిలోని భావాలన్నీ మరొక ఎత్తు. అన్ని గ్రంథాల కృత్యాద్యవస్థ యీ మాత్ర గ్రంథంతో తీరిపోయి యిక అనాయాసంగా రచనలు పుంఖాను పుంఖంగా వెలువడ్డాయి. స్వామి భక్త్యున్మాదంతో రచించిన మరో గ్రంథరాజం ప్రధానంగా మహారాష్ట్రలో జన్మించిన సంత్ మహాత్ముల జీవిత గాథలున్న 'చంద్రభాగా తరంగాలు'. ఇది వినయంగా చదివి అనయమూ మననము చేసుకోదగ్గ భక్తిరసమయమైన ఉద్గ్రంథం. దీని లోని గాథలకు ప్రతిస్పందించని గుండె ఒక చట్టుబండ.

జన్మతః వైష్ణవ మతావలంబులైన స్వామికి ఆదిశంకరుల పట్ల ఎనలేని భక్తి. ఆచార్యపాదుల ప్రకరణ గ్రంథాలకు స్వామి సంతరించిన వ్యాఖ్యానాలు ప్రతిభా పూర్ణములుగా, సుగమ మనోహరములుగా వున్నాయి. శాంకర అద్వైత వేదాంత విజ్ఞానము స్వామికి ప్రాణము. ఇంకా, వాల్మీకి మహర్షికీ, వ్యాస భగవానులకు భక్త్యంజలిగా రామాయణ భాగవతాలను పునర్వచించడ మొక అపూర్వ ప్రయోగం. హృదయస్థానీయమైన కథాంశాంలనూ, తాత్త్విక భావనలనూ స్వామి పొల్లు పోకుండా తమ యీ గ్రంథాలలో జాగ్రత్త వహించారు. ఇక ఔపనిషద జ్ఞానవారాశిని ఆపోశనం పట్టిన అపర అగస్త్యులు స్వామి. పంచకోశ విచికిత్సనూ, అవస్థాత్రయ విశ్లేషణనూ, పంచీకరణ విధానాన్నీ కరతలామలకం చేసుకుని వున్న స్వామి వొలిచిన అరటిపండు వలె వీటిని శ్రోతల నోటి కందించగలరు.

'జ్ఞాని కేవలం పాలను చూడడం తోనే సరిపెట్టుకున్న వానిని పోలినవాడు. విజ్ఞాని పాలను త్రాగి అరిగించుకొని, బలవంతుడైన వాడిని పోలినవాడు' అన్నారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. గీతలోనైతే పరిభాష మార్పు వల్ల స్థితప్రజ్ఞు డన్నారు. జీవన్మృతుల వలె బ్రతుకీడుస్తున్న తోటి జీవులకు యిలా వేదాంత విజ్ఞానాన్ని పొంది జీవన్ముక్తులై బ్రతకండని హితవు చెప్పడం విజ్ఞాని లక్షణం. విజ్ఞానము లేక మానవప్రేమ లేదు. ప్రేమ వినా నిజమైన మానవసేవ సాధ్యపడదు.

తమ దయా శతకం లోని 'మృదు హృదయే దయే' అని ఆరంభమయ్యే శ్లోకంలో శ్రీమద్వేదాంతదేశికులు 'బుధేషు వితతాత్మధురే' అని వాడడం జరిగింది. దయాదేవి (లక్ష్మీదేవి) తాను నిర్వహించవలసివున్న జీవపాలనము అనే బాధ్యతను విజ్ఞానులపై (బుధులపై) వుంచి వారిచే ఆ పని నిర్వర్తింపజేస్తుందని వాక్రుచ్చారు. ఆత్యంతికమైన జీవపాలనం మోక్ష ప్రదానమే కదా!

సంవిత్సంపన్నులైన స్వామివారు ప్రజ్ఞా పాటవం తోనూ, వ్యుత్పన్నతాతిశయం తోనూ ఇట్టి ప్రబోధ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జీవోద్ధరణానికి బద్ధకంకణులై వున్నారన్నది వున్న మాటయే. అత్యుక్తి కాదు. భగవత్కారుణ్యావతారులైన మన స్వామికిది అత్యంత సహజకార్యమే అవుతుంది.

భగవద్గీత 18వ అధ్యాయంలో భగవాన్ గీతాబోధను చేస్తున్న వారు తమకెంత ప్రియులో స్వయంగానే చెప్పి వున్నారు.

బద్ధజీవులకు విముక్తి ధర్మాచరణమనే రాజబాటలో ప్రయాణించడం ద్వారానే లభిస్తుందని సూచిస్తారు స్వామి. చిత్తశుద్ధి లేక జ్ఞానప్రాప్తి లేదు గనుక ధర్మాచరణం ముక్తికి ఆవశ్యక మంటారు వారు. రాగద్వేష భయాలతో కొట్టుమిట్టాడుతున్న మనిషి స్వరూపతః శుద్ధ సత్త్వ స్వరూపుడైన శ్రీహరి దరిజేరగలడా? సత్య ధర్మ పరాక్రముడై, శాశ్వతధర్మగోప్త అయిన పరమాత్మ ప్రాపును పొందగలడా? గీతలో చెప్పబడిన 'నివశిష్యసి మయ్యేవ' అను హామీ ఒక అధర్మ పరాయణునికి అన్వయిస్తుందా? దుష్ట శిక్షణార్థ మవతరించిన నందనందనుడు దుశ్శాసనునికి తోడ్పడగలడా? అధర్మశీలునికి భగవదాభిముఖ్యం కల్గనేరదు. ముఖ్యంగా రామాయణాన్ని పునర్వచించడంలో స్వామి ఆంతర్యం యిదే అనుకోవాలి. సాత్త్విక స్వభావమూ, ధర్మనిష్ఠా తోబుట్టువుల వంటివి.

జ్ఞానబోధ విషయంలో స్వామి కమిట్‌మెంట్ (నిబద్ధత) అసమానమైనది. నెల్లూరు లోనే భగవద్రమణుల 'ఉపదేశసారం' అను 30 శ్లోకాల గ్రంథాన్ని పదిరోజుల పాటు కూలంకషంగా విడమరచారు. ఈ బోధన ద్వారా స్వయంగా తామూ ఉన్నతిని పొందుతున్నా నంటారు స్వామి.

స్వామి చక్కని ఉపమానాలతో, ఉదాహరణలతో గదా వుపన్యసిస్తారు! ఇవి గంభీరమైన వారి లోకజ్ఞతకు నిదర్శనాలుగా వుంటుంటాయి. అవసరమైన చోట రవన్ని చురకలు అంటించకుండా వూరుకోరు. అత్తాకోడళ్ళ సమస్యే తీసుకుని స్వామి ధర్మమార్గమే దానికి పరిష్కార మార్గమని చెబుతారు. 'నీ కూతురిని చూచే విధమూ, నీ యింటి కోడలిని చూచే పద్ధతికీ యింత తేడా అధర్మమని' అత్తలనూ, 'మీ అమ్మ విషయంలో ఒక రీతిగా, మీ అత్త విషయంలో మరొక విధంగా వుండటం సబబేనా?' అని కోడళ్ళనూ సభ అంతా నిశ్చేష్టమై వినే విధంగా బుద్ధి గరపుతారు. ఇటువంటివి ఎన్నైనా పేర్కొనవచ్చు.

రథస్థుడైన పార్థుడు తన ముందున్న కేశవుని చూస్తూ విజృంభించినట్లే సుందర చైతన్యానందులు తమ ఎదుట నున్న శ్యామసుందరుని మంగళ మనోజ్ఞమూర్తిని దర్శిస్తూ వేదికపై విజృంభిస్తారు. లోకాధ్యక్షుడే స్వామి సభల కిప్పుడు అధ్యక్షుడు కావడం ఆనందదాయకం. వచ్చీరాని కచ్చా వేదాంతాన్ని వేదికపై నెక్కి వినిపించే అధ్యక్ష బ్రువులుండరు గదా!

పిల్లనగ్రోవి గాని, వయొలిన్ గాని తమలో నుంచి ప్రసరిస్తున్న మధుర మంజులనాదం ఎలా ఏర్పడి వెలువడుతున్నదో తెలుసుకోలేవు. అవి జడవస్తువులు. ఆనంద సదుజ్జ్వల చిన్మయమూర్తి ఆ గిరిధారి తన చేత పల్కిస్తున్న తీరుకు మురిసిపోయే అవకాశం స్వామి కున్నది. పలికేది స్వామి పలికించేది వాసుదేవ పరమాత్మ. నిమిత్త మాత్రులై వుంటూ యీ మహనీయు భగవల్లీలను అనుభవిస్తున్నారు స్వామి. లోక సంగ్రహ తత్పరులై నిష్కామ బుద్ధితో అహోరాత్రులు - జనతా రూపంలో కన్పిస్తున్న - హరిని సేవిస్తున్నారు.

'స్వయం తీర్త్వా పరాంస్తారయ' అను విధివాక్యాన్ని ఉపలక్షించియే స్వామి 'విచారము - అనుభవము - ప్రచారము' అను మహదాశయాన్ని ఎన్నుకొని స్పష్టమైన అవగాహనతో, తమ అపూర్వ నిబద్ధతతో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

ఇంత చదివీ, ఇంత నేర్చీ, ఇంత వ్రాసీ, ప్రవచించీ, ఇంతటి ఖ్యాతి నార్జించీ స్వామి ఏ మాత్రమైనా గర్విస్తున్నారా? లేదు. అప్రతిమాన ప్రతిభా భాస్వంతు లైనప్పటికీ, ఉపజ్ఞాతిశయము తోడై వున్నప్పటికీ, స్వామి లోని వినయశీలత అణు మాత్రమైనా చెక్కు చెదరలేదు. 'మహాత్ముల ఉచ్ఛిష్టాన్ని నెత్తిన వుంచుకుని ఇలా వూరూరా తిరుగుతున్నాను' అని సభలో పల్కడం స్వామికే చెల్లును. నిగర్వత కిది గదా పరాకాష్ఠ!

స్వామి లోని ప్రధాన లక్షణం దుఃఖిత జీవుల పట్ల ప్రేమ పూర్వకమైన అసహిష్ణుత. న చ ధర్మో దయాత్పరం' దయకు మించిన ధర్మం లేదు అను శాస్త్రోక్తి ననుసరించి స్వామి అజ్ఞాన నివృత్తి ద్వారా ఆత్యంతిక దుఃఖ నివృత్తికై వేదాంత సత్యాలను దాపరికం లేకుండా వ్యాప్తికి తెస్తున్నారు. భక్తి ప్రచారం పేరుతో సాత్త్వికతనూ, ధార్మిక, తాత్త్విక అవగాహననూ సంఘాలలో విస్తరింప జేస్తున్నారు.

జ్ఞానబ్రహ్మ, ప్రవచన వాచస్పతి అయిన స్వామి సుగమ సుందరంగా వేదాంత బోధనలను నల్గడలా వెదజల్లుతూ వున్నారు. ప్రేమమూర్తి యైన స్వామికి ఇదే నా ప్రేమాంజలి. స్వామి మంగళకరమైన జీవయాత్ర నిండు నూరేళ్ళు సాగాలనీ, లోకంలో వారి సత్కీర్తి చిరస్థాయిగా వుండాలనీ శ్రీహరిని ప్రార్థిస్తూ, స్వర్ణోత్సవ శుభకామనలను నివేదిస్తున్నాను. మంగళం మహత్. హరిః ఓం.

జై జై గురుదేవ్!

శ్రీ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం
విశాఖపట్టణం

(పుడమి నల్దెసల జ్ఞానయజ్ఞాలు సలిపి, మహిత లీలా వైభవమును వీనుల విందు చేసిన మధుర మంజుల మనోహర మంగళమూర్తి, దాస జనుల పాలిటి కల్పతరువు, భక్తజనుల శతకోటి జన్మల నోము పంట, శ్రీ సుందర చైతన్య యోగివర్యుల కిలలో వేరొకరు సాటి గాదనుచు, సాటి రారనుచు, మదిని మనసార మ్రొక్కుచు, ముకుళిత హస్తద్వయముతో, అవనత శిరస్సుతో శ్రీ సద్గురు వరేణ్యులకు సవినయ వందన సహస్రము లర్పిస్తూ, నా ఈ భావ సుమాంజలిని కనికరించి, నన్ను కృతార్థుని గావించమని వేడుకొంటున్నాను - శ్రీ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం)

అందమైన నవ్వు, అలస టెరుగని నవ్వు
విసుగు లేని నవ్వు విమల నవ్వు
పెదవి దాటని నవ్వు, ప్రేమ లొలికెడి నవ్వు
సరసమైన నవ్వు శ్రీస్వామి నవ్వు!

పాలసంద్రము తెలుపు పండువెన్నెల తెలుపు
చుక్క తెలుపు హంసరెక్క తెలుపు
మందగమనులగు స్వామి నడక మెరుపులందు
సుందర చైతన్యుల చిరునగవు తెలుపు

జాతిభేదము లేదు జన్మభేదము లేదు
కుల మత భాష భేద మసలు లేదు
చేరి కొలుచువారల కొంగు బంగారమ్ము
స్వామి మానస మందు సర్వ మొకటే!

పాదపూజకు గుట్టుగా పదివేల వరహాలు
పట్టుబట్టి కోరెడి గురువు కాదు
ఆధ్యాత్మిక ముసుగులో అట్టహాసము చేసే
కపట వేషము లెరుగని సాధుశీలి

క్షుద్ర విద్యలు చూపి, చూపరుల నాకట్టు
చోద్య మెరుగని విమలచిత్తు డతడు
వెన్న వంటి మనసు వెన్నెల వంటి చూపు
తేనె వంటి పలుకు శ్రీ స్వామి సొత్తు

పరవశించిన వేళ, మూగబోయిన మనసు
పలుకలేదు నోట పలుకు రాదు
ఇంతకన్నను వేరెద్ది విన్నవింతు
సాధు రూపాన వచ్చిన వేదవేద్య!

చింత దీర్చు చింత

శ్రీ ఇ.వెంకటయ్య గౌడ్,
ఎమ్.ఎ; బి.ఇ.డి.,
హెడ్ మాస్టర్, మహబూబ్‌నగర్

కం॥ సుందర చైతన్యుడు జను
లందరి అజ్ఞానమెల్ల అణచుట కొరకై
పొందుగ జన్మించెను ధర
యందున భక్తాదులార అరయుడి నిజమున్

సీ॥ వేద శాస్త్రములెల్ల మోద మందిగ జనుల్
ప్రవచించు సుజ్ఞాన బ్రహ్మాయితడు
సజ్జన సత్సంగముల్ స్థాపించబూనిన
మాన్యుండు సత్సంగ మణియితండు
గండె పెండేరముతో ఘనమైన సత్కార
మొందిన సౌజన్య మూర్తి యితడు
పామర జనులకు పరమార్థమును దెల్పి
ముక్తి మార్గము జూపు ముని యితండు



తె.గీ॥ వేద వేదాంత సారంబు విసుగులేక
వింత అనుభూతి కల్గించు వినెడు వారి
మనసు నాకట్టుకొనెడు యామాటతీరు
మధుర గంభీరమై మేను మరువజేయు

పూజ్యులు శ్రీ స్వామి శుద్ధానంద భారతి
భారత రాష్ట్రపతి డా॥ శ్రీ శంకర్ దయాళ్ శర్మ



మౌంట్ ఆబులో బ్రహ్మాకుమారీల సదస్సులో
ప్రధాన ప్రసంగం చేస్తున్న శ్రీ స్వామీజీ

పూజ్య స్వామీజీతో శ్రీ జి.వి.కృష్ణారెడ్డి గారు

సినీ ఆర్టిస్ట్ శ్రీ గొల్లపూడి మారుతీరావు

సుందర చైతన్య తరంగాలు

డా॥ కె. మలయవాసిని,
ఎమ్.ఎ., పి.హెచ్.డి.
ప్రొఫెసర్, ఆంధ్రా యూనివర్సిటీ,
విశాఖపట్టణం

మానవ జాతిని ఒక మహోన్నత స్థితికి, ఉదాత్త రసాన్విత స్థాయికి, ధర్మబద్ధ జీవనరీతికి నడిపించడానికి యుగ యుగాలుగా మహానుభావులు జన్మిస్తూ ఉంటారు. వారు భగవానుని దూతలుగా మానవలోకానికి వచ్చి మానవుల్ని చైతన్యవంతులుగా చేస్తూ ప్రతిఫలాపేక్ష లేకుండా తమ వంతు కృషిని భగవదర్పణగా నిర్వహిస్తారు. అట్టి మహనీయుల కోవకు చెందిన వారే శ్రీ సుందర చైతన్యానంద స్వామి.

లలిత లలిత పదాలతో, మలయమారుతంగా సాగే వీరి ప్రవచనాలు విన్నా, సువర్ణాలతో సద్గుణ శోభితమైన వీరి రచనలు చదివినా, తనువు మనసూ పులకరించ వలసిందే. సాధారణంగా లోకంలో ఉత్తమ ప్రవచనం చేసేవారు పెద్దగా వ్రాతకోతల వైపు శ్రద్ధ పెట్టరు. శబ్దార్థబంధుర రస సమన్వయంగా రచనలు చేసేవారు ప్రవచనాల జోలికి పోరు. అలా కాకుండా రచనము, ప్రవచనమూ కూడా రమ్యాతి రమ్యంగా చేయగల శక్తి శ్రీ సుందర చైతన్య స్వామి వారి సొత్తు.

వేదశాఖలు వెలసిన భూమి మనది. ఉపనిషన్మధువు ఒలికిన నేల మనది. ఆది కావ్యము అలరిన దేశమిది. అయితేనేం, నేటి మానవుల బుద్ధికి వాటిని అందుకునే సమయము, శక్తి కూడా లేకుండా పోయింది. నిత్యము అనేకానేక సమస్యల వలయాల్లో చిక్కుకొని మనశ్శాంతి కరవై జీవిస్తున్న మానవులకు మధుర భాషణంతో ఉపనిషత్తులను వివరిస్తూ జ్ఞానవంతుల్ని చేయడంలో స్వామి వారికి స్వామివారే సాటి.

ఒక చంద్రభాగా తరంగాలలో మునక వేసినా, రామాయణం పారాయణం చేసినా, భాగవతం చదివినా, విష్ణుసహస్రనామ వివరణ విన్నా, పాఠకులు 'అరటిపండు ఒలిచి చేతిలో పెట్టారే స్వామి!' అనే అనుభూతి పొందవలసిందే. వీటికి తోడు వారు వాగ్గేయకారులు కూడా కావడం మరో విశేషం. స్వయంగా తామే పాటలు వ్రాసి, బాణీలు కూర్చి, స్వయంగా గానం చేసి, ఆ గాన మాధుర్యంలో పరవశింపచేసే శక్తిని గమనించినప్పుడు, మురళీలోలుని వేణుగానం గుర్తుకు వస్తుంది. చిన్న చిన్న పదాలు, చిన్న చిన్న వాక్యాలు, గంభీరమైన అర్థాలు వీరి రచనలో ప్రత్యేకతలు. 'గిరిధారి' పత్రికలో సంపాదకీయాలు కావ్యంలా భాసించడంలో మరి విశేష మేముంది?

భగవంతునికి చేసే ఆ స్వరార్చనలో భక్తులను మైమరపింప చేసే ప్రక్రియ వారిది. పూర్వపు రామాయణాలు ఎన్ని ఉన్నా, అన్ని రామాయణాల లోని అపురూపమైన ఘట్టాలను పేర్చి కూర్చి రమ్య రామాయణంగా తయారు చేసిన నేర్పు వారిది. ఒక్క తెలుగు రామాయణాలే కాదు; తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠీ రామాయణాల లోని రమణీయ భావాలను ప్రోది చేసి వ్రాసిన రామాయణమే శ్రీ స్వామివారి 'చైతన్య రామాయణం'. నిజంగా ఆ రామాయణం సుందరము, చైతన్యవంతము కూడా. అతి సరళమైన భాషలో ఈనాటి పాఠకుల స్థాయికి పనికివచ్చే రీతిలో రసాయనంగా తయారుచేసి, వారు ధన్యులై ఆంధ్రజాతిని ధన్యులుగా చేశారు.

శంకరాచార్యుల సాహిత్యాన్ని చిన్న చిన్న పుస్తకాలుగా విపులార్థ పరిమాణంతో ముచ్చటగా ప్రచురించి ఆంధ్రజాతికి అందించారు. చిన్న చిన్న కథలుగా, గాథలుగా మన జాతి సంస్కృతీ సంపదని, ఆధ్యాత్మిక సాహిత్యాన్ని గోరుముద్దలుగా అందించిన గురూజీ శ్రీ సుందర చైతన్య స్వామి. వారు చేస్తున్న సాహిత్య, ఆధ్యాత్మిక కృషి సాటి లేనిది. ఎందరో మహిళలను వారు విద్యావంతులుగా, విజ్ఞాన ప్రపూర్ణులుగా తీర్చిదిద్దడం వారి కార్యకలాపాలలో ప్రత్యేకంగా పేర్కొన వలసిన విషయం.

గిరిధారి పత్రికకు శ్రీ స్వామి వారిని గూర్చి ఈ నాలుగు విషయాలు వ్రాసే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనంద పడుతున్నాను.

ఒక వాల్మీకిని, ఒక వ్యాసుణ్ణి, ఒక శుకుణ్ణి, ఒక త్యాగరాజుని, ఒక అన్నమయ్యని, ఒక రామదాసుని ఒక్కొక్క యుగంలో జనులు కనీ, వినీ పులకరించారు. ఆ అందరినీ శ్రీ సుందర చైతన్య స్వామిలో చూసే అదృష్టం ఈ యుగపు ఆంధ్రులది.

పూజ్య గురుదేవ గైకొను పూజనములు

డా॥ డింగరి రామాచార్య,
లెక్చరర్,
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,
తెలంగాణా రచయితల వేదిక

శ్రీ సుందర సత్సంగ సంసేవిత చరణారవిందా!
విలసద్వేదోఖిలో సద్ధర్మ వాగ్వైభవార్య!
భగవత్కైంకర్య సత్కార్య రచనాధుర్యా!
శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామి వారూ!
మీకు శతకోటి శ్రద్ధా భక్తిపూర్వక సుమనోంజలులు.



పుట్టువు టూబిలో మునిగియున్న భక్తకోటిని నముద్ధరించడానికి బద్ధకంకణులైన మీారు కామధేనువువోలె కోరురీతి ఛాత్రులను పార్థులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో, తిమిరాన్ని చీల్చే సూర్య తేజస్సు చందాన పండు నొల్చి పెట్టెడు రీతిగా, ప్రసాద గుణోదంచిత మనస్తత్వంతో శ్రీకృష్ణ భక్తి తత్త్వాన్ని ప్రబోధిస్తూ, ముజ్జగాలు మ్రోయించగ మురళిని వాయించే శ్యామ సుందరుని దివ్య చరణారవిందాలను సందర్శింపచేసే నెపంతో, భక్తజనకోటి జీవన ప్రస్తారాల్లో భవబాధలను దూరం చేయాలనే తలంపుతో, ఐహికాముష్మికా భావచైతన్య దీప్తికి సోపానాలుగా పల్లెపల్లెల్లో, వాడవాడల్లో 'ఓం నమో భగవతే వాసుదేవాయ' తారక మంత్రోపదేశ విలసిత ఆధ్యాత్మికా ప్రపంచిత "సుందర సత్సంగాలను" సంస్థాపించే మీ లక్ష్యం నెరవేరినందులకు సుందర సత్సంగ భక్త కోటి జన్మ తవః ఫలముగా భావిస్తున్నాము. మీ లక్ష్య సాధనాయజ్ఞంలో పాలువంచుకొంటున్న మేము అమందానంద కందళిత హృదయారవిందాలతో సాష్టాంగ ప్రణామాల నర్పిస్తున్నాం.

విమల భక్తి దానగుణ సద్వినుతశీల!
ఉపనిషత్ ప్రతిపాదిత అద్వైత జ్ఞాన సద్యశస్సాంద్ర!
వేదాంత విద్యా సమారాధనోద్యమ ప్రపంచిత జ్ఞానయజ్ఞకార్య
విరచనా ధురీణా! అశేషశేముషీ విభ్రాజమాన జ్ఞానబ్రహ్మ!
శిష్య ప్రశిష్యకోటి సంపూజిత పాదయుగళా!
భారతీయ సనాతనధర్మ పునర్వైభవ గురుకుల ప్రాచార్యా!
శ్రీమచ్ఛంకర భగవత్పాద ప్రస్థాన త్రయామృత నవ్య భవ్య భాష్యాచార్యా!

బద్ధజీవుల బుద్ధజీవుల ప్రబుద్ధులుగా మలచే యత్నంలో ద్వైతభ్రాంతిని నివృత్తి చేసే అద్వైత బ్రహ్మ బోధాత్మకమైనట్టి మీ సహస్రాధిక గ్రంథ రచనలు, మీ ఉపజ్ఞతకు, ప్రాజ్ఞతకు, వైవిద్య రచనా విన్నాణానికి పట్టుకొమ్మలై, లోకాదరణ పొందుతూ, ఆనందోపదేశాలను పంచుతున్నాయి. మానవాళిని జీవన్మృతులుగా కానీకుండా, జీవన్ముక్తులుగా చేసే మీ దృఢ సంకల్పం క్రమేపీ నెరవేరుతూ, ప్రజలను చైతన్యవంతులయ్యే శక్తి సంపన్నులయ్యే దిశలో నడిపిస్తున్నవి.

ప్రతిభా వ్యుత్పత్తి అభ్యాసాలు పరిపుష్టి నొందినాయి. ప్రత్యేకమైన మీ బాణీ, మీ వాణీ, మీ పల్లవి పల్లవించి ఆడియో వీడియో క్యాసెట్ల రూపాల్లో ఇంటింటా ప్రతినోటా చైతన్యగానం చేస్తూ భక్తి పారవశ్యంతో ఆముష్మిక చింతనా నాట్యం చేస్తోంది.

ఏమాత్రం దాపరికం లేకుండా వేదాంత సత్యాలను, ఉపనిషద్ రహస్యాలను చాటి చెప్పుతూ, మీ హృదయవిశాలతను, మీ విశ్వప్రేమను, మీ గుణసౌందర్యాన్ని చాటుతున్నాయి. జీవితాలకు గమ్యం చూపి, మార్గదర్శనం చేసే మీ గ్రంథరాజాలు, మీ దార్శనికతను వేనోళ్ళ శ్లాఘిస్తున్నాయి. మీ పవిత్రమైన రచనలు, కీర్తనలు, కదలలేని బండబ్రతుకులను కదలిస్తూ, పెనునిద్దుర నుండి జాగృతం చేస్తూ, ఆరాధనకూ, సాధనకూ నిలయాలై, పాఠకుల హృదయ క్షేత్రాల్లో నూతన భావాంకురాలను మొలకెత్తింపజేసి, చెరగని ముద్ర వేసి, మిమ్ము వాక్బ్రహ్మగా కీర్తి పతాకాన్ని ఎగురవేసి మీ స్థితప్రజ్ఞతకు అద్దం పట్టుతున్నాయి.

ఆర్షవిద్యా వాచస్పతీ!
నవనవోన్మేష చైతన్య జ్ఞానప్రదీప్తీ!
అక్షరబ్రహ్మ! జ్ఞానబ్రహ్మ! నాదబ్రహ్మ!
ధవళేశ్వర నికేతన ధవళకీర్తి జయపతాకా!
భాగ్యనగర ఆధ్యాత్మికా ప్రగతి పతాకా!
సరస సంగీత సాహిత్య సుక్షేత్రపాలకా!
శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామీజీ!

వందలాది, వేలాది, లక్షలాది, కోట్లాది జనులను, ఆబాలగోపాలాన్ని పరవశింపజేసే మీ గానామృతం గ్రోలని వారుండ రనుటలో నేమాత్రం అతిశయోక్తి లేదు. సాత్త్వికతా, ధార్మికతా, తాత్త్వికతలు ఓతప్రోతాలై, తన్మయానందంతో ప్రవచించే భగవల్లీలాగుణ విభూతీ సంకీర్తనం రస జగత్తును ఉఱ్ఱూత లూగిస్తుంది. విన్నట్టి కన్నట్టి స్మరించినట్టి ప్రబోధాత్మకమైన మీ సంకీర్తనా గమక చమకం వేదాంత వధూటిని నర్తింపజేసి ఆనందాబ్ధిలో మునకలు వేయిస్తుంది. జనుల నాడిని వాడిని పసిగట్టి మీరు చేసే వేదాంతోపన్యాసం శృతిలయలతో, బోధనాభిరతితో వాగ్విలాసంతో, ఆపాత మధురమై సరస్వతీ పదమంజుల శింజాన మంజీర రవమై శ్రోతలను శాంతి నిలయానికి చేరుస్తుంది. చందమామ వెన్నెలకన్నా చందనం చల్లదనం కన్నా మీ తీయని పలుకులు శ్రోతల హృదికి హాయినిస్తాయి. మీ ప్రవచనాల్లో, సంకీర్తనల్లో ఎందరో సుందర పాండ్యకవులు, ఎందరెందరో మల్లినాధపోతనలు, అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్యాది సంకీర్తనాచార్యుల యొక్క గళాలు వినిపిస్తాయి. జగద్గురు గీతాచార్యులు శ్రీకృష్ణ పరమాత్ముని మోహన వంశీ నినాదాలు ఆలపిస్తాయి. మంగళకరమైన మీ గంభీర గళం అనేకానేక ఉపమానోపమేయాలతో లోకజ్ఞతను చాటి, అడుగకుండకనే వర్షించే అభ్రమువోలె, కోరకుండ గనే ఫలాలనిచ్చే కుటజంవలె, దప్పికను దీర్చడానికి ప్రవహించే తరంగిణి వలె కోరికల నీడేరిస్తూ పీయూష ధారలను కురిపిస్తుంది.

శ్రీశ్రీశ్రీ చైతన్యానంద స్వామీజీ!
మీకివే మా సంగీతసాహిత్య కళానీరాజనాలు.
ఉత్తమాదర్శ గుణములు రూపుగొన్న సంపూర్ణమూర్తీ!
ధర్మకర్మ సదాచార ధార్మికోత్తమా!
నైష్ఠిక ప్రపన్నతౌదార్య దార్శనిక నైతిక ప్రాడ్వివాకా!
క్రాంతి దాంతి శాంతి జాతి దీప్తి చైతన్య కాంతిపుంజమా!
సమత మమతా ప్రేమల పంచే సుధీనేత్రా!
సుందర మందస్మిత దరహాస చంద్రికలతో ఆశీర్వదించే
నిండుమనస్వీ!
అనవరత జ్ఞానయజ్ఞ రచనలో అలుపెరుగని తపస్వీ!
అశేషజన విశేష సంపూజ్య సుచరితా యశస్వీ!

మీ పలుకు పలుకులో నాధ్యాత్మికతా ప్రవచనం పలుకరిస్తుంది. మీ ఊర్పునూర్పులో స్నేహం, సౌహార్ద్రం, ప్రేమలు ఉదయమొందుతాయి. చూపు చూపులో నార్ద్రతా సుధలు గురుస్తాయి. వదన వర్చస్సులో అనవద్య విద్య తొణకిసలాడుతూ మీ ప్రాభవ స్ఫురద్రూపము తరాలెన్ని తరలినా తరగనట్టి సభ్యతాసంస్కృతీ భక్తి సాధుశీలతలను మలిచే శిల్పిగా భాసిల్లు తుంది. మీ సరసూక్తి బోధన ఎదల నిద్రాణమైన ఇంగితాన్ని మేల్కొల్పి చైతన్యపరుస్తుంది.

ఛాత్ర సంపూజితాచార్య చారుశీల!
సునిశిత ధిషణ బోధనాస్ఫూర్తిమంత!
సరససాహిత్య సంగోష్ఠి సదననిలయ!
పూజ్య గురుదేవ గైకొను పూజనములు!
జయము సుందర చైతన్య స్వామి జయము!
జయము జ్ఞానబ్రహ్మ జయము జయము!
జయము సద్గురుదేవ జయము జయము!
జయము శ్రీకృష్ణ ప్రవచనాచార్య జయము!

నడిచే భగవద్గీత

శ్రీ వోలేటి పార్వతీశం
ప్రొడ్యూసర్, దూరదర్శన్



'ఏడుస్తూ వస్తావు - ఏడిపించి పోతావు
నడి మధ్యన కాసేపున్నా నిజం తెలుసుకోలేవు'

జీవితాన్ని అంతర్లీనంగా ప్రతిఫలిస్తున్నాయి ఈ వాక్యాలు -

పుట్టినప్పుడు ఏడుపుంది, పోయినప్పుడూ ఏడుపుంది. రెండు ఏడుపుల మధ్య విరామమే మన జీవితం. కనీసం ఆ కాస్త విరామాన్ని కూడా కలతలకి, కన్నీళ్ళకి, దూరంగా గడపలేక పోతున్నాడు మనిషి. ఎందుచేత?

ప్రశ్న వేసినంత సులభం కాదు దీనికి సమాధానం చెప్పడం. మనుషు లంతా ఒకటే రూపురేఖల తోటి, వర్ణమూ వర్చస్సు తోటి ఎలా పుట్టడం లేదో, అలాగే, ఈ ప్రశ్నకి సమాధానం కూడా ఒకే తీరుగా గోచరించదు.

తీరని కోరిక వల్ల కొందరికీ, అసూయ వల్ల మరి కొందరికీ, అవిద్య వల్ల మరి కొందరికీ, ఇలా కారణం ఏదైనా, మొత్తంగా, అందరికీ అశాంతిగానే వుంది.

మనిషికి జీవితంలో అశాంతి అనేది తప్పడం లేదు. నిజమే, అలా అని, అది తప్పడం లేదని, సరిపెట్టుకోవడ మేనా? తప్పించుకొనే మార్గాన్ని అన్వేషించ నవసరం లేదా?

అవసరం మనిషికి ఎదురు పడినప్పుడు, అసాధ్యం అన్నది అతనితో తలబడలేదు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం.

చరిత్ర పుటల్ని ఒక్కసారి తిరగేస్తే, అశాంతికి

ఆలవాలమైన మానవ జీవన సాగరాన్ని ఆధ్యాత్మిక చింతన అనే మందరంతో మథించి, అమృత తుల్యమైన శాంతిని సాధించిన యోగి పుంగవుల చిరునామాలు అనేకం లభ్యం అవుతాయి. ఈ విషయం మీకూ, నాకూ, మనందరికీ తెలియనిది కాదు. అయినా, తెలియనట్టే వుంటాం. ఆ మహనీయులు చూపిన ప్రశాంత మార్గం కళ్ళముందే ఉన్నా మనం పట్టించుకోము. అదే మనిషి నైజం. తెలిసున్నా తెలియనట్లు వుండడమే మనిషి లక్షణం. మరో చెడు లక్షణం వుంది మనకి. కోతి నుంచి పుట్టిన మనం, కోతి చేష్టలు వదిలి, నాగరికత నేర్చుకుని, సంస్కారవంతులుగా రూపుదిద్దుకొని, సభ్య సమాజంలో అడుగుపెట్టాం. కాని, అక్కడ మితిమీరిన తెలివితేటలు ప్రదర్శించి, విచక్షణ కోల్పోయి మళ్ళీ కోతి చేష్టలే, కోతులుగా మారే ప్రయత్నాలే.

ఇలా మూర్ఖత్వానికి బందీ అయి, ఈ సభ్య సమాజం భ్రష్టు పట్టి పోతున్న తరుణంలో హైందవ ధర్మంలో నిబిడీకృతమైన, ఉత్కృష్ట తత్వాన్ని ప్రజల ముందు ఆవిష్కరించి సమాజాన్ని పునరుజ్జీవింప చేసిన మహానుభావులకు మనం శిరస్సు వంచి నమస్కరించాలి.

అలా మన ప్రణతుల్ని నిత్యం అందుకొనే అర్హత ఉన్నవారు రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద ఇత్యాదులు. మానవాళికి మరో దౌర్భాగ్యం వుంది. అదే మనిషి కనుమరుగైతే తప్ప అతని ఘనతను గుర్తించలేని తనం. బహుశా, ఈ కారణంగానే, నేటితరంలో పూజనీయులై ప్రణతులు అందుకుంటున్న, రామకృష్ణ పరమహంస వంటివారు తమ జీవితకాలంలో అంతగా గుర్తింపుకు నోచుకోలేదు. వారి ప్రవచనాలు చిత్త చాంచల్య భాషణాలుగానే ఎక్కువ ముద్ర వేసుకున్నాయి. కాని యిప్పుడు మనం సాలోచనగా గతంలోకి అవలోకిస్తే, రామకృష్ణ పరమహంస, వివేకానందుల వంటి మహనీయులు మన హిందూధర్మ పునరుద్ధరణకు తమ జీవితాన్ని అంకితం చెయ్యకుంటే, నేడు మన సమాజం ఏ దుస్థితిలో ఉండేదో మన ఊహకి కూడా అందని విషయం.

ఆ తరహా మహనీయుల కోవకి చెందిన మాననీయు లొకరు ఈ తరంలోనూ ఉన్నారు. ఆయనే శ్రీ స్వామి సుందర చైతన్యానంద. వారికి సమకాలీనులమై జీవిస్తున్నందుకే మనమంతా గర్వపడాలి. అది మన అదృష్టం అనుకోవాలి.

వికటించిన నాగరికత ప్రభావంతో నేడు, వెఱ్ఱితలలు

వేస్తున్న ఆలోచనలను, సమూలంగా నిర్మూలించే ప్రయత్నంలో, హైందవ ధర్మతేజాన్ని వియత్తల పర్యంతం వికసింప జేయడానికి, మరొక పర్యాయం అవతరించిన అపర వివేకానందులు, శ్రీ స్వామి సుందర చైతన్యానందులు. స్వామి ప్రవచన ప్రభావం, ప్రజావాహినిని స్పృశించిన క్షణాన, అక్కడ సాగర చైతన్యం! అది ఆనందార్ణవ స్పందనం!

గీతాజ్ఞాన ప్రవచనాలతో, మానవాళి అశాంతిమయ జీవనమార్గంలో, ప్రశాంతి ద్వారాలను తెరుస్తున్న ధన్యజీవి వారు.

సత్యాన్ని శివ (దైవ) పరంగా ఆవిష్కరిస్తున్న సుందర చైతన్యానికి మూర్తి కడితే, అది వారి రూపురేఖా విలాసాలను సంతరించుకుంటుంది.

ఆయన ఒక నడిచే భగవద్గీత!
ఆ ప్రవచనం సాగే రసవద్ఘంగ.....!!

విశ్వకల్యాణానికి వినూత్న చైతన్యం

శ్రీ భాట్టం శ్రీరామమూర్తి
మాజీ మంత్రివర్యులు

సుందరగిరి మారుతం వీచింది. నిత్య సత్యక్రతువు ప్రారంభం అయింది. దివ్య ప్రభంజనం కదిలింది. గీతాజ్ఞాన యజ్ఞానికి, విశ్వకల్యాణానికి శ్రీ సుందర చైతన్యానందులు కంకణం ధరించారు. అజ్ఞాన, అహంకారాది అరిషడ్వర్గాలపై సమరశంఖం పూరించారు.

చైతన్యస్ఫూర్తి

సమత కోసం, నవత కోసం - మానవత కోసం కొత్త రాస్తాలు తెరుస్తున్నారు. శాంతికి - దాంతికి - కాంతికి స్వాగతం పలుకుతున్నారు. సనాతన, సాంస్కృతిక, నైతిక విలువల వెలుగులు వెదజల్లుతూ విశ్వవిభుడికి - వేద పురుషుడికి నీరాజనాలు అందిస్తున్నారు. ప్రస్థానత్రయం, పురాణ ఇతిహాసాల పరమార్థాల ప్రబోధంతో శ్రీ సుందర చైతన్యానందులు, నవచైతన్యానికి, నూతన సంస్కారానికి నాంది పలుకుతున్నారు. మానవ జీవన సరళిని సవరించి, సంస్కరించి, మానవత్వాన్ని దైవత్వపు టంచులకు చేర్చేందుకు ఉద్యమించారు. ప్రణవనాదంతో, భక్తి భావంతో, ప్రేమ ప్రబోధంతో, సకల ప్రతిబంధకాలు, భవబంధాలు ఛేదించి, ముక్తిమార్గం చూపించేందుకు నడుం కట్టేరు. దైవత్వంతో ముడిపడిన మానవుడి సహజ సంబంధాన్ని, నిజబాంధవ్యాన్ని పునరుద్ధరించేందుకు కదలి వచ్చిన ఉత్తుంగ కడలితరంగం సుందర చైతన్యం. చిత్తమునకు చేతనత్వం కల్పించే చెలికాడుగా, ముగ్ధమోహన మధుర వచోమూర్తిగా, దివ్య

స్ఫూర్తిగా, సత్యజీవన పథగామిగా, ముక్తిమార్గగామిగా, జీవనరథ చోదకుడుగా జనబాహుళ్యాన్ని ఆదుకుంటున్నారు, ఆకట్టుకుంటున్నారు శ్రీ సుందర చైతన్యానందస్వామి.

వేదవాణి - దైవదూత

ఆయన భక్తాగ్రేసరుడు, తపస్సంపన్నుడు, ఋషి పుంగవుడు, సుందర చైతన్యాశ్రమ వ్యవస్థాపకుడు. దైవధ్యానంలో, యోగసాధనలో - స్వామి సేవలో, సాన్నిధ్యంలో, సంకీర్తనలో, సంస్మరణలో జీవయాత్ర గడిపే దైవాంశ సంభూతు డతడు. ఆ పరమాత్ముని ప్రతినిధిగా దేశం నలు దిశలా పర్యటించి, ప్రసంగించే పవిత్రమూర్తి అతడు. ఆయన నిత్యసత్యవ్రతుడు, సంతుష్టాంతరంగుడు, మందస్మిత వదనారవిందుడు, సత్యాన్వేషకుడు. శాశ్వతుడు, అనంతుడైన అద్వైతమూర్తి ప్రభావంతో, ప్రబోధంతో, తపనతో, తపోదీక్షతో దైవవాణిని భూతలం అంతా వినిపించేందుకు ఉద్యమించిన దైవదూత అతడు. అంతరంగం లోకి తొంగి చూసి, ఆనంద తరంగాలలో మునిగితేలి, అంతర్ముఖుడై, చిదాకాశంలో భాసించే జ్యోతిర్మయు డతడు. వేదవాఙ్మయాన్ని, పురాణ ఇతిహాసాలను, ప్రస్థానత్రయాన్ని ఆపోశనపట్టి, ఆ సారాంశాన్ని భావరాగయుక్తంగా, ధారాప్రవాహంగా, నిర్విరామంగా భారతావని అంతా అందించే ప్రజ్ఞాశాలి అతడు. ప్రతిభావంతు డతడు.

శుద్ధోదనుడు

గండుశిలలకు కూడ మానవత్వం ఆపాదించ గల మహిమాన్వితు డతడు. కఠిన పాషాణాలను సహితం కరిగించి, కారుణ్య రసాస్వాదన చేయించ గల ప్రజ్ఞాన ధురీణు డతడు. బండబారిన గుండెల్లో కూడ తన పసిడి పలుకుల పండువెన్నెలలు కురిపించి, మానవత్వాన్ని మేలుకొల్ప గల మహనీయు డతడు. ఇంటింటా వంటపాత్రను ప్రతి నిత్యం

తోమునట్లు, ప్రతి శ్రోత హృదయాన్ని ప్రక్షాళన చేసి పరిశుద్ధం చేయగల శుద్ధోదను డతడు.

నవ జగానికి నాంది

భక్తిభావ బంధురమైన గానామృతంతో సర్వేశ్వరుడి సాక్షాత్కారం బొందిన వాగ్గేయకారు డతడు. ఆయన ప్రతి పలుకులో పలుకుల తల్లి తరవాడుతూ ఉంటుంది. ఆయన నోటి మాట మన హృదయ తంత్రులను మీటుతూ ఉంటుంది. ఆయన గళం - కలం కలిసి యీ జగానికి నవయుగాన్ని ప్రసాదించడానికి అంకితం అయ్యాయి. ఆయన పరవశంతో కృష్ణ పరమాత్మణ్ణి స్తుతించి గానం చేస్తే ఆ మురళీరవళి సరళి వినిపిస్తూ ఉంటుంది. అలౌకిక ప్రేమ ప్రవాహంలో శ్రోతలు తలమునక లవుతారు. భక్తిభావ తన్మయత్వంతో, ప్రేమానురాగాల అనుపల్లవిలో గోపికల విరహవేదనకు స్పందిస్తూ నేత్రాంచనాల నుండి అశ్రుధారలు రాలుతాయి.

గానదేవ్

శ్రీ సుందర చైతన్యులు గీతా జ్ఞానయజ్ఞం జరిపే సభాస్థలి అంతా పవిత్ర క్షేత్రంగా మారి పోతుంది! పురుషార్థాన్ని పరమార్థాన్ని అర్థించి, ప్రార్థించే దైవ గోత్రీకులుగా, యాత్రికులుగా శ్రోతలంతా మారిపోతారు. యోగిపుంగవులు, సంతులు, సత్పురుషులు, ఋషుల మధ్య మనం మసలుతున్న అనుభూతి కలుగుతుంది. తపోధనులు, భక్తాగ్రగణ్యులు ఎందరెందరో మన మనోనయనాల ముందు సాక్షాత్కరిస్తారు! భక్త రామదాస్, సూరదాస్‌ల సాన్నిధ్యం లభించి నట్లవుతుంది. జయదేవ్, నామ్‌దేవ్, జ్ఞానదేవ్‌ల సహ పంక్తిలో మనం ఆసీనులం అయిన ట్లనిపిస్తుంది. కబీర్‌దాస్ కీర్తనలు - భక్తతుకారాం అభంగాలు, జయదేవ్ అష్టపదులతో సమావిష్టుల వీనులకు విందు చేస్తారు. మీరాబాయి మరో రూపంలో గళం మార్చి గానం చేస్తోందా అనిపిస్తుంది.

మానవ మహాసముద్రం

సువిశాల మైదానం నిండా తండోపతండాలుగా జన సందోహం కనుచూపుమేర బారులు తీర్చి కూర్చుంటారు. విద్యాధికులు, విజ్ఞానవేత్తలు, పండితులు, శాస్త్రజ్ఞులు, కొలువు దీరిన మహాసభలో సగటుజీవులు - సామాన్య ప్రజానీకం లక్షలాదిగా హాజరవుతారు. నేల యీనినట్టు ఉంటుంది. మానవ మహాసముద్రం గోచరిస్తుంది. అంతా యెంతో ప్రశాంతంగా, నిశ్శబ్దంగా, మంత్రముగ్ధులుగా ఉంటారు. ఒళ్ళంతా చెవులు చేసుకొని తదేక దీక్షతో వింటారు. వేల కళ్ళు వేదిక మీద కేంద్రీకృతం అవుతాయి. గీతాజ్ఞానామృతాన్ని, భక్తిగాన గోవిందాన్ని విని తరించామని, భక్తిముక్తిసాధనం సుందర సత్సంగం అని విశ్వసిస్తారు. వయోవృద్ధుల నుండి యువజనుల వరకు, మహిళా లోకం నుండి విద్యార్థి బృందం వరకూ పాఠకజనం నుండి కుండలాల పండితుల వరకూ, విజ్ఞాన శాస్త్రవేత్తల నుండి నాస్తికులు - భౌతికవాదుల వరకూ అందరూ అమందానందం పొందుతారు. అమితమైన దివ్యానుభూతి పొందుతారు. గంటల తరబడి చేసిన గంగా ప్రవాహం లాంటి ప్రసంగం పది నిమిషాల్లో పూర్తి అయినట్టు అనిపిస్తుంది. ఇంకో అవకాశం కోసం ఎదురు చూస్తారు. మరొక ఆధ్యాత్మిక ప్రసంగం కోసం చెవి కోసుకుంటారు. సుందర చైతన్యుని పునర్దర్శన ప్రాప్తి కోసం నిరీక్షిస్తారు. గీతామృతధారలు కుంభవృష్టిని కురిపించినా తనివి తీరదు, తృప్తి చాలదు. ధారావాహికంగా చేసే ప్రసంగ పరంపరల కోసం ఉర్రూతలూగే ప్రజానీకం ప్రతి ప్రాంతం లోనూ సహస్రాధికం గానే ఉంటారు. జనసముదాయాన్ని సమ్మోహనం చేయడంలో, తన్మయుల్ని చేయడంలో, ప్రభావితుల్ని చేయడంలో శ్రీ సుందర చైతన్యస్వామి సాటిలేని మేటి. జనచైతన్యానికి మరో నామధేయమే సుందర చైతన్యం.

శ్రీరామరక్ష

విజ్ఞానం వెదజల్లి, ఆధ్యాత్మిక చింతన కలిగించి, పెంచి, మానవత్వపు విలువలు విస్తృతంగా వ్యాప్తి చేసే అనంతమైన శక్తి శ్రీ సుందర చైతన్య స్వామిలో మూర్తీభవించి ఉంది. ఆయన మాట మధురం - ఆయన మనసు కోమలం.

వారిది అలసట ఎరుగని గళం -

విరామం ఎరుగని కలం -

దివారాత్రుల తారతమ్యం తెలియని తపోదీక్ష!

అదే దేశానికి శ్రీరామరక్ష!



PURVA JANMA SUKRUTAM

Sri Jupudi Yagna Narayana, *B.A; B.L.,*
Ex. M.L.C.
Ex President
Sundara Satsang, GUNTUR

SANATANA DHARMA based on Vedas and Upanishads was very lucidly explained and expounded by Sri Sankaracharya, who has handed over to us several books of philosophy based on Advaita. There have been various interpretations given to the writings of Sri Sankaracharya.

Sri Sundara Chaitanyanandaji, from his very childhood has been of religious mind based upon the philosophy of Sri Sankaracharya. His knowledge of Sanskrit, Telugu, English and music is par excellence. Unless it be a gift of God and 'poorvajanma sukruta', it is not possible to give such a lucid exposition, logical conclusion and correct interpretation of our ancient culture, as enunciated in Sanatana Dharma. His knowledge of Vedas, Upanishads and various puranas is astounding. I do not think it possible for a person living in these times to acquire such knowledge unless it be God's gift. Sanatana Dharma is the only guiding factor for achieving peace either to an individual or to the society, where several problems are confronting our national integrity and world peace. Revered Swamiji observes discipline and tries to inculcate disciplinary habits in one and all.

A PORTRAIT OF PUJYA SWAMIJI

Dr.J.Ramanaiah, *M.A.,M.Ed.,M.Phil,Ph.d.*
Ex Secretary, Sundara Satsang, Jagitial

Men will come and go but only a few people make their mark to the posterity by their great, noble, good and grand deeds. Pujya Swamiji is a doyen among them and stands first and foremost in making a distinct mark of his own for the benefit and betterment of the masses by his most powerful and forceful discourses in the realm of religion and philosophy.

Pujya Swamiji is holding the torch

of Sanatana Dharma high in his hands to clear off the darkness of ignorance among the men and women, the young and the old. Hinduism, which has been gaining momentum for its revival under his dynamic leadership is bringing awareness and awakening among the masses to realise and recognise as to which splendid, grand and glorious culture they belong to. He has kindled the spiritual fire and developed a quest for spiritual knowledge and eternal truth. He is striving hard to develop a right perspective and understanding of our ancient vedic culture. He stresses on the need to understand and appreciate the true canons of Hindu religion and Sanatana Dharma. He points out that the indifference to religion by the educated youth is not due to futility and hollowness of the science of religion but because of their incapacity to understand it in true spirit.

Pujya Swamiji is endowed with a versatile personality. He is a multifaceted and many splendoured genius. He is gifted with a commendable tone, melodious voice, mellifluous language and invincible courage to deal with the contents of philosophy in their right perspective. His religious teachings and preachings undoubtedly lay down an indelible and unforgetful impression upon the minds of the thousands of devotees and disciples. He is spear-heading the Hindu renaissance movement, which has long been over due.

Pujya Swamiji is a rare, dynamic, daring and dashing spiritual leader, who always stands in the forefront and strives hard to save and safeguard the canons of Sanatana Dharma. His discourses on various religious themes are highly useful and educative, authoritative and exemplary especially at a time, when religion and philosophy are losing their hold and the moral and

ethical values are found in peril. The most logical, scientific, rational and realistic approach followed, found and felt in his discourses leaves an everlasting impact and impression upon the minds of the listeners. His exposition and critical analysis of the subject are matched by a unique and lucid style of his own. His spiritual discourses are highly impressive and effective both to the masses and the intelligentsia. His teachings build up the moral, ethical and spiritual values among the people, who come in contact with him and make their lives pure and serene, noble and sublime. The true and implicit belief in the teachings of Swamiji certainly brings an enormous and a substantial change in the day to day life and behavioural tendencies of an individual and makes him follow the path of truth and righteousness. Pujya Swamiji stands as beacon light guiding the destinies of the thousands of people from the darkness of their ignorance towards the religion of their own.

Pujya Swamiji is well-versed in several subjects. To his credit he has digested the philosophies of the East and the West. He is a profound scholar, a great thinker and a renowned philosopher. He is an eminent and eloquent speaker and a prolific writer. Numerous feature articles and more than one hundred and fifty books and booklets on various philosophical themes and issues have come out of his powerful pen both in Telugu and English. His books are in great demand and his writings are eagerly awaited by a vast number of readers, enriched as they are by diverse experience derived from his wide and continuous study of the various sastras. It is an ardent desire of Swamiji that the holy Bhagawadgita should reach the threshold of every Hindu house at a very nominal price.

So far Pujya Swamiji has conducted more than 240 Gita Gnana Yagnas at several important places which attracted lakhs of people. Swamiji keeps the thousands of audience spell-bound, wherever he conducts the Gita Gnana Yagnas with complete control and command over them and maintains perfect decency, decorum and discipline among any number of audience. His voice is sweet, songs are melodious, expression is clear and above all his fluency and command over the language stands quite unparalelled. The contents of Gita are the same in all times and in all places. But the greatness of Swamiji lies in the authoritative exposition, lucid expression and clear explanation of the slokas. Numerous examples and episodes rouse the passion and spirit among the listeners to understand and appreciate the real meaning and essence of every sloka and the true sense of each word and letter in the holy Gita. The teachings of Swamiji provide necessary vision to understand that the riches, name, fame, power and prestige are quite momentary, illusory, short-lived and ephimeral and one should strive to seek for the eternal and everlasting truth, perpetual and perennial joy, which he derives from the realisation of his own Self.

Pujya Swamiji founded the Sundara Chaitanya Ashram in 1984 on the banks of the holy river Godavari at Dowlaiswaram in East Godavari district of Andhra Pradesh. It lies in between the Godavari and its canal built by Sir Arthur Cotton. The two magnificent temples in the Ashram dedicated to Lord Murali Krishna and Lord Sri Rama

attract the attention of the visitors by their unique architectural style. The distinguished dignitaries like Dr.Shankar Dayal Sharma, the then Governor of A. P., H.H.Swami Ranganathananda, Swami Shuddhananda Bharati, Justices of A. P. High Court, eminent scholars and many men of letters visited the ashram and appreciated the calm, quiet and serene atmosphere coupled with religious fervour. It is an abode of peace and tranquillity for the spiritually starved souls. It is here that we feel our head and heart completely satisfied and elevated.

It is a centre for the various religious and spiritual activities conducted under the gracious presence and able guidance of Swamiji. People, who visit the ashram, listen to the discourses of Swamiji with rapt attention and come out totally regenerated and rejuvenated. The ashram is full of idols and images of several gods exhibiting various themes, subjects and episodes of Hindu pantheon and philosophy. During the times of religious programmes and spiritual discourses, the ashram feeds the thousands of devotees for days together. In a word the ashram is an earthly paradise for those, who sincerely seek the eternal truth.

The philosophical monthly magazine named 'Giridhari', brought out by Swamiji is having a very wide circulation satisfying the thirst of the seekers of truth. It deals with various topics mostly written by Swamiji and caters to the needs of men, women and children bringing religious awakening and awareness among the masses. The frequent appeals made by

Swamiji to the youth during the course of his discourses have laid down tremendous influence and impact upon the young minds to do their best for the promotion and preservation of the ideals of Sanatana Dharma.

Pujya Swamiji has founded the potential spiritual organisations named as Sundara Satsangs at all the places, wherever he conducted the Gita Gnana yagnas. Each Satsang organisation meets once in a week to carry out the programme for an hour as designed by Swamiji. These Satsang organisations aim at promoting the high ideals cherished by Swamiji for the cause of the revival of vedic culture and Sanatana Dharma.

Finally, I pray to God, the Almighty to give Pujya Swamiji a very long life and to bestow on him the power and strength to serve the mankind morally and spiritually for many more decades to come.

అక్షర ప్రసూనార్చనము

శ్రీ డి.వి.మురళీ మోహనాచార్య, ఎమ్.ఎ.,బి.ఓ.ఎల్.,
మాజీ కార్యదర్శి, సుందర సత్సంగ్, మెట్‌పల్లి

సీ॥ భరత సంస్కృతి పునర్వైభవ స్థాపన
ధ్యేయంబుగా నెంచు ధీరయోగి
ప్రాచీన సాహితిన్ పంచగా జనులకు
బహుకావ్యరచన చేపట్టు యోగి
తత్త్వసారము దెల్పి తరింపనెల్లరు
జ్ఞానయజ్ఞములకై సాగుయోగి
విపుల వేదాంతమ్ము వెలయించి 'గిరిధారి'
సంచికతో ప్రబోధించు యోగి

గీ॥ పూత గౌతమీ తీరఁపు పుణ్యభూమి
వసుధ ధవళేశ్వరారామవాసి యగుచు
వరలు సుందర చైతన్య స్వామి యోగి
భక్తి సేవింప సుగమము ముక్తి పథము

సీ॥ గీతార్థసార సుఖ్యాత వేదాంతమున్
విశదమ్ముగా దెల్పు విమలయోగి
ఆధ్యాత్మతత్త్వము నాంధ్రుల కెరిఁగింప
విశ్రామ మెరుగని విబుధయోగి
చతురోక్తులఁ బరపి సకల జనాళికి
భక్తి పథము జూపు పరమయోగి
తన గానమాధురిన్ వినువారి నెల్లరన్
మంత్ర ముగ్ధులఁ జేయు మాన్యయోగి

గీ॥ మహిత సద్గ్రంథ తతులను బహుళముగను
వ్రాసె నాంధ్రాంగ్ల సంస్కృత భాష లందు
నిలిపె 'సుందర సత్సంగములను' చాల
భరతజాతి సమైక్యత పరిఢవిల్ల
జయము సుందర చైతన్యస్వామి కెపుడు

సీ॥ ఆ కనుదోయిలో నత్యంత వాత్సల్య
సుందర చైతన్య చూపు గలదు
ఆ చిరునగవులో నాప్యాయతయు దివ్య
సుందర చైతన్య సొగసు గలదు
ఆ మాటలందున యద్వైత వేదాంత
సుందర చైతన్య సూక్తి గలదు
ఆ గళమందున అంబుద గర్జనల్
సుందర చైతన్య సుధలు గలవు

గీ॥ జలధి గంభీర సుందర శాంతమూర్తి
సకల వేదాంత సామ్రాజ్య చక్రవర్తి
ధరణి ధవళేశ్వరాశ్రమ ధామవర్తి
స్వామి సుందర చైతన్య ప్రేమమూర్తి

సీ॥ అఖిలాంధ్ర జనులకు నద్వైతముం దెల్ప
శంకరాచార్యుడీ స్వామి యయ్యె
అఖిలాంధ్రదేశ పర్యటనమ్ము గావింప
రామానుజుండె యీ స్వామి యయ్యె
అఖిల గీతాసార మవనికి నందింప
వసుదేవ సూనుఁడీ స్వామి యయ్యె
అఖిల గానామృత మంతట నినదింప
వాణి వీణయె యిటు స్వామి యయ్యె

గీ॥ కనుకనే శంకరాచార్య కావ్య వ్యాఖ్య
రచన; యాధ్యాత్మసాధన; రమ్యసరళి
'గీత' బోధలు; దివ్యసంగీత సుధలు
సంభవించెను స్వామికి శంభుకరుణ

సీ॥ సుందర చైతన్య సందర్శనమ్మున
జన్మమే సార్థక జన్మమగును
సుందర చైతన్య సూక్తి సుధలు గ్రోలు
భాగ్యమే యతులిత భాగ్యమగును
సుందర చైతన్య వందనార్చన జేయు
కాయమే మానవకాయ మగును
సుందర చైతన్య సుందర భజనల
గానమే పరమాత్మ గానమగును

గీ॥ అవని సుందర సత్సంగ మఖల మిదును
స్వామి గ్రంథాళి సకల విజ్ఞాన మిదును
పూజ్యయతివరు మధుర సుబోధ సుధల
నోలలాడుడీ! ధన్యత నుర్విగనుడి.

ఇతిశమ్

మౌక్తికహారం

డా॥ ఏ.గోపాల రావు
విజయనగరం

స్వామిసుందర! భక్తమందిర!
సూక్తిముక్తావళీసాగర!
ఆర్షవిద్యా జ్ఞాన భాస్కర!
రాజసుందర! వందనం 1

శేషాచార్యరంగనాయకి
దంపతుల కులదీపకునిగా
ఎనిమిదవ పుత్రునిగ పుట్టిన
రాజసుందర! వందనం 2

పుట్టినప్పుడె గట్టివానిగ
పట్టుగా పదిమంది పొగడగ
బాలగాయక ప్రతిభగాంచిన
రాజసుందర! వందనం 3

రెండుపదులును నిండకున్నా
నిండుజ్ఞానిగ జ్ఞానయజ్ఞము
నుడివి శ్రీహరి నెదను నిలిపిన
ధీర సుందర! వందనం 4

వాసుదేవుని నామస్మరణమె
పారలౌకికప్రాప్తి మార్గము
అనుచు తేటగ చాటిచెప్పెడు
నామ సుందర వందనం 5

మాటలో మధురిమలు చిలుకగ
పాటలో సరిగమలు పలుకగ
జనాకర్షణ మంత్ర సిద్ధుడ
గానసుందర! వందనం 6

పలుకులో వాల్మీకివ్యాసులు
పోతనాదుల దర్శనమ్మగు
ఉపనిషత్తులె ఊపిరిగ మను
జ్ఞానసుందర! వందనం 7

నామదేవుడు తులసిదాసుడు
తుకారామును మీర జయదేవ్
నీదుగళమున ఒదిగినిలుతురు
నాద సుందర! వందనం 8

ఏది చెప్పిన ఎంత చెప్పిన
చాలదింకా వినగవలె నను
శ్రోతృకర్ణామృతము చిలికెదు
మధుర సుందర! వందనం 9

చాలులే విన్నాములే అని
పెదవి విరిచెడు వారి కైనను
తలలు తిరిగేలాగ పలికెదు
వాదసుందర! వందనం 10

కామమాదిగ లోనిశత్రువు
లారుగురిని జయింపవలయును
అనెడి నీ నుడి ముక్తిసతి గుడి
వేదసుందర! వందనం 11

విజ్ఞాన సోమయాజి శ్రీ స్వామీజీ

శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి,
ఎమ్.ఎ; బి.ఇ.డి.
కడప

ఎందరో మహాత్ములు, మహర్షులు, సాధుపుంగవులు జన్మించిన పుణ్యభూమి భరతఖండం. సనాతన ధర్మో ద్ధరణకై అవతరించి, అజ్ఞానతిమిరమును పారద్రోలి, విజ్ఞాన జ్యోతిని వెలిగించి, మానవ జాతిని సుశ్రేయమైన పథమున నడిపించిన బుద్ధ, శంకర, రామకృష్ణ, వివేకానంద, రమణమహర్షుల వారసులుగ ఆర్షధర్మ శంఖారావంతో జాతిని జాగృత మొనరించుటకు అవతరించిన చైతన్య స్ఫూర్తి శ్రీ సుందర చైతన్యానంద దీప్తి.

మానవుడు నిజంగా మానవుడై జీవించాలన్నదే శ్రీ సుందర చైతన్యుల పరమాశయం. సుఖం కోసం, సంపదల కోసం పరుగులు తీస్తూ మూల భూతములైన మానవ లక్షణాలనే విస్మరించి తాత్కాలిక భౌతిక సుఖాల కోసం అలమటిస్తున్న మానవులకు చిరంతనమైన శాంతిని పంచిపెట్టాలన్న లక్ష్యంతో జ్ఞానయజ్ఞములను నిర్వహిస్తున్న విజ్ఞాన సోమయాజి శ్రీ సుందర చైతన్య స్వామి వారు.

వేదోపనిషత్తులలో, భాగవత పురాణాది ఉద్గ్రంథా లలో నిక్షిప్తమైన జ్ఞాన భాండాగారాన్ని శతాధికమైన రచనల ద్వారా జిజ్ఞాసువులకు అందజేస్తున్న విజ్ఞాన ఖని శ్రీ స్వామీజీ.

సనాతన మతం లోని అంతస్సారమును, భక్తియోగ, కర్మయోగ, జ్ఞానయోగముల సమన్వయ స్వరూపమును మహత్తేజకమైన ప్రసంగాల ద్వారా పరివ్యాప్త మొనర్చుచున్న మహనీయులు.

గంగాఝరీ సమమైన వారి అమృత వాక్ ప్రవాహంతో పండిత పామర జనావళిని పునీతం కావిస్తున్న విజ్ఞాన కంఠీరవులు శ్రీ స్వామీజీ.

కలియుగంలో తపస్సు, ధ్యాన వైరాగ్యములు కఠినతరములైన మార్గములై నందున స్వామీజీ సర్వ జనావళి కత్యంత సుగమమైన సంకీర్తనమునకు సత్సంగమునకు అధికతరమైన ప్రాధాన్య మిచ్చుట అత్యంత సముచితమై యున్నది.

ఆనాడు అర్జునుని నిమిత్త మాత్రముగ పెట్టుకొని లోకహితం కోసం గీతాచార్యుడు భగవద్గీతోపదేశం చేశాడు.

ఈనాడు యంత్రిక నాగరికతా వ్యామోహ పరవశులై ఆత్మశాంతి కోసం ఆరాటపడుతున్న మానవు లను 'ఉద్ధరేదాత్మ నాత్మాన నాత్మాన మవసాద యేత్' అన్న గీతావాక్యోపదేశంతో ఆత్మ వికాసం కోసం ప్రబోధింప చేస్తున్నారు శ్రీ స్వామీజీ.

అనన్యమైన ధీశక్తితో, బహుభాషా వైదగ్ధ్యంతో పూర్వపశ్చిమ దేశాల దర్శనము లను, సాహిత్య, సంస్కృతి, చరిత్ర విజ్ఞానములను ఆపోసనం పట్టిన స్వామీజీ, స్వీయ రచనలతో సదాచార సంపన్నులమైన బోధాచరణములతో జనావళికి మార్గదర్శకులైనారు.

వ్యక్తి స్వాతంత్ర్యమును అభిలషించినా సమిష్టి సముద్ధరణమే వారి ధ్యేయం.

నిగమకల్పతరోర్గళితం ఫలం
శుకముఖాదమృత ద్రవ సంయుతం
పిబత భాగవతం రసమాలయం
ముహురహోరసికాః భువి భావుకాః

'కృష్ణరసాయనం పిబ' అన్నారు శ్రీ కులశేఖరాళ్వా రులు. మహత్తర చరిత్రకు ఆలవాలమైన భాగవతముపై స్వామీజీ రచించిన వ్యాఖ్య సురచిర మైనది.

ప్రాచీన భారత వైభవమును స్మరించుకొనటంతో తృప్తి చెందకుండా ఆ స్ఫూర్తితో శక్తివంతమైన, సముజ్వల మైన, యావత్ప్రపంచానికే వెలుగుల నందింపగల నవభారత నిర్మాణానికి జాతిని సమాయత్తం కావిస్తున్న సనాతన ధర్మదీపికాధారి యన శ్రీ సుందర చైతన్యా నందులు సుదీర్ఘాయుష్కులై, భారతీయ వేదాంత విజ్ఞాన ప్రబోధక సార్వభౌములై వర్ధిల్లునట్లు అనుగ్రహింప పరమేశ్వరునికి వేడికోలు.

భారతీయ నాట్యకళ - సుందర చైతన్య ఆనంద స్వరూపం

డా॥ కె. ఉమా రామారావు, ఎమ్.ఎ., పి.హెచ్.డి.
డైరెక్టర్, లాస్యప్రియ, హైదరాబాద్

భారతీయ నాట్యకళ అతి ప్రాచీనమైనది. ధర్మ ప్రతిపాదకము, చతుర్విధ పురుషార్థ సాధకము, యశస్కరము, సత్కర్మ మార్గదర్శకము, సర్వశాస్త్రార్థ సంపన్నము ఇతిహాస సహితము - మొదలైన ఈ లక్ష్యాలతో ఇంద్రాది దేవతల కోరికపై బ్రహ్మ దృశ్యము, శ్రవ్యము అయిన వినోద వస్తువుగా నాట్యాన్ని సృష్టించాడు. ఇది సమాజంలో అన్ని వర్గాల వారు ఆచరింపదగ్గ కళా ప్రక్రియ. నాలుగు వేదాల నుంచి నాట్యాంగాలను గ్రహించి రూపొందించిన పంచమవేదం.

ఋగ్వేదం నుంచి పాఠ్యాన్ని, సామవేదం నుంచి గీతాన్ని, యజుర్వేదం నుంచి అభినయాలను, అథర్వణ వేదం నుంచి రసాలను సేకరించి, వేదోపవేదాలకు సంబంధించే విధంగా బ్రహ్మ చేసిన లలితకళాత్మక సృష్టి ఇది. లోక స్వభావాన్ని తెలియజేసే 'త్రైలోక భావానుకీర్తన' మన్నాడు నాట్యశాస్త్రకర్త భరతుడు. ఇది భరత మునిచే ప్రయోగింపబడి మోక్షసాధనంగా మలచబడింది.

నాట్యశాస్త్ర గ్రంథంలో భరతుడు నాట్యావతరణ అధ్యాయంలో పూర్వరంగవిధి నాందీపఠనాల ప్రయోజనాన్ని వివరిస్తూ, నాట్య సమాశ్రయమైన ధ్వని ఏ దేశంలో వ్యాపిస్తుందో, ఆ దేశంలో పాపాలు నశించడమే కాకుండా మంగళాలు చేకూరుతా యన్నాడు. పాఠ్య, నాట్య, గేయ, చిత్ర వాదిత్రములు వేదమంత్రాలతో సమానాలని తెలియపరిచాడు. 'నాట్యవేద మహాత్మ్యం' అధ్యాయంలో నాట్యాన్ని చక్కగా నేర్చి, కాపాడే మానవుడు బ్రహ్మర్షులతో బాటు పుణ్యవంతమైన సద్గతి పొందుతాడని వివరించ బడింది. ఇది వేదం. భరతవాక్యం. నాట్యమాహాత్మ్యం.

ప్రతి యుగం లోను నాట్య ప్రసక్తి ఉంది. త్రేతాయుగంలో రామాయణ కాలంలో శ్రీరామజననం, పట్టాభిషేక శుభసమయాలలో నాట్యప్రదర్శన ఒక ముఖ్య వేడుక. రాక్షస రాజైన రావణుని దర్బారులో కూడా నాట్యానికి మంచి ఆతిథ్యమే లభించింది. రాముని సన్నిధిలో రామాయణ గాథను అతి మధురంగా ఆలపిస్తూ నర్తించారు లవకుశులు. ఇక ద్వాపర యుగంలో పాండవ మధ్యముడైన అర్జునుడు బృహన్నలగా విరాటరాజు కొలువులో రాజకుమార్తె ఉత్తరకు నాట్యాచార్యుడై ఆ కళకే రాజయోగం కల్పించాడు. చివరికి విశ్వామిత్రుని తపోభంగానికి కూడా నాట్యమే ప్రధాన సాధనమైంది. ఇలాగ ఎన్నెన్నో సంఘటనలు, సన్నివేశాలు భారతీయ నాట్యకళ విలువలను తెలియజేస్తాయి. నాట్యంలో శిల్పం వుంది కాని, ప్రతి శిల్పంలో నాట్యం లేదు. నాట్యం చైతన్య వంతమే కావచ్చు కాని ప్రతి కదలిక నర్తన మవదు. భావరాగ తాళ లయాశ్రయమైనదే నాట్యం. జీవన స్రవంతికి తార్కాణం. సుకుమార అంగవిన్యాసంతో లాస్యంగాను, ఉద్ధృత కరణ, అంగహారాల సమాహారంగా తాండవంగాను ప్రత్యక్షమవుతూ, చూపరుల హృదయాలను ఆకట్టుకొనేదే నాట్యం. మాట కంటే పాటలో ప్రభ వుంది. ఈ రెండింటి ఆధారంగా రూపొందిన ఆటలో రసపట్టు ఉంది.

కొందరు మాట్లాడుతుంటే సుమధుర నాదం వినిపిస్తుంది. మరి కొందరు పాడుతుంటేనే, ఆత్మచక్షువులకి నాట్యం గోచరించి, దివ్యానుభూతిని కలుగజేస్తుంది. ఈ రెండింటి కోవకి చెందిన వారే పూజ్య స్వామీజీ. ఆయన పలుకులో కులుకు వుంది. గానంలో పంచమవేదమైన నాట్యం మళ్ళీ ఉద్భవిస్తుంది. సుందర చైతన్య ఆనంద నర్తనమే అవుతుంది.

ఆయన నోటి నుండి వెలువడిన ప్రతి మాట భక్తుల హృదయ వీణలను సున్నితంగా మీటుతుంది. ఆయన అంతరంగం నుండి బహిర్గతమైన ప్రతి గీతిక గానరూపం దాల్చి భావరాగ శ్రావ్యపేటికయై భగవంతుని ఆరాధనలో పూజా పుష్పంగా మారి తన్ను తానుగా సమర్పించుకుంటుంది. లోకంలో అనేక వృత్తులు,

ప్రవృత్తులు ఉన్నాయి. స్వలాభంతో కూటి కొరకు చేసేవి కొన్ని. పదవిని కోరేవి మరి కొన్ని.

కాని భారతీయ లలితకళల యొక్క పరమావధే వేరు. ఆత్మానందాన్ని కలిగిస్తూ, ప్రేక్షకులకు కూడా ఆ అనుభూతులను పంచుతూ మహత్తరమైన లక్ష్యసాధనకి తోడ్పడే జీవనాడులు అవి. అందులో సాహిత్య, సంగీత, నాట్యాలు ప్రజలకు ఒక సందేశాన్ని అందివ్వడంలో ముఖ్య భూమికలను వహిస్తాయి.

'మధురమైన భావాలను సుమధురమైన పద జాలంలో తురిమి, మృదు మధురమైన కవితా పల్లకిలో కూర్చోబెట్టి ఊరేగించేదే కవిత్వమైతే, దానికి ముందుమాట రాసేందుకు నేను ముందుకు రాలేను. మీ ముందుకు రాలేను' అని స్వామీజీ 'చైతన్య గీతికలు' పుస్తకంలో 'నవ్విన పువ్వులు' శీర్షికలో రాస్తూ 'జననాడిని కుదిపి - జీవనాడిని తెలిసి జీవనప్రవంతి నిరాటంకంగా సాగేందుకు.... సర్వాన్ని సర్వంలో కలిపేందుకు - కవిత్వ మొక సాధనమైతే కవిగా నేను సాధకుణ్ణి. సాధ్యాన్ని కూడా' అని అన్నారు. 'స్వామి సుందర చైతన్య ఆనంద' - ఆయన పేరులోనే సర్వం ఉన్నాయి. స్వామిలో వేదాంతముంది. జ్ఞానముంది, కవిత ఉంది.

'సుందర చైతన్య'లో గళం నుండి జారే గాన ముంది. ఆ గానంలో చైతన్యం పొందిన నాట్యతరంగాలు ఉన్నాయి. అవే రస గుళికలు. అంతర్వాహినిలో కలిసిపోయే జ్ఞానప్రసూనాలు. భగవంతుని పాదపద్మాలను అలరించే భక్తి జ్యోతులు. సన్మార్గానికి రాచబాటలు. క్రిందటి సంవత్సరం డిశంబరు **24**వ తేదీన స్వామి సుందర చైతన్యానందుల వారి జన్మదిన వేడుకల సందర్భంలో మా బృందం సమర్పించిన నృత్య కార్యక్రమం ఆహ్వానితులను ఆకర్షించి మన్ననలను పొందిందంటే దానికి కారణం స్వామీజీ చైతన్యగానమే. కృష్ణ ప్రేమలో ఓలలాడిన గోపికలు, రాధ, యశోద, గోపబాలుర అంతరంగాల ఆత్మ నివేదన అది. ముఖ్యంగా బాలకృష్ణ లీలా విహారాలని 'చైతన్యగానం' అనబడే ఏడు క్యాసెట్లలోని కొన్ని ఆణి ముత్యాల కవితాగానానికి స్పందనే ఆ కార్యక్రమం అయినా మా కళాకారుల జీవితాలలో కలకాలం నిలిచిపోయే మధురస్మృతులు, మరువ లేని అనుభూతులు అవి.

నిజంగా స్వామి చెప్పినట్లు ఆ రోజు సున్నితమైన ఒక హృదయం ఒలికించిన ఈ కవితాసుధలకు మరొక సున్నిత హృదయం స్పందించి కొన్ని బాలకిరణాల నాట్య



విన్యాసంతో వెదజల్లిన కాంతులలో 'ఆ మువ్వల గోపాలుడు' నర్తించాడు.

'నీ మందిరమున రాగాలొలికే
పల్లవి కదిలిన పాటను
నేడు చరణము కదిలే బాటను' అంది రాధ.

'చల్లని వెన్నెల నవ్వుల చిన్నా!
తెల్లని వెన్నల మువ్వల నాన్నా!
నీ కొరకే నే బ్రతికున్నా
నిన్నొదలలేను ఎవరేమన్నా!' అంది - తల్లి యశోద.

'అందాల మూట మా నోముల పంట
మా బ్రతుకంతా తానొకవింత' అన్నారు గోపికలు.

'పాడినా నీ పాటలే
మాటాడినా నీ మాటలే
ఎన్ని జన్మల పుణ్య ఫలమో
యెద నిండా నీ తలపులే' అంటూ తన్ను తాను అర్పించుకొంది ఒక భక్త హృదయం.

ఇంతకంటే పుణ్యం ఏముంది? దివ్యానందం ఎక్కడుంది? మళ్ళీ మళ్ళీ రావాలి ఈ రోజు. భక్తుల పుణ్యపంటలు పండే రోజు.

❋ ❋ ❋

పూజ్య గురుదేవుల చరణ సన్నిధికి

భక్తి సుమాక్షరాలు

శ్రీమతి బృందావనం రంగనాయకమ్మ
ఖమ్మం

చైతన్య గురుదేవు జ్ఞానవిభవము గాంచి
జగతి ప్రణమిల్లె స్వామీజీ చరణములకు
ద్వాదశాక్షర దివ్య మంత్ర ప్రభావమున
దేశవిదేశముల కీర్తి తేజరిల్లె
ఎచటి కేగిన కృష్ణ మందిర సుందరమే
భక్త కోటికి సాధనా భాగ్య మొసగె
మోక్షధామ మరయ మునుల పరివేష్ఠితమయ్యె
అద్వైత స్థితి జేరు మార్గదర్శక మిదియె



జ్ఞానభాస్కరు కిరణములు భువిని తాకె
విస్తరించెను విశ్వమున సత్సంగ శాఖలు
ప్రతి ఇంట 'గిరిధారి' వాక్సుధల్ కురిసె
వెంట భగవద్గీత వేదముల్ బోధజేసె

దేహము నేను కాదనెడి దివ్య ప్రబోధము వీనుల కందినంతనే
'నేను నీవు'గా తెలిసి నిర్వైర బోతిని ఆ క్షణంబునన్
మది అద్వైతామృత కలశమైనటుల భావన గల్గెన్ జ్ఞానబ్రహ్మ
శ్రీ సుందర చైతన్య గురుదేవు లొసంగిన మంత్ర మహిమతోన్



సేవింతును గురుదేవులుగా మిము
కీర్తింతును జగద్గురువు శంకరాచార్యునిగన్
భావింతు దైవ రూపమని
తరియింతును గీతాజ్ఞాన యజ్ఞము గాంచన్

శక్తి లేదని ఆశ్రమము జేరలేక
రిక్త హస్తములతో మిమ్ము దర్శింపలేక
ముక్తి మార్గము ఏదియో గానలేక
భక్తి సుమాక్షరములు మీకర్పించినాను.

భక్త పరమాణువు,

బృందావనం రంగనాయకమ్మ.

❁ స్వామి సుందర చైతన్యానంద ❁

శ్రీ పి.విజయబాబు
ఆర్.టి.ఐ.కమీషనర్

సుందర చైతన్యానంద స్వాముల వారు ఎన్నో జ్ఞానయజ్ఞాలు చేశారు. వారి అనేకమైన గ్రంథాలు మనకు అందుబాటులో ఉన్నాయి. అనేకమైన క్యాసెట్లు రెడీగా ఉన్నాయి. అయినప్పటికి సుదూర ప్రాంతాల నుండి తరలి వచ్చి స్వామి వారి అభిభాషణం ప్రత్యక్షం గానే ఎందుకు వినాలి? చాలా మంది స్వామీజీలు ఉండగా వీరి అభిభాషణమే ఎందుకు వినాలి? సాక్షాత్తు భగవంతుడిని దర్శిస్తున్నామా! అని పులకించేటటు వంటి ఆకారం, ఆ ఆకారానికి తగినటువంటి ప్రజ్ఞ, ఆ ప్రజ్ఞకి తగినటువంటి ప్రతిభ, ప్రతిభకి తగినటువంటి వ్యుత్పత్తి, నేను అన్నీ తెలిసిన వాణ్ణి కదా అనేది కాకుండా నిరంతర అభ్యాసం ఆ నారాయణుడి గురించి - ఇన్ని సద్గుణాలు కలిసినటువంటి, ఒక సాకారమూర్తి ఇక్కడ సాక్షాత్తు కూర్చొని ఉంటే, వారి మాటలను ప్రత్యక్షంగా వినడం వల్ల మనకు కలిగే టటువంటి ఆ పులకింత, ఆ తాదాత్మ్య భావన కేవలం ఒక మానసిక ఆనందం, మానసిక ఆహ్లాదం కాదు - ఆత్మానందం. ఆత్మ చైతన్యం. అందుకోసమే స్వామి వారు ఎన్ని యజ్ఞాలు చేసినా స్వామి వారి అభిభాషణం అంటే - దానిని వినడానికి ఎక్కడెక్కడి నుండో సుదూర ప్రాంతాల నుండి జనం తరలి వచ్చే పరిస్థితి ఉంది.

అయితే, ఆయన చెప్పినట్లుగా మనం కూడా చెప్పవచ్చు అని చాలా మంది అనుకోవచ్చు. కానీ, అది వాస్తవం కాదు. రాజకీయ నాయకులు ఇంతకంటే ఆకర్షణీయంగా చాలా చక్కగా చెప్పగలరు. కానీ, అది పరిశుద్ధమైన హృదయం కాదు. మన హృదయం శుద్ధంగా ఉండాలి. మనం చెప్పే మాట శుద్ధంగా ఉండాలి. ఆచరణ లేని ఆలోచన, ఆలోచన లేని ఆచరణ - రెండూ నిరర్థకాలే. అందుకనే యథా చిత్తం తథా వాచ్యా తథా క్రియా, చిత్తే వాచక్రియాణాం సాధూనాం ఏకరూపతః. ***Our thought, our talk and our act should be synchronized in one shape and that is Swami Sundara Chaitanyananda.*** ఇది మరొకరికి అసాధ్యమైనటువంటి విషయం కాబట్టే వారి మాటల్ని వినడానికి, జీవితోద్యాన వనంలో ఆనంద చైతన్య అతసీ కుసుమాలను ఆఘ్రాణించడానికి, ఆనందించడానికే మనం ఇంత దూరం వస్తున్నాం. ఇదే శ్రీ స్వామి వారి లోని గొప్పదనం.

ఉపనిషత్తుల్లో చాలా సంక్షిప్త మైంది, క్లుప్తమైంది స్వామి వారు నేడు ప్రవచించనున్న మాండూక్యోపనిషత్తు. అయినప్పటికీ దానిని అవగాహన చేసుకోవడం, ఆ తరువాత ఇతరులకు అర్థమయ్యేలా బోధించడం, అంటే అలతి అలతి పదాలతో అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లుగా, నోట్లో పెట్టినట్లుగా చెప్పడం ఒక్క స్వామి వారికే తప్ప మరొకరికి సాధ్యం కాదు. ఈ సమస్తము ఓంకారమే. ఈ సృష్టికి మూలం ఓంకారమే అంటుంది మాండూక్యోపనిషత్తు. ఓంకారం . . . చైతన్య సకల సాకారం

. . . సద్గుణాకారం . . . సురుచిరం . . . సుందరం. అటువంటి ఓంకారంలో అష్టాక్షరీ మంత్రాన్ని, పంచాక్షరీ మంత్రం యొక్క ఔన్నత్యాన్ని రెంటిని కలగలిపి చెప్పగలిగిన శ్రీ చైతన్యానంద స్వాముల వారి సామర్థ్యాన్ని లెక్కగట్టడం సామాన్యమైన విషయం కాదు.

నేడు మానవతా విలువలు ఘనీభవిస్తున్నటు వంటి పరిస్థితి. ఆ ఘనీభవిస్తున్న వాటిని మళ్ళీ ద్రవీభవింప చేసే సామర్థ్యాలు వారికే ఉన్నాయి. ఈ సమాజంలో మనం ఎలా జీవిస్తున్నాము అని గనుక ఆలోచిస్తే . . . *'Guilt has poisoned our souls. Totally poisoned our souls. We are not living like human beings. We are not computers. We are human beings. We have to live by each other's happiness not by each other's misery'* అని తెలియ చెప్పటం కోసమే ఈ జ్ఞానం.

ఈ రోజు శ్రీ సుందర చైతన్యానందుల వారు ఒక మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రపంచానికే సంస్కృతిని నేర్పినట్టి ధర్మభూమి, కర్మభూమి, వేదభూమి అయినటువంటి ఈ భరత భూమిలో ఆ విలువలు పతన మవుతున్న నేపథ్యంలో వారు నేనున్నానంటూ ఈ గడ్డ మీద మళ్ళీ ఘనీభవించిన మానవతా విలువలను మరలా ప్రవహింప జేయడానికి ఒక గంగా ప్రవాహం లాగా, ఒక త్రివేణీ సంగమం లాగా మన మధ్యకు వచ్చారు. దాదాపు ఇరవై అయిదు సంవత్సరాల క్రితం, అంటే 1987 వ సంవత్సరంలో మీడియా ఇంతగా అభివృద్ధి చెందనప్పుడు శ్రీ స్వామి వారి ప్రవచనాలను మేము ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురించి ఒక ప్రత్యేకమైన ఆటోలో పెడితే జనం ఎగబడి కొన్న పరిస్థితి ఉండింది. వేద వేదాంత భాష్యాల్ని మనందరికి అర్థమయ్యే రీతిలో బోధించమని సాక్షాత్తు ఆ వాసుదేవుడే పంపిన ప్రతినిధిగా మనం భావించి నట్లైతే వారి మాట, ప్రతి పదం ఈ తరాన్ని చైతన్యవంతం చేస్తుంది అనుటలో ఎటువంటి సందేహమూ లేదు.

శ్రీ స్వామి వారివి ఎటువంటి అమృత వాక్కులంటే . . . పున్నమి జాబిల్లి కురిపించే ఆ వెండి వెన్నెలను తీసుకొని చిక్కని చక్కని పాలలో తోడు పెట్టి, ఆ దధిని పారిజాతపు చిగురు కొమ్మతో మథించగా వచ్చిన ఆ నవ్య నవనీతాన్ని, అంటే వెన్నను రుచి చూచి, ఆ రుచికి సరితూగు వాక్కులను మనకు అందిస్తున్నటువంటి అనుభూతి సుందర సాగర వన తీరాలలో ఒక చల్లని సాయంత్రం నడుస్తూ ఉండగా కలిగే ఆహ్లాదాన్ని, ఆనందాన్ని మించినటు వంటి అనుభూతి. అది భౌతికమైన అనుభూతి. ఇది దైవికమైన, అలౌకికమైన, ఆధ్యాత్మికమైన అనుభూతి. అటువంటి దివ్యానుభూతిని మనకందించే శ్రీ స్వామి వారిని గురించి ఒక రెండు మాటలు మాట్లాడగలిగే అవకాశాన్ని నాకు కలిగించి నందుకు శ్రీ స్వామి వారికి నతమస్తకుడనై నమస్కరిస్తూ, ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షిస్తూ సెలవు తీసుకుంటున్నాను'.

PUJYA SWAMIJI AND UNIVERSAL BROTHERHOOD

***Sri K.S.R. Murthy**, I.A.S.*
Ex. Secretary to Government of India
NEW DELHI

I first came in contact with Swami Sundara Chaitanyanandaji by a chance. Driving on the Parade Ground road at Secunderabad the large number of vehicles and people there attracted my attention. And when I verified I was told that it was due to the lectures of this great Swamin on Bhagavatam and Bhagavadgita going on for ten days already by that time. When I made enquiries, people started telling me so much about his oratorical skills that naturally, I wanted to hear him myself.

I attended his first lecture along with my daughter, three year old grand daughter and a few other members of my family and all of us were attracted so much that we continued to attend his lectures both in the morning at 6.00 in the cold winter and from 6.00 onwards in the evening for the next few days.

His eloquence and his anecdotes are so beautiful that even an illiterate can understand, enjoy and get benefited through his discourses.

His scholarship in English is very great. He has written a large number of books on Hindu philosophy. Countless books written in sanskrit on Indian philosophy have been translated by him into very simple and sweet Telugu so as to make everyone aware of the greatness of our national heritage.

His habits are simple. He is benevolant, kind hearted and affectionate to everyone. He does not distinguish between the rich and the poor and in his view every individual is a part of a greater whole.

I feel like listening to him throughout the day for years to come for his voice is so divinely melodious.

The spiritual renaissance movement which Swamiji has launched forty years ago is beneficial not only to the people of Andhra Pradesh but to the entire country and also to the whole world. My appeal to all the satsangis is to request Swamiji to travel accross the country carrying his message of peace, prosperity, tranquility and brotherhood. I also pray for the good wishes and blessings of Pujya Swamiji on this occasion. I wish you all the best as you are the pillars of the movement.

I sincerely pray that Lord Krishna should bless His Messenger for many many years to come so that we may hear him preaching love, unity and universal brotherhood.

ఓం శ్రీ గురవే నమః

శ్రీమతి చక్కిలం విజయలక్ష్మి
రచయిత్రి, కర్నూలు

ప్రణవ స్వరూపమైన ప్రత్యక్ష పరమేశ్వరా!
ప్రణామ శతములు. కృతజ్ఞతా కెందారములు.
స్వామీ!
కోటి యుగాల నిరీక్షణ
మరెన్నో మన్వంతరాల ప్రతీక్షణ
సురభిళ పుష్పంలా, సుగంధ సౌరభంలా జ్ఞానయజ్ఞం పేరిట కర్నూలులో కాలుమోపారు.
ఈ ఋష్యశృంగుని పాదస్పర్శతో ఋతువే మారి వానై కురుస్తోంది.
జ్ఞానం వానై కురుస్తోంది.
ఆధ్యాత్మిక అభావంతో ఆత్మ మాసిపోయిన మనుషులం.
ఈ ఉపనిష త్తుఫాను మా ఏడుజన్మల ఎడారి బ్రతుకును కూకటివేళ్ళతో వూపేస్తోంది. కృష్ణ నామామృతాన్ని మీ గళం అనే కలంలో సిరాగా పోసి మా ఆత్మపత్రాల మీద అలవోకగా లిఖిస్తున్న ఓ సుకవీ,
మా అజ్ఞానాంధకారాన్ని మీ జ్ఞానదీపికతో పటాపంచలు చేస్తున్న ఓ అపర రవీ,
ఏమి సమర్పించ గలదాన!
ఇంకా ఏమి మిగిలి వున్నది నా లోన?
మురళిలా గుల్లను, డొల్లను అయ్యాను. కాదు కాదు. చేశారు.
ఇక కృష్ణుని నిస్వనంతో తప్ప నాలో స్వరం పలకదు.
స్వామీ, కృష్ణుని మా ఇంటి రోటికి కట్టేశారు!
మా గుండె రాటకు కట్టేశారు!
మీ కేమి సమర్పించను?
అనంతమైన ఆనందాన్ని మాలో ఊదిన స్వరకర్తా! ఏమని చెప్పను?
భాష సరిపోని భావం
భావంలోనూ ఇమడని అనుభవం.
మాటలు రాని ఈ మౌన నివేదన!
చేత లుడిగిన నిశ్శబ్ద గాన ఆరాధన!
అనంతాత్మను తాకిన ఈ
అనుభూతి పరంపర నెలా
నివేదించాలనే ఆవేదన!

ఆత్మభాష తప్ప ఆంధ్రభాషలో
తెలుపలేను.
స్వామీ! భాష సరిపోని భావం.
లోన కృతజ్ఞతా శంఖారావం.
ఆనందంతో ఆత్మ పులకరిస్తోంది.
అమృతాన్ని చిలక రిస్తోంది.
కృష్ణుడైనా కర్మఫలాన్నే ఇస్తాడు.
ఈ అపరకృష్ణుడు అమృతమయుడు
ఆధ్యాత్మికం అంటే తెలియని పామరులకు జ్ఞానామృతాన్నే పంచి పెడ్తున్నాడు!
అడగకనే లభించిన మృష్టాన్నం
అదృష్టవశాన దొరికిన సిద్ధ పరమాన్నం!
ఓంకారనాద ఝుంకారాలు . . .వేదాంత బోధ భేరీ నినాదాలు
వాన బొట్లను ఏరుకొనే స్థోమత లేదు
మా మీద కురుస్తున్న అనంత జ్ఞాన జలపాతాన్ని ఎలా గుండె కెత్తుకోను?
ఆశగా, బేలగా, నిస్సహాయంగా పిచ్చిచూపులు చూడ్డం తప్ప!
పేదవాడింటికి రాజొచ్చినట్లు బిచ్చగాడికి ఏను గిచ్చినట్లు తడబడి పోతున్నాము. తత్తరపడి పోతున్నాము.
జ్ఞానసాగరం ముందు చిన్న కలశంతో నిలబడిన అయోగ్యులం.
అందిన అదృష్టాన్ని పూర్తిగ అందుకోలేని నిస్సహాయులం.
చెట్టెడు పూలకు చిట్టి దోసిలి సరిపోతుందా!
ఏం చేయను? ఏం చేయను?
మీరు పంచుతూన్న జ్ఞానామృతాన్ని టెంకం వేయలేని ఈ నవరంధ్రాల దేహాంజలితో జుర్రుకో లేకుండా వున్నాను!
అయినా, నాలో మీరు ప్రతిష్ఠించిన అనంత నిశ్శబ్దం
జ్ఞానాన్ని మౌనపానం చేస్తోంది. మౌనపానం చేస్తోంది.
చివరగా . . .
నా కన్నీట పాదాలు కడిగేను స్వామీ,
ఆత్మపుష్పమై మీ చరణాల చెంత విడిగేను స్వామీ!

హ్యూమన్ కంప్యూటర్



ఆచార్య ప్రభాకర శ్రీకృష్ణభగవాన్
ప్రిన్స్‌పాల్ రిటైర్డ్, సంస్కృత కళాశాల
రాజమండ్రి

నా స్వామి సుందర చైతన్యానంద. కాదు కాదు. నీ స్వామి సుందర చైతన్యానంద. కానే కాదు. మన స్వామి సుందర చైతన్యానంద. అవును. మన స్వామి, మనందరి స్వామి. మన కోసం ఉన్న స్వామి. మనందరి కన్నీళ్ళు తుడవడానికి వచ్చిన స్వామి. మనందరి హితం కోసం, మన ధర్మం కోసం, మన మతం కోసం, నిరంతరం పరితపించే స్వామి. మనలో ఒకరైన స్వామి. అందరిలో తానైన స్వామి.

శ్రీ సుందర చైతన్యానంద స్వామి. ఎంత తియ్యని పేరు! ఎంత చక్కని రూపు! ఎంత మధురమైన వాక్కు! రండి. పదండి. మన స్వామిని దర్శిద్దాం. మన స్వామిని అర్చిద్దాం. మన స్వామి అమరగానంలో పరవశిద్దాం.

ఆశ్రమ ప్రాంగణంలో ప్రసన్న వదనులై, ధీర గంభీరులై, పద్మాసనారూఢులై ప్రవచిస్తున్న బ్రహ్మతేజో విరాజితులయిన శ్రీ సుందర చైతన్యానంద మహాస్వామి సనాతన ధర్మప్రచార మహోద్యమ వైతాళికులు. భారతీయ వేదాంత విజ్ఞాన రహస్య ప్రబోధక సార్వభౌములు. హిందూ ధర్మ ప్రవచన పారీణులు. శ్రీ స్వామి మహా తపస్సంపన్నులు. తపో నిష్ఠాగరిష్ఠులు. వశ్య వాక్కులు.

శ్రీ స్వామి వచస్వి. శ్రీ స్వామి వర్చస్వి. శ్రీ స్వామి మనస్వి. శ్రీ స్వామి తేజస్వి. శ్రీ స్వామి యశస్వి.

అనంతములైన వేదముల లోని ధర్మ స్వరూపాన్ని సాంగోపాంగంగా శ్రీ స్వామి ఉద్బోధిస్తున్నారు. ఉపనిషత్తులలో ప్రతిపాదింప బడిన ఆత్మస్వరూపాన్ని, శ్రీ స్వామి సంక్షిప్త సుందరంగా ప్రబోధిస్తున్నారు. పురాణాల లోని విజ్ఞాన వైభవాన్ని శ్రీ స్వామి ప్రవచిస్తున్నారు. ధర్మశాస్త్రాల లోని సూక్ష్మాతి సూక్ష్మములైన అంశములను శ్రీ స్వామి విపులీకరిస్తున్నారు. ఇతిహాసముల లోని తాత్త్విక సిద్ధాంతములను, శ్రీ స్వామి బోధిస్తున్నారు. భారతీయ వాఙ్మయానికి తలమానికములైన రామాయణ, భారత, భాగవతముల లోని కథా సంవిధాన విధానాన్ని, శ్రీ స్వామి మధురాతి మధురంగా ఉపన్యసిస్తున్నారు. సర్వోపనిషత్సారమైన గీతాశాస్త్రాన్ని, శ్రీ స్వామి పారవశ్యంతో అనుగ్రహిస్తున్నారు. త్యాగరాజు, సూరదాసు, కబీరు, తుకారాం, మీరా, ఏకనాథ్, నామదేవుల సంకీర్తనల గానంతో పులకింప జేస్తున్నారు. ఇదొక మరువలేని, మరపురాని, మధురానుభూతి.

శబ్దమాధుర్యం, అర్థగాంభీర్యం, అలంకార చాతుర్యం, వ్యంగ్య వైభవం, లలిత పదవిన్యాస కళా ప్రావీణ్యం, ఆంగ్లభాషా వైదుష్యం, సంస్కృతాంధ్ర సాహిత్య సర్వంకష ప్రజ్ఞా విశేష వాగ్వైభవం, ప్రతిభా సంపద, ధారణాబలం, ధారాశుద్ధి, అభ్రగంగా వేగం, ఇవన్నీ కలిసిమెలసి, ఒక్కటిగా, ఒక్కొక్కటిగా, శ్రీ సుందర చైతన్యానంద స్వామిని ఆశ్రయించినవి.

శ్రీ స్వామి తన **44** వ సంవత్సరం వయస్సు నాటికే, ఆసేతు శీతాచలం సుడిగాలిలా, విస్తృతంగా పర్యటించారు.



నూరు జ్ఞాన యజ్ఞాలను రంగరంగ వైభవంగా నిర్వహించారు. తన ఆధ్యాత్మిక మహోపన్యాసాల ధర్మగంగలో అశేష భక్తజనాన్ని పుణ్యస్నానం చేయించారు. అభారతీయ పిడివాదా లను తన వాగ్బాణాలతో సంహరించారు. నాస్తిక, హేతువాదుల అశాస్త్రీయ సిద్ధాంతాలను తన వాగాడంబరంతో నేల కొరిగించారు. తన శిష్యుల హృదయ కేదారాలలో భక్తి మందారాలను చిగురింప జేశారు. సత్సంగాలలో, అనుష్ఠాన వేదాంతానికి శ్రీకారం పలికారు.

'మహేశ ముకుటీ కోటీర కల్లోలినీ కల్లోల ప్రతిమల్ల సూక్తి విభవము' లతో భక్తకోటికి నవరసాల ప్రసాదాన్ని అందించారు.

'నా నీతి వినని వానిని
భానుని కిరణములు మీద బారని వానిన్
వానను తడియని వానిని
గానమురా కుందవరపు కవిచౌడప్పా '

సూర్యకిరణాలు సోకని వానిని, వానలో తడియని వానిని, చూడజాలమని కవిచౌడప్ప చెప్పినట్లుగా, శ్రీ సుందర చైతన్యానంద ప్రసంగ పరిమళముతో గుబాళింపని ఆస్తిక హృదయమే కానరాదు.

ప్రవక్త

శ్రీ సుందర చైతన్యానందస్వామి వక్త. వక్తలకే వక్త. మహావక్త. ప్రవక్త. శ్రీ స్వామి వారి భాషణములు వాగ్దేవికి భూషణములు. లలిత లావణ్య సంపన్న ములు. సూరి హృదయ పరితోషణములు. సహృదయ హృదయంగమములు. వారినుడులు, నానుడులు, పలుకుబడులు అనుపమానములు. అనన్య సామాన్య ములు. అత్యంత మనోజ్ఞములు. భారతీయ ధర్మాన్ని ప్రబోధించడంలో, ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఉపదేశించడంలో నైతిక విలువలను ప్రవచించ డంలో, శాస్త్రీయ విజ్ఞానాన్ని అందచేయ డంలో, ధర్మ సూక్ష్మాలను వివరించడంలో, కర్తవ్యా కర్తవ్యములను ఉద్బోధించడంలో, శ్రీ స్వామివారి శైలి, బాణీ, సముదాత్త సుందరం. ముగ్ధ మనోహరం. వారి ప్రసంగాలలో ఒక్కొక్కసారి మేఘ గర్జనలు, మరోసారి మలయమారుతపు చల్లగాలులు, వెన్నెల రాత్రుల మధురిమలు, తీయని తెలుగు పదాల ఒంపుసొంపులు, గాఢ - గూఢ - నిగూఢ - సంస్కృత సమాసముల సోయగాల, లోకోక్తుల వయ్యారాలు, సరిగమల సరస సరాగాలు, కర్మ-భక్తి-జ్ఞాన వైరాగ్యాల హోరుగాలులు, ఉపనిషత్సూక్తుల శుకాలాపాలు ప్రతిధ్వనిస్తూ శ్రోతలను మంత్రముగ్ధులను గావించును. శిష్యవత్సలులు, బహుముఖ ప్రతిభా భాస్వంతులైన శ్రీ స్వామి వారి ప్రవచనాలు, ఆర్షసంస్కృతీ పరిజ్ఞానానికి కరదీపికలు. హిందూ విజ్ఞాన వైభవానికి మంగళ తోరణాలు. భారతీయ ధర్మ ప్రాభవానికి జయజయ ధ్వానాలు.

జగద్గురు శంకరులు, అరవిందులు, స్వామి వివేకానంద, రామతీర్థులు, సమర్థ రామదాసు, త్యాగరాజు, తులసీదాసు, మొదలైన మహాత్ముల సర్వ సమగ్ర సంక్షిప్త స్వరూపమే శ్రీ సుందర చైతన్యానంద స్వామి అని లక్షలాది ఆస్తిక సోదరులు భావించడంలో ఆశ్చర్య మేముంది?

విజ్ఞాన సర్వస్వం

శ్రీ సుందర చైతన్యానంద స్వామి భారతీయ విజ్ఞాన సర్వస్వం. సనాతన ధర్మ పరిమళం. ఆర్షసంస్కృతీ సభ్యతల భాండాగారం. ఆధునిక అర్థనాస్తిక లోకంలో, ధర్మ ప్రబోధం చేయడం సులభసాధ్యం కాదు. వేద, శాస్త్ర, పురాణ రహస్యా లను పండిత పామర జనరంజకంగా ప్రవచించడం సుగమం కాదు. వితండవాదుల ప్రశ్న పరంపరలకు సంతృప్తికరంగా, సశాస్త్రీయంగా, అనుభవ పుర స్సరంగా, సమాధాన మివ్వడం నల్లేరుపై బండినడక కాదు. ఎంతో శాస్త్ర పరిచయం, గ్రంథావలోకనం, తపోనిష్ఠ, ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్య పరిశీలన, పరిశోధన, లోకానుభవం, సమయస్ఫూర్తి, హాస్య చతురత, సమ్మోహనా శక్తి, శాబ్దిక మహేంద్ర జాలం ఎంతగానో అవసరం. ఇన్ని శక్తియుక్తులు

కలిగి యుంటేనే, వేదికపై వీరవిహారం చేసి, ఆధ్యాత్మిక జైత్ర యాత్రను దిగ్విజయంగా కొనసాగించడం సాధ్యం. శ్రీ స్వామీజీలో ఈ లక్షణాలన్నీ పుష్కలంగా తిష్ఠ వేసుకున్న కారణం చేతనే ఆయన ప్రసంగాలకు శ్రోతలు లక్షలాదిగా ఆకర్షితు లవడం, శ్రీవారి ఉపన్యాసాలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలకించడం, వారి వాగ్ధాటికి శిరస్సు వంచి నమస్క రించడం జరుగుతూ ఉంది.

శ్రీ స్వామీజీ గురుకుల క్లిష్టములైన బహు శాస్త్రాలను, ఎన్నో అమూల్య గ్రంథాలను ఎవరి శిష్యరికంలో అభ్యసించారు? శ్రీ శంకర భగవత్పాదుల భాష్య రత్నాలను, ఏ గురుదేవుల పాద సన్నిధిలో అధ్యయనం గావించారు? అనేకానేక వేదాంత గ్రంథాలను, సాహిత్య గ్రంథాలను, ఏ ఆచార్యదేవుని అనుగ్రహ వీక్షణాలతో అవగాహన చేసుకున్నారు?

25-12-1947 వ సంవత్సరంలో నెల్లూరు జిల్లా లోని బుచ్చిరెడ్డిపాలెం మండలం లోని కట్టుబడి పాలెంలో, శ్రీ పెరుంబుదూరు వెంకటశేషాచార్యులు, రంగనాయకమ్మ పుణ్యదంపతులకు ఎనిమిదవ సంతానంగా జన్మించిన శ్రీ స్వామి బి.ఎ. పట్టభద్రులు. శ్రీవారి ఆధ్యాత్మిక గురువు శ్రీకృష్ణ పరమాత్మ. చిన్నతనం నుండి దీక్షతో, తపనతో, దృఢ విశ్వాసంతో, త్రికరణ శుద్ధితో, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, కష్టనష్టాల నెదుర్కొని, కైవల్యా నదీ తీరంలో సైకత ప్రదేశాలలో, ధ్యాన నిష్ఠాగరిష్ఠులై, అధ్యయనం కొనసాగించి అపూర్వ పాండితీ గరిమను, ప్రతిభా సంపత్తిని సముపార్జించిన శ్రీ స్వామి, పరమేశ్వర

కరుణా కటాక్షలబ్ధ సమస్త విద్యా ప్రవీణులు. సుమధుర, సుందర, వాగ్విలాస, వైభవ, ప్రాభవ, శ్రీ సుశోభితులు.

మధుర సంగమం

మనం నిశితంగా పరిశీలిస్తే అవగతమయ్యే రహస్యం ఒకటుంది. అది ఎంతో ఆసక్తిదాయక మైంది. ఆశ్చర్యకరమైంది కూడా. స్వర్గధామం నుండి దిగి వచ్చే స్వచ్ఛంద గంగా ప్రవాహం వలె, తన ఉపన్యాస పరంపరలచే, శ్రోతలను మంత్ర ముగ్ధులను గావించే వక్త మహోద్గ్రంథ రచయిత అవడం అరుదు. లలిత లలిత భావాలతో, మెత్తని పదజాలంతో, మృదుమధుర మంజుల రచనా విన్యాసంతో, విషయ గాంభీర్యంతో, అలంకార కళా ప్రావీణ్యంతో, రసస్ఫూర్తిదాయక ఊహాల హేలల్లో వేదాంత విద్యాప్రబోధక ఉక్తి సౌందర్యంతో, ఆధ్యాత్మిక తత్త్వ గాంభీర్యంతో, మహోద్గ్రంథాలను రచించే రచయిత వక్త అవడం కూడా అరుదే. వక్త, రచయిత ఒకరే అయితే! రచయిత, వక్త ఒకరే అయితే! నిజంగా బంగారానికి పరిమళ మబ్బినట్లే. శ్రీ స్వామి గళం మధుర మైనది. కలం ప్రౌఢ మయినది. వారి పరిశీలనము నిరుపమానము. వారి పాండిత్యము కూలంకషము. అందుకనే ఎంద రెందరో, ఎంత చెప్పినను, ఎంత వ్రాసినను, పుష్పక విమానము నందు వలె, కొంతచోటు మిగిలి పోవుచునే ఉండును. శ్రీ సుందర చైతన్యానంద మహావక్త. మహోద్గ్రంథ రచయిత. శ్రీ స్వామి నూరు గ్రంథాలను రచించి ప్రచురించారు. ఎన్నో గ్రంథా లకు వ్యాఖ్యానాలు వెలయించారు. ఉపనిషత్ మాధుర్యాలను అందించారు. పండుగల ప్రాశస్త్యాన్ని తేటతెల్లం గావించారు. శివానందలహరి సౌందర్యాన్ని అనుగ్రహించారు. విష్ణుసహస్రనామ వైభవాన్ని రుచి

చూపించారు. పురుషసూక్త స్వరూపాన్ని విశదీక రించారు. బ్రహ్మసూత్ర దీపికలను ఆప్యాయతతో అందించారు. చంద్రభాగాతరంగాలలో, రసజ్ఞ హృదయాలకు పన్నీటిస్నానం చేయించారు. భాగవత రససుధా ధారలతో, తెలుగు నేలను పునీతం గావించారు. శ్రీవారి రచనలు అన్నీ ఆణిముత్యాలే. చదువుల తల్లికి సమర్పించిన అపూర్వ ఆభరణాలే. ఆస్తిక ప్రపంచానికి సర్వదా ఆదరణీయాలే. సర్వథా శిరోధార్యాలే. శ్రీ స్వామి అమృతలేఖిని నుండి ఎన్నో! ఎన్నెన్నో! మరెన్నో! ఇంకెన్నో! అమూల్య గ్రంథాలను ఆశిద్దాం.

వ్యక్తిత్వ సౌరభం

శ్రీ సుందర చైతన్యానంద స్వామిది విశిష్ట వ్యక్తిత్వం. శ్రీ స్వామి శిష్యులలో విశిష్టులు. విశిష్టులలో వశిష్టులు. ప్రాచీన ఆర్ష ఋషి పరంపరకు చెందిన ఉత్తమ సంస్కారం, వ్యక్తిత్వం, త్యాగనిరతి, సేవాభావం సమాజ కళ్యాణదృష్టి, తత్త్వచింతన, సంయమనం ఇవన్నీ శ్రీ స్వామిలో ప్రస్ఫుటంగా ద్యోతక మగుచున్నవి. లక్షలాది భక్తజనాన్ని ఉద్దేశించి వేదికపై అనర్గళంగా ప్రసంగించే శ్రీ స్వామికి, వేదిక దిగిన తరువాత చిరునవ్వులు చిందిస్తూ అందరినీ ఆత్మీయంగా, ఆప్యాయంగా పలకరించి పులకింప చేసే శ్రీ స్వామికి ఎంతో వ్యత్యాసం కనబడుతుంది. శ్రీ స్వామి ఆలోచన, ఆందోళన, ఆవేదనలు వేదికపై తొణికిసలాడు తుంటే, ప్రేమ, వాత్సల్యం, మమత, మమకారాలు వేదిక నుండి దిగిన శ్రీ స్వామిలో మనం చూస్తున్నాం. నిజమే. ధర్మోపదేశ సమయంలో ఆ నిరంకుశత్వం ఎంతో అవసరం.

భగవంతుడు కాలస్వరూపుడు. కాలపు విలువను విస్మరిస్తున్న మన దేశంలో స్వామి సమయపాలనం నిక్కచ్చిగా చేస్తూ అందరికీ ఆదర్శ ప్రాయుడైనాడు. శ్రీ స్వామి ఆశ్రమంలో ఉన్నా, వేదికపై ఉన్నా, ఎక్క డున్నాసరే. సమయానుసారం అన్నీ జరుగ వలసిందే. ఆయన మూర్తి మనకు స్ఫూర్తిని కలిగిస్తుంది. శ్రీ స్వామి సన్నిధానంలో నిశ్శబ్ద వాతావరణం తొంగి చూస్తుంది. స్వామి ఆకర్షణ శక్తికి ఇదొక చక్కని ఉదాహరణ.

శ్రీ స్వామి అష్టావధాన, శతావధానాలే కాదు. సహస్రావధానం చేస్తూంటారు. ఒక వైపు నిర్విరామ గ్రంథ రచన, మరొక వైపు సుదూర ప్రాంతాలకు వెళ్ళి చేసే మహోపన్యాసాలు. 'గిరిధారి' పత్రిక వ్యాస పరిశీలన ఒక వైపు, భక్తులకు హితోక్తులు మరొక వైపు. బ్రహ్మచారులకు సూచనలు ఒక వైపు, ఆశ్రమ అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష మరొకవైపు. పాద నమస్సుల స్వీకరణ ఒక వైపు. దూరశ్రవణ యంత్రంలో ఆత్మీయుల పలకరింపులు మరొక వైపు. చర్చలు ఒక వైపు, ఛలోక్తులు మరొక వైపు. అందుకే నే నంటాను. శ్రీ స్వామి 'హ్యూమన్ కంప్యూటర్' అని.

శ్రీ గురుభ్యో నమః

శ్రీ డి. రాఘవేంద్ర రావు
హైదరాబాద్

పూర్వ జన్మార్జిత సుకృత దుష్కృతాల సమ్మేళనమే మానవజన్మకు హేతువు. ప్రారబ్ధానుభవానికి ఆచారవంతులైన పుణ్యదంపతుల ఆఖరి బిడ్డగా జన్మించి, దేశవిదేశాలలో అనేక కష్టాల మధ్య బాల్య యవ్వన దశలు గడిపి, వృద్ధాప్యంలో అడుగుపెట్టే సమయంలో పరమాత్మ కృప వల్ల సద్గురు పరిచయ భాగ్యం లభించింది.

1998లో బెంగుళూరు నేషనల్ కాలేజి ఆవరణలో పూజ్య గురుదేవులు జరిపిన జ్ఞానయజ్ఞంలో పాల్గొని ప్రవచనాలు శ్రవణం చేసే భాగ్యం నాకు కలిగింది. అద్భుతమైన ఆ ప్రసంగాలను ఇప్పటికీ నా మనసులో వింటూ ఉంటాను.



నా ఆనందాన్ని, అనుభూతిని పూజ్య స్వామీజీకి ఉత్తరం ద్వారా తెలియచేయటం జరిగింది. దాని పర్యవసానంగా మరొకసారి స్వామీజీ దర్శనభాగ్యం లభించింది. ఆ సమయంలో స్వామీజీ అన్న మాటలు నా జీవిత సరళిని పూర్తిగా మార్చేశాయి. ప్రేయస్సు నుండి శ్రేయస్సు వైపుకు మళ్ళించాయి. ధవళేశ్వరం వానప్రస్థాశ్రమంలో చేరటానికి వెళ్ళి, ఆ తరువాత స్వామివారి ఆశ్రమ సేవలో పాల్గొనే అవకాశాన్ని పొందాను. నాలుగు సంవత్సరాలు హైదరాబాద్ ఆశ్రమంలో నివాసం స్వర్గవాసంలా గడిచింది. పూర్వపుణ్య ఫలం ఇదేనేమో అనిపిస్తుంది.

పూజ్య స్వామీజీ ప్రవచనాల శ్రవణఫలంగా పురుషార్థ నిశ్చయం దృఢంగా ఏర్పడింది. కేనోపనిషత్తు, నారదభక్తి సూత్రాలపై గురుదేవుల ఉపన్యాసాల ఫలితమే అది. శేష జీవితాన్ని గురుదేవుల పాదాల చెంత గడపాలని నిశ్చయించుకున్నాను. ఆ తరువాత, ఇప్పటివరకు మరో ఆలోచనే లేదు. ఆశ్రమ జీవితంలో నాకు కలిగిన అనుభవాలను, నా అభిప్రాయాలను గిరిధారి పాఠకులతో పంచుకొనే ఉద్దేశ్యంతో ఈ వ్యాసం వ్రాయాలని సంకల్పించాను. పూజ్య స్వామీజీని చాలా సమీపంగా పరిశీలించే అవకాశం వల్ల ఏర్పడిన అభిప్రాయాలు ఇవి.

(1) భక్తుల బాధలు తనవిగా భావించటం, వారికి ఉపశమనం కలిగించేలా సమయోచితంగా సముదాయించటం స్వామీజీలో నేను దర్శించిన దైవలక్షణం. చాలా దుఃఖంతో వచ్చినవారు దర్శనమైన తరువాత నవ్వు కుంటూ తిరిగిపోవటం మేము తరచుగా గమనిస్తూ ఉంటాము.

(2) అనారోగ్యంతో శరీరము, కలతలతో మనస్సు బాధపడుతున్న సమయాలలో కూడా స్టేజి మీదకు వెళ్ళి రెండుగంటల కాలము భక్తులను నవ్విస్తూ

ఉపన్యసించటం పూజ్య గురుదేవులకే సరిపోయింది. ఆ పరిస్థితులలో వేరొక రెవరైనా ఉంటే ఉపన్యాసం రద్దు చేసేవారే. దక్షిణామూర్తి స్తోత్రం నాలుగవ శ్లోకంలో రెండవపాదం

జ్ఞానం యస్యతు చక్షురాది కరణ ద్వారా బహిస్పందతే

గురుదేవులలో ప్రత్యక్షంగా దర్శనీయమవుతూ ఉంటుంది.

(3) నేను ఇది చెయ్యగలను, అది చెయ్యగలను అని స్వామిజీ ముందు అనటం చాలా అవివేకమని నేను స్వానుభవంతో గ్రహించాను. నవ్వుతూనే అహంకారు లను సిగ్గుపడేలా చేస్తారు. కర్మలు-కర్మఫలాల విషయంలో వారిది అద్భుతమైన అవగాహన. స్వామిజీ ప్రసాదించే అవగాహన ఉండాలే గాని ఎటువంటి ఫలితం వచ్చినా నిరాశ ఉండదు.

(4) ఆశ్రమవాసులకు లభించే ప్రివిలేజస్‌లో మరువలేనిది ఒకటుంది. స్వామిజీ తాము వ్రాసిన కవితల్ని, రచనల్ని, లేఖల్ని ఆశ్రమవాసుల్ని దగ్గర కూర్చొబెట్టుకొని తామే స్వయంగా చదివి వినిపిస్తారు. నిజభావనలను విశదీకరించి చెబుతారు. అసలే తీరిక లేని స్వామిజీ మాకొరకు సమయ మిచ్చి అలా చెబుతూ ఉంటే, ఈ భాగ్యం ఏ కార్యాలు చేసి పొందామో అనిపిస్తుంది.

(5) కొందరు వ్యక్తులు రాగద్వేషాల మధ్య సతమత మవుతూ, అహంకారంతో విఱ్ఱవీగుతూ ఉంటారు. సున్నితంగా అలాంటి వారిని దండించినా, మనసులో మాత్రం వీరు మారుతారు - నేను ప్రయత్నిస్తాను అని స్వామిజీ అనుకొంటూ ఉంటారు. వేలాది మంది భక్తులను ఈ విధంగా ఆలోచిస్తూ ప్రవర్తించటం స్వామిజీకే సాధ్యం. ఒకొక్కసారి ఆయన సహనానికి హద్దులు లేవు అనిపిస్తుంది.

అటు మాట్లాడుతూ ఉంటారు. ఇటు వ్రాస్తూ ఉంటారు. పాటలు, భజనలు వ్రాసి స్వరపరుస్తూ ఉంటారు. దూరప్రాంతాల భక్తులను గూర్చి ఆలోచిస్తారు. స్వామిజీది బహుముఖ ప్రజ్ఞ. అటువంటి వ్యక్తి సద్గురువుగా లభించి, వారికి సేవ చేయగలిగే భాగ్యం లభించటం నాకు గర్వకారణంగా కూడా ఉంటుంది.

పూజ్య గురుదేవులు తమ 77 సంవత్సరాల జీవితంలో, 57 సంవత్సరాలు మానవ కళ్యాణానికి వినియోగించారు. పూజ్య స్వామిజీ వంద సంవత్సరాలు పూర్ణ ఆరోగ్యంతో జీవించి, భక్తుల హృదయ తాపాన్ని తీర్చగలరని ప్రార్థిస్తూ ఈ రచనను ముగిస్తున్నాను.

స్వామీజీ ప్రజ్ఞా కౌశలం

శ్రీ జి.వి.కృష్ణారెడ్డి
జి.వి.కె.ఇండస్ట్రీస్ అధినేత
హైదరాబాద్

తల్లిని మించిన దైవం లేదంటారు. అటువంటి నా తల్లిగారైన గునుపాటి రుక్మిణమ్మగారు స్వామివారి ప్రసంగాలను విని భక్తురాలైంది. ఇప్పటికీ, ఆమె 90 సంవత్సరములు వయస్సున్నప్పటికీ, స్వామివారి కార్యక్రమాలలో పాలు పంచుకోవడం కోసం భక్తిగా నెల్లూరు నుండి ఇక్కడికి వస్తూ ఉంటుంది. అటువంటి భక్తురాలైన నా తల్లిగారి అడుగుజాడలలో నడుస్తూ, నేను కూడా స్వామిగారి భక్తుడనై ఇక్కడకు రావడం జరుగుతూ ఉంది.

నాకు చిన్నతనం నుండి తెలిసిన విషయ మేమిటంటే, ధర్మంగా జీవనాన్ని నడిపించ డానికి ఎందరో మహానుభావులు భగవంతుని దూతలుగా మానవ లోకానికి వస్తారు. అలా వచ్చి ఫలాపేక్ష లేకుండా మానవుల్ని ఆధ్యాత్మికంగా చైతన్యవంతుల్ని చేస్తారు. శ్రీస్వామి వారు కూడా అలాంటి కోవకు చెందినవారే నని అనుటలో సందేహం లేదు.

శ్రీ స్వామివారు వారి ప్రసంగములతో ఎంతో మందిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతూ ఆదర్శాచార్యులుగా పిలువబడుతూ ఉన్నారు.

యాంత్రికంగా సాగే జీవనానికి, అలసి సేద తీర్చుకోవాలనే మనస్సులకి స్వామివారి ప్రసంగాలు, ప్రవచనాలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయి. కాబట్టే, పలు ప్రాంతాల నుంచి భక్తులు ముందుగానే వచ్చి స్వామివారి కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈ విధంగా స్వామివారు, భక్తులకు జీవిత పరమార్థాన్ని బోధిస్తూ ధన్యులౌతున్నారు. భక్తులను తరింపజేస్తున్నారు.

పూజ్య స్వామీజీ వేదికపై నుండి ప్రసంగిస్తూ ఉంటే, ఆసీనులై వింటున్న శ్రోతల్ని చూసి నేను ఆశ్చర్యపోయాను.

ప్రసంగం సాగుతున్నంత సేపు వేలాది మంది శ్రోతలు దేహాలను కూడా కదల్చకుండా నిశ్చేష్టులై వినడం నాకు పరమాశ్చర్యాన్ని కలిగించింది.

ఒక దశలో శ్రోతలుగా ఉన్నది మనుషులా? లేక బొమ్మలా? అనే ప్రశ్న కూడా తలెత్తింది. నేటి సమాజంలో ఈ విధమైన క్రమశిక్షణ అనూహ్యం. అద్భుతం. ఇదంతా స్వామీజీ ప్రజ్ఞా కౌశలం.

శ్రీకృష్ణభగవానుడు స్వామీజీకి ఆయురారోగ్యము లను ప్రసాదించగలరని కోరుకుంటూ - శెలవు తీసుకుంటాను.

పరమ పూజనీయ ప్రణతులివిగో

శ్రీ నన్నపురాజు రామేశ్వర రాజు
డిప్యూటి డైరెక్టర్ (రిటైర్డ్)
జిల్లా విద్యాశాఖాధికారి
హనుమకొండ

ఆ॥ వె॥ ఆర్షవిద్య యందు ఆరితేరిన వారు
ఆత్మవిద్య నొసగు ఆత్మవిదులు
శుద్ధ జ్ఞానగంగ బుధులెంతొ మెచ్చంగ
సుధలను గురిపించు సురులు మీరు ॥

ఆ॥ వె॥ కంచు కంఠ మందు కాంచన స్వరఝరి
కర్ణపేయముగను, గదలి సాగ
విష్ణు తత్త్వమైన కృష్ణయ్య కథలైన
శ్రోతల మురిపించు శోభ మీది ॥

ఆ॥ వె॥ కఠినమైన గాని, జఠిలమైనను గాని
వేద విషయములను వింగడించి
ద్రాక్షపాక మందు దీక్షతో బోధించు
భాగ్యదాత మీరు, భక్త తతికి ॥

ఆ॥ వె॥ జ్ఞానయజ్ఞములలో గానకోకిల వయ్యి
వంద పైన వ్రాసి గ్రంథములను
అందజేసి మాకు అద్వైత సిద్ధాంత
రుచిని జూపిన పరమ ఋషులు మీరు ॥

ఆ॥ వె॥ నాభి నుండి పలుకు నాదబ్రహ్మము మీరు
ఆలపించి భజన ఆర్తి తోడ
జాగృతంబు చేసి, జనుల మనంబుల
భక్తి పాదు కొలుపు శక్తి మీరు ॥

ఆ॥ వె॥ గ్రామసీమ లందు కదిలించి రథమును
సంప్రదాయములను చాటి చెప్పి
తెలుగునాట భక్తి వెలుగులు నింపెడు
పరమ పూజనీయ ప్రణతు లివిగో ॥

సద్గురు వైభవం

శ్రీ సి. శ్రీరామ మూర్తి
హైదరాబాద్

ఎవరా వ్యక్తి - ఏమా శక్తి
కోర్కెలన్నిటిని - సంన్యసించి
తనలోనె తానె - సంతసించు వ్యక్తి ॥ ఎవరా ॥

శీతోష్ణములకు - చెదరనివాడు
సుఖదుఃఖములకు - బెదరనివాడు
రాగద్వేషముల కందనివాడు
క్రోధభయములకు - లొంగనివాడు ॥ ఎవరా ॥

శుభాశుభములకు చిందులు వేయక
లాభాలాభాల స్పృహయే లేక
సమభావముతో - నిశ్చలమనసుతో
మనన శీలుడై - మహిమ గలవాడు ॥ ఎవరా ॥

ఆప్తకాముడై - ఆత్మబంధువై
మన కాలమున అవతరించిన
ఆ వ్యక్తి ఎవరో కాదు
సుందర చైతన్య స్థితప్రజ్ఞుడే
బ్రహ్మజ్ఞాని - జ్ఞానబ్రహ్మ ॥ ఎవరా ॥

వందే వందే - వందిత పూజ్య
వందన మిదిగో - విద్వద్వరేణ్య
పాహిమాం - పాహిమాం - పావన చరితా
పాహిమాం - పరమ దయానిధే
పాహిమాం - పాహిమాం - పాహిమాం ॥ ఎవరా ॥

ప్రణుతి

శ్రీ మద్దిపట్ల సుబ్రహ్మణ్య శర్మ
రేపల్లె

శ్రీనందనందన పద
ధ్యానానందైక తుందిలాత్ముని, బ్రహ్మ
జ్ఞానిని, సుందర చైత
న్యానంద స్వామిని శరణంచు భజింతున్ 1

ఏ స్వామి సుందరశ్రీ స్వరూపముగన్న
అతిలోక పారవశ్యంబు గలుగు
ఏమౌని మంజులామృత భాషణము విన్న
సన్మార్గ వర్తనాసక్తి గలుగు
ఏ యోగి పదసేవనా యోగమబ్బిన
భక్తి భావప్రభావంబు వెలుగు
ఏ మహర్షి దయార్ద్ర దృక్కులు సోకిన
చిత్త చాంచల్య దుస్థితి తొలంగు

ఆ మహాత్ముని వేద వేదాంతశాస్త్ర
బహుపురాణేతిహాస ప్రబంధ సత్కథా
రహస్యార్థ విజ్ఞాన సారమతిని
ప్రణుతి జేసెద వాక్కు సార్థకత నొంద 2

వేణునాదమో, ఆమని పికరవమ్మొ
స్వామిగానమ్ము, స్వరసుధా సాగరమ్ము
భక్తిఁ బరవశ మందుచు పాడుచుండ
భక్తులెల్లరు గోపాల బాలు రపుడు 3

శతము మించిన జ్ఞానయజ్ఞము లొనర్చి
భక్తి వర్షము కురిపించి, భక్తహృదయ
సీమ వైరాగ్య బీజముల్ చెలగినాటి
సౌఖ్యసస్యము పండించు స్వామి గొలుతు 4

గురువు - చైతన్య కల్పతరువు

శ్రీమతి సి.పద్మ, ఎమ్.ఎ.
డా॥ శ్రీ సి.హెచ్.మోహన్ రావు, డి.ఎమ్. (న్యూరో)

పవిత్రమైన పరమాత్మ సృష్టిలో తల్లికి బిడ్డ ఒక అపురూపమైన వరమైతే బిడ్డకు తల్లి భగవత్స్వరూపమే. తల్లీబిడ్డలను ఒకరి జీవితానికి మరొకరు సార్థకతను, పరిపూర్ణతను కలిగించుకునే విధంగా పరమాత్మ అనుగ్రహించాడు.

ప్రతి తల్లి తన బిడ్డ పురోగతిని కళ్ళారా చూడాలని కలలు కంటుంది. కాని, పుట్టుక తోనే పరిమళించే తమ బిడ్డల ఉజ్జ్వల భవిష్యత్తును ఆదిలోనే గుర్తించి, అందుకు దోహదపడి, ఆ వైభవాన్ని దర్శించే భాగ్యాన్ని భావితరాలకు కలిగించి నిశ్శబ్దంగా తరలిపోయే కన్నతల్లులు ఇలలో కల్పవల్లులు. పారిజాతం పుట్టేది కల్పవృక్షం లోనే.

సాధుమహాత్ములు ఉద్భవించేది సాధ్వీమ తల్లుల గర్భము నందే. అటువంటి ప్రేమమయి, త్యాగమయి, అనురాగమయి అయిన ఒకానొక కల్పవల్లి హృదయ కుసుమమే మన పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారు. నేడు ఎందరో తల్లులకు బిడ్డ. మరెందరో బిడ్డలకు తల్లిదండ్రి.

'స్వామీజీ! మీరు తప్ప నా కెవరూ లేరు. మీరు లేకుండా నేను బ్రతకలేను' అనే భక్తులు ఆది నుండి మన ఉద్యమంలో కోకొల్లలు. అలా అనే వారిలో కోటికి పడగెత్తిన వారు ఉన్నారు, కూటి కొరకు పాటు పడేవారు ఉన్నారు. విద్యావేత్తలు ఉన్నారు, నిరక్షరాస్యులూ ఉన్నారు. ఊపిరి సలపని ఉద్యోగస్తులు ఉన్నారు, ఉద్యోగ విరమణ గావించి విశ్రాంతి తీసుకుంటున్న వృద్ధులూ ఉన్నారు. వీరందరు ఎవరూ లేని ఏకాకులు కారు. అన్నీ ఉన్నా, అందరూ ఉన్నా, ఎవరూ లేని వారము అని ఎరిగిన వివేకవంతులు. ఉన్నవారికి, లేనివారికి, అందరికి స్వామీజీ కావాలి అంటే ఉన్నవారు, లేనివారు అందరూ లేని వారే - సుఖం లేని వారే అని అర్థం. సుఖకారణం జ్ఞానమే కనుక ఒక్క సద్గురువు వల్లనే తప్ప మనిషికి సుఖం లభించే అవకాశం లేదు. మోక్షం ఉండేది జ్ఞానరూపంలో అయితే జ్ఞానం దొరికేది గురువు వద్దనే. మూర్తీభవించిన జ్ఞానమే గురుదేవుడు. గురువులో ఉండేదంతా పరమాత్మ జ్ఞానమే కనుక గురువు సాక్షాత్ పరబ్రహ్మమే. మనకు ఏమి కావాలో మనకు తెలియకపోయినా ఫరవాలేదు. పూర్వ పుణ్య విశేషం వల్ల, భగవత్కృప వల్ల, అవనిపై అహేతుకంగా నడయాడే పరమపురుషుడు గురుదేవుడు అని తెలిసి, ఆయనను సమీపించి, ఆయన చేతులలో నేను సంస్కరింపబడాలి అనే సద్బుద్ధి మనలో కలిగితే చాలు. ఆ తరువాత ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు ఆటలు నేర్పి, పాటలు నేర్పి, అన్నం పెట్టి పాఠాలు చెప్పిన విధంగా గురువు అనే కల్పతరువు నీడలో శిష్యుడికి ఇహపరాలు ఈడేరుతాయి.

వాసన లేని పూలు కళ్ళకు విందే గాని మనసుకు ఆహ్లాదాన్ని కలిగించలేవు. సువాసనను వెదజల్లే పువ్వు కంటికి కనిపించకున్నా మనిషి దానిని వెతికి మరీ పట్టుకుంటాడు. ఎవరివో ఆశలు తీర్చాలని, ఆర్తిని బాపాలని పూజ్య స్వామిజీ కదిలి రాలేదు. ఆకాశంలో సూర్యుడు ఉదయిస్తూ ఉంటే లోకంలో అంధకారం అదృశ్యమైనట్లు, వేదాంత గగనంలో శ్రీ స్వామివారి విహారం ముముక్షువుల అజ్ఞానాన్ని పటాపంచలు చేసింది. జనులపై వారికున్న అపారమైన ప్రేమ వారిలో నిక్షిప్తమై ఉన్న జ్ఞానాన్ని ద్రవీభవించి నదిలా ప్రవహించేలా చేసింది. పొంగి పొరలే శ్రీ స్వామివారి జ్ఞానగంగలో మునక లేసిన ముముక్షువులను జిజ్ఞాసువులను చేసి, వారి శిష్యులుగా మార్చి గురుదేవుల దివ్య పాదాలను విడువకుండా పట్టి, వారిని ప్రత్యక్షదైవంగా ఆరాధించేలా చేసింది.

పువ్వు పుట్టగనే పరిమళించునట్లు, పూపవయస్సు నుండే గురుదేవులలో ఆధ్యాత్మిక సౌరభం గుబాళిస్తూ ఉండేదట. 'అమ్మా!' అంటూ నడచి వస్తున్న పుత్రుని చూచి తల్లి కూర్చోలేక నిలుచుని మాట్లాడేవారట. 'నాయనా!' అని తల్లి పిలిస్తే, 'స్వామీ!' అని ఎరిగిన వారు సంబోధించేవారట. ఆడుకొనే వయస్సు లోనే భగవంతుణ్ణి వేడుకోవడం, వినోదాలతో గంతులేసే యవ్వనాన్ని సాధనకు అంకితం చేయడం, ఆయన లోని తీవ్ర వైరాగ్యం, భావ గాంభీర్యం వారిని అందరిలో విశిష్టంగా, అందరికీ విలక్షణంగా నిలబెట్టాయి.

శ్రీ స్వామివారు సార్థక నామధేయులు. 'సుందర రాజన్' అనేది శ్రీ స్వామికి తల్లిదండ్రులు పెట్టిన పేరు. 'రాజన్' అంటే రాజు అని అర్థం. ఏదంటే అది మెచ్చేవాడు రాజు కాడు కదా! అందుకే అందానికి అందమైన ఆత్మ సౌందర్యం ఆయనను ఆకట్టుకుంది. విద్యలలో కెల్ల రాజవిద్య ఐన ఆత్మవిద్య ఆయన హృదయాన్ని హత్తుకుంది.

కరువు కాటకాలలో, ఆకలిగొన్న దీనుల ఆర్తనాదాలు వింటూ గాదెల నిండా ధాన్య మున్న ఉదారులు దానం చేయకుండా ఉండగలరా? అలాగే సమాజంలో అశాంతితో అలమటిస్తున్న ఆశ్రితుల ఆర్తిని జూసి గురుదేవులు జ్ఞానాన్ని అందివ్వకుండా ఉండలేక పోయారు. భగవత్సంకల్పం ఒక వైపు, భక్తుల ఆర్తి మరొక వైపు పూజ్య స్వామీజీని వందొమ్మిదవ ఏటనే జ్ఞానయజ్ఞ సోమయాజిగా సుప్రతిష్ఠితం చేశాయి. అకస్మాత్తుగా మీద బడిన కుటుంబ భారాన్ని ఒక వైపు మోస్తూ, మరో వైపు వైభవోపేతమైన జ్ఞానయజ్ఞాలను పూజ్య స్వామీజీ నిర్వహిస్తూ ఉండేవారు.

చల్లని గాలిని, నీడను ఇస్తూ, తియ్యని పండ్లను అందిస్తూ, కమ్మని సువాసన గల పూలను రాల్చే తరువు ఎవరి నుండి ఏమి ఆశిస్తుంది? ప్రకృతి సహజమైన రీతిలో తాను మనుగడను కొనసాగిస్తూ లోకానికి పరమాత్మను గుర్తు చేయడం తప్ప! తరువుల లాంటి వారే గురువులు.

ఏదో కొంత పుచ్చుకొని గాని ఏమీ ఇవ్వని లోకమిది. ఇవ్వడమే గాని పుచ్చుకోవడం తెలియని వారు గురువులు. కారణం? మన వద్ద ఉన్నవి, మనమివ్వగలిగినవి గురువుకు అవసరం లేదు. కాని, మనకు అవసరమైన జ్ఞానం మాత్రం ఒక్క గురువు వద్దనే ఉంది. కాబట్టి ఆధారపడి ఉన్నవాడు శిష్యుడు. ఆధారమైనవాడు గురువు. అభ్యర్థించ వలసినవాడు శిష్యుడు, అనుగ్రహించేవాడు గురువు. జనం తమ ఇష్టానుసారం ఉపయోగించుకునే ఫ్యానులా తిరిగేవాడు కాదు గురువు. గాలికి అనుగుణంగా ఊగే చెట్టు లాగా అపౌరుషేయమైన శాస్త్రాన్ని అనుసరించి జీవించేవాడు సద్గురువు.

గురుదేవుడు సర్వ స్వతంత్రుడు. సర్వులకు ఆశ్రయమైనవాడు. సంసార ఊబిలో కూరుకుపోయి దిక్కుతోచక దుఃఖిస్తున్న వారిని తన ప్రేమామృతంతో సేద దీరుస్తాడు. వారి చిత్తాలు ప్రసన్నతను పొందితే జ్ఞానాన్ని పట్టించాలి అనేదే వారి ఏకైక లక్ష్యం. 'I can be friendly with all but never a friend! - అందరితో స్నేహంగా ఉంటాను గాని ఎవరికీ స్నేహితుణ్ణి కాను' అంటారు పూజ్య స్వామీజీ.

గురువు కన్నవారిని, తోడబుట్టిన వారిని వదిలి వచ్చింది కేవలం సమాజ కళ్యాణం కోసం. సమాజాన్నే కుటుంబంగా ప్రేమించే గురువు తన కుటుంబాన్ని ఎంతగా ప్రేమించి ఉంటాడో ఊహకు అందని విషయం. పదిమందిని ఆయన వదిలి వచ్చింది వేలమందిని ఉద్ధరించేందుకే గాని పరుల చేతులలో పట్టుబడేందుకు కాదు. గురువు భక్తికే గాని పట్టువిడుపులకు లొంగేవాడు కాదు. శిష్యుల ఉపచారాలపై అపచారాలపై గురువు సుఖం ఆధారపడి లేదు. ఆయనది ఆత్మసుఖం. ఆత్మలోనే తప్ప ఇతరమైన వాటిలో గురువు రమించలేడు.



నది అందరిదీ అని తెలుసుకోవడం ఎంత వివేకమో, నది నాకొక్కడికే సొంతం అనుకోవడం అంత అవివేకం. గురువు వ్యక్తి కాదు, శక్తి. జ్ఞానశక్తి. వ్యక్తిగతమైన దృష్టి గురువుకు లేదు. వ్యక్తిగతమైన ఆలోచనలతో సమీపించేవారు గురువు వద్ద నిలువలేరు.

పూజ్య గురుదేవుల వారి 77 సంవత్సరాల జీవితకాలంలో, గడచిన 57 సంవత్సరాల సేవా జీవనంలో వారికి ఎన్నో అనుభవాలు, ఇంకెన్నో సమస్యలు, మరెన్నో విమర్శలు, పరామర్శలు. ఇలా ఆగకుండా లేచిపడే అలల మధ్య ఉత్సాహంతో ముందుకు ఈదారే గాని ఎదురీతగా భావించి వెనుదిరగ లేదు. బండబారిన బ్రతుకులు బాధపెట్టినా, కరుడు గట్టిన గుండెలు కలత పెట్టినా, నిరంతరం ఏకాకిగా రాతిగోడల మధ్య మౌనంగా నిలిచి ఉన్న తన శ్యామసుందరుని తలచుకొని ముందుకు సాగేవారు. చూస్తూ చూడని, పిలిచినా పలుకని రాతిగోడలే భగవంతుడికి ఆలయం కాగలిగినపుడు, ఏ నాటికైనా ఈ రాతి గుండెలు కరగకపోతాయా, బండబ్రతుకులు కదలక పోతాయా అనే అపారమైన ప్రేమ, ఒక అనంతమైన ఆశ వారిని సమాజ దిశగా కదిలించి జనుల మధ్యకు నడిపించాయి. ఇదంతా గతం. నేడు పూజ్య గురుదేవుల శిష్యులు వేలకు వేలు. ఎవరి స్థాయిలో వారు గురుదేవుని పూజిస్తూ, ప్రేమిస్తూ, సేవిస్తూ ఉన్నారు. శిష్యులు పరిమితాలతో ఉన్నవారు. కనుక వారి ప్రేమ పరిమితం. గురుదేవుడు పరమాత్మ స్వరూపం కనుక ఆయన ప్రేమ అనంతం. పత్రం, పుష్పం, ఫలం, తోయం అన్నిటిని పరమాత్మ ప్రీతితో గ్రహించునట్లు ఎవరెవరి పరిమితాలతో వారిని స్వీకరిస్తూ, అర్థం చేసుకుంటూ గురుదేవులు ఆశీర్వదిస్తూ ఉంటారు.

అమ్మ అన్నం పెడుతుంది. ఇది బిడ్డలందరికీ తెలుసు. కాని, ఆకలిని బట్టే పరుగులు. గురువు జ్ఞానాన్ని అందిస్తాడు. ఇది శిష్యులందరికీ తెలుసు. కాని, శ్రద్ధను బట్టే ఆతురత, సాధన తీవ్రత. దాగుడుమూతలు ఆడుతూ కొందరు వెనుకబడి నడుస్తూ ఉంటే, తదేక దృష్టితో కొందరు బాణాల్లా ముందుకు దూసుకుపోతూ ఉంటారు. అందరిది అదే మార్గం, అందరికీ అదే గమ్యం. ఒడిదుడుకులు, వెనకాముందులు గమనం లోనే.

ఉన్న మెట్టును వదలకపోతే పై మెట్టును ఎక్కలేము. పట్టుకున్న దానిని విడువక పోతే విలువైన దానిని పట్టుకోలేము. చేతులు కాళ్ళు ఉన్నది వ్యర్థమైన వాటిని వాటేసుకొని కూర్చునేందుకు కాదు. చేతులెత్తి పరమాత్మను పిలుస్తూ పరుగు లెత్తేందుకు. చేతులెత్తిన వారికే గురుదేవుని చేయూత అందుతుంది. పరుగులెత్తే వారికే పరమాత్మ సదనం చేరువౌతుంది.

శ్రీ స్వామీజీ వారి 57 సంవత్సరాల ఈ మహోద్యమంలో సత్కర్మ, భక్తి సంకీర్తనల ద్వారా అంతః కరణశుద్ధికై నిరంతరం సాధనను కొనసాగించే సత్సంగీయులు శ్రీ స్వామీజీ ఆదర్శాలకు దర్పణాలు. నిరంతరం స్వాధ్యాయతపస్సులతో లక్ష్య సాధనకై శ్రమించే ఆశ్రమవాసులు భక్తిసేవలకు ప్రతిరూపాలు, శ్రీ సుందర గురుదేవుల కన్నుల కాంతి కిరణాలు. పుష్పహారంలో ఏ పుష్పానికి ఆ పుష్పమే ఉంటూ అన్నీ కలిసి హారానికి రూపు నిచ్చినట్లు, వీరంతా ఎవరికి వారుగా సాధనలో ఉంటూ అందరూ కలిసి సముజ్జ్వల శాంతి జీవనాన్ని కొనసాగిస్తూ శ్రీ స్వామి వారి మెడలో అందమైన పూలదండలా శోభిస్తూ ఉంటారు.

నేటికి ఈ జ్ఞాన భాస్కరుడు మన మధ్య ఉదయించి 77 సంవత్సరాలు. ఒక్కొక్క భగవద్విభూతిని ఒక్కొక్క కాంతిపుంజంలా విభూతియోగం ప్రసరింపజేస్తే, భగవద్వైభవా న్నంతా సముజ్జ్వలంగా తనలో ఇమిడ్చి చూపేదే విశ్వరూప సందర్శన యోగం. తన విశ్వరూపాన్ని దర్శించేందుకు పరమాత్మ స్వయంగా అర్జునుడికి దివ్య నేత్రాన్ని ప్రసాదించి నట్లు, గురుభాస్కరుని దివ్య వైభవాన్ని దర్శించేందుకు గురుదేవుడే మనకు జ్ఞాన నేత్రాన్ని ప్రసాదించు గాక!

జై జై గురుదేవ!

సుందర సముద్యమం .. సుందర చైతన్యం

(పూజ్య స్వామీజీ జన్మదినోత్సవ సందర్భమున ఆంధ్రప్రభ దినపత్రిక ప్రచురించిన వ్యాసం).

'తరువులు కరువు తీర్చవచ్చు. బ్రతుకుతెరువు మార్చలేవు. ఛాయను ప్రసాదించవచ్చు. మాయను తొలగించలేవు. ఏ తరువు ఆ ఫలాన్నే ఇస్తుంది. కానీ కల్పతరువు కోరిన వన్నీ ఇస్తుంది. కల్పతరువు నీడలో కరవులు తీరతాయి. బరువులు దిగుతాయి. కానీ అజ్ఞానాన్ని తొలగించి మోక్షాన్ని ప్రసాదించడం కల్పతరువుకు కూడా సాధ్యం కాదు. గోవింద కల్పతరువు లాంటి గీతాజ్ఞానంతో మాత్రమే అది సాధ్యపడుతుంది. ఎందుకంటే అసలు మోహం, కోరికలే నశించినప్పుడు ఇక కల్పతరువు అవసరం ఏముంటుంది?'

గీతాసారాన్ని ఇంత అద్భుతంగా, అలవోకగా, అలతి అలతి పదాలతో ఆవిష్కరించడంలో, మారాం చేస్తున్న బాలుడికి తల్లి కొసరి కొసరి గోరుముద్దలు రుచి చూపిస్తూ దారికి తెచ్చుకొనే తీరులో బోధించడంలో ఆయనదొక విలక్షణ శైలి. ఘనీభవించిన హృదంతరాలను కూడా చలింప చేయగల శక్తి ఆయన మాటలకు ఉంది. ఆయన ప్రవచనాలకు ఆధ్యాత్మిక పరిమళాలు గుబాళించడమే కాదు సమతా, మమతా, మానవతా విలువలు రవళిస్తాయి. అజ్ఞాన అమవస కుటిలో జ్ఞానకాంతులు అఖండ దీపావళులై ప్రకాశిస్తాయి. భక్తి తాత్పర్యాలే కాదు, గీర్వాణాంధ్ర భాషామ తల్లి జాతీయాల స్వర్ణాంబరాలతో అలరారుతుంది ఆయన రచనలకు, అమృతోపమానమైన పలుకులకు. అందుకే ధార్మిక మహోద్యమంలో ఆయన ఒక చైతన్య కెరటం. సమస్త వేదార్థ సార ప్రబోధంలో ఆయన వ్యాఖ్యానం సుందరం, సుమధురం, అశేష, విశేష భక్తజనావళికి ఆయన ఆరాధ్య దైవం. సంక్లిష్టమైన భగవద్గీతను సమకాలీన సమాజానికి అర్థమయ్యే రీతిలో విరచించిన ధన్యులు. ఆయనే శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామి. ప్రపంచంలో భౌతిక వాదం వైపు ఉరుకులు, పరుగులూ పెడుతూ ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకోవాలనే దురాశలో ఉన్న స్థితినే భిన్న భిన్నం చేసుకొంటున్న వేళ ధర్మభూమి, కర్మభూమి, వేదభూమి అయిన భరతభూమిలో విలువలకు అర్థాన్ని వివరిస్తూ, మానవ జీవితానికి సార్థకతను ప్రబోధిస్తూ మానవాళికి దిశానిర్దేశం చేస్తోన్న స్వామి సుందర చైతన్యానంద స్వామి.

శ్రీ స్వామీజీ వారి మాటలూ, పాటలూ, వ్యాసాలూ, వ్యాఖ్యానాలూ, కవితలూ, సర్వతోముఖ వికాసాన్ని సంతరించు కొన్నాయి. అవి జనుల లోని జడత్వాన్ని పోగొట్టి, హృదయాలకు చైతన్యాన్ని సమకూర్చే పదునైన సాధనాలుగా రూపొందాయి. మానవ జాతిని ఒక మహోన్నత స్థితికి, ఉదాత్త రసాన్విత స్థాయికి, ధర్మబద్ధ జీవనరీతికి నడిపించడానికి యుగయుగాలుగా మహానుభావులు జన్మిస్తూ ఉంటారు. వారు దేవుని దూతలుగా మానవ లోకానికి వచ్చి మానవుల్ని చైతన్యవంతులుగా చేస్తూ ప్రతిఫలాపేక్ష లేకుండా తమ వంతు కృషిని భగవదర్పణగా నిర్వహిస్తారు. అట్టి మహనీయుల కోవకు చెందిన వారే శ్రీ సుందర చైతన్యానంద స్వామి. లలిత లలిత పదాలతో, మలయమారుతంగా సాగే వీరి ప్రవచనాలు విన్నా, సువర్ణాలతో సద్గుణ శోభితమైన వీరి రచనలు చదివినా, తనువు మనసూ పులకరించ వలసిందే. సాధారణంగా లోకంలో ఉత్తమ ప్రవచనం చేసేవారు పెద్దగా రాతకోతల వైపు శ్రద్ధ పెట్టరు. శబ్దార్థబంధుర రస సమన్వయంగా రచనలు చేసేవారు ప్రవచనాల జోలికి పోరు. అలా కాకుండా రచన, ప్రవచనమూ కూడా రమ్యాతి రమ్యంగా చేయగల శక్తి శ్రీ సుందర చైతన్యస్వామి వారి సొత్తు. వారి రచనలు అన్నీ ఆణిముత్యాలే. చదువుల తల్లికి సమర్పించిన అపూర్వ ఆభరణాలే. ఆస్తిక ప్రపంచానికి సర్వదా ఆదరణీయాలే. సర్వధా శిరోధార్యాలే.

స్వామి అమృత లేఖిని నుండి ఎన్నో! ఎన్నెన్నో! మరెన్నో! ఇంకెన్నో! అమూల్య గ్రంథాలను హిందూ సమాజం ఆశిస్తోంది. అనితర సాధ్యంగా, అసమాన తేజంతో స్వామీజీ నిర్విరామంగా సాగిస్తున్న ప్రచారోద్యమానికి లబ్ధ ప్రతిష్ఠులు, సర్వసంగ పరిత్యాగులు అయిన పరమహంసలు కూడా మహాజ్ఞాన యజ్ఞాలకి పులకించి పోయారు.

'ఆంధ్రదేశంలో శ్రీ సుందర చైతన్యానంద స్వామి నిర్విరామంగా సాగిస్తున్న ప్రచార కార్యక్రమాలకు నేను పరమానంద భరితు ణ్ణయ్యాను. ఉత్కృష్టమైన ఆశయాలతో వారు నిర్వహిస్తున్న పవిత్ర కార్యాలు నన్ను తన్మయుణ్ణి చేస్తున్నాయి. వేదాంత ప్రచారముల ద్వారా ఆర్షధర్మ పునర్వైభవ ప్రాప్తిని సాధించడానికి ఇలాంటి నిశ్శబ్ద ఆధ్యాత్మిక ఉద్యమాలే ఏకైక మార్గము. శక్తివంతమైన వారి యజ్ఞ కార్యక్రమాలు ఎడతెగక నిత్యము కొనసాగాలని ప్రార్థిస్తూ ఉన్నాను'

- స్వామి చిన్మయానంద
చిన్మయ మిషన్

'సుందర చైతన్యస్వామి కలకాలం జీవించు గాక! పూర్ణ ఆయురారోగ్యాలతో ఈ ధర్మ ప్రచార ఉద్యమంలో, జన జాగరణ కార్యములో వర్ధిల్లు గాక!' అంటూ అమృత వాక్కులు కురిపించారు. వేదాలలో, రామాయణ భాగవతాది పురాణ ఇతిహాసము లలో నిక్షిప్తమై ఉన్న జ్ఞానమణులను వెలికి తీసి వితరణ చేయడంలో వారికి వారే సాటి. వారి జీవన విధానం, వారి ప్రచారోద్యమం అంతులేని కళలతో, విశేష జ్ఞానవైభవంతో విరాజిల్లుతూ ఉన్నాయి.

గహనమైన విషయాలను సరళమైన శైలిలో అక్షర రూపంలో లిఖించి అలరించే నేర్పు పరమాత్మ వారి కిచ్చిన అపురూపమైన వరం. సరస్వతీ కటాక్షం వారిపై పూర్ణంగా ఉంది' అన్నారు ఋషీకేశం శివానందాశ్రమం పీఠాధిపతులు శ్రీచిదానంద స్వామి.

- స్వామి చిదానంద, హృషీకేశం

అనాదిగా ఏర్పడి, శాఖోపశాఖలుగా విస్తరించి, మహర్షి ప్రవర పరిపుష్టమై శాంతి సుఖ పుష్పఫలాల నందిస్తూ, ఆశ్రితుల నందరినీ ఆనంద పరుస్తోన్న సనాతన భారతీయ హైందవ ధర్మ సంప్రదాయ వృక్షాన్ని పరిరక్షించడమే - సర్వతోముఖంగా పునర్వికాస పరచడమే స్వామీజీ సముద్యమ లక్ష్యం. కేవలం పట్టణాలలో నగరాల లోనే గాక గ్రామ గ్రామాల్లో, వాడవాడలా ప్రసంగించడం - గ్రంథాలు చదివించడం – గీతా ప్రబోధం చేయడం, సంకీర్తనం, గానం చేయడం, తద్వారా ఎల్లరనూ ఆకర్షించి, వారికి కర్తవ్యాన్ని ప్రబోధించి, వారు స్వధర్మాన్ని అనుష్ఠించేటట్లుగా, పరధర్మ వ్యామోహితులు కాకుండా కర్తవ్య పాలనం చేసేటట్లుగా, నవ్య వాతావరణాన్ని పున ర్నిర్మించడం సముద్యమ స్వరూపం.

అసాధారణ ధారణాశక్తితో అనర్ఘ – అపార విజ్ఞానంతో అకుంఠిత సమయ స్ఫూర్తితో, అసమాన మేధా సంపన్నతతో, శ్రీ స్వామీజీ చేస్తున్న నిర్విరామ ధర్మప్రచార ప్రసారాలు ఫలవంత మౌతున్నాయి. సోమరులు కార్యశూరు లౌతున్నారు. అజ్ఞానులు జడత్వాన్ని వదలు తున్నారు. అశ్రద్ధాళువులు శ్రద్ధాళువు లౌతున్నారు. అజిజ్ఞాసువులు జిజ్ఞాసువు లౌతున్నారు. ఆధ్యాత్మి కానుష్ఠానం ప్రారంభిస్తున్నారు. చైతన్యం తన స్వభావధర్మంతో వెల్లి విరుస్తోంది.

ఈ మహోన్నత వైభవానికి, సమాజ అభ్యుదయానికి హారతి కర్పూరంలా సాగిపోతున్న శ్రీ స్వామి వారి అద్భుత కార్యాలను స్వయంగా వీక్షించిన అంతర్జాతీయ రామకృష్ణ మఠాధ్యక్షులు శ్రీరంగనాథానంద స్వాముల వారు సైతం ఆశ్చర్య చకితు లయ్యారు.

'స్వామి సుందర చైతన్యానంద పాండిత్యము, ఆధ్యాత్మిక జీవనము, గాన వైదుష్యముతో పాటు అనంతమైన శక్తి సామర్థ్యములు గల మహోన్నత వ్యక్తి. ఆధునిక విద్యతో పాటు దేవభాష యైన సంస్కృతములో ప్రావీణ్యమును పొందినారు. రాష్ట్ర వ్యాప్తంగా సనాతన ధర్మమును ప్రచారము చేయుటలో స్వామీజీ తమ యావచ్ఛక్తిని ధారపోయు చున్నారు'

- స్వామి రంగనాథానంద

సుందర చైతన్యానంద స్వామి అనే పేరుతో మీరు భూలోకానికి వెళ్ళి, ప్రజలలో విశేష మైన జ్ఞానసంపదను కలిగించండి. ఇదే మీ కార్యక్రమం' అని చెప్పి భగవంతుడు వీరిని పంపించి ఉంటారని నా భావన"

శ్రీ కొణిజేటి రోశయ్య
తమిళనాడు గవర్నరు

1994 లో కడపలో సుందర చైతన్యానంద స్వామీజీ 18 రోజుల పాటు నిర్వహించిన భాగవత యజ్ఞానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉడిపి పెజావరు మఠాధ్యక్షులు శ్రీశ్రీశ్రీ విశ్వేశ తీర్థుల వారు 'జ్ఞానబ్రహ్మ' బిరుదముతో స్వామి వారిని సత్కరించారు.

శబ్దమాధుర్యం, అర్థగాంభీర్యం, అలంకార చాతుర్యం, వ్యంగ్య వైభవం, లలిత పదవిన్యాస కళా ప్రావీణ్యం, ఆంగ్లభాషా వైదుష్యం, సంస్కృతాంధ్ర సాహిత్య సర్వంకష ప్రజ్ఞా విశేష వాగ్వైభవం, ప్రతిభా సంపద, ధారణాబలం, ధారాశుద్ధి, అభ్రగంగా వేగం, ఇవన్నీ కలిసిమెలసి, ఒక్కటిగా, ఒక్కొక్కటిగా, శ్రీ సుందర చైతన్యానంద స్వామిని పూర్ణంగా ఆశ్రయించాయి.

నిలిచెనా మీ మహోజ్జ్వల భావనారథ్య
　　కతివేల్పుదొర గీతికా రథమ్ము
వెలసెనా మీ మనోవీధిలో లోకమ్ము
　　నలరించు జయదేవు నష్టపదులు
తెలిపెనా మీ మేలు కొలువులో రామయ్య
　　యలఘు చరిత్రమ్ము తులసీదాసు
నిలిపెనా మీదు మంజుల కంఠసీమలో
　　అల కబీరుడు తనదైన పలుకు
　　　లేని యెడల మీకు నీనాడు నెటులబ్బు
　　　వారి దివ్యచరిత సారమెల్ల
స్వామీ! మీ చరిత్ర చైతన్య రూపమ్ము
భక్త వితతి కెల్ల ముక్తి పథము

కళాప్రపూర్ణ
డా॥ శ్రీ జ్ఞానానంద కవి

శ్రీ సుందర చైతన్యానంద స్వామి భారతీయ విజ్ఞాన సర్వస్వం. సనాతన ధర్మ పరిమళం. ఆర్షసంస్కృతీ సభ్యతల భాండాగారం. ఆధునిక లోకంలో, ధర్మ ప్రబోధం చేయడం సులభసాధ్యం కాదు. వేద, శాస్త్ర, పురాణ రహస్యాలను పండిత పామర జనరంజకంగా ప్రవచించడం సుగమం కాదు. వితండవాదుల ప్రశ్న పరంపరలకు సంతృప్తికరంగా, సశాస్త్రీయంగా, అనుభవ పురస్సరంగా, సమాధాన మివ్వడం నల్లేరుపై బండినడక కాదు. ఎంతో శాస్త్ర పరిచయం, గ్రంథావలోకనం, తపోనిష్ఠ, ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్య పరిశీలన, పరిశోధన, లోకానుభవం, సమయస్ఫూర్తి, హాస్య చతురత, సమ్మోహనా శక్తి, శాబ్దిక మహేంద్ర జాలం ఎంతగానో అవసరం. ఇన్ని శక్తియుక్తులు కలిగి యుంటేనే, వేదికపై వీరవిహారం చేసి, ఆధ్యాత్మిక జైత్ర యాత్రను దిగ్విజయంగా కొనసాగించడం సాధ్యం. శ్రీ స్వామీజీలో ఈ లక్షణాలన్నీ పుష్కలంగా తిష్ఠ వేసుకున్న కారణం చేతనే ఆయన ప్రసంగాలకు శ్రోతలు లక్షలాదిగా ఆకర్షితు లవడం, శ్రీవారి ఉపన్యాసాలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలకించడం, వారి వాగ్ధాటికి శిరస్సు వంచి నమస్క రించడం జరుగుతూ ఉంది.

తేదీ 25-12-1947 వ సంవత్స రంలో నెల్లూరు జిల్లా లోని బుచ్చిరెడ్డిపాలెం మండలం లోని కట్టుబడి పాలెంలో, శ్రీ పెరుంబుదూరు వెంకటశేషాచార్యులు, రంగనాయకమ్మ పుణ్యదంపతులకు ఎనిమిదవ సంతానంగా జన్మించిన శ్రీస్వామి పట్టభద్రులు. చిన్నతనం నుండి దీక్షతో, తపనతో, దృఢ విశ్వాసంతో, త్రికరణ శుద్ధితో, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, కష్టనష్టాల నెదుర్కొని, కైవల్యా నదీతీరంలో సైకత ప్రదేశాలలో, ధ్యాన నిష్ఠాగరిష్ఠులై, అధ్యయనం కొనసాగించి అపూర్వ పాండితీ గరిమను, ప్రతిభా సంపత్తిని సముపార్జించిన శ్రీ స్వామి, పరమేశ్వర కరుణా కటాక్షలబ్ధ సమస్త విద్యా ప్రవీణులు. సుమధుర, సుందర, వాగ్విలాస, వైభవ, ప్రాభవ, శ్రీ సుశోభితులు. శ్రీ సుందర చైతన్యానంద మహావక్త. మహోద్గ్రంథ రచయిత. శ్రీ స్వామి శతాధిక గ్రంథాలను రచించి ప్రచురించారు. ఎన్నో గ్రంథాలకు వ్యాఖ్యానాలు వెలయించారు. ఉపనిషత్ మాధుర్యాలను అందించారు.

ఒక తత్త్వవేత్త, అద్వైత సంప్రదాయానికి చెందిన గురువు, వివిధ రంగాల లోని మహిమాన్వితులను, మేధావులను చలింప చేయడ మనేది సాధారణమైన విషయం కాదు.

కవి పుంగవులనే కాకుండా, మేధావులైన పత్రికా ప్రతినిధులను సైతం కదిలించింది స్వామీజీ అపార మేధాసంపత్తి.

"ఓం' అంటే వెయ్యివీణలు మంద్రస్థాయిలో మీటి నట్లుంటుంది ఆయన గొంతు. స్వామి వారి మాటలు - హిమవత్ పర్వత సానువుల నుండి ఉరకలు వేస్తూ వచ్చే *అలకానంద గలగలలు!*

ఆర్ద్రతతో, ఆవేశంతో, అర్థ గాంభీర్యంతో, అనిమిషులు తలలూపే మార్దవమైన గానంతో భాగవతాన్ని స్వామి సుందర చైతన్యానంద చెబుతుంటే వినడం చెవులకు, మనసుకు పెద్ద పండగే.

'నేను రెండు పర్యాయాలు స్వామి వారి ఉపన్యాసం వినడం జరిగింది. సామాన్యునికి సైతం అర్థమయ్యే రీతిలో విపులంగా ప్రస్తుత సమాజానికి అవసరమైన ధర్మాలు ఏ విధంగా ఆచరించాలో తెలిపారు. వారి కార్యక్రమాలకు ప్రతిసారి వేల సంఖ్యలో ప్రజలు పాల్గొనటమే వారి ఔన్నత్యానికి తార్కాణం. సమాజంలో సత్సాంప్రదాయాన్ని, సహ జీవనాన్ని, శాంతి ప్రియత్వాన్ని, సోదరప్రేమను, త్యాగశీలతను, పరోపకారాన్ని ఉద్బోధించి అవిరామ సేవ చేస్తున్నారు స్వామీజీ.

- జస్టిస్ వై.భాస్కర రావు

కృష్ణుడు నుండి కబీరు దాకా, స్తోత్ర రత్నావళి నుండి నిర్గుణ మానసపూజ దాకా శ్రీ సుందర చైతన్యులు వ్యాఖ్యానించని సనాతన సాహిత్యాంశం లేదేమో? అనిపిస్తుంది.

ఈయన కాలెండరు లోనూ సంవత్సరానికి మూడువందల అరవై రోజులే కదా? రోజుకు 24 గంటలే కదా?' అని ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక పూర్వ సంపాదకులు, బహుగ్రంథ రచయిత శ్రీ వాకాటి పాండురంగా రావు గారు ప్రస్తుతించారు.

పత్రికారంగ ప్రముఖులే గాక విశిష్టులైన రాజకీయ విజ్ఞులు కూడా స్వామీజీ వక్తృత్వానికి ముగ్ధు లయ్యారు.

స్వామీజీ కారణజన్ములు. వారి ప్రసంగాలు గంగా ప్రవాహంలా సాగుతాయి. ప్రతి పలుకు అర్థవంతంగా ఉంటుంది. ప్రసంగాలతో పాటు అనేకములైన రచనలు చేసి జనతను జాగృతం చేశారు. చేస్తున్నారు.

బిడ్డ ఎంత ప్రయోజకుడైనా, బిడ్డ ప్రగతిని గాంచి తల్లిదండ్రులు ఎంతగా పరవశించినా, బిడ్డను బిడ్డ ముందే పొగడటానికి తల్లిదండ్రులు ముందు వెనుక లాడుతారు. కాని, శ్రీ సుందర చైతన్యానంద స్వామికి దీక్షా గురువులు, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన యోగి పుంగవులు, కవియోగి, మహర్షి శ్రీ శుద్ధానంద భారతీ స్వాముల వారు స్వామీజీ ఔన్నత్యాన్ని గాంచి ఉప్పొంగి బహిరంగం గానే శిష్యుని స్తుతించడము ఒక అపూర్వమైన విషయంగా విజ్ఞులు విస్తుపోయారు.

'స్వామి సుందర చైతన్యానందులు ఏకత్వానికి, దివ్యత్వానికీ, పవిత్రతకు ప్రతిరూపము. నేడు మనకున్న మహాత్ములలో, ప్రమాణ పురుషులలో వీరు ఒకరు. ఆత్మజ్ఞానమును పంచుతూ, నిత్యశాంతి వైపుకు మానవాళిని మరలిస్తున్న మహనీయులు వీరు. సనాతన ధర్మానికి వీరు చేస్తున్న సేవ అమోఘం' - **స్వామి శ్రీ శుద్ధానంద భారతీ**

అందుచేతనే, బహుముఖ ప్రజ్ఞాశాలురు, రచయితలు, మేధావులైన అమాత్యులు సైతం స్వామి వారి బాటను దేశానికి శ్రీరామరక్షగా అభివర్ణించారు.



జనసముదాయాన్ని సమ్మోహనం చేయడంలో, తన్మయుల్ని చేయడంలో, ప్రభావితుల్ని చేయడంలో శ్రీ సుందర చైతన్యస్వామి సాటిలేని మేటి. జనచైతన్యానికి మరో నామధేయమే సుందర చైతన్యం.

విజ్ఞానం వెదజల్లి, ఆధ్యాత్మిక చింతన కలిగించి, పెంచి, మానవత్వపు విలువలు విస్తృతంగా వ్యాప్తి చేసే అనంతమైన శక్తి శ్రీ సుందర చైతన్య స్వామిలో మూర్తీభవించి ఉంది. ఆయన మాట మధురం - ఆయన మనసు కోమలం.

అందుచేతనే స్వామీజీని వ్యక్తిగా కాకుండా శక్తిగా విజ్ఞులు అంచనా వేస్తున్నారు. యంత్రశక్తిగా, మంత్రమూర్తిగా వారిని కీర్తిస్తున్నారు.

నాలుగు దశాబ్దాలుగ దేశమంత పర్యటించి, ప్రవచన పరంపరలతో ప్రజానీకాన్ని పరవశింపచేసి, విశిష్టమైన రచనలతో సాహిత్య లక్ష్మిని అర్చించి, సుందర సత్సంగములను స్థాపించి, జ్ఞానయజ్ఞ మహాక్రతువులను వైభవోపేతముగ నిర్వహించి, ధవళేశ్వరము, భాగ్యనగరము, విశాఖపట్టణములలో సుందర చైతన్యాశ్రమములను స్థాపించి, వేలాది భక్తజనుల హృదయ మందిరాలలో కొలువుండి, తమ జీవితాన్ని సమాజ కళ్యాణానికై సమర్పించిన త్యాగధనులు గురుదేవులైన శ్రీ సుందర చైతన్య స్వామి.

స్వామి వారి బహుముఖ ప్రజ్ఞా పాటవాలు సాహిత్య, సంగీత, వేదాంత లోకాలనే గాక, కళారంగాలను కూడా కదిపింది. సినీ దర్శకులు, కళాతపస్వి శ్రీ కె.విశ్వనాథ్ గారు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈ వాస్తవానికి అద్దం పడతాయి.

'స్వామిజీ ప్రవచనం చేస్తూ ఉంటే లక్షలాది మంది పిన్‌డ్రోప్ సైలెన్స్‌తో వింటారు. వారిలో ఒక మహత్తరమైన సమ్మోహనా శక్తి ఉంది' అని చాలా మంది నాతో అన్నారు. ఆ రోజు వారి మాటలు నేను నమ్మలేదు. ఆయన భక్తులు కదా! ఏదో అతిశయోక్తిగా చెప్పి ఉంటారులే అనుకున్నాను. ఒక రోజు సాయంత్రం నాకు కాస్త తీరిక దొరికితే ఊరకే చూసి వద్దామని విశాఖపట్టణంలో బుల్లయ్య కాలేజి ప్రాంగణానికి వెళ్ళాను. అక్కడ చూసేసరికి అబ్బో! ఆ మైదానమంతా జన సమూహం కాదు, ఒక జన సముద్రం. స్వామి వారు 'గలగలగల' లాడించేస్తూ ఉన్నారు.

> 'స్వామిజీ ప్రవచనం చేస్తూ ఉంటే లక్షలాది మంది పిన్‌డ్రోప్ సైలెన్స్‌తో వింటారు. వారిలో ఒక మహత్తరమైన సమ్మోహనా శక్తి ఉంది'
>
> **- కళాతపస్వి శ్రీ కె.విశ్వనాథ్**

బాబోయ్! ఇదేమిటి! పది సంవత్సరాలుగా నేను సౌండ్ రికార్డిస్ట్‌గా పని చేసినాను. ఇటువంటి వాయిస్, ఇటువంటి మోడ్యులేషన్స్ నేను ఎప్పుడూ ఎక్కడా వినలేదు. సాధారణంగా వేదంలో ఉదాత్త అనుదాత్తాలు ఉంటాయి. వాటిని అనుసరించి వేదం పఠిస్తూ ఉంటారు. కానీ ఇక్కడ మామూలు గద్యమే ఒక వేదంలా వినిపిస్తూ ఉందేమిటి అని ఆశ్చర్య పోయాను. ఇది సుమారు 20 సంవత్సరాల క్రితం విషయం. అది రామాయణంలో శ్రీరాముని పట్టాభిషేక ఘట్టం. ఎక్కడో సుదూరంగా ఆ జనసముద్రానికి ఆవల కారు నిలుపుకొని, అక్కడే ఒక ముప్పావు గంట నిలుచుని ముగ్ధుడినై ఆ ప్రవచనం విన్నాను. ఆ రోజు నాలో కలిగిన స్పందనను నేను ఈనాటికీ మరువలేను. నా ఆనందాన్ని చూసి మరునాడు ఎవరో అన్నారు 'మీరు స్వామీజీతో మాట్లాడతారా?' అని. నేనన్నాను అమ్మో! ఆయనతోనా? ఆయనతో నేనెలా మాట్లాడగలను? అని. అప్పుడు వారన్నారు. 'లేదు, స్వామి వారు ప్రేమ హృదయులు. వారు అందరి తోనూ మాట్లాడతారు' అని. మేము ఎప్పుడు ఆశ్రమానికి వెళ్ళినా స్వామి వారు ఎంతో ఆప్యాయంగా మాతో కూర్చొని మాట్లాడతారు' అన్నారు కళాతపస్వి శ్రీ కె.విశ్వనాథ్ గారు.

సినీకవి, సహజకవి, బహుగ్రంథ రచయిత

శ్రీమల్లెమాల సుందర రామిరెడ్డి గారు స్వామీజీ వాగ్వైభవాన్ని అమోఘంగా స్తుతించారు.

'పావన గోదావరీ నది ఆంధ్ర దేశంలో ప్రవహించడం ఎంత గర్వకారణమో, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం ఆంధ్రదేశంలో ఉండటం ఎంత గర్వ కారణమో, శ్రీ సుందర చైతన్యానంద స్వామి ఆంధ్రుడు కావడం అంతే గర్వ కారణము' - **మల్లెమాల**

ఎంతో సునిశితంగా పరిశీలిస్తే గాని అర్థం కాని మరొక కోణం కూడా స్వామీజీలో విలక్షణంగా ఉంది. వారికి జ్ఞాన ప్రచారం విషయంలో ఎంత ప్రగాఢమైన నిబద్ధత ఉందో, అలాగే విలువలు క్షీణిస్తున్న సమాజ పతనాన్ని చూచి వ్యథ చెందే హృదయం కూడా ఉంది. అవసరమైతే, కలాన్ని కత్తిలా ఝుళిపించే వాడి, వేడి కూడా ఉంది. చివరగా, స్వామీజీ జన్మదిన వేడుకల ప్రస్తావన. స్వామీజీ 64 వ జన్మదినోత్సవ వేడుకలు హైదరాబాదు శివారు లోని సుందర చైతన్యాశ్రమంలో నేడే వైభవంగా జరుగుతున్నాయి.

వారిది అలసట ఎరుగని గళం. విరామం ఎరుగని కలం. దివారాత్రుల తారతమ్యం తెలియని తపోదీక్ష! అదే దేశానికి శ్రీరామరక్ష!

- శ్రీ భాట్టం శ్రీరామమూర్తి

మాజీ మంత్రివర్యులు, బహుగ్రంథ రచయిత

1947 డిసెంబర్ 25 వ తేది క్రీస్తు పుట్టిన దినాన స్వామీజీ జన్మించారు. ఆ రోజే వైకుంఠ ఏకాదశి, గీతాజయంతి కూడా కలిసి రావడం విశేషం.

రెండువందల పన్నెండు జ్ఞానయజ్ఞములను నిర్వహించిన స్వామీజీకి, వందకు పైగా అద్భుతమైన గ్రంథములను రచించి ప్రచురించిన గురువు గారికి, పాతికేళ్ళుగా ఇరవై వేల మంది జీవిత సభ్యులను కలిగిన 'గిరిధారి' పత్రిక సంపాదకత్వమును నెరపిన ఆచార్యునికి ఈ సంవత్సరం జయంతి వేడుకలను నిర్వహించడానికి మూడు వేల మంది ప్రతినిధులు వివిధ రాష్ట్రాల నుండి, విదేశాల నుండి కూడా అరుదెంచారు. జ్ఞానబ్రహ్మ, ఆర్షవిద్యా వాచస్పతి బిరుదాంకితులైన శ్రీ స్వామి వారి చిరకాల సేవలు సమాజానికి అందాలని ఆకాంక్షిస్తూ, ఆంధ్రప్రభ స్వామి వారికి జన్మదిన శుభాకాంక్షలు సమర్పిస్తున్నది.

స్వామీజీ లో మరొక కోణం

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికలలో చెలరేగి పోయిన వికృత విన్యాసాలు స్వామి వారి హృదయాన్ని ఎంతగానో కలత పెట్టాయి. అంతే. 'ప్రజాస్వామ్య వెన్నెముకను విరిచేసిన ఎన్నికలు' అనే కవితను, తాను పాతికేళ్ళుగా నడుపుతున్న గిరిధారి పత్రికలో ప్రచురించారు. అది వ్యాసమా? కవితయా? లేక విప్లవ గీతమా? అని చదువరులకు సందేహం కలుగుతుంది.

నాయకుల మొదలుకొని ఉద్యోగుల వరకు, కార్యకర్తల మొదలుకొని కవుల వరకు స్వామీజీ ఎవ్వరినీ వదలిపెట్ట లేదు. చివరగా, కుహనావాదులైన కవులపై స్వామీజీ విసిరిన వాగ్బాణాలు ఇలా వున్నాయి.

ఇక,
కలతల భారతంలో
కవితల బాజాలు
కాలం మారిపోయింది
కవి కలం మారిపోయింది
క్రొత్త ఇంకు నింపుకొని
కొంగ్రొత్త లింకు పెట్టుకుంది
నోటుకు మాట లమ్ముకొని
డబ్బుకు డప్పు వాయిస్తూ
ఓట్ల పాట పాడుతోంది
కొట్లాట పాట పాడుతోంది
పేగులు వెనక్కి లాగే పేదరైతును
ముందుకుపో - ముందుకుపో అని
కొరడా మాటలు పలికే శక్తి
కవి కలాని కిచ్చిం దెవరు?
కాకికూతలు కవిత్వా లవుతాయా?
పైసా పైత్యంలో కళ్ళు మూసుకు పోతాయా?
విశ్వాన్ని తట్టి లేపిన విశ్వకవి మరో రవి

ఉదయించిన భారతిలో ఇదేనా సాహితి?
కాసుకు కళలు దాసోహ మనే సమాజంలో
ఏం మిగుల్తుంది సంస్కృతి?
ఎలా వస్తుంది ప్రగతి?
ఇది ప్రజాస్వామ్య మోయ్!
పిచ్చోడి చేతిలో రాయి!
నిరుపేదల బ్రతుకు నేతలకు అలుసు
ఇది ప్రజాస్వామ్యమని ఎందరికి తెలుసు?
ఇంత చూసినా
ఎందుకనో, చావదు ఆశ!

వేసవి ఎండల్లా మండే గుండెల్లో
చల్లదనం నింపే మంచితనం కావాలి.

నిరాశా నీడల్లో నీరసించిన జనం
ఆశా విహంగాలై విహరిస్తేనే ఘనం!

కుళ్ళిన రాజకీయాల నుండి మళ్ళిన యువత
విద్యపై దృష్టిని సారించి నపుడే ఘనత!

మాటలమ్మ మానస పుత్రులైన కవులు
పలకాలి కాంతులు విరజిమ్ము పలుకులు

ఉన్నవారు మనసున్న వారు కావాలి
లేనివారికి తోడున్న వారుగా మారాలి

మాగాణిలో గానము కమ్మగా వినిపించాలి
మనిషిలో జ్ఞానము నిండుగా కనిపించాలి.

అరుపు లొద్దు మనకు పైపై మెరుపు లొద్దు
మంచిని త్రుంచే వంచన మాట లొద్దు.

బ్రతుకుదాం బ్రతుకు అందాలు నేర్చి
అందరం అందరిలో ఉన్నామని తెలిసి
బ్రతికించే గాలి కనిపించ దెప్పుడూ
పరిపాలన పవిత్రగాలి కావా లిప్పుడు.

పరిస్థితులను చూచి కలత చెందిన స్వామీజీ ఈ కవితలో నిరాశావాదిగా ఎక్కడా కనిపించ లేదు. పైగా పరమ ఆశావాదిగా కనిపించారు. సమస్యను అర్థం చేసుకోమని అర్థించడమే గాక, సమాజ అభ్యుదయం ఎలా ఉండాలో కూడా సూచించారు. ఇది స్వామీజీ లోని విలక్షణమైన మరొక కోణం.

SWAMIJI - A GREAT MISSIONARY

Justice Sri P. Kodandaramaiah,
Former Judge,
A.P. High Court
HYDERABAD

Swami Sundara Chaitanyanandaji is a saint, a seer and a great missionary

who is spiritualising the human race. At present the Telugus are singularly fortunate as his writings, discourses and his varied relentless activities round the clock are being carried out across all the Telugu speaking areas of our country.

Swami Sundara Chaitanyanandaji is an ardent follower of Monoism or Advaita philosophy and strictly adheres to the tenets expounded by Sri Adi Sankara.

He is running a spiritual journal by name 'Giridhari' and conducting regular Geeta Yagnas throughout the state. His favourite subject is the exposition of

Upanishadic lore. At times he comes down from his heights explaining the elementary norms that should be followed by every human being. His editorials in Giridhari are a real treat for every student who pursues the spiritual course.

I hope and trust, by the grace of Lord Giridhari, that the services of Swamiji shall constitute a perennial source of strength to all those who want to pursue the spiritual path.

మనసు పులకరించే పలకరింపు

జస్టిస్ శ్రీ ఈశ్వరయ్య
హైకోర్టు న్యాయమూర్తులు
హైదరాబాద్

పూజ్య గురుదేవుల పాదపద్మములకు ప్రణామములు. నా ప్రథమ గురువు శ్రీ సుందర చైతన్యానంద స్వామి. వారి ప్రేమ, కరుణ, ఆప్యాయత ఏ తల్లితండ్రి కూడా ఇవ్వలేరు. ఒక్కసారి స్వామీజీ పలకరిస్తే చాలు మనసు పులకరించి పోతుంది.



శ్రీ స్వామీజీ ప్రమాణ మైనటువంటి వేదాలను, ఉపనిషత్తులను, ప్రకరణ గ్రంథాలను, రామాయణము, మహాభారతము ఇత్యాది పురాణాలను, ఇతిహాసాలను అధ్యయనం చేసి, వాటిని శోధించి, పరిశోధించి మరల తేటతెల్లమైన భాషలో తాము స్వయంగా ఎన్నో గ్రంథాలను రచించి మానవాళికి అందించారు. అటువంటి మహా ఋషికి, మహా మనీషికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

నేను దాదాపు 20 సంవత్సరాల క్రితం మెహబూబ్ కాలేజి ప్రాంగణంలో జరిగిన శ్రీ స్వామీజీ గీతా జ్ఞాన యజ్ఞానికి హాజరయ్యాను. వాన జల్లులు ఎడతెగక పడుతూ ఉన్నా జనం ఏ మాత్రం కదలకుండా వినేవారు.

నేడు మనకు ఉన్న విద్యా విధానం, మనం చూస్తున్న సినిమాలు, వింటున్న పాటలు, చదువుతున్న సాహిత్యం, అన్నీ మానవతా విలువల్ని దిగజార్చే విధంగా ఉన్నాయే తప్ప, పెంపొందించే విధంగా లేవు. ప్రపంచ మంతా ఈ రోజు ఒక విడ్డూరమైన పంథాలో నడుస్తూ ఉంది. శ్రీ స్వామి వారి దివ్య బోధల లోని సూక్ష్మమైన తాత్త్విక రహస్యాలను మనం అవగతం చేసుకో గలిగితే ప్రపంచంలో ఏ శక్తీ మనల్ని చెడుప జాలదు. మన మానవతా విలువల్ని దిగజార్చే శక్తి ప్రపంచంలో దేనికీ ఉండదు.

శ్రీ స్వామీజీ భగవత్స్వరూపులు. వారు ఒక భగవ ద్విభూతి. వారి ప్రేమ, పవిత్రత, త్యాగము, శక్తి, సేవా భావనకు స్పందించని మనస్సు లుండవు. గృహస్థులుగా ఉంటూనే ఒక పవిత్రమైన, తృప్తి నిండిన జీవితాన్ని గడిపేందుకు శ్రీ స్వామి వారి బోధలు మన కెంతో స్ఫూర్తి నిస్తాయి. సంసారంలో ఉంటూనే విహిత కర్మలు ఆచరిస్తూ ఎటువంటి వత్తిళ్ళకు, వికారాలకు, నిరాశకు లోబడకుండా ఆనందంగా జీవితం గడిపేందుకు శ్రీస్వామి వారి గీతా జ్ఞానబోధ మనకు ఎంతగానో ఉపకరిస్తుంది.

శ్రీ స్వామి వారి పాదపద్మాలకు మరొక్కసారి ప్రణమిల్లుతూ సెలవు తీసుకుంటున్నాను.



జస్టిస్ శ్రీ చంద్రకుమార్
హైకోర్టు న్యాయమూర్తులు
హైదరాబాద్



ప్రపంచంలో అన్నిటి కంటె ఉత్కృష్ట మైనది జ్ఞానం. జ్ఞానం లేకపోతే, ఎన్నున్నా మనిషి ఆనందంగా ఉండలేడు. 'నే నెవరు? నా దేమిటి?' అనే విషయంలో మనం జ్ఞానాన్ని సముపార్జించుకుంటే, నూటికి తొంభై శాతం మనము బాధల నుండి, ఘర్షణల నుండి, దుఃఖం నుండి విడిపడి పోతాము. అలాంటి జ్ఞానాన్ని కలిగించే వారే నిజమైన గురువులు. నాడైనా, నేడైనా గురువులు అందించే జ్ఞానాన్ని మనం సద్వినియోగ పరచుకున్నప్పుడే దాని ఫలితాన్ని చూడగలం.

పరిస్థితులు మారుతున్నా, ఆయా పరిస్థితులలో మనం ఎలా ప్రవర్తించాలి? గీత ఏమి చెబుతోంది? గురుదేవులు ఏమి బోధించారు? అనేది గుర్తు తెచ్చుకొని జీవించాలి. నా వాళ్ళు – నాది అనేది కొంచెం ప్రక్కన పెట్టి, నా ధర్మ మేమిటి? అని ఆలోచించుకుంటూ ప్రవర్తించాలి (కరతాళ ధ్వనులు).

ఇవన్నీ స్వామీజీ బోధలలో మనకు అర్థ మవుతాయి. స్వామి వారి సి.డి.లు విని చూడండి. అరటి పండు ఒలిచి పెట్టినట్లు చెబుతారు. స్వామీజీ ప్రసంగం విన్న తరువాత 'నాకు అర్థం కాలేదు' అని చిన్న పిల్లవాడు కూడా అనడు. అది ఆయన గొప్పతనం. ఇలాంటి స్వామి వారి కార్యక్రమాలను నిర్వహించే వారందరిని ప్రశంసిస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియ చేస్తూ సెలవు తీసుకుంటున్నాను'

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్
శ్రీ నూతి రామమోహన్ రావు గారి ప్రసంగము

నారాయణ సమారంభాం
వ్యాస శంకర మధ్యమాం ।
అస్మదాచార్య పర్యన్తాం
వందే గురు పరం పరామ్ ॥

శ్రీ గురుభ్యోనమః! భగవంతుని మహాద్భుతమైన సృష్టిలో మహోన్నతమైన ప్రాణి మానవుడు. మానవ జన్మ భగవంతునికి ప్రీతికర మైనది.

భగవంతుడు తన సృష్టిలో స్థావరములైన హిమాలయాలను సృష్టించాడు. హిమాలయాలను స్పృశించాలని దినదినము పై పైకి పెరుగుతూ ఉందా అనే లాగున మొక్కని సృష్టించాడు.

పర్వతము చలించ లేదు. మొక్కకు చలనముంది గాని చైతన్యము లేదు. వాటికి ఊహలు లేవు. ఆలోచనలు లేవు. కాని, పశుపక్ష్యాదులను సృష్టించాడు. వాటికి ఆలోచించే శక్తి నిచ్చాడు. కాని, ఆలోచనా పరిధిని నియంత్రించాడు. సహజాతాలకే పరిమితం చేశాడు. కాని, వీటన్నిటికి విభిన్నంగా పరమేశ్వరుడు మానవుణ్ణి సృష్టించాడు.

మనిషికి మనస్సిచ్చాడు. మంచిచెడులను వివేచించే పరిజ్ఞానాన్ని ప్రసాదించాడు. కాటు వేసి ప్రాణం తీసే నాగుపామును సృష్టించాడు. ఆ విషానికి విరుగుడైన నాగవేరును కూడా తానే సృష్టించాడు. దేనిని ఎలా ఎప్పుడు, ఎందుకు వినియోగించాలో అలా విచక్షణతో మనిషి జీవించాలి అని ఇవన్నీ చెబుతున్నాయి. అలా తెలిసి జీవించ గలిగితే మానవులు హంస లవుతారు. పరమహంస లవుతారు. జలక్షీరములను వేరు చేయగలిగే శక్తి హంసలకే ఉంది. ఈ పుణ్య భారతావనిలో ఎందరో పరమహంస లున్నారు. వారి మధ్య ఉండటం మన భాగ్యంగా నేను భావిస్తాను.

రామకృష్ణ పరమహంస గారి ముందు ఒక యోగి తన యోగశక్తులను ప్రదర్శిస్తూ, ఒక దశలో ఆకాశానికి ఎగిరాడు. ఆకాశంలో కొంత కాలము సంచరించి, తరువాత క్రిందికి దిగిన ఆ యోగిపుంగవుని శిష్యు లందరూ జయజయ ధ్వానాలతో అభినందించారు.

ఇదంతా వీక్షిస్తున్న పరమహంస ప్రశాంతంగా, చిద్విలాసంగా, చూడండి, మన స్వామీజీ లాగే కూర్చుని ఉన్నారు (అనగానే శ్రుతిమందిరం కరతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది).

జస్టిస్ శ్రీ నూతి రామ మోహన్ రావు

యోగి పుంగవుని ఉద్దేశించి పరమహంస అన్నారు, 'నాయనా! చక్కని ప్రదర్శనను కనబరచావు. కాని, మానవ జన్మ యొక్క ప్రాశస్త్యాన్ని గుర్తించలేక పోయావు. ఇలాంటివి ప్రదర్శించడానికా మానవజన్మ వచ్చింది? ఈ ప్రదర్శనలే ప్రధానమైతే ఉత్కృష్టమైన మానవ జన్మను ఎత్తాల్సిన అవసరం ఏముంది? పక్షిగా పుడితే సరిపోతుంది కదా! అన్నారు. ఆ యోగిపుంగవునికి మత్తు వదిలింది. వివేకము కలిగింది. మానవ జన్మ ఎంత ఉత్కృష్ట మైనదో తెలిసి వచ్చింది.

ఈ రోజు ఇక్కడ ఇంత మంది ఉన్నారు. సూది మోపిన నిశ్శబ్దంతో క్రమశిక్షణతో కూర్చొని ఉన్నారు. స్వామీజీ ప్రవచనాన్ని శ్రవణం చేసేందుకే నిరీక్షిస్తూ ఉన్నారు. అదే సుందర చైతన్యం. చూడలేని చైతన్యాన్ని చూడగలిగే భాగ్యం మనది కాకపోతే మరెవరిది?

స్వామి వారి జన్మదిన సందర్భంగా మనం ఇక్కడ ఉన్నాం. స్వామీజీకి జన్మదిన వేడుకలు అవసరం లేదు. ఆయన సర్వసంగ పరిత్యాగి. కాని, ఈ వేడుకలు మనం జరుపుతూ ఉంటే, ఈ సదస్సును ఆధారం చేసుకొని స్వామీజీ జ్ఞానబోధ చేస్తున్నారు.

మీలో జ్ఞాన దీపాన్ని వెలిగించి, మీకు మార్గదర్శనం చేయిస్తూ, సద్గురువు బోధిస్తూ ఉంటే, మీరు ఎంత అదృష్టవంతులో అనే భావన నాకు కలుగుతోంది. మీ లాగే నేనూ రోజూ ఇక్కడ ఉండి శ్రవణం చేయలేక పోతున్నానే అని మదన పడుతున్నాను. స్వామి వారికి మీ తరఫున, నా తరఫున, మనందరి తరఫున ప్రణామము లర్పిస్తున్నాను'.

ఉపనిషత్తుల వ్యాఖ్యానం విలక్షణం

డా॥ శ్రీ యతిరాజులు
హైకోర్టు మాజీ న్యాయమూర్తులు
హైదరాబాద్

పూజ్యులు, గురుదేవులు శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామి వారికి సాష్టాంగ ప్రణామములు.

శ్రీ స్వామి వారు గత నాలుగైదు దశాబ్దాలుగా మనల్ని చైతన్యవంతుల్ని చేయడం జరుగుతూ ఉంది. మన సంస్కృతి వెల లేనిది. మన గ్రంథాలన్నీ ప్రధానంగా సంస్కృత భాషలో ఉన్నాయి. వాటిని పూర్వీకులు తెలుగులో అనువదించినా అవీ కఠినం గానే ఉన్నాయి. అలాంటి వాఙ్మయాన్ని సాధారణ వ్యక్తులకు కూడా అందే లాగున రచించి, వాటిని విస్తృతంగా వితరణ చేసిన స్వామి వారి కృషి అమూల్యమైనది. గ్రంథ రచనలతో పాటు వారు రచించి వారి సుమధుర గళంతో గానం చేసిన పాటల సి.డి.లను మనము వింటూనే ఉన్నాం.

ముఖ్యంగా ఉపనిషత్తులను వారు వ్యాఖ్యానించే తీరు చాలా విలక్షణ మైనది. వారి కఠోపనిషత్తు వ్యాఖ్యానాన్ని నేను వందసార్లు వినుంటానేమో అంటే అతిశయోక్తి కాదు. ఎన్నిసార్లు విన్నా మధురం గానే ఉంటుంది.

నేను న్యాయమూర్తిగా అనేకమంది స్వామీజీల కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా వెళ్ళడం జరిగింది. కాని, స్వామీజీ ప్రత్యేకత నాకు వేరే వారిలో కనిపించ లేదు. ఒక్క శ్లోకాన్ని తీసికొని, గంటల తరబడి దానిని వివరిస్తూ అనర్గళంగా ప్రసంగించే శక్తి స్వామీజీకే ఉంది.

ప్రధానంగా ఒక విషయాన్ని చెప్పాలి. స్వామీజీ కొందరు భక్తులను గుర్తించి, వారికి ప్రత్యేకంగా మోక్షధామం తరగతులను నిర్వహించి, జటిలమైన ఉపనిషత్తుల వంటి గ్రంథాలను ప్రవచించి, వారిని తర్ఫీదు చేయడ మనేది చాలా గొప్ప విషయం. ప్రవచిస్తూ మధ్యమధ్యన స్వామీజీ ప్రశ్నలు వేస్తూ ఉంటే, శ్రోతలు సమాధానాలు చెబుతూ ఉంటారు. దట్ ఈజ్ ది గ్రేట్‌నెస్ ఆఫ్ స్వామీజీ.

శ్రీ స్వామి వారు డెబ్బై వసంతాలు దివ్యంగా వినియోగించుకొని వారి సేవలను సర్వులకు అందించారు. ఇంకా ఎన్నో వసంతాలు వారు ఇలాగే జ్ఞాన యజ్ఞాలను నిర్వహిస్తూ, అనితర సాధ్యమైన వారి సేవలను సమాజానికి అందించాలని, భగవంతుడు వారికి ఆయురారోగ్యములను ప్రసాదించాలని మనసారా ప్రార్థిస్తూ, శ్రీ స్వామి వారికి సాష్టాంగ దండ ప్రణామ మాచరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

సమాజపరమైన జ్ఞానబోధ

జస్టిస్ శ్రీ వై.భాస్కర రావు
(మాజీ ప్రధాన న్యాయమూర్తి, కర్ణాటక హైకోర్టు)

అహింసా సత్య మస్తేయ మకామ క్రోధ లోభతా
భూత ప్రియ హితేచ ధర్మోఽ యం సార్వ వర్ణికః

అహింస, సత్యము, చౌర్య లేమి, కామ క్రోధ లోభములు లేకుండుట, ప్రాణులకు ఇతరులకు మేలు చేయు కోరిక అనునవి సర్వ వర్ణములకు సంబంధించిన ధర్మములు అని భాగవతము నొక్కి వక్కాణించు చున్నది. భారత దేశం వేదభూమి. మానవ శాంతి, సహజీవనము, సోదర ప్రేమను చాటి చెప్పు మూల గ్రంథములు, వేదములు, ఉపనిషత్తులే కాక మరెన్నో గ్రంథము లున్నవి. అయినప్పటికి అశాంతి, హింస, ద్వేషము, అసహనము, స్వార్థ పరత్వము దావాగ్ని వలె సమాజములో ప్రజ్వరిల్లు చున్నవి. వీటికి కారణము తెలుసుకోలేక కాదు. తెలిసికొనియు తాము సత్ప్రవర్తనతో నడచుకొనలేని స్థితిలో యున్నారు, ఈ నాటి మానవులు. తత్ఫలితమే ఒకరి నొకరు హింసించుట, చంపుట, గృహ దహనములు, ఆస్తి నష్టములు - కుల, వర్ణ, మతముల పేర జరుగు చున్నవి. ప్రపంచ ప్రజలలో భారతీయులకు శాంతి కాముకులని పేరు. అహింసా సిద్ధాంతము భారత దేశంలో పుట్టినది. బుద్ధుడు గొంతెత్తి పునః ప్రవచించినాడు. గాంధీజీ దానిని తూ.చ. తప్పకుండా అనుసరించి సూర్యుడస్తమించని సామ్రాజ్య మేలిన బ్రిటీషు వారిని పారద్రోలినాడు. మన భారతీయ సంస్కృతి ఏకత్వంలో భిన్నత్వం కల్గిన సంస్కృతి. పరమత సహనము, భ్రాతృ ప్రేమ, పరోపకారము, మన సంస్కృతికి పెట్టని వన్నెలు. విశ్వ విద్యాలయాలు, మరెన్నో భాషా నిలయాలు, ఇంకెన్నో నూతన సంస్థలు, సైన్సు, వైద్యము, కంప్యూటరు, మొదలగు అంశాలలో ఎంతో పురోగమించు చున్నాము. అయినప్పటికి అశాంతి, హింస, ద్వేషము, మారణకాండలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వీటినన్నిటిని అధిగమించ వలెనన్న మానవునిలో పరివర్తన అనివార్యము. అతడు మతము, వర్ణము, మొదలుగా గల విషయాల గురించి క్షుణ్ణంగా తెలుసుకో గలగాలి. ఇవన్నియు సమాజ సహజీవనం కొరకు అని తెలిసిన నాడు, వాటిని సమాజ క్షయానికి ఉపయోగించటం మానుతాడు. సమాజంలో మరల సమాజపు విలువలు పునరుద్ధరింప బడాలంటే ఎందరో మహానుభావులు, జ్ఞానులు ముందుకు వచ్చి ప్రవచించవలె. ఉద్బోధించవలె. ఖురాను, బైబిలు, వేదాలు, వేదాంగాలు, సహజీవనమును ప్రబోధించు చున్నవని, తోటి మానవుల యెడ ప్రేమ, త్యాగము, అహింస ద్వేషరహితము ఆవశ్యము లనియు, అశాంతి, మారణకాండ, అసహనము, ద్వేషము, విసర్జించ వలెననియు పై గ్రంథములు చాటి చెప్పుచున్న సంగతి మానవులకు తెలియ చెప్పవలసిన అవసరం ప్రస్తుత తరుణంలో ఎంతయినా యున్నది.

పూజ్యులు శ్రీ సుందర చైతన్య స్వామి వారు తమ ఆశ్రమము లోనే కాక వివిధ నగరములలో తమ అనర్గళ ఉపన్యాసముల ద్వారా హిందూ మతం, వేదములు, వేదాంగాలు, ఉపనిషత్తులు ఆదిగా గల ఉత్కృష్ట గ్రంథముల లోని సారాంశమును బోధించు చున్నారు. అంతియేకాక ఇతర మత గ్రంథముల లోని ఉదాహరణములు, కథలు, ఏ తీరున నేటి మానవాళికి ఆచరణ యోగ్యములో సవివరంగా సామాన్య భాషలో సామాన్యు లెల్లరకు అర్థమగు తీరు బోధించుచు, తమ పరిపక్వ జ్ఞానాన్ని ప్రజా సేవకు అంకితము చేసి, మానవ సేవయే మాధవ సేవ అను నానుడిని సార్థకము చేయుచున్నారు.

నేను రెండు పర్యాయములు వారి ఉపన్యాసము వినడము జరిగినది. అనర్గళంగా సామాన్యునికి సైతం అర్థ మగు భాషలో అతి విపులంగా ప్రస్తుత సమాజానికి అవసరమైన ధర్మములు ఏ విధముగా ఆచరించ వలెనో తెలిపినారు. ప్రతిసారి వేల సంఖ్యలో ప్రజలు పాల్గొనటమే వారి ఔన్నత్యానికి తార్కాణము.

ఇంతేకాక శ్రీ స్వామి వారు ఎన్నో పుస్తకములు రచించినారు. మరెన్నో భక్తి కీర్తనలు క్యాసెట్లు, సి.డి.ల రూపంలో తయారు చేయించినారు. మాసపత్రిక 'గిరిధారి' నడుపు చున్నారు. తమ పూర్తి జీవితాన్ని ప్రజా సేవ కొరకే అంకితం చేసి సమాజంలో సత్సాంప్రదాయమును, సహ జీవనమును, శాంతి ప్రియత్వమును, సోదరప్రేమ, త్యాగశీలత, పరోపకారము ఉద్బోధించి అవిరామ సేవ చేయుచున్నారు.

భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యములు ప్రసాదించవలె నని కోరుతూ, వారి భక్తు లెల్లరు వారి ప్రవచనములను తు.చ. తప్పక పాటించి లోక కళ్యాణానికి తోడ్పడాలని కోరుతూ శెలవు తీసికొనెదను.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ చంద్రయ్య గారి ప్రసంగం

పూజ్యశ్రీ సద్గురుదేవులు, శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారి జయంత్యోత్సవ సందర్భంగా మన మందరము ఇక్కడ సమావేశ మయ్యాం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జాతీయ సుందర సత్సంగ్ సదస్సును కూడా మనం నిర్వహించు కుంటున్నాం. ఈ రోజు చాలా శుభదినం.

ఇదొక ఆశ్చర్యం. ప్రపంచ మంతా అనేకమైన సమస్యలతో సతమత మవుతూ ఉంటే, సమస్యలకు సుదూరంగా, ప్రేమ ప్రపంచంలో, ఆనంద ప్రపంచంలో, భక్తి ప్రపంచంలో, సుందరమైన ప్రపంచంలో మనం ఈ వేడుకలు జరుపుకుంటున్నాం. నేను ఈ సభకు ముఖ్య అతిథిగా వచ్చేటందుకు ఆశీర్వాదాన్ని అందించిన గురుదేవులకు నమస్సుమాంజలులు తెలుపు కుంటున్నాను.

చలికాలంలో వయోవృద్ధులనే భేదం లేకుండా చలి తన ప్రభావాన్ని చూపుతూ ఉంటుంది. కాని గురుదేవుల ప్రసంగాలతో వేడెక్కిన మిమ్మల్ని చూస్తూ ఉంటే, చలియే తనకు తానుగా దూరమై పోయిందా అనే భావన కలుగుతూ ఉంది. ఇదొక గొప్ప విశేషమైన, చైతన్యవంతమైన, ఆనందప్రదమైన సందర్భము.

ఈ రోజు ఎక్కడ చూచినా, నిద్ర లేచి వార్తా పత్రిక చేతికి తీసుకోగానే కంటబడే బాధాపూరిత సన్నివేశాలు, అవి ఎక్కడో జరిగినా, మన ఇంటి లోనే జరిగాయా అన్న విధంగా వ్యధ చెందుతున్నాం. అలాంటి బాధా తప్తమైన ప్రపంచం నుండి మనల్ని మరలించి, వారి వద్దకు రప్పించుకొని, వారి ప్రేమ ప్రపంచంలో మనల్ని నడిపిస్తున్నందుకు నేను కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

ఆశ్రమాలు అనేకము లున్నాయి. అనేక పద్ధతులను పాటిస్తున్నాయి. సుందర చైతన్యాశ్రమం ఒక ప్రత్యేకతను సంతరించుకొని ఉంది. జ్ఞానమును వితరణ చేయుటయే ప్రధాన కర్తవ్యంగా కలిగిన ఆశ్రమం ఇది. అన్నం పెడితే ఆకలి తీరుతుంది. అది ఒక్క పూటకు మాత్రమే శక్తి నిస్తుంది. కాని జ్ఞానమనే శక్తి మనల్ని జీవితాంతం శక్తివంతంగా ఉంచుతుంది. దేశం నలుమూలల జ్ఞానయజ్ఞాలను నిర్వహిస్తూ, సామాన్యులకు అర్థం గాని నిగూఢమైన తాత్త్విక విషయాలను సరళమైన భాషలో ప్రజలకు అందిస్తూ, వారిని మేధావంతులుగా చేయాలని నిరంతరం తపిస్తున్న స్వామీజీ వారు అభినందనీయులు.

ప్రపంచం లోని సర్వ సమస్యలకు జ్ఞానమే ఏకైక పరిష్కారము అనే స్వామి వారి భావనతో నేనూ ఏకీభవిస్తూ, ఒక న్యాయమూర్తిగా నేను ఏ సభలలో పాల్గొనినా, సర్వ సమస్యలకు పరిష్కారము జ్ఞానమే అనే విషయాన్ని నేను చాటి చెబుతున్నాను. జ్ఞానం లేని వాళ్ళు అంధులతో, బధిరులతో సమానము.

న్యాయమూర్తిగా నేను మీకు ఒక్క విషయం చెబుతున్నా. మీరు మీ బిడ్డలను జ్ఞానవంతులుగా చేయండి. స్వామి వారి మార్గంలో మీరందరూ సుందరంగా, చైతన్యవంతంగా, ఆనందంగా జీవించాలని ఆశిస్తున్నాను (కరతాళ ధ్వనులు).

ఈ రోజు ప్రపంచంలో ప్రేమ, సేవ మృగ్యమై పోయాయి. ప్రేమతో ప్రపంచం పరిఢ విల్లాలి. ప్రేమ అంటే భేద రహితం, కామ రహితం, అర్థ రహితం, లింగ రహితం, వర్ణ రహితం, కల్మష రహితం, అశాంతి రహితం, మరణ రహితం, సత్యం, నిత్యం, అనంతం, దైవత్వం – అదే స్వామీజీ గారి తత్త్వం.

SRI D.V.SUBBA RAO, *Advocate, Ex. Mayor,* VISAKHAPATNAM

I consider it a rare privilege to take part in this yagna, the honour of conducting which has been given to Visakhapatnam by His Holiness Swami Sundara Chaitanyananda. In these days of meaningless materialism man is forgetting his essential self and mankind has to rediscover itself; and that is possible only if each one is able to "Look beyond himself". In fact this was the theme of SWAMIJI's address to the Rotary Clubs in July, 1991. Sceptics, agnostics and atheists in their excessive zeal for rationalism debunk several theories which are beyond explanation and thus pave the way to spiritual barrenness which will ultimately destroy the finest flowering of the human values. In these days, where in the myriad pursuits of our daily routine, we hardly find time to 'stand and stare', where is the time for prayer? Where is the time for spiritual pursuits, is the question that an ordinary individual embroiled in the dust and din of the daily trials and tribulations asks. The answer is provided by Swamiji. Spreading the message of Sanatana Dharma with his resonant and mellifluous voice he goes on a voyage causing spiritual reawakening of our souls.

After all, an idol or icon is only the manifestation of God - an image created by man himself not merely as an object of worship but also as a focal point for his concentration from the diverse and devious temptations of life. The place of worship; be it a temple, mosque or church is only a haven for congregation of the kindred souls to offer their worship to their Maker. Religious leaders and preachers are the messengers of God, the messiahs carrying forward the gospel of truth and the efficacy of prayer. Bharat which is also called punya bhoomi has been endowed by God with endless succession of preachers and teachers who have elevated this land to the sublime level of spirituality. That parampara is available even in Kaliyuga. Sanatana Dharma is the sustaining force of our culture. Its central theme of truth and love and piety have sustained this nation and enabled it to withstand numerous challenges. What India needs today is a spiritual renaissance and to spearhead this great movement several saints and savants are trudging and traversing the length and breadth of this land. For the awakening of the human soul and to bring about spiritual awareness Swami Sundara Chaitanyanandaji has been carrying on a relentless campaign. The issue that was brought out by the 100th yagna at Secunderabad was aptly called 'Panchajanya' the clarion call that Swamiji has given for the spiritual awakening of the disturbed souls. In this Karma bhoomi men like Swamiji are 'Karana Janmas' and we are fortunate to live in times when such men of God as His Holiness are inspiring us to 'realise ourselves' by introspection, soul searching and enquiry. Swamiji's inspiring messages are beacon lights which illumine the paths of our lives and put us on the road to self-realisation.

Let us therefore pray that great spiritual leaders like Swami Sundara Chaitanyanandaji help us to realise that God has created us in his image and that to be worthy of the kingdom of God we shall transform this earth in such a way that peace and prosperity shall rule and prevail. ***Om Tat Sat***

నా జీవితంలో శ్రీ స్వామీజీ

శ్రీ చంద్రవదన్, ఐ.ఎ.ఎస్.,
హైదరాబాద్ జిల్లా కలెక్టర్

నేను శ్రీ స్వామి వారి ప్రవచనాలను చిన్న వయస్సు నుండే హైదరాబాద్ లోను, ధవళేశ్వరం లోను వింటూ ఉన్నాను. శ్రీ స్వామి వారు భగవద్గీత తత్వాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా అందించగలిగారు. ఒక్క జ్ఞానం ద్వారానే మోక్షం సిద్ధిస్తుందని సర్వులకు తెలియజేస్తూ, జ్ఞానమనే శక్తివంతమైన అస్త్రాన్ని మన చేతిలో ఉంచుతున్నారు. శ్రీస్వామి వారు జ్ఞానబ్రహ్మ. వారి వాక్కులో శక్తి ఉంది. శక్తివంతమైన వారి వాక్కు ద్వారా, ఎందరో ఋషులు, మహాత్ములు అనుభూతి ఉండినా అందించలేని జ్ఞానాన్ని శ్రీ స్వామి వారు మనకు అందిస్తూ ఉన్నారు. నేను కేవలం స్వామి వారి ప్రవచనాల ద్వారానే సనాతన ధర్మానికి దగ్గరయ్యాను అనేది నా వ్యక్తిగతమైన అభిప్రాయం. బడికెళ్ళే వయస్సు నుండే నేను శ్రీస్వామి వారిని అనుసరిస్తూ ఉన్నాను. ఇది నా భాగ్యం.

జ్ఞానం ద్వారా శ్రీ స్వామి వారు మనలను శక్తివంతుల్ని చేస్తూ ఉన్నారు. బుద్ధి లోని అజ్ఞానాన్ని అంతమొందించడమే గాక, ఆలోచనలో, అనుభూతులలో, వ్యవహారంలో, విలువలలో ఒక స్పష్టతను ప్రసాదిస్తూ ఉన్నారు. ఎందరో గురువులు ఉన్నా, స్పష్టతను పెంపొందించగల సద్గురువు కోసం సమాజం వెతుకుతూ ఉంది. ఆ సద్గురువు ఎవరో కాదు, ఈ మహాత్ముడే.

అనితర సాధ్యం

శ్రీ ఎమ్.సత్యనారాయణ రావు
మాజీ ఎ.పి.ఎస్.ఆర్.టి.సి ఛైర్మెన్



సుందరము చైతన్యము మూర్తీభవించిన శ్రీ సుందర చైతన్యానంద స్వాముల వారికి పాదాభివందనములు.

నేను ఎందరో స్వాముల వారి ఉపన్యాసాలు విన్నాను. వాళ్ళను విమర్శించడం కాదు గాని, అబ్బ! ఈ స్వామిది ఏమి కంఠమండీ! భగవంతుడు ఏమి కంఠం ఇచ్చాడండీ స్వామికి. అయినా, ఏమి చెబుతాడండి, ఏం మాట్లాడుతా డండీ.

భాగవతం చెప్పడం మొదలుపెడితే, వింటున్నంత సేపు మనల్ని మనం మరచిపోతాం. భాగవంతలో ఆయన ఎక్స్‌పర్ట్ అనుకోండి. కృష్ణతత్త్వం మీద ధారాళంగా ప్రసంగించి మనల్ని ముగ్ధుల్ని చేస్తారు. భగవంతుడు వారికి ఆ శక్తిని ప్రసాదించాడు. అలాంటి స్వామీజీ మన మధ్య ఉన్నందుకు ఎంతో సంతోషము.

ఎందరెందరో మాట్లాడుతూ ఉంటారు. కాని, స్వామీజీ మాట్లాడుతుంటే అందరికీ స్పష్టంగా అర్థమవుతుంది. స్వామీజీ లాగా చక్కటి భాషలో మాట్లాడే స్వామిని మరొకరిని నేను చూడలేదు.

ఈ కార్యక్రమంలో పాల్గొనడం నా భాగ్యంగా భావిస్తూ, ఈ అవకాశము కల్పించిన స్వామీజీకి, మీ అందరికి నా నమస్కారాలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నా.

స్వామీజీ కారణజన్ములు

శ్రీ కొణిజేటి రోశయ్య
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి

స్వామీజీ కారణజన్ములు అనేది నా వ్యక్తిగతమైన భావన. మన దేశ జనాభా నూటపది కోట్లకు చేరింది. అదుపు చేసే ప్రయత్నాలు జరుగుతున్నా వేగం తగ్గకుండా ఉంది. మనుషులు పుడుతూ ఉంటారు. గిడుతూ ఉంటారు. ఉన్నప్పుడే కాకుండా, పోయిన తరువాత కూడా సమాజం కొందరిని గుర్తుపెట్టు కుంటుంది. అతి కొందరు మాత్రమే భౌతికంగా మరణించినా మన మనస్సులలో చిరస్మరణీయంగా, సజీవంగా మూర్తీభవించి ఉంటారు.

ఇంకొక మెట్టు పైకి వెళ్తే,

స్వామీజీ లాంటి వారు గోచరిస్తారు. సామాన్య ప్రజానీకాన్ని కూడా చైతన్యవరచి, సదాచారాన్ని అలవరచుకొని, దురాచారాన్ని దూరం చేసుకొనేందుకు కావలసిన సదుపదేశాన్ని సమాజానికి అందిస్తూ ఉంటారు.

శ్రీ సుందర చైతన్యానంద స్వామి ప్రసంగాలు మీరు చాలా సార్లు విని తరించి ఉంటారు. నేను కూడా అలా వినినవాళ్ళలో ఒకణ్ణి.

వారి ప్రసంగాలు గంగా ప్రవాహంలా సాగుతాయి. ప్రతి పలుకు అర్థవంతంగా ఉంటుంది. ప్రసంగాలతో పాటు అనేకములైన రచనలు చేసి జనతను జాగృతం చేశారు. చేస్తున్నారు.

స్వామీజీ 100 వ జ్ఞానయజ్ఞాన్ని నిర్వహించినపుడు నేను వారి పాదాల వద్దకు రావడం జరిగింది.

మన రాష్ట్రంలో, పొరుగు రాష్ట్రాల్లో కూడా స్వామీజీలు, పీఠాధిపతులు, మఠాధిపతులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. పరమేశ్వరునితో ఐక్యం కావడమే అందరి లక్ష్యం కూడా. కాకపోతే, బోధించే మార్గాలు అనేకంగా ఉంటాయి.

కాని, వీరిలో కొద్ది మంది మాత్రమే అశేష ప్రజానీకాన్ని చైతన్యపరుస్తూ, విస్తృతంగా పర్యటిస్తూ, వారి మధురమైన ప్రవచనాల ద్వారా భక్త సమూహాన్ని ఉత్తేజపరుస్తూ ఉంటారు. అలాంటి వారిలో శ్రీ సుందర చైతన్యానందస్వామి ఒకరు అని అనడం కంటే, ప్రధానమైన వారుగా మనం గుర్తించదగిన వారు.

వారు ప్రవచించడం, రచించడమే కాకుండా ప్రసంగాల మధ్యలో తియ్యటి సంగీతంతో గీతాలు వినిపిస్తూ ఉంటారు. ప్రసంగం చేయడం ఒక తీరు. రాగాలాపనలతో కూడిన కీర్తనల్ని ఆలపించడం మరొక తీరు. స్వామీజీ అన్నిటిలో శక్తివంతులు. అందుకే నేను ప్రారంభం లోనే చెప్పాను వారు కారణజన్ములు అని. అంటే, ఒక ప్రత్యేకమైన కార్యక్రమాన్ని నిర్వహించడానికి జన్మనెత్తిన వారు అని నా భావం.

వారికి జన్మనిచ్చిన పరమేశ్వరుడు, 'అయ్యా! సుందర చైతన్యానంద స్వామి అనే పేరుతో మీరు భూలోకానికి వెళ్ళి, ప్రజలలో విశేషమైన జ్ఞానసంపదను కలిగించండి. ఇదే మీ కార్యక్రమం' అని చెప్పి పంపించి ఉంటారని నా భావన.

స్వామీజీని గూర్చి నాకున్న అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం లభించినందుకు శ్రీ స్వామీజీకి నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నా.

మహోన్నత వ్యక్తి శ్రీ స్వామీజీ

శ్రీ సీతారామయ్య
బ్రహ్మయ్య & కంపెని
హైదరాబాద్

నాకు స్వామీజీ చాలా కాలంగా తెలిసినా చివరికి ఆయనకు సేవ లందించేందుకు నా భార్య రికమెండేషన్ అవసరమైంది. గత 25 సంవత్సరాలుగా ఆమె శ్రీ స్వామి వారి భక్తురాలు. రోజులో కనీసం నాలుగు గంటలైనా వారి క్యాసెట్లు వింటూ, గ్రంథాలు చదువుతూ కాలం గడుపుతుంది. స్వామి వారి యజ్ఞాలు ఎక్కడ జరిగినా, అటు హైదరాబాద్ నిజాం కాలేజిలో అయినా, ఇటు సికింద్రాబాద్ మెహబూబ్ కాలేజి గ్రౌండ్సులో అయినా, ఉదయం అయిదు గంటలకే ఆమె హాజరు అయ్యేది. నన్ను కూడా తీసుకొని వెళ్ళేది. అలా వింటూ వింటూ నెమ్మదిగా నాలోనూ ఆసక్తి, అవగాహన పెరిగాయి. స్వామి వారి గ్రంథాలు కూడా చదివిన తరువాత, నాకనిపించింది, ఈయన ఒక గొప్ప సోషలిస్టులా ఉన్నారే! అని. సాధారణంగా సోషలిస్టులు ఏం చేస్తారు? వీరి సొమ్ము వారికి, వారి సొమ్ము వీరికి పంచుతూ ఉంటారు. కానీ మన స్వామి వారు అలా కాదు. వారి దంతా స్వయంకృషి. ఆకళింపు చేసుకోలేని తాత్త్విక విషయాల నన్నిటిని వారే స్వయంగా అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఎంతో శ్రమతో సమకూర్చుకున్న ఆ జ్ఞానాన్నంతా గ్రంథాల ద్వారా, బోధల ద్వారా జనానికి పంచి పెడుతూ ఉన్నారు. ఇంతకన్నా గొప్ప సోషలిస్టు ఎవరుంటారు?

అటువంటి మహోన్నత వ్యక్తి శ్రీ స్వామీజీ కలం నుండి మాసం మాసం వెలువడుతున్న అద్భుతమైన పత్రిక 'గిరిధారి' నేటికి ఇరవై వేల మంది జీవిత సభ్యుల్ని కలిగిన మహా పత్రిక అయింది. ఇది ఇంతటితో ఆగకూడదు. ఆ సభ్యత్వాన్ని ఇరవై ఐదు లక్షలకు తీసుకొనిపోయే విధంగా మన వంతు మనం కృషి చెయ్యాలి. మనకు ఇంతటి ఆధ్యాత్మిక శక్తిని, స్ఫూర్తిని అందిస్తున్న శ్రీ స్వామీజీ ఎంతో కాలం దీర్ఘ ఆయుష్షుతో, చక్కటి ఆరోగ్యంతో విలసిల్లాలని ప్రార్థిస్తూ శెలవు తీసుకుంటున్నాను.

భగవదంశ

శ్రీ నరసింహప్ప
ఇన్‌కమ్‌టాక్స్ ఛీఫ్ కమీషనర్
హైదరాబాద్

పూర్వం ఆంధ్రప్రదేశ్ - అంటే, తెలంగాణా, రాయలసీమ, కోస్తా ప్రాంతాల లోని ఋషులందరూ సంఘటితంగా వెళ్ళి విష్ణుమూర్తిని కలిసారట. 'స్వామీ! రాబోయే రోజుల్లో, ఆంధ్రదేశంలో జనం రియాలిటీని విడిచిపెట్టి రియల్ ఎస్టేట్ చుట్టూ తిరుగుతూ, ప్లాట్లు ఫ్లాట్లు, కంపెనీ షేర్లు, కమీషన్లు, పదవులు, కాంట్రాక్టులు - ఈ మాయలో పడి తమ జీవితాల్ని అశాంతి, అంధకారంలో నింపుకోబోతున్నారు. దీనికి తరుణోపాయ మేమిటి? అని ప్రశ్నిస్తూ ప్రార్థించారట.

విష్ణుమూర్తి వారి ఐకమత్యానికి సంతోషించి, ప్రజల పట్ల వారికున్న సేవా ప్రేమలకు ఆనందించి, రాబోయే కాలంలో నా అంశ సుందర చైతన్య స్వామిగా రావడం జరుగుతుంది. ఆయన చెప్పే మార్గంలో చరించేవారు తప్పక తరిస్తారు అని అభయ మిచ్చారట.

శ్రీకృష్ణ పరమాత్మ జీవిత కాలంలో స్వామీజీ



శ్రీకృష్ణుడికి స్నేహితుడో, లేదా గోపికయో అయ్యుంటాడు. ఆయన దొంగలించిన వెన్నలో ఈయన కాస్త అపహరించి ఈనాటి సమాజానికి పంచుతున్నారు. స్వామీజీ రెండువందలకు పైగా యజ్ఞాలు నిర్వహించారు. ఇతరులకు సాధ్యం గాని కార్యక్రమాలు నిర్వహించారు. గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, కబీర్, సదాశివ బ్రహ్మేంద్రుల కీర్తనలు, ముఖ్యంగా శ్రీ శంకరాచార్య స్వామి ప్రకరణ గ్రంథాలు - ఇలా అన్నిటిని అందరికీ అర్థమయ్యే రీతిలో బోధించడం అరుదైన విషయం. ఇలాంటిది ఆంధ్రప్రదేశ్ చరిత్ర లోనే లేదు అని మీకు మనవి చేస్తున్నాను. అది మన అదృష్టం. మనకు వరం.

స్వామీజీ జ్ఞానాన్ని విశేషంగా వితరణ చేస్తూ, జ్ఞానయజ్ఞాలు నిర్వహిస్తూ జ్ఞానయోగిగా శోభిస్తున్నా, నిరంతరం మానవాళి కోసం శ్రమిస్తూ కర్మయోగిగా కనిపిస్తారు. ఆయనది అంతా సమర్పణ భావమే. ఇది నాది అని అనుకోరు. అంతా భగవదనుగ్రహంగా దర్శిస్తారు. అందరినీ ప్రేమతో చూస్తారు. జనులలో జనార్దనుని చూడగలిగిన మహనీయులు శ్రీ సుందర చైతన్యులు. ఇదే భగవదంశ.

An Acharya

Om Gurudevaayavidmahae
ParamBrahmaayadheemahae
Tanno Guru prachodayaat

Dr.Mrs.Kasturi Siripurapu,
M.S.,M.F.F.P;F.R.C.O.G
London, UK



When I was contacted recently that a souvenir booklet is going to be published for Poojya Swamiji's 77th birthday, I was delighted but a few seconds later when I was asked to contribute an article, the bombshell fell on me and my heart sank into my boots to put it proverbially. How can an ant climb up mount Everest, and without climbing to the top how can it describe the serene beauty of the Himalayas!! How can an ignorant and inadequate disciple like me describe the length and breadth of the knowledge and mightiness of a person whose persona attracts hundreds of thousands of people and thousands of them have their lives moulded by Him? But I have to make an attempt and this is what it is "Chandruniki oka noolu progu."

According to Sanatana Dharma Acharya is not a person having merely the knowledge of the scriptures, but one who practices the teachings of the scriptures and knows all the practical ramifications of such practice from his own experience and uses his practical knowledge to guide the disciples. That is how a Guru is different from an Acharya because Guru just teaches what is in Sastras.

There are some distinguishing characteristics of an acharya that he practices and disciples have to watch, learn and practice to be able to progress in their spiritual pursuit i.e attaining jeevanmukti.

I shall endeavour to mention a few of those which Poojya Swami Sundara Chaitanyananda has , whom I was fortunate enough to have had as my Gurudev/acharyadev.

The first noticeable characteristic of Poojya Swamiji is humility. Inspite of having knowledge of sastras, being a prolific writer, singer, song writer, choreographer, he considers himself as a simple sadhu who is carrying the knowledge given by ancient Rishis in a basket on his head and distributing it

to the interested and deserving people on his way, thus paying off his debt to the ancient Rishis.Unless somebody has a long time contact with Him it is impossible for people like me to fathom out his depth of knowledge and writing skills which are also submerged in the songs He writes, in addition to his books. He considers himself as a tool in the Lord's hands.This is what is called vinayamu or humility. Vedic texts, contrary to the modern day prevailing perceptions which are basically materialistic, considered knowledge as that which instills humility or *Vidya dadaathi vinayam*. For the Vedic Rishis humility or vinayam was not just important but a crucial element in evolution, achievement and attainment of happiness.

In Yogavasishta, Vasishta maharshi says "Through vinayam and prayathna (persistant effort) everything can be known and he who thinks he knows, knows nothing. And he who thinks he doesn't know, could know everything. The notion 'I don't know' signifies vinayam or humility".

Wise people and scholars all over the world recognized the value of humility in conducting ourselves in daily life and I shall mention a few quotes here.

'Humility is the root, mother, nurse, foundation and bond of all virtue' - St. John Chrysostom.

'Without humility there can be no humanity' - John Buchan.

'Real excellence and humility are not incompatible one with the other, on the contrary, they are twin sisters' - Henri-Dominique Lacordaire.

'What makes humility so desirable is the marvellous thing it does to us; it creates in us a capacity for the closest possible intimacy with God' - Monica Baldwin.

Yes, Poojya Swamiji has humility and He qualifies to be called as an acharya, but what qualities in a disciple tell that he or she is humble? For a start, the way one offers his Pranams, the way he talks , the way he sits and the way he questions to clear his doubts, the way he thinks about the answer before asking a follow up question for further clarity; unlike one of Yagnavalkya Maharshi's disciples (story is not mentioned for the sake of brevity),how he obeys the orders of a Guru even when he thinks it is not right, as the parents and Guru know better than him, and finally but by no means least, how one reacts when the Guru admonishes. Whether he wants to blame the Guru and leave, or talk about him in an insulting way, or sit and think what went wrong, and how to rectify and apologize; because an Acharya has got immense kshama or forgiving nature built into Him.

The next quality of Poojya Swamiji is His dedication of time continuously to the well being of the society for all age groups, giving His precious time for every needy person or a group of people who can mould the future generations. Sloka no.8 in Manecha slokas by Samartha Ramadas says as follows: (I am giving English translation).

'Let fame prevail after one's death,

Thus alone lead your life, oh! my gentle and upright Mind!
Like the sandalwood, endure selflessly, that more fragrance emanate,
And yet, oh Mind! offer joy to the hearts of other gentle souls'.

Swamiji, inspite of his ill health and other obstacles works day and night to leave the spiritual fragrance of the sandalwood to the people at large , no friends, no enemies. He teaches His disciples practically by way of this example how best to use the time and how best to help the fellow human beings. And I think this qualifies him to be addressed as an Acharya.

Next I will come to another important quality which is : a Guru teaches the masses by way of Pravachanams but an Acharya spots the deficiencies and merits of individual disciples and uses his experience to correct them without even the disciple knowing that this is happening until at one point the caterpillar turns into a beautiful butterfly.

A butterfly will not remember that it was an ugly caterpillar at one point but a spiritual pursuant with his God given memory will know how he was before and how he is now. This is what happened to me personally as I was sown with the seeds of jnana in my childhood by my father, but by the time he wanted to teach me about bhakthi I left home and never bothered about it. I never disapproved of people going to temple or doing pooja etc., but I could not bring myself to do that. I never looked down on anybody doing that. When I approached Swamiji first time He gave me a collection of books mainly about bhakthas and with the intermingled gnanam. It looked like Dvaitham to start with and bhakthi culminating in gnanam at the end showed the oneness. I understood they are two sides of a coin. Swamiji says gnanam without bhakthi is lame and bhakthi without gnanam is blind. And when I started to stay in the ashram every now and then I found out his daily practices of pooja, meditation etc. Started going to temple when I can and do what I can by way of pooja at home daily. This is how his actions taught me how to amend my life. Similarly, his generosity was evident on several occasions to me at a personal level and I know how much personal attention he gave me when he gave me his own well cherished japamala and gave me mantra deeksha, indicating another quality of a good Acharya.

An Acharya knows his limitations when to give up and where not to tread or tread carefully as all disciples are not the same. As Swamiji said a few times when He started teaching he wanted to mend everybody and later found out there are some who cannot be mended in their ways and He gave up on that category of people.

As I said in the beginning, it is not possible for me to describe all the virtues of Swamiji, but I wrote what were very striking to my mind during my little acquaintance with Him and to my mind He deserves to be called as an Acharyadeva.

Sarve janah sukhino bhavantu!

A Tribute to SRI SWAMI SUNDARA CHAITANYANANDA on His 77th Birthday

T. Nanda Kumar, *MD, FACP, MRCP(UK& Ire), FHM,*
Program Director, Shasta Regional Medical Center Internal Medicine Residency,
Director of Medical Affairs, Shasta regional Medical Center
Clinical Professor University of California, Davis

It is my great privilege and fortune to pen a few words on this auspicious occasion of the 77th birthday of Swami Sundara Chaitanya nanda. Words fail to capture my amazement and gratitude as I reflect on the extraordinary accomplishments of Swamiji, whom I have been fortunate to know since our shared childhood.

Swamiji and I, as cousins, were born in the same sprawling ancestral home of our grandfather, a renowned Ayurvedic physician Sri Thiruvengalaiah, in Kattubadipalem, Nellore. Despite being years apart, my early memories of Swamiji are vivid—he was an extraordinary adolescent, often surrounded by stacks of books and immersed in deep contemplation, yet always retaining his humor and wit. Even at that young age, his focus and demeanor set him apart

from our family and peers.

Our childhood was shaped significantly by our uncle, Sri Thiruvoipati Raghavaiah, a self-educated scholar, prolific writer, college principal, and humanist-philanthropist. Uncle Raghavaiah inspired everyone he encountered, leaving a lasting impression on his family, students, and colleagues. His guidance laid the foundation for the intellectual and spiritual paths we would later pursue in life.

Swamiji's journey into spirituality was remarkable. He began leading bhajans and delivering discourses that

captivated audiences, young and old, starting in Venkatagiri and later spreading throughout the state. As our paths diverged, I moved to the UK and United States and lost touch for several years. However, my mother, Sarojanamma - our family matriarch kept me updated on Swamiji's incredible transformation. She often spoke of his achievements as divine blessings and the result of his unwavering dedication.

Swamiji's journey is a testament to the power of will, concentration, and perseverance. Coming from humble beginnings and without formal education, he mastered the scriptures and attained self-realization. His innate musical talents blossomed into mastery; he became a revered classical singer, a prolific composer, and an orchestrator of grand musical performances. Hundreds of these are now digitized and preserved, serving as a timeless source of inspiration, enlightenment, and joy for generations to come.

Like a scintillating diamond with myriad facets, Swamiji's accomplishments have illuminated the lives of millions, helping them rewrite their destinies. His teachings, ideas, and music will undoubtedly continue to guide and inspire generations. Swamiji's ability to distill profound spiritual truths into simple language, enriched with relatable comparisons to everyday life and delivered with empathy and love, has captivated the masses. His words have not only guided countless people toward the righteous path but have also spurred actionable changes in their understanding and behavior.

As a Vedanta practitioner and preceptor, Swamiji's contributions have been extraordinary. He established the Dhavaleswaram Ashram and the Sundara Chaitanya Ashram in Dindigul, along with multiple Sri Krishna Bhagwan temples and Sundara Satsang centers. These spiritual landmarks have become focal points for the revival of Sanatana Dharma. His efforts in writing hundreds of books, publishing the Giridhari journal monthly, organizing innumerable Gnana Yagnas, composing profound music, and creating enduring spiritual institutions are nothing short of miraculous.

Swami Sundara Chaitanyananda's life and work stand as a beacon of hope and inspiration, demonstrating the heights an individual can achieve through devotion, discipline, and divine grace. On this milestone birthday, we celebrate not only his accomplishments but also the lasting impact he has made on countless lives. May Swamiji's wisdom and vision continue to guide us for many years to come.

VOICE OF THE HEART

Dr.Mrs.Annapurna
Dr.Jogi Pattisapu, *M.D.,FAAP, FAANS*
(Neuro surgeon)
Orlando, Florida USA



Sri Gurubhyo namah!
Acharyadevo bhava!

For over 30 years, we have been blessed to be at your feet, learning various scriptures and increasing our love of God and for you! As we reflect on the many hours during your weeklong stay in our humble home in Orlando and the many visits to the ashram and other lecture halls, we realize how blessed we are for your gracious guidance in life . We witnessed several janmadina mahotsavalu at the Dundigal ashram including many gajarohanam rituals and of course the sweet pravachanams. We can almost recall every event.

Most importantly, we read your precious books everyday and our satsangam group benefited immensely through years of studying the various scriptures. Your in-depth explanations made them most enjoyable with life changing knowledge. We have listened to so many of your discourses, Bhajans, and music over the 30+ years and still yearn for more!

Your English writing is so superb and clear, beautiful and still we read (and re-read) them to appreciate the depth and clarity you deliver in multiple languages. Your Bhaja Govindam in English is the best ever!!!! As one of our era's most influential cultural revivalists and religious teachers, Swamiji stands as a beacon of spiritual wisdom, combining profound scriptural knowledge with extraordinary talents in multiple domains.

What sets Swamiji apart is his remarkable ability to convey deep spiritual truths through various mediums. His oratory skills are legendary, characterized by a unique blend of wisdom, wit, and warmth. His talks flow with graceful eloquence, interspersed with jovial anecdotes and sharp insights that make complex spiritual concepts accessible to all. The multifaceted nature of Swamiji's contributions - as an orator, writer, musician, and spiritual guide - creates

a comprehensive approach to spiritual awakening. His teachings demonstrate that spirituality isn't confined to traditional methods but can be expressed through various creative channels. This versatility allows him to reach people of different temperaments and backgrounds, making spiritual wisdom accessible to the masses.

The impact of his spiritual mission is evident in the 100s of Gnana Yagnas that he has conducted in India and abroad, spreading the timeless wisdom of Sanatana Dharma. His speeches resonate with both scholars and laypeople, creating an atmosphere where spiritual wisdom flows naturally into receptive hearts. The thundering voice that challenges and calls, combined with nectar-like words that console and convince, creates an unforgettable impact on his audiences. And Swamiji does this by adding a healthy dose of charming jokes, making all the knowledge sweeter, much easier to remember and put to daily use.

The many lectures on Katopanishad, Vishnusahasra namam, Upadesasaram and Gopika Gitam and others are still ringing in our ears as we continuously revel in them. The words from Ramayanam, Bhagavatam, Chaitanya Panchajanyam and the many books we enjoyed reading and learning are ever fresh as we keep re-reading them frequently. Your voice from the Vyasa Peetam resonates in our hearts as we cherish the many personal and quiet moments with you over the years dear Swamiji!! Your personal guidance and doubt clarifications are still remembered and cherished. Dhanyavadamulu Priya Swamiji.

We are so grateful for yet another *janmadina mahotsavam*, and personally regret our inability to travel during this time. Looking forward to seeing the pictures and videos of your smiling face as you appreciate your devotees celebrating the very special day, dear Swamiji!!!

Maa jivana lakshya darsanam chupinchina Gurudevula pada padmalaki vandanalu arpistu,

Yours,

Annapurna and Jogi Pattisapu.

మరువలేని స్పందన

కళాతపస్వి
సినీ దర్శకులు
శ్రీ కె.విశ్వనాథ్

ఎన్నో ఏళ్ళ క్రితం నేను విశాఖపట్టణంలో ఉండగా ఎవరో చెప్పారు, 'స్వామిజీ ప్రవచనం చేస్తూ ఉంటే లక్షలాది మంది పిన్డ్రోప్ సైలెన్స్‌తో వింటారు. వారిలో ఒక మహత్తరమైన సమ్మోహనా శక్తి ఉంది' అని. ఆ రోజు వారి మాటలు నేను నమ్మలేదు. ఆయన భక్తులు కదా! ఏదో అతిశయోక్తిగా చెప్పి ఉంటారులే అనుకున్నాను. ఒక రోజు సాయంత్రం నాకు కాస్త తీరిక దొరికితే ఊరకే చూసి వద్దామని బుల్లయ్య కాలేజి ప్రాంగణానికి వెళ్ళాను. అక్కడ చూసేసరికి అబ్బో! ఆ మైదాన మంతా జన సమూహం కాదు, ఒక జన సముద్రం. స్వామి వారు 'గలగలగల' లాడించేస్తూ ఉన్నారు. బాబోయ్! ఇదేమిటి! పది సంవత్సరాలుగా నేను సౌండ్ రికార్డిస్ట్‌గా పని చేసినాను. ఇటువంటి వాయిస్, ఇటువంటి మోడ్యులేషన్స్ నేను ఎప్పుడూ ఎక్కడా వినలేదు. సాధారణంగా వేదంలో ఉదాత్త అనుదాత్తాలు ఉంటాయి. వాటిని

అనుసరించి వేదం పఠిస్తూ ఉంటారు. కానీ ఇక్కడ మామూలు గద్యమే ఒక వేదంలా వినిపిస్తూ ఉందేమిటి అని ఆశ్చర్య పోయాను. ఇది సుమారు 20 సంవత్సరాల క్రితం విషయం. అది రామాయణంలో శ్రీరాముని పట్టాభిషేక ఘట్టం. ఎక్కడో సుదూరంగా ఆ జనసముద్రానికి ఆవల కారు నిలుపుకొని, అక్కడే ఒక ముప్పావు గంట నిలుచుని ముగ్ధుడినై ఆ ప్రవచనం విన్నాను. ఆ రోజు నాలో కలిగిన స్పందనను నేను ఈనాటికీ మరువలేను. నా ఆనందాన్ని చూసి మరునాడు ఎవరో అన్నారు 'మీరు స్వామిజీతో మాట్లాడతారా?' అని. నేనన్నాను అమ్మో! ఆయనతోనా? ఆయనతో నేనెలా మాట్లాడగలను? అని.

అప్పుడు వారన్నారు. 'లేదు, స్వామి వారు ప్రేమ హృదయులు. వారు అందరి తోనూ మాట్లాడతారు'.

నేను ఆ రోజు ప్రథమంగా స్వామి వారితో ఫోనులో మాట్లాడాను. ఆ రోజు ఎంతో ఆప్యాయంగా, ఎన్నో జన్మల సంబంధం ఉన్నట్లు స్వామి వారు నాతో మాట్లాడారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నేనెవరో వారికి తెలియదు. అప్పుడు నాకనిపించింది - జీవితంలో దేనికైనా అదృష్టం ఉండాలి. నేను నిజంగా చాలా అదృష్టవంతుడిని అని. మేము ఎప్పుడు ధవళేశ్వరం వెళ్ళినా లేదా హైదరాబాద్ ఆశ్రమానికి వచ్చినా, స్వామి వారు ఎంతో ఆప్యాయంగా మాతో కూర్చొని మాట్లాడతారు. అది మా పుణ్యంగా మేము భావిస్తాము.

పంచరత్న భక్తిమాల

శ్రీ ఎ.వి.సుబ్రహ్మణ్యం
(ఎవిఎస్)
సినీ హాస్య నటుడు, దర్శకుడు
తెనాలి

బ్రహ్మశ్రీ పూజ్యులు, గురుదేవులు, గీతాజ్ఞానయజ్ఞ ప్రయోక్త, మృదు మధుర గాయకులు బ్రహ్మచారి శ్రీ సుందర రాజన్, బి.ఎ., గారి **34** వ జన్మదినోత్సవ శుభ సందర్భము పురస్కరించుకొని అత్యంత భక్తి ప్రపత్తులతో సమర్పించు పంచరత్న భక్తిమాల.

వేంకటగిరి నివాసి యష్టాంగ యోగ
సాధనుడు శ్రీకృష్ణ సత్ప్రసాదపాత్ర
భవ్యచిత్తుడు పరిపూర్ణ భావ విదుడు
బ్రహ్మచారితండు సుందరరాజ వరుఁడు

అవతరించె నిట నాబాల గోపాల
మును దరింపజేయ బుణ్యమూర్తి
పరమ పావనుండు కరుణాబ్ధి విజ్ఞాన
వరుడు శ్రీ సుందర రాజిన్యుండు

కదలి యఖండదీక్ష భరత ఖండమునన్ విహరించి భారతా
భ్యుదయము బెంపుజేయ మృదుమధురోక్తులతో గమనీయభావసం
పద నలరారు జగద్గురు వ్యాఖ్యయు వ్రాసెను విద్యలన్నియున్
జదివిన బ్రహ్మచారి మనజాతి హితుండు సుందరరాజ వరుఁడు

స్వామిధీ మన్మణి సమర్ధస్వామి సుందరరాజ
ప్రకటిత తపఃప్రభావు డార్యప్రియుడు
పావనాత్ముడు జీవన్ముక్తు డితడు
ఆత్మబలమిచ్చునట్టి మహా మహితాత్ముడితడు

జ్ఞానాంబోధి భక్తితత్పరుడు సాక్షాద్బ్రహ్మతేజస్విసం
విభుదాచార్యుడు దైవభక్తి భజితుండు సంధ్యాధ్యను
ష్ఠానాసక్తుడు యోగసత్వమయ దీక్షాకంకణోద్భాసిబ్ర
హ్మచారి మన సుందరరాజ కత్యంతాప్తుడై వర్తిలెన్.

తెనాలి
23-12-1981

శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామి వారికి

సాహిత్య నీరాజనం

సహజకవి, సినీకవి
శ్రీ మల్లెమాల సుందర రామిరెడ్డి

మానిత సుందర చైత
న్యానంద స్వామి! నీదు నవరస భరిత
మ్మౌనుడుల నాలకించిన
జ్ఞానోదయమౌను క్రూర జంతువులకైనన్

ప్రతి మాట మంత్రపుష్పము
ప్రతి కదలిక భక్తిభావ బంధుర మికనో
యతివర! నీ కలమందువ
శ్రుతులకు భాష్యమ్ము చెప్ప స్తుతి పాత్రముగన్ ॥

మౌని సత్తమా!
కడగంటి చూపుతో జడపదార్థమ్మైన
బండను చైతన్య పరచగలవు!
అపురూపమైనట్టి ఉపమానములు జల్లి
శిశువుల తలలూప జేయగలవు ॥
పండు వెన్నెల పిండు వంటి గడ్డము నుండి
పీయూషమును గురిపించ గలవు!
వరదపొంగును మించు వాగ్ధాటితో సభన్
ఆపక ఉఱ్ఱూత లూపగలవు!

అంతేనా?
సంఘమున వాసి చెడిన కాషాయమునకు
విజ్ఞత నలంది యెనలేని విలువ పెంచి
ఆత్మవిజ్ఞానమును హృదయాంతరాళ
ములను వెలయించి బ్రహ్మమున్ తెలుపగలవు ॥

ఆంధ్రమాత గర్భమందున జన్మించి
భరతమాత గర్వపడెడు లీల
విశ్వమానవుడుగ వెలుగొందు చున్న నీ
జన్మ సార్థకమ్ము! సంయమీంద్ర ॥

ఐహిక వాంఛలెల్ల విడనాడి నిరంతర సత్యనిష్ఠతో
దేహ మశాశ్వత మ్మను యతీంద్రుల సూక్తిని మౌళిదాల్చి, ని
ర్మోహ నిసర్గమార్గమున లోకము మెచ్చగ సాగుచున్న ధ
ర్మాహవవీర! నిన్ను మనసార నుతించి నమస్కరించెదన్ ॥

'పావన గోదావరీ నది ఆంధ్ర దేశంలో ప్రవహించడం ఎంత గర్వకారణమో, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం ఆంధ్రదేశంలో ఉండటం ఎంత గర్వ కారణమో, శ్రీ సుందర చైతన్యానంద స్వామి ఆంధ్రుడు కావడం అంతే గర్వ కారణము'
- మల్లెమాల

కృష్ణ భగవానుని దూత

కళాప్రపూర్ణ, పద్మశ్రీ
డా॥ నేరెళ్ళ వేణుమాధవ్

జిహ్వాగ్రే వసతే లక్ష్మీ
జిహ్వాగ్రే మిత్ర బాంధవాః
జిహ్వాగ్రే బంధనం ప్రాప్తి
జిహ్వాగ్రే మరణం ధృవమ్ ॥ అన్నారు. స్వామి వారి నాలుక మీద లక్ష్మీ సరస్వతు లిద్దరూ ఉన్నారు. స్వామీజీ నూట ఇరవై ఐదు సంవత్సరాలు జీవించి మనందరికీ జ్ఞానబోధ చేయాలని కోరుకుంటున్నా. అంతేకాదు. స్వామీజీ మళ్ళీ జన్మించాలని కూడా వాంఛిస్తున్నా. ఎందుకంటే, ఇలాంటివారు మరొకరు మనకు దొరకరు.

స్వామీజీని చూసినపుడు ఉర్దూలో అక్బాల్ వ్రాసిన వాక్యాలు నాకు జ్ఞాపక మొస్తూ ఉంటాయి.

నీవు ఎంత గొప్పవాడివి కావాలి అంటే, నీవు చేసిన కార్యానికి సంతసించి, దేవుడే దిగి వచ్చి నీకు ఏమి కావాలి? అని అడగాలి. అలాంటి పని చేసిన వారు మన గురూజీ గారు. వారి పాదపద్మాలకు నమస్కారాలు. వారు కృష్ణ భగవానుని దూత.

పూజ్యశ్రీ

స్వామి సుందర చైతన్యానందుల వారి

పర్యవేక్షణలో నిర్మింపబడిన

భగవాన్ శ్రీ మురళీకృష్ణ స్వామి ఆలయములు

మరియు

సుందర సత్సంగ భవనములు

సుందర చైతన్యాశ్రమం - హైదరాబాద్


మల్కాజ్‌గిరి - హైదరాబాద్

సిద్ధిపేట

కరీంనగర్


ఖమ్మం

వైజాగ్

గజ్వేల్


మహబూబ్‌నగర్


వరంగల్
సుందర సత్సంగ్ భవనము - శ్రీ మురళీకృష్ణ మందిరము, వరంగల్

నిజామాబాద్



సుందర సత్సంగ్ భవనము - శ్రీ మురళీకృష్ణ మందిరము, రాజమండ్రి

సుందర సత్సంగ్ భవనము - శ్రీ మురళీకృష్ణ మందిరము, నెల్లూరు

ఒంగోలు

నిర్మల్

తొర్రూరు

వాఘాపూర్ - ఆదిలాబాద్



పార్డి-కె, ఆదిలాబాద్

ఎల్లారెడ్డిపేట

సిరిసిల్ల



సుందర సత్సంగ్ భవనము , శ్రీ మురళీకృష్ణ మందిరము - ఆదిలాబాద్

గోదావరిఖని


మెట్‌పల్లి

లాల్‌పురం - గుంటూరు
సుందర సత్సంగ భవనము - శ్రీ మురళీకృష్ణ మందిరము, లాల్‌పురం


సంగారెడ్డి
సుందర సత్సంగ భవనము - శ్రీ మురళీకృష్ణ మందిరము, సంగారెడ్డి

పొన్నారి
శ్రీ మురళీకృష్ణాలయం
సుందర సత్సంగం - పొన్నారి

మాండగడ

over.
Now what remains?
Nothing.
Nothing means?
Nothing means No-thing.
And No-thing is everything. OK?
OK.
OK for only Krishna.

OK
Only Krishna

Sri Swami Sundara Chaitanyananda

జ్ఞానబ్రహ్మ ఆర్షవిద్యావాచస్పతి

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారి జననం

వైకుంఠ ఏకాదశి **గీతాజయంతి**



సుందర చైతన్యాశ్రమం హైదరాబాద్



సుందర చైతన్యాశ్రమం
హైదరాబాద్ - 500 043